ఈనాడు

హైదరాబాద్ 14-3-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 213

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 20+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi



ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

హైదరాబాద్ 14-3-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 213

రూ. 5-00 పేజీలు 20+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

సభ్యత్వాలు రద్దు

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌పై వేటు

శాసనసభ గెజిట్ నోటిఫికేషన్

దక్షిణాది రాష్ట్రాల్లో ఇలాంటి చర్య తొలిసారి

కేంద్ర ఎన్నికల సంఘానికి సమాచారం

జానారెడ్డి, ఉత్తమ్ సహా 11 మంది సభ్యుల సస్పెన్షన్

ప్రతిపక్షం ఆందోళన నడుమ శాసనసభాపతి నిర్ణయం

మండలిలో ఆరుగురు సస్పెన్షన్



శాసనసభ సభ్యత్వాల రద్దుకు నిరసనగా గాంధీభవన్‌లో దీక్ష చేపట్టిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్

ఈనాడు - హైదరాబాద్

ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వాలను తెలంగాణ శాసనసభ రద్దు చేసింది. కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు సహా 11 మందిని, శాసనమండలిలో విపక్ష నేత సహా ఆరుగురు సభ్యులను బడ్జెట్ సమావేశాల వరకు సస్పెండ్ చేస్తూ శాసనసభ, మండలిలో నిర్ణయం తీసుకున్నారు. నల్గొండ, అలంపూర్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ శాసనసభ సభ్యత్వాలను రద్దు చేయాలని, కాంగ్రెస్ పక్ష నేత జానారెడ్డితోపాటు పదకొండు మంది ఎమ్మెల్యేలను ప్రస్తుత సమావేశాలు పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు తీర్మానం ప్రవేశపెట్టగా.. సభాపతి సిరికొండ మధుసూదనాచారి సభ ఆమోదంతో సభ్యత్వాల రద్దు, సస్పెన్షన్ విధింపును కాంగ్రెస్ సభ్యుల ఆందోళనల నడుమనే ప్రకటించారు.

గవర్నర్ ప్రసంగం సందర్భంగా సోమవారం ఉభయ సభల సంయుక్త సమావేశంలో చోటు చేసుకున్న సంఘటనపై మంగళవారం సభ ప్రారంభం కాగానే సభాపతి మధుసూదనాచారి మాట్లాడుతూ.. దేశానికి ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ శాసనసభలో ఎన్నడూ లేని అవాంఛనీయ సంఘటన జరిగిందనీ, మండలి ఛైర్మన్ గాయపడటం తీవ్ర మనస్తాపాన్ని కలిగించిందన్నారు. కాంగ్రెస్ దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. అనంతరం శాసనసభా వ్యవహారాల మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. దాడి సంఘటనను ప్రస్తావిస్తూ అమానవీయమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కాంగ్రెస్ వ్యవహరించడం దారుణమని పేర్కొన్నారు. దాడి హేయమైన చర్యగా పేర్కొంటూ సభ సంప్రదాయాలను వెల్లడించారు. సభా కార్యకలాపాల నిబంధనల ప్రకారం (వరస సంఖ్య 2/340) నిబంధనల్ని వివరించారు. పార్లమెంటులో పాటిస్తున్న (మిగతా 2లో)

సస్పెన్షన్‌కు గురైన కాంగ్రెస్ సభ్యులు

శాసనసభలో	మండలిలో
జానారెడ్డి (సీఎల్పీ నేత)	షబ్బీర్ అలీ (మండలిలో ప్రతిపక్ష నేత)
జీవన్‌రెడ్డి	పొంగులేటి సుధాకర్‌రెడ్డి
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
గీతారెడ్డి	దామోదరరెడ్డి
చిన్నారెడ్డి	సంతోష్‌కుమార్
డీకే అరుణ	ఆకుల లలిత
మల్లు భట్టి విక్రమార్క	
రామ్మోహన్‌రెడ్డి	
వంశీచంద్‌రెడ్డి	
మాధవరెడ్డి	
పద్మావతి	

ఆ రెండు స్థానాల పరిస్థితేమిటి!

ఎన్నికల నిర్వహణపై ఈసీదే నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఇద్దరు శాసనసభ్యుల సభ్యత్వాన్ని అసెంబ్లీ రద్దు చేయడం రాజకీయ వర్గాల్లో సంచలనం సృష్టించింది. ఇంతటి తీవ్ర చర్యలు తీసుకున్న దాఖలాలు లేకపోవటంతో సదరు నిర్ణయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయటం దక్షిణాది రాష్ట్రాల్లో ఇదే తొలిసారి. సభను సజావుగా నిర్వహించేందుకు ఎమ్మెల్యేలపై ఎలాంటి చర్యలైనా తీసుకునే అధికారం స్పీకర్‌కు ఆర్టికల్ 194(3) ద్వారా ఉందని శాసనసభా (మిగతా 2లో)



' సోమవారం సభలో జరిగిన సంఘటన దురదృష్టకరం. ఇది బాధాకరమైన ఘటన. ఇంతచేసి పైగా గవర్నర్‌కు విసిరితే మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు తగిలిందని టీవీ ఛానళ్లలో లైవ్‌లో అంటున్నారు. నేను విన్న. ఇంత అసహనం పనికి వస్తదా. పనికిరాదు. కాంగ్రెస్ సభ్యులు బయటా, లోపలా వ్యవహరిస్తున్న తీరు పరాకాష్టకు చేరింది. వారిని చూసి సమాజం సిగ్గు పడుతోంది '

– సీఎం కేసీఆర్

అరాచక శక్తులపై కఠిన వైఖరే

- కాంగ్రెస్ అసహనానికి పరాకాష్ట
- గవర్నర్‌కు విసిరితే స్వామిగౌడ్‌కు తగిలిందంటున్నరు..
- తెలంగాణ వచ్చినప్పటి నుంచీ కాంగ్రెస్‌ది దుర్మార్గమే
- 2014 తర్వాత ఆ పార్టీ ఒక్క ఎన్నికలోనూ గెలవలేదు
- ఈర్ష్య, కక్ష పెంచుకుని విషపూరిత ప్రచారం చేస్తున్నరు
- శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ -2లో



ఇది చీకటి రోజు

ఇద్దరు కాంగ్రెస్ శాసనసభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయడం, ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయడం గర్హనీయం. ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజు. ప్రజలు, మేధావులు, న్యాయ నిపుణులు గమనించాలి. ప్రభుత్వ చర్య అనైతికం. ఘటన జరుగుతున్న సందర్భంలో ప్రతిపక్ష నేతగా సంయమనం పాటిస్తూ పక్కన నిల్చున్న నన్ను ఎలా సస్పెండ్ చేస్తారు. సభ గవర్నర్ అధీనంలో ఉన్నప్పుడు జరిగే ఘటనలపై గవర్నరే చర్యలు తీసుకోవాలి తప్ప..స్పీకర్ తనకు లేని అధికారాలను ఎలా ఆపాదించుకుంటారు. **- సీఎల్పీ నేత జానారెడ్డి**

మరో ఇద్దరిపైనా తీవ్ర చర్యలు!

- నేడు సభాపతికి సిఫార్సు చేయనున్న ప్రభుత్వం -14లో
- సీసీటీవీ దృశ్యాల్లో సదరు సభ్యుల దాడి చర్యలు గుర్తింపు

సభాపతి నిర్ణయంపై న్యాయస్థానానికి

- హైకోర్టులో కాంగ్రెస్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం
- మూకుమ్మడి రాజీనామాల దిశగానూ సమాలోచనలు
- సభ్యుల సస్పెన్షన్‌కు నిరసనగా శ్రేణుల ధర్నాలు -14లో



మంగళవారం శాసనసభలో విభజన హామీలపై తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా మాట్లాడుతూ కంటతడి పెట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు

చంద్రబాబు భావోద్వేగం

- రాజధాని ప్రస్తావనతో చెమ్మగిల్లిన కళ్లు
- గద్గద స్వరంతో అసెంబ్లీలో కొనసాగిన ప్రసంగం
- తమ సంకల్పాన్ని అవహేళన చేస్తున్నారని ఆవేదన

ఈనాడు - అమరావతి

ఎప్పుడూ గంభీరంగా ఉండే ఆయన ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. కళ్లు చెమ్మగిల్లాయి. గొంతు వణికింది. గద్గద స్వరంతోనే ప్రసంగం కొనసాగించారు. అంతలోనే తేరుకుని... ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయరని కేంద్రాన్ని నిలదీశారు. తెలుగువారు గర్వపడేలా రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయి రాజధాని నగరాన్ని నిర్మిస్తామని ఆయన చాటి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వం హామీల అమలుపై శాసనసభలో మాట్లాడినప్పుడు ఈ సంఘటన చోటు చేసుకుంది. కేంద్రం నుంచి ఏ అంశానికి ఎంత సహకారం అందిందో, ఇంకా రావలసిందేంటో వివరిస్తూ... రాజధాని అమరావతి నిర్మాణం దగ్గరకు వచ్చేసరికి ముఖ్యమంత్రి చలించిపోయారు. రాజధానికి కేంద్రం చెప్పిన సాయం చేయకపోగా, అంతర్జాతీయ స్థాయి నగరాన్ని నిర్మించుకోవాలన్న తమ సంకల్పాన్ని ఎగతాళి చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. "రాజధానికి రైతులు రూ.40 వేల కోట్ల విలువైన భూముల్ని స్వచ్ఛందంగా ఇచ్చారు. బాధ్యతగల ప్రభుత్వాలుగా మనమేం ఇచ్చాం? అదే నేను అడుగుతున్నాను. అక్కడే నాకు బాధేస్తోంది. రాజధానికి రూ.2500 కోట్లు ఇచ్చామని కేంద్రం చెబుతోంది. దానిలో గుంటూరు, విజయవాడ నగరాలకు చెరో రూ.500 కోట్లు ఇచ్చారు. రాజధానికి కేవలం రూ.1500 కోట్లు ఇచ్చి అంతా ఇచ్చేశామన్నట్టు మాట్లాడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానికి శంకుస్థాపన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని ఆయన ప్రస్తావించారు. ఆంధ్ర ప్రజలకు విశ్వాసం అందించడానికి వచ్చానని, విభజన చట్టం స్ఫూర్తిని చెదరనీయకుండా, దానిలోని అంశాలన్నీ అమలు చేస్తామని, భారత ప్రభుత్వం వెన్నంటి ఉంటుందని ప్రధాని చెప్పారు. చంద్రబాబు-నరేంద్ర మోదీ జోడీ నిర్ణీత సమయంలోగా వాటన్నిటినీ ఆచరణలోకి తెస్తుందని, తనను (మిగతా 2లో)

మావోయిస్టుల ఘాతుకం

ఛత్తీస్‌గఢ్‌లో సీఆర్‌పీఎఫ్ వాహనం పేల్చివేత ● 9 మంది జవాన్ల మృత్యువాత

- మరో ఇద్దరికి గాయాలు
- సుకుమా జిల్లాలో ఘటన
- 50 కిలోలకుపైగా పేలుడు పదార్థాలతో దుశ్చర్య
- ఇటీవలి ఎన్‌కౌంటర్‌కు ప్రతీకారమే..!



పేలుడు తీవ్రతకు తునాతునకలైన వాహనం, చెల్లాచెదురుగా పడిపోయిన మృతదేహాలు

ఈనాడు-ఖమ్మం, న్యూస్‌టుడే- దుమ్ముగూడెం, చింతూరు: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు మరోసారి రెచ్చిపోయారు. సుకుమా జిల్లాలో కేంద్ర రిజర్వు పోలీసు దళం(సీఆర్‌పీఎఫ్) సిబ్బంది ప్రయాణిస్తున్న వాహనాన్ని మంగళవారం పేల్చివేశారు. ఈ ఘటనలో 9 మంది జవాన్లు మృత్యువాతపడ్డారు. మరో ఇద్దరు గాయపడ్డారు. గస్తీ విధుల్లో భాగంగా సీఆర్‌పీఎఫ్ 212వ పటాలం జవాన్లు కిష్టారం నుంచి పలోడికి వెళ్తుండగా మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో తాజా దాడి జరిగింది. కిష్టారం-పలోడి మధ్య ఐదు కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్న రోడ్డుపై పాతిపెట్టిన 'మెరుగుపర్చిన పేలుడు పదార్థాల(ఐఈడీ)'ను మావోయిస్టులు పేల్చారు. జవాన్లు ప్రయాణిస్తున్న వాహనం(బంకర్) మందుపాతరల పేలుళ్లను తట్టుకునే సామర్థ్యమున్నదే. అయితే, తాజా దాడిలో 50 కిలోలకుపైగా పేలుడు పదార్థాలను ఉపయోగించడంతో.. పేలుడు ధాటికి వాహనం 10 అడుగుల మేర గాల్లోకి ఎగిరి.. కిందపడి తునాతునకలైంది. 9 మంది జవాన్లు అక్కడికక్కడే (మిగతా 2లో)

ఇదీ సంగతి!



ఇంటర్నెట్ వేగంలో హైదరాబాద్ @ 3

- నాలుగో స్థానంలో విశాఖపట్నం
- మొదటి రెండో స్థానాల్లో చెన్నై, బెంగళూరు



ఈనాడు, హైదరాబాద్: దేశంలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్‌ను వాడుతున్న నగరాల్లో వేగవంతమైన నెట్ స్పీడ్ లభిస్తున్న నగరంగా చెన్నై ప్రథమస్థానంలో నిలిచింది. బెంగళూరు రెండోస్థానంలో ఉండగా, హైదరాబాద్ మూడో స్థానం పొందింది. నాలుగో స్థానంలో విశాఖపట్నం ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వేగాన్ని గణించే (స్పీడ్ టెస్ట్) సంస్థ ఊక్లా తాజా అధ్యయనంలో ఇది తేలింది. అమెరికాలోని సియాటిల్ కేంద్రంగా గల ఈ సంస్థ అధ్యయన నివేదికను మంగళవారం విడుదల చేసింది. ఇండియా డిజిటల్ డివైడ్ (మిగతా 2లో)

బడ్జెట్ రూ.1.72లక్షల కోట్లు

- గత ఏడాది కంటే 15 శాతం పెరుగుదల
- రేపు 11 గంటలకు సభలో ప్రవేశపెట్టనున్న ఈటల

ఈనాడు, హైదరాబాద్: 2018-19 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్ సిద్ధమైంది. గత ఏడాదికంటే 15 శాతం వృద్ధితో రూపొందించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బడ్జెట్ సుమారు రూ.1.72 లక్షల కోట్ల మేరకు ఉంటుందని (మిగతా 2లో)

శక్తిమంతమైన తెలంగాణ లక్ష్యం
'ఈనాడు-ఈటీవీ'తో రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ -15లో

ఆధార్.. గడువు పెంపు

- అనుసంధానంపై నిరవధికంగా పెంచిన సుప్రీం ధర్మాసనం
- నేడు కూడా కొనసాగనున్న వాదనలు



దిల్లీ: బ్యాంకింగ్ సహా వివిధ రకాల సేవల్ని, సంక్షేమ పథకాలను పొందడానికి మార్చి 31వ తేదీలోగా ఆధార్‌ను అందరూ తప్పనిసరిగా అనుసంధానించుకోవాలన్న గడువును సుప్రీంకోర్టు నిరవధికంగా పెంచింది. ఆధార్ చట్టాన్ని, బయోమెట్రిక్ విధానాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లపై విచారణ పూర్తిచేసి, తుది తీర్పును తాము వెలువరించేవరకు ఈ గడువును పొడిగిస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం ప్రకటించింది. గత ఏడాది డిసెంబరు 15న వెలువరించిన మధ్యంతర ఉత్తర్వులు... తమ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడేవరకు వర్తిస్తాయని తెలిపింది. ఆధార్ తప్పనిసరంటూ ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడం తగదని పేర్కొంది. విచారణ ఇంకా కొనసాగుతున్న దృష్ట్యా... ఈ నెలాఖరుతో ముగిసిపోతున్న గడువును పెంచడానికి సిద్ధంగా (మిగతా 2లో)

ఆ రెండు స్థానాల పరిస్థితేమిటి!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహారాల నిపుణుడు ఒకరు మంగళవారం 'ఈనాడు'తో పేర్కొన్నారు. శాసనసభలో స్పీకర్ నిర్ణయాన్ని న్యాయస్థానంలో ఎవరైనా సవాలు చేసినా అది నిలబడదన్నారు. సభ్యులను సస్పెండ్ చేయడం సమావేశాల సందర్భంగా తరచుగా జరుగుతున్నా సభ్యత్వాన్ని రద్దు చేయటమనేది ఇదే తొలిసారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్న దాఖలాలు లేవు. సభ్యత్వాల రద్దుకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు పంపిన క్రమంలో ఆ రెండు స్థానాలు ఖాళీ అయినట్లు ఎన్నికల సంఘం(ఈసీ) ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నిర్వహణకు వీలుగా ఈసీకి సమాచారం పంపటం సాధారణ ప్రక్రియేనని అధికారి ఒకరు తెలిపారు. ఆ రెండు స్థానాల్లో ఎన్నికల నిర్వహణ ఈసీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని ఎన్నికల సంఘం అధికారి ఒకరు చెప్పారు. సభ్యత్వాన్ని కోల్పోయిన ఎమ్మెల్యేలు న్యాయస్థానం ద్వారా స్టే ఉత్తర్వులు పొందితే తదుపరి చర్యలు తాత్కాలికంగా నిలిచిపోతాయనీ, ఆ సభ్యులు శాసనసభా కార్యకలాపాలకు కూడా హాజరు కావచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు. స్పీకర్‌కు రాజ్యాంగం ద్వారా లభించిన అధికారాన్ని వినియోగించిన సందర్భాల్లో న్యాయస్థానాల నుంచి సానుకూల ఉపశమనం లభించటం కష్టమేననే అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. సభ్యత్వ రద్దుపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే అవకాశం ఉండదని శాసనసభా వ్యవహారాల నిపుణుడు ఒకరు చెప్పారు. గతంలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా శాసనసభల్లో పలువురు సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసిన ఉదంతాలున్నాయని వెల్లడించారు. పార్లమెంటులో కూడా పలువురు సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసిన ఉదాహరణలూ ఉన్నాయని పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్‌లో ఇద్దరు...

2012 (జులై 18): మధ్యప్రదేశ్ శాసనసభను నడిపిస్తున్న ఎమ్మెల్యే జ్ఞాన్‌సింగ్‌పై అప్పటి కాంగ్రెస్ సభ్యులు చౌదరి రాకేశ్‌సింగ్ చతుర్వేది, కల్పనా పారులేకర్‌లు అనుచితంగాప్రవర్తించారు. పోడియం వద్దకు దూసుకుపోయి గలాటా సృష్టించారు. జ్ఞాన్‌సింగ్‌ను కుర్చీలోంచి బయటకు లాగేందుకు ప్రయత్నించారు. దీంతో స్పీకర్ ఈశ్వర్‌దాస్ రోహిణి ఆ తర్వాత వారిద్దరి సభ్యత్వాలను రద్దు చేశారు.

మణిపూర్‌లో ముగ్గురు...

2015 (ఆగస్టు 3): అనుచిత ప్రవర్తన ఆరోపణలపై ముగ్గురు తృణమూల్ ఎమ్మెల్యేలు లుఖోయ్, బిషోర్జిత్, జాయ్‌క్రిష్ణల పదవులను మణిపూర్ శాసనసభ ట్రైబ్యునల్ కోర్టు రద్దు చేసింది. అయితే, ఆ తర్వాత లుఖోయ్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ శాసనసభ ప్రకటన జారీ చేసింది.

న్యాయమైన డిమాండ్‌పై సంకోచమెందుకు?

- రిజర్వేషన్లపై తెలంగాణ బిల్లును తొమ్మిదో షెడ్యూలులో చేర్చాల్సిందే
- పార్లమెంటులో కొనసాగుతున్న తెరాస ఎంపీల నిరసన
- దేశంలో మళ్లీ అల్లకల్లోలం వస్తుందేమో
- ఎంపీలతో కేంద్రమంత్రి గడ్కరీ



మంగళవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద తెరాస ఎంపీల నిరసన

ఈనాడు, దిల్లీ: రిజర్వేషన్లపై తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో పాస్ చేసిన బిల్లును పార్లమెంటులో ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూలులో చేర్చాల్సిందేనని తెరాస ఎంపీలు డిమాండ్ చేశారు. పార్లమెంటు వేదికగా ఏడురోజులుగా చేస్తున్న నిరసన కార్యక్రమాన్ని మంగళవారం కూడా కొనసాగించారు. పార్లమెంటు ప్రాంగణంలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో ఎంపీలు నినాదాలు చేశారు. న్యాయబద్ధమైన డిమాండ్‌పై కేంద్రం ఎందుకు సంకోచిస్తోందో అర్థం కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

తెరాస లోక్‌సభా పక్ష నేత జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ఒకే నీతి ఉండాలనేది మా కోరిక అని అన్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచుకొనే హక్కు రాష్ట్రాలకు ఇవ్వాలన్నారు. తాము కేంద్రంలో రిజర్వేషన్లు అడగడం లేదని రాష్ట్రంలో విద్య, ఉద్యోగాల్లోనే అడుగుతున్నామని తెలిపారు. జీఎస్టీ, ఒకేసారి ఎన్నికలు అంటున్న కేంద్రం.. రిజర్వేషన్లు కూడా దేశమంతా ఒకేలా ఉండాలని అంటే ఎందుకు విముఖత చూపుతోందో అర్థం కావడం లేదన్నారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు ఇచ్చి వారి అభివృద్ధి సంక్షేమానికి కృషి చేయకపోతే జాతులు అంతరించిపోయే ప్రమాదముందని ఎంపీ సీతారాం నాయక్ పేర్కొన్నారు. ఈశాన్య రాష్ట్రాల మాదిరిగా తెలంగాణలోనూ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఎంపీ బాల్కసుమన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకిచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో చేసిన రిజర్వేషన్ల పెంపు బిల్లును కేంద్రం విస్మరించడం తగదన్నారు. కేంద్రం వైఖరిని నిరసిస్తూ తమ పోరాటం కొనసాగుతుందని వెల్లడించారు. ఎంపీ దయాకర్ మాట్లాడుతూ.. విభజన అనంతరం రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీల జనాభా శాతం పెరిగిందని తదనుగుణంగా రిజర్వేషన్లు ఇవ్వకపోతే నష్టపోతారన్నారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న హామీని భాజపా విస్మరించిందన్నారు. ఎంపీ డీఎస్ మాట్లాడుతూ.. మైనార్టీలకు ఎలాగూ వ్యతిరేకమయ్యారు.. బీసీలు, ఎస్సీ ఎస్టీల గురించి కూడా పట్టించుకోరా అని భాజపాను ప్రశ్నించారు.

వీపీ సింగ్ హయాంలో అల్లరు గుర్తులేవా?

రిజర్వేషన్ల విషయంలో గతంలో జరిగిన అల్లర్లు మరోసారి జరుగుతాయేమోనని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెరాస ఎంపీలతో వ్యాఖ్యానించినట్లు సమాచారం. నాడు వీపీ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు మండల్ కమిషన్ సిఫార్సులు సమయంలో దేశవ్యాప్తంగా వచ్చిన ఆందోళనలను ఈ సందర్భంగా తెరాస ఎంపీలతో ప్రస్తావించినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం 11.00 గంటలకు లోక్‌సభ కొద్దిసేపటికే వాయిదా పడడంతో తెరాస ఎంపీలు జితేందర్‌రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, సీతారాంనాయక్ తదితరులు కేంద్రమంత్రులు గడ్కరీ, అనంతకుమార్‌లతో ముచ్చటించారు. ఈ సమయంలో కేంద్రమంత్రి అనంతకుమార్ మహారాష్ట్రలో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు కేసు కొట్టివేసిన విషయాన్ని వారితో ప్రస్తావించారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించి తొమ్మిదో షెడ్యూలులోపెట్టాలని ఒకవేళ కోర్టు జోక్యం చేసుకుంటే అప్పుడు చూద్దామని తెరాస ఎంపీలు కేంద్రమంత్రులతో అన్నట్లు తెలిసింది.

సభ్యత్వాలు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలు, పలు చర్యలను ఉదహరించారు. రాజ్యాంగం ప్రకారం సభా వ్యవహారాలకు తీవ్ర ఆటంకం కలిగిస్తే తీసుకోవాల్సిన కఠినమైన చర్యల (సభా వ్యవహారాలు 122 పేజీ, 7.1 పేరా) ప్రకారం నిర్ణయం తీసుకునే హక్కు సభాపతిపై ఉందని మంత్రి పేర్కొన్నారు. అనంతరం సభలో తీవ్రమైన దాడి, సభా వ్యవహారాలను అవమానపర్చడం, ఆటంకం కలిగించడం వంటి చర్యలకు పాల్పడిన కాంగ్రెస్ సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ పేర్లను వెల్లడించారు. వారి శాసనసభ సభ్యత్వాల రద్దుకు ప్రతిపాదిస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. దీనికి సభాపతి అంగీకారం తెలుపగా సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది.

సమావేశం ముగిసే వరకు సస్పెన్షన్

ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు సోమవారం సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించారని హరీశ్‌రావు పేర్కొన్నారు. సభా కార్యకలాపాలకు భంగం కలిగించడంతోపాటు దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికే చేటు అని వ్యాఖ్యానించారు. దాడికి పాల్పడిన వారిపై సస్పెన్షన్ విధించాలంటూ తీర్మానం చేశారు. దీనికి సభాపతి అంగీకారం తెలుపగా సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. దీంతో సభలో ప్రతిపక్ష నేత (సీఎల్పీ నాయకుడు) జానారెడ్డి సహా పదిమంది సభ్యులపై సమావేశాలు ముగిసే వరకు వేటు పడింది.

కాంగ్రెస్ సభ్యుల ఆందోళనలు..ప్రతిఘటన

శాసనసభ ప్రారంభంలోనే కాంగ్రెస్ సభ్యులందరిపై చర్యలకు సిఫార్సు చేస్తూ మంత్రి హరీశ్‌రావు ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ సభా పక్ష నేత జానారెడ్డి సహా మిగిలిన కాంగ్రెస్ సభ్యులు లేచి నినాదాలు చేశారు. వేటు విధించాక సభలో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలంటూ జానారెడ్డి పలుమార్లు మైకు నొక్కి ప్రయత్నించారు. సభాపతి నుంచి అనుమతి రాకపోవడంతో ఉత్తమ్‌కుమార్ సహా సభ్యులు పలుమార్లు గట్టిగా నినాదాలు చేశారు. సభాపతి కాంగ్రెస్ సభ్యులు సభ నుంచి బయటికి వెళ్లాలంటూ పలుమార్లు ప్రకటించారు. అయినప్పటికీ సభలో తమకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని జానారెడ్డి కోరారు. దీంతో మార్షల్ రంగంలోకి దిగి సభ్యులను బయటికి పంపేందుకు ప్రయత్నించారు. చిన్నారెడ్డి స్థానంలో నుంచి కదలకపోవడంతో మార్షల్స్ పైకిలేపేందుకు గట్టి ప్రయత్నించారు. రామ్మోహన్‌రెడ్డి కూడా మార్షల్స్‌ను తీవ్రంగా ప్రతిఘటించారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి కూడా కొద్దిసేపు మార్షల్స్‌తో ప్రతిఘటించారు. డీకే అరుణ, గీతారెడ్డిలు కూడా నినాదాలు చేశారు. చివరికి ప్రతిపక్ష సభ్యులు బయటకి వెళ్లిపోవడంతో విపక్ష నేతలకు మాట్లాడే అవకాశం కల్పించారు.

సభకు మాయని మచ్చ తెచ్చారు: సభాపతి

తెలంగాణ రాష్ట్రంలో శాసనసభ నాలుగేళ్లు హుందాగా వ్యవహరించిందని సభాపతి మధుసూదనాచారి అన్నారు. 'ఇన్నాళ్లూ సభ తన విధ్యుక్తధర్మాన్ని నిర్వర్తించింది. దేశంలో పలు చోట్ల జరిగిన సదస్సుల్లో తెలంగాణ సభా వ్యవహారాలను తెలుసుకుని అనేక రాష్ట్రాలు మెచ్చుకున్నాయి. శాసనసభకు మచ్చతెచ్చేలా కాంగ్రెస్ సభ్యులు వ్యవహరించారు. నాలుగేళ్లలో ఇంత దురదృష్టకరమైన పరిస్థితి చూడలేదు. చట్టసభల్లో ఇలాంటి పరిస్థితి వాంఛనీయం కాదు. మండలి ఛైర్మన్‌పై జరిగిన దాడి, ఆయన దెబ్బ తినడంతో దిగ్భ్రాంతికి గురయ్యాను. సోమవారం ఘటన చోటుచేసుకున్నప్పటి నుంచి ఇప్పటికీ బాధతోనే ఉన్నాను. మనస్తాపంతో మాట్లాడుతున్నా..' అంటూ సభాపతి ఆవేదన వ్యక్తం చేశారు. 'పత్రికల క్లిప్పింగ్ చూశాను. చర్యలకు అనివార్య పరిస్థితిని కల్పించారు' అని పేర్కొన్నారు. సోమవారం సభలో జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సభావ్యవహారాల మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ప్రజాస్వామ్యంలో.. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన స్థితిలో దాడులకు పాల్పడటం దారుణమైన చర్యగా పేర్కొన్నారు. 'సభా వ్యవహారాలను ఉల్లంఘించి కాంగ్రెస్ సభ్యులు దాడులకు పాల్పడిన సంఘటన తీవ్రమైన చర్య. సభా సంప్రదాయాలకు ఎవరు ఆటంకం కలిగించినా చర్యలు తీసుకోవాల్సిందే' అని పేర్కొన్నారు.

మండలిలోనూ కాంగ్రెస్ సభ్యులపై చర్యలు

మంగళవారం ఉదయం శాసనమండలి సమావేశం ప్రారంభం కాగానే డిప్యూటీ ఛైర్మన్ నేతి విద్యాసాగర్ మాట్లాడుతూ.. సోమవారం జరిగిన ఘటన, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ గాయపడటం బాధాకరమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావద్దన్నారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మండలిలో ప్రతిపక్షనేత షబ్బీర్‌అలీతోపాటు ఐదుగురు సభ్యులపై బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు సస్పెన్షన్‌కు తీర్మానం ప్రవేశపెట్టారు. మండలి డిప్యూటీ ఛైర్మన్ దీనికి ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంపై పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్సీలు సభలో నిరసన వ్యక్తం చేశారు. సోమవారం నాటి ఘటనలో తామేమీ తప్పుచేయలేదని, అయినా సస్పెండ్ చేయడం ఏమిటనీ, ఆధారాలు ఉంటే చూపాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్‌కు గురైన సభ్యులు సభ నుంచి వెళ్లిపోవాలని డిప్యూటీ ఛైర్మన్ అన్నారు. సభలో కొద్దిసేపు నిరసన వ్యక్తంచేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీలు మండలి వెలుపల బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

గెజిట్ నోటిఫికేషన్ జారీ..

కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి (నల్గొండ), ఎస్.ఎ.సంపత్‌కుమార్ (అలంపూర్)ల సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తెలంగాణ శాసనసభ సచివాలయం మంగళవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఇద్దరు సభ్యుల శాసన సభ్యత్వాల రద్దు దృష్ట్యా రెండు స్థానాలు ఖాళీ అయినట్లు తెలంగాణ శాసనసభ దిల్లీలోని కేంద్ర ఎన్నికల సంఘానికి(ఈసీ) ఫ్యాక్స్ ద్వారా సమాచారం పంపింది. గెజిట్ నోటిఫికేషన్ ప్రతులు మంగళవారం రాత్రి అందుబాటులోకి రాలేదు. బుధవారం వాటిని విడుదల చేసే అవకాశం ఉంది. గెజిట్ విడుదలైన వెంటనే ఆ ప్రతిని ఈసీకి పంపింది.

అరాచక శక్తులపై కఠిన వైఖరే

ఈనాడు, హైదరాబాద్: 'రాష్ట్రంలో శాంతిభద్రతలు అద్భుతంగా ఉన్నాయి. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు రక్షణ ఉంది. సభ విషయంలోనూ లోపలా, బయటా కఠినంగా వ్యవహరిస్తాం. అరాచక శక్తుల పీచమణచడానికి చర్యలు తీసుకుంటాం. రాజకీయ ముసుగులో ఉండి ఇష్టారీతిన వ్యవహరిస్తామంటే చూస్తూ ఊరుకోం. సోమవారం చూశాం. బీఏసీలో సభాపతి సమక్షంలో చర్చించాం. ఎన్ని రోజులు సభ నిర్వహించడానికైనా సిద్ధమని చెప్పాం. గతంలోనూ సమయం మించి నిర్వహించాం. ఏ అంశమైనా ఎంత సమయమైనా చర్చిద్దాం అన్న తర్వాత గొడవలు చేయడానికి ఆస్కారం ఎక్కడిది. బీఏసీలో ఒప్పుకుని సభలో అరాచకం చేశారు. బల్లలు ఎక్కి కొట్లాడితే మండలి ఛైర్మన్ ఆసుపత్రి పాలయ్యారు. పైగా ఛైర్మన్ నాటకం ఆడుతున్నారని అంటున్నారు. ఆయన ఎందుకు నాటకం ఆడతారు. మాకు ముందే సమాచారం అందింది. దీనిపై అప్పటికే సభాపతికి స్పష్టమైన సమాచారం ఇచ్చాం. దీంతో మార్షల్స్ అప్రమత్తమయ్యారు. ఈ సభలో కూర్చుంటే ఏం చేయాలో తెలియక దీర్ఘకాలం సస్పెన్షన్ చేయించుకోవాలనుకునే ఇలా చేశారు'అని ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు. సభాపతి తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. మంగళవారం సీఎం సభను ఉద్దేశించి మంగళవారం మాట్లాడారు..'కొత్త రాష్ట్రమైనప్పటికీ సభను హుందాగా నిర్వహిస్తున్నారు. బడ్జెట్ కార్యకలాపాలు గిలెటిన్ అవుతున్న సందర్భాల్లో సభాపతులు, ఉపసభాపతులు రాత్రి 11-12 గంటల వరకు సభను సజావుగా నడిపిస్తున్నారనే ప్రశంసలు వస్తున్నాయని ఇటీవలే సభాపతి నాకు చెప్పారు. నేనూ సంతోషపడ్డా. అంతలోనే ఈ ఘటన.

ప్రభుత్వం కూలిపోతుందంటూ..

తెలంగాణ ఏర్పాటయ్యాక ఐదో రోజు రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలిసేందుకు నేను దిల్లీ వెళ్లా. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ వాళ్లు మా జెండా దిమ్మెలు కూల్చేశారు. ఆగమాగం చేశారు. ఎక్కడి నుంచి వస్తుంది వీరికి ఈ అసహనం. వివిధ రాజకీయ పరిస్థితుల్లో అప్పుడు అలా నిర్ణయాలు జరిగాయ్. తెరాస, కేసీఆర్ ఇంటి ముందుకు కుక్క కూడా పోదన్నారు. మూడోవంతు సీట్లు వచ్చాయి. మేం ప్రభుత్వం ఏర్పాటు చేశాక.. కొన్ని దినాల్లోనే కూలిపోతుందని అన్నారు. మూడు, నాలుగు రోజులే ఉంటుందని ఇదే సభ్యులు మాట్లాడారు. ప్రభుత్వం, ప్రతిపక్షం గురించి ప్రజలు ఏమనుకుంటున్నరో అని కూడా ఆలోచించలేదు వాళ్లు. ఇలా ఎన్ని ఘట్టాలు. . శాసనసభ, జీహెచ్ఎంసీ, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, అచ్చంపేట మున్సిపాలిటీలో పార్టీ సిద్ధాంతాలు, అజెండాలు పక్కనపెట్టి పోటీ చేశారు. మాకే ఇరవై సీట్లు వచ్చాయి. వారు ఒక్కటి కూడా గెలువలేదు. పైగా ఈర్ష్య, కక్షలు పెంచుకున్నారు. నాపై విషపూరిత ప్రచారం చేస్తున్నారు. అమెరికాకు పోతుండు, వాపస్ రాడు, ఏదో జబ్బు ఉంది. చచ్చిపోతాడని ప్రచారం చేశారు. నాలుగేళ్ల నుంచి పోతాన్న వస్తాన్న. ఏమయింది. మేం ప్రజలకు జవాబుదారీగా ఉంటాం.

అంతిమ న్యాయ నిర్ణేతలు ప్రజలే

రాజ్యాంగబద్ధంగా ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడం రాజ్యాంగ విధానం. మనం ఆ సమయంలో మర్యాద పాటిద్దాం. ఆ తర్వాత మాట్లాడుకుందామని నేను చెప్పాను. రభస చేయాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ సభ్యులు ఇలా చేశారు. పెడబొబ్బలు పెట్టారు. కళ్లద్దాలతో కొట్టారు. మైకులు విరిచారు. పెన్నులు విసిరారు. సభలో మంగళవారం తీసుకున్న నిర్ణయం పూర్తి సమంజసంగా ఉంది. మేం రాజీపడం. మేం చేస్తున్నది తప్పయితే తేల్చాల్సింది ప్రజలే. అంతిమ న్యాయ నిర్ణేతలు వారే. అరాచకాన్ని సహిస్తే ప్రజలు మమ్మల్ని సహించరు.

జానారెడ్డిని నాలుగేళ్లుగా గౌరవిస్తున్నా

భాజపా సభ్యుడు కిషన్‌రెడ్డి ప్రసంగం సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. అరాచకాలు చేస్తున్న వారిని సపోర్టు చేస్తాం అంటే మీ ఇష్టం. వారి పార్టీ సభ్యులు దాడి చేస్తుంటే ప్రతిపక్ష నేతగా జానారెడ్డి ఏం చేశారు. ఆయనంటే మాకూ గౌరవం ఉంది. నాలుగేళ్లుగా అందరికన్నా ఎక్కువగా గౌరవిస్తున్నా. పార్లమెంటులో తెరాస సభ్యుల ఆందోళనలు సందర్భానుసారం చేస్తున్నారు. కిషన్‌రెడ్డి సభలో ఎంపీల విషయం మాట్లాడాలంటే సభాపతి నుంచి అనుమతి పొందాలి. ఇప్పుడు సందు దొరికిందని బయటి విషయాలు మాట్లాడితే ఎలా.. పార్టీలు, సిద్ధాంతాలను పక్కనపెట్టడానికి వారికి సందర్భం దొరికింది' అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

ఆధార్.. గడువు పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న విషయాన్ని ఇప్పటికే తెలిపామని కేంద్రం తరపున అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ చెప్పినమీదట ధర్మాసనం తాజానిర్ణయాన్ని వెలువరించింది. ఆధార్‌ను ఇంకా అనుసంధానించుకోని లక్షలాది మందికి ఊరట కల్పించింది.

తత్కాల్ పాస్‌పోర్టులకు ఆధార్ తప్పనిసరి కాదు: చరవాణి సేవల అనుసంధానానికి కూడా గడువు పెంపు వర్తిస్తుంది. తత్కాల్ పాస్‌పోర్టుల్ని పొందడానికి ఆధార్‌ను తప్పనిసరి చేయరాదని ధర్మాసనం స్పష్టం చేసింది. భారత ప్రభుత్వ సంచిత నిధి నుంచి ఖర్చు చేసే వివిధ పథకాల కింద ప్రయోజనాలను లబ్ధిదారులకు బదలాయించడానికి ఆధార్ సంఖ్యల్ని అడగడాన్ని ప్రభుత్వం కొనసాగించుకోవచ్చని అనుమతించింది. అనుసంధానత అంశం ప్రభావం బ్యాంకులు, స్టాక్ ఎక్స్ఛేంజిలు వంటి ఆర్థిక సంస్థలపై ఉంటుందనీ, అందువల్ల గడువును చివరి క్షణంలో పెంచితే పెద్ద సమస్య అవుతుందని ధర్మాసనం ఆరోజు పేర్కొంది.

ద్రవ్యబిల్లుగా చూపించడం తప్పు: చిదంబరం: మంగళవారం నాటి విచారణలో కేంద్ర మాజీ మంత్రి జైరాం రమేశ్ తరపున సీనియర్ కాంగ్రెస్ నేత, న్యాయవాది పి.చిదంబరం వాదనలు వినిపించారు. రాజ్యసభ ఆమోదంతో పనిలేకుండా చూడడానికి ఆధార్ బిల్లును లోక్‌సభ స్పీకర్ ద్రవ్యబిల్లుగా చూపించారనీ, అది తప్పు అనీ చెప్పారు. అసంపూర్తిగా మిగిలిన వాదోపవాదనలు బుధవారం కూడా కొనసాగుతాయి.





పేలుడు ధాటికి ఎగిరిపడ్డ వాహనం ఘటనాస్థలంలో జవాన్ల మృతదేహాలు

మావోయిస్టుల ఘాతుకం

(మొదటి పేజీ తరువాయి)

మృతిచెందారు. ఘటనాస్థలానికి భారీగా అదనపు బలగాలను తరలించామని అధికారవర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి మంగళవారం ఉదయం 8 గంటల ప్రాంతంలోనే మావోయిస్టులు దాడికి యత్నించారని.. బలగాలు ప్రతిఘటించడంతో పారిపోయారని పేర్కొన్నాయి. పేలుడు సమయంలో జవాన్ల వాహనశ్రేణిలో మోటారుసైకిళ్లతోపాటు రెండు వాహనాలున్నట్లు తెలిపాయి. వెనుక ఉన్న వాహనాన్ని మావోయిస్టులు పేల్చివేశారని పేర్కొన్నాయి. పేలుడు అనంతరం ఆయుధాల కోసం మావోయిస్టులు ఘటనాస్థలానికి వచ్చేందుకు ప్రయత్నించగా.. జవాన్లు కాల్పులు ప్రారంభించడంతో వెనుదిరిగి వెళ్లిపోయారని వివరించాయి. మావోయిస్టు కమాండర్ హిద్మా నేతృత్వంలోని దళం తాజా దాడికి పాల్పడి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాయి. మృతుల్లో నలుగురు ఇటీవలే సెలవు ముగించుకొని తిరిగి విధుల్లో చేరారని అధికారులు తెలిపారు.

బేస్‌క్యాంపు దూరం కావడంతో..: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన గౌరవరం శివారులో సీఆర్‌పీఎఫ్ బేస్‌క్యాంపును ఏర్పాటుచేశారు. దాని తర్వాత 2.5 కిలోమీటర్ల దూరంలోని పైడిగూడెంలో మరో బేస్‌క్యాంపు ఉంది. మళ్లీ 2.5 కిలోమీటర్ల దూరంలోని ధర్మపేటలో, అక్కడి నుంచి 2.5 కిలోమీటర్ల దూరంలోని ఎలకనగూడెంలో, దానికి 2.5 కిలోమీటర్ల దూరంలోని కిష్టారంలో బేస్‌క్యాంపులు ఉన్నాయి. ఒక్కో క్యాంపులో సుమారు 500 మంది నుంచి 1,000 మంది వరకు జవాన్లు ఉన్నారు. కిష్టారం తర్వాత సుమారు 5 కిలోమీటర్ల గాజులగుట్టలో మరో బేస్‌క్యాంపు ఏర్పాటు చేశారు. దీన్ని మావోయిస్టులు అవకాశంగా తీసుకున్నారు. బేస్‌క్యాంపుల మధ్యదూరం ఎక్కువగా ఉండటంతో తాజా దాడికి తెగబడ్డారు.

మృతులు వీళ్లే..: అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.కె.ఎస్.తోమర్, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుళ్లు అజయ్ కె యాదవ్, మనోరంజన్ లంక, జితేందర్ సింగ్, శోభిత్ శర్మ, మనోజ్ సింగ్, ధర్మేంద్ర సింగ్, హెచ్.ఎస్.చంద్ర. వీరంతా మావోయిస్టుల ఏరివేతలో ప్రత్యేక శిక్షణ పొందినవారు. క్షతగాత్రులు మదన్ కుమార్, రాజేశ్ కుమార్‌లకు రాయ్‌పూర్‌లో చికిత్స అందిస్తున్నారు.

ఏడాది క్రితం కూడా..: గతేడాది మార్చి 11న సుకమా జిల్లాలోని భేజీ ప్రాంతంలో సీఆర్‌పీఎఫ్ గస్తీ బృందంపై మావోయిస్టులు మెరుపుదాడి చేశారు. నాటి ఘటనలో 12 మంది జవాన్లు దుర్మరణం పాలయ్యారు. అనంతరం గతేడాది ఏప్రిల్ 24న సుకమాలోనే మావోయిస్టులు జరిపిన మరో మెరుపుదాడిలో 25 మంది పారామిలటరీ సిబ్బంది మృత్యువాతపడ్డారు.

ప్రతీకారం: కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మళ్లీ రణరంగంగా మారుతోంది. రహదారి పనులకు గస్తీ నిర్వహిస్తున్న జవాన్లను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు దాడులకు తెగబడుతున్నారు. గత నెల 18వ తేదీన సుకుమా జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు జవాన్లు, రహదారి పనులు పర్యవేస్తున్న గుమస్తా దుర్మరణం పాలయ్యారు. ఇటీవల తెలంగాణ పోలీసులు జరిపిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టులు మృత్యువాతపడ్డారు. దీనికి ప్రతీకారం తీర్చుకుంటామని పేర్కొంటూ తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ ఓ లేఖ విడుదల చేసిన సంగతి గమనార్హం. ఆ ప్రతీకార మాటలకు, నేటి చేతలకు సారూప్యత క్షేత్రస్థాయిలో గోచరిస్తోంది. ఈ నెల 5న సుకుమా జిల్లా కుడ్తి ప్రాంతంలో మావోయిస్టులు ఒక బస్సు, రెండు లారీలు, ఓ ట్రాక్టర్‌ను కూడా దహనం చేశారు. సోకే మున్నా అనే మాజీ కానిస్టేబుల్‌నూ హత్య చేశారు.

అమరులకు ప్రధాని జోహార్లు: ఛత్తీస్‌గఢ్‌లో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని నరేంద్ర మోదీ జోహార్లు అర్పించారు. దేశమంతా వారికి వందనం చేస్తోందని ఓ సందేశంలో పేర్కొన్నారు. సుకమాలో మావోయిస్టులు జరిపిన దాడిని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఖండించారు. జవాన్ల మృతి తీవ్ర విచారకరమని ట్విటర్‌లో ఆయన పేర్కొన్నారు. తాజా దాడిపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి రమణ్ సింగ్‌తో కూడా రాజ్‌నాథ్ మాట్లాడారు. జవాన్ల దుర్మరణంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విచారం వ్యక్తం చేశారు.

మళ్లీ చర్చనీయాంశమైన ఎంపీవీల వినియోగం

దిల్లీ: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు తాజాగా జరిపిన దాడిలో 9 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృత్యువాతపడటంతో.. మందుపాతరల నుంచి రక్షణ కల్పించే వాహనాల(ఎంపీవీలు) వినియోగంపై మరోసారి చర్చ మొదలైంది. దండకారణ్యంలో ప్రస్తుతం చెట్ల ఆకులు ఎక్కువగా రాలి ఉన్నాయి. ఎంపీవీలేగాక చిన్నచిన్న వాహనాలను సైతం ఇప్పుడు మావోయిస్టులు అడవిలో సులభంగా గుర్తించగలరు. అలాంటి పరిస్థితులున్నప్పటికీ.. హరిత వర్ణంలోని ఎంపీవీలను ఎందుకు ఉపయోగించారనేది చర్చనీయాంశమైంది. వాస్తవానికి గతేడాది సీఆర్‌పీఎఫ్ విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం.. బలగాల నియంత్రణలో ఉన్న ప్రదేశాల్లో.. మందుపాతరలు, మెరుగుపర్చిన పేలుడు పదార్థాల(ఐఈడీలు) ముప్పు లేదని నిర్ధారించుకున్నప్పుడు మాత్రమే ఎంపీవీలను ఉపయోగించాలి. ఇవేమీ లేకుండా మావోయిస్టు ప్రభావిత సుకమా జిల్లాలో ప్రస్తుతం జవాన్లు ఎంపీవీలను ఉపయోగించడంపై చర్చ జరుగుతోంది.

బడ్జెట్ రూ.1.72లక్షల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సమాచారం. బడ్జెట్ ప్రసంగంతో పాటు అన్ని ప్రక్రియలను రాష్ట్ర ఆర్థికశాఖ పూర్తి చేసింది. బుధవారం సాయంత్రం జరిగే రాష్ట్ర మంత్రిమండలి సమావేశంలో పద్దుకు ఆమోద ముద్ర వేస్తుంది. ఈసారి కూడా సాగునీటికి భారీగా కేటాయింపులు చేయగా వ్యవసాయానికి రూ.15 వేలకోట్లు, సంక్షేమ రంగానికి గత బడ్జెట్‌కంటే పదిశాతం పైగా నిధులు పెరిగినట్లు తెలిసింది. బడ్జెట్ వెలుపల రుణాల ద్వారా నిధులు సమకూర్చునే శాఖలకు కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నట్లు తెలిసింది. బడ్జెట్‌ను గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ శాసనసభలో ప్రవేశపెట్టనున్నారు. శాసనమండలిలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెడతారు.

ఇంటర్నెట్ వేగంలో హైదరాబాద్ @3

(మొదటి పేజీ తరువాయి)

పేరిట దేశంలోని 20 నగరాల్లో ఈ సంస్థ గత నెలలో అధ్యయనం చేసింది. చెన్నైలో ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్‌లో ఇంటర్నెట్ డౌన్‌లోడ్ స్పీడ్ 32.67 మెగాబైట్స్ ఫర్ సెకను (ఎంబీపీఎస్)గా ఉంది. అప్‌లోడ్ వేగం 26.15 ఎంబీపీఎస్‌గా ఉంది. బెంగళూరులో 31.09, 27.20 ఎంబీపీఎస్‌గా ఉండగా.. హైదరాబాద్‌లో డౌన్‌లోడ్ వేగం 28.93 ఎంబీపీఎస్‌గా, అప్‌లోడ్ వేగం 25.09 ఎంబీపీఎస్‌గా ఉంది. విశాఖపట్నంలో 26.59, 26.63 ఎంబీపీఎస్‌గా నమోదైంది. ఆ తర్వాత స్థానాల్లో దిల్లీ, కోల్‌కతా, థానె, ముంబయి, వడోదర, సూరత్ ఉన్నాయి.

దక్షిణాదిలో మెరుగు: ఇంటర్నెట్ వేగంలో మొదటి అయిదు స్థానాల్లో నాలుగు దక్షిణాది రాష్ట్రాలున్నాయి. మొదటి పది స్థానాల్లో ఆరు ఉత్తరాది రాష్ట్రాలు నిలిచాయి. దేశంలో అతి తక్కువ వేగం గల రాష్ట్రాల్లో నాలుగు ఈశాన్య రాష్ట్రాలున్నాయి. మిజోరంలో 3.62, మణిపూర్‌లో 4.30, త్రిపురలో 4.52 ఎంబీపీఎస్‌ల వేగం మాత్రమే ఉందని అధ్యయనంలో వెల్లడైంది.

ప్రపంచ వ్యాప్తంగా...: ప్రపంచ వ్యాప్తంగా ఫిక్స్‌డ్ బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ వేగంలో మనదేశం 67వ స్థానంలో నిలిచింది. దేశవ్యాప్తంగా బ్రాడ్‌బ్యాండ్ సగటు వేగం 20.72 ఎంబీపీఎస్‌గా ఉంది. ప్రపంచంలో అత్యధికవేగవంతమైన ఇంటర్నెట్ వేగాన్ని పొందుతున్న దేశంగా సింగపూర్ ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ సగటున 161.53 ఎంబీపీఎస్‌ల వేగం ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఐస్‌ల్యాండ్, హాంకాంగ్, దక్షిణకొరియా, రొమేనియా, స్వీడన్, హంగేరీ, మకావు, అమెరికా, నెదర్లాండ్స్ ఉన్నాయి.

చంద్రబాబు భావోద్వేగం

(మొదటి పేజీ తరువాయి)

విశ్వసించమని తెలిపారు. అప్పుడు ఆయన ఏం చెప్పారో అది చేయమనే అడుగుతున్నానని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ఆంధ్ర ప్రజలు పన్నులు కట్టడం లేదా?: "రాజధాని లేకపోవడం ఒక సంక్షోభం. దాన్ని అవకాశంగా మార్చుకుని దేశంలోనే సుందర నగరం నిర్మించుకునే అవకాశం మనకు లభించింది. కేంద్రం పూర్తి సహకారం అందిస్తే దేశానికే ప్రతిష్ఠ పెరుగుతుంది కదా? కేంద్ర ప్రభుత్వానికి ఆ బాధ్యత లేదా? ఆంధ్రప్రదేశ్ ప్రజలు పన్నులు కట్టడం లేదా?" అని ముఖ్యమంత్రి నిలదీశారు. "కలల నగరం కడతారంట, ఏదో పెద్ద నగరం కడతారంట... కట్టమనండి అని మీలోనూ కొందరు మాట్లాడారు" అని పరోక్షంగా భాజపా సభ్యులనుద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. "ఇప్పుడు మనం ఉన్న శాసనసభ, తాత్కాలిక సచివాలయం భవనాలు బాలేదా? బాగానే ఉన్నాయి? కానీ మేం కట్టాలనుకున్న రాజధాని ఇది కాదు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు కంటే అది మిన్నగా ఉండాలి. అలాంటి నగరాన్ని నిర్మిస్తాం. ప్రపంచం మొత్తం తెలుగువాడి సత్తా ఏంటో చాటిచెబుతాం"అని ముఖ్యమంత్రి అన్నారు.

రేపు మండలిలో తీర్మానం..!: విభజన చట్టంలోని అంశాలు, ప్రత్యేక హోదా సహా కేంద్రం ఇచ్చిన హామీల్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శాసనసభ మంగళవారం తీర్మానం ఆమోదించింది. శాసన మండలిలోనూ గురువారం దీనిపై తీర్మానం చేయనున్నారు. చంద్రబాబు 40 ఏళ్ల రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనను అభినందిస్తూ శాసనసభలోను, మండలిలోను గురువారం తీర్మానం ప్రవేశపెట్టాలని తెదేపా శాసనసభాపక్షం నిర్ణయించింది.

గ్రహం అనుగ్రహం

14-3-2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
ద్వాదశి: మ. 3-04 తదుపరి త్రయోదశి
శ్రవణం నక్షత్రం: మ. 2-37 తదుపరి ధనిష్ఠ
అమృత ఘడియలు: తె. 5-23 నుంచి
వర్జ్యం: సా. 6-57 నుంచి 8-41 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-45 నుంచి 12-33 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-14; సూర్యాస్తమయం: సా.6-06
మీన సంక్రమణం రా. 1-33

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
రామగుండం	39.2	21.4
ఆదిలాబాద్	39.0	21.8
మహబూబ్‌నగర్	38.0	21.6
హన్మకొండ	38.0	20.5
మెదక్	37.8	17.9
ఖమ్మం	37.0	21.0
హైదరాబాద్	36.8	20.5
నిజామాబాద్	36.0	23.0
కరీంనగర్	36.0	20.0
సూర్యాపేట	35.5	26.0

16న సైన్స్ కాంగ్రెస్‌ను ప్రారంభించనున్న ప్రధాని

ఇంఫాల్: భారత సైన్స్ కాంగ్రెస్ 105వ సదస్సును ప్రారంభించేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న మణిపూర్ సందర్శించనున్నారు. ఇంఫాల్‌లోని మణిపూర్ విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. రాష్ట్రంలో సైన్స్ కాంగ్రెస్ జరగడం ఇదే మొదటిసారని వర్సిటీ ఉపకులపతి ఆద్య ప్రసాద్ పాండే తెలిపారు. దేశం నలుమూలల నుంచి శాస్త్రవేత్తలు, నిపుణులు, కార్పొరేట్ అధికారులు 5వేల మంది ఇందులో పాల్గొంటారని చెప్పారు. నోబెల్ గ్రహీతలు మహ్మద్ యూనస్, హిరోషి అమానో, దలైలామలు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

పీఏసీ ఛైర్మన్‌గా కొనసాగనున్న ఖర్గే!

దిల్లీ: ప్రజా పద్దుల సంఘం (పీఏసీ) పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమవుతున్న నేపథ్యంలో ఒకరిద్దరు సభ్యుల స్థానంలో కొత్త ముఖాలను తీసుకురావాలని భాజపా యోచిస్తోంది. కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలోని పీఏసీ ప్రస్తుతం బోఫోర్స్ కుంభకోణం, అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల ఒప్పందం సహా వివిధ అంశాలను పరిశీలిస్తోంది. గతంలో పీఏసీ అధ్యక్షునిగా ఉన్న కె.వి.థామస్ స్థానంలో మల్లికార్జున్ ఖర్గేను కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చింది. మరోసారి ఖర్గేనే కొనసాగించడానికి ఆ పార్టీ సుముఖంగా ఉంది. తదుపరి పీఏసీయే ప్రస్తుత లోక్‌సభ పదవీ కాలంలో చిట్టచివరిది కావచ్చని భావిస్తున్నారు. ఉభయ సభలకు చెందిన 22 మంది సభ్యులు దీనిలో ఉన్నారు. నిషికాంత్ దూబే, అనురాగ్ ఠాకుర్, కిరీట్ సోమయ్య భాజపా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

వలస పాలన నాటి పద ప్రయోగం వద్దు: వెంకయ్య

దిల్లీ: ‘ఐ బెగ్ టు లే...’ వంటి వలస పాలన నాటి పదాలను కేంద్ర మంత్రులు సభా కార్యకలాపాల్లో ప్రయోగించవద్దని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు పునరుద్ఘాటించారు. మంగళవారం రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పి.రాధాకృష్ణన్ కొన్ని పత్రాలను సమర్పించబోతూ ‘ఐ బెగ్ టు లే...’ అని మొదలుపెట్టారు. వెంటనే సభాపతి అడ్డుపడి, పత్రాలను సభలో సమర్పించడానికి అలా అనాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని స్పష్టం చేశారు. దీని బదులు ‘ఐ రైజ్...’ అని అంటే చాలని చెప్పారు. కాసేపట్లో కాగ్ నివేదికల్ని సభకు సమర్పించడానికి మరోసారి అదే మంత్రి లేచినప్పుడు తనను తాను ఆ మేరకు సవరించుకున్నారు. స్వతంత్ర భారతదేశంలోనూ వలస కాలం నాటి పద ప్రయోగాలు వద్దని వెంకయ్యనాయుడు ఇదివరకే స్పష్టం చేసిన విషయం తెలిసిందే.







ఈనాడు
సుదృఢ సమాఖ్య కోసం...

పదిహేనో ఆర్థిక సంఘం పని ప్రారంభించిన నేపథ్యంలో- కేంద్రం నుంచి పన్నుల వాటాల నిర్ధారణకు అది పాటించనున్న మార్గదర్శకాలపై ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్ర కలవరపాటుకు గురవుతున్నాయి. జనవిస్ఫోట నియంత్రణలో మెరుగైన పనితీరే తమకు గుదిబండ కానుందని అవి తల్లడిల్లుతున్నాయి! కేంద్రం వసూలు చేసే పన్నుల్లో రాష్ట్రాల భాగస్వామ్య హక్కును రాజ్యాంగ అధికరణలు స్పష్టంగా నిర్దేశిస్తున్నాయి. ఏడో ఆర్థిక సంఘం మొదలు పద్నాలుగో ఫైనాన్స్ కమిషన్ దాకా అన్నీ 1971నాటి జనాభా లెక్కల ప్రకారమే వనరుల పంపిణీకి ఓటేశాయి. ప్రస్తుత పదిహేనో ఆర్థిక సంఘం 2011 జనగణన లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలంటున్న కేంద్ర నిర్దేశం పలు రాష్ట్రాలకు మింగుడుపడటం లేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు సహా పన్నెండు రాష్ట్రాలు- మార్గదర్శకాల్లో మార్పును నష్టదాయకంగా పరిగణిస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ వేదికగా ఆర్థిక సంఘం ప్రాంతీయ భేటీలో ఈ అభ్యంతరమే వాటి ఉమ్మడిగళంలో ప్రతిధ్వనించింది. వివాదాస్పద ప్రతిపాదనపై కలత చెందుతున్న రాష్ట్రాల ఆందోళనకు కేంద్రం ఎలా ప్రతిస్పందిస్తుందో చూడాలి! ఏటికి ఎన్ని నీళ్లు వచ్చినా కుక్క గతుకు నీళ్లే గతి అన్న సామెత చందంగా దిగజారింది దేశంలో రాష్ట్రాల పరిస్థితి. గత ఆర్థిక సంఘం విభాజ్య నిధుల్లో రాష్ట్రాలవాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచినా, వాస్తవంలో పంచుతున్నది 35 శాతమేనని కేంద్రమే లోక్‌సభాముఖంగా అంగీకరించింది. ఆర్థిక సంఘం విధివిధానాలు, సిఫార్సుల పకడ్బందీ అమలుకు సంబంధించి విస్తృత సంస్కరణల ఆవశ్యకతను ఉద్బోధిస్తున్న ఉదంతమిది.

కేంద్రం తాను విధించి వసూలు చేసే పన్నులు, సుంకాల్లో రాష్ట్రాల వాటాలు నిర్ణయించే నిమిత్తం ప్రతి అయిదేళ్లకోసారి ఆర్థిక సంఘాన్ని కొలువుతీర్చడం రాజ్యాంగబద్ధ విధి. ఆర్థికపరమైన ఇబ్బందులు అధిగమించడంలో ఆ నిధుల పందేరం కొండంత అండ కాగలదని ప్రతిసారీ రాష్ట్రాలు గంపెడాశలు పెట్టుకోవడం, తీరా సిఫార్సులు వెల్లడయ్యాక తరతమ భేదాలతో చింతాక్రాంతం కావడం- అంతులేని కథగా కొనసాగుతోంది. అభివృద్ధి కార్యక్రమాల అమలులో కీలకమైన వనరుల లభ్యత అంశాన్ని ఆర్థిక సంఘాలు పూర్తిగా ప్రణాళిక సంఘానికే వదిలేయడం, నిధుల పంపిణీ విధివిధానాల కూర్పులో తమకు ప్రమేయమన్నదే లేకుండాపోవడంతో ఏళ్ల తరబడి రాష్ట్రాల్లో పెను నైరాశ్యం ఆవరించింది. ప్రణాళిక సంఘం స్థానే 'నీతి ఆయోగ్'ను అవతరింపజేసిన సంస్కరణాభిలాష కనబరచిన ఎన్డీఏ ప్రభుత్వం- ఆర్థిక సంఘం పనిపోకడల్లోనూ మౌలిక క్షాళనకు నడుం కట్టాల్సిన తరుణం ఆసన్నమైంది! కేంద్ర పన్నుల్లో ఒకప్పుడు 7.9 శాతంగా ఉన్న తమ వాటా 5.3 శాతానికి పడిపోవడమేమిటని దశాబ్దం క్రితం కరుణానిధి నిలదీశారు. నూతన పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్న దీటుగా వనరుల పంపిణీ సాకారం కావడం లేదని నేడు మరెన్నో రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయి. ఎఫ్ఆర్‌బీఎం రూపేణా చట్టబద్ధ ఆంక్షల కారణంగా రాష్ట్రాలు ఇష్టానుసారం రుణాలు తెచ్చుకోగల వీల్లేదు. వెనకబడిన రాష్ట్రాలకు కేంద్రం వేలుపట్టి నడిపించాల్సింది. దేశ రక్షణ సహా తనవంతు బాధ్యతల్ని సమర్థంగా నిభాయించడానికి కేంద్రం పరిమితమై- అన్ని రకాల పథకాల అమలును రాష్ట్రాలకు బదలాయించడం సర్వోత్తమం. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా పథకాల్ని రూపొందించే కార్యాచరణలో సత్తా నిరూపించుకునే రాష్ట్రాలు ఆర్థికంగానూ బలపడాలి. విద్యుక్త బాధ్యతల అనివార్య నిర్వహణ సజావుగా సాగే వాతావరణం కల్పిస్తే రాష్ట్రాల మధ్య ఆరోగ్యకరమైన స్పర్ధ రెక్క విచ్చుకుంటుంది. ఆ మేరకు విభాజ్య నిధిలో రాష్ట్రాలవాటా గణనీయంగా పెరగాలి!

అయిదేళ్ల కాలావధిలో రాష్ట్రాల రాబడులు, జన నియంత్రణకు చేపట్టిన చర్యలు, విపత్తులను వెన్నంటి పునరుద్ధరణ సరళి, పారిశుద్ధ్యం వ్యర్థాల నిర్వహణ తదితరాంశాల్ని లోతుగా పరిశీలించి వాటాల్ని మదింపు వేస్తామని ఆర్థిక సంఘం చెబుతున్నా- వాస్తవంలో లెక్కలు తప్పుతున్నాయి. కేరళ, పశ్చిమ బంగ, జమ్మూకశ్మీర్ ప్రభృత రాష్ట్రాల నికర రెవెన్యూలోటు పరిస్థితే పద్నాలుగో ఆర్థిక సంఘం అంచనాలు ఎలా తలకిందులయ్యాయో ఇట్టే బోధపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ఆదాయాన్ని లక్షన్నర కోట్ల రూపాయల మేర అధికంగా, ఖర్చుల్ని రూ.42 వేలకోట్లు తక్కువగా, రెవెన్యూలోటును రమారమి రెండు లక్షల కోట్ల దాకా తక్కువగా కమిషన్ అంచనా వేసింది. 2014 జూన్ రెండున ఆవిర్భవించిన నూతన రాష్ట్ర స్థితిగతులపై ఆర్థిక సంఘం సరిగ్గా నివేదించని పర్యవసానంగా చాలా నష్టపోయామన్న ఆవేదన తెలంగాణను కుదిపేస్తోంది. ఇప్పుడిక పురోగామి రాష్ట్రాల పనితీరుకు ప్రోత్సాహకరంగా పదిహేనో ఆర్థిక సంఘం కొత్త ఒరవడి దిద్దాల్సి ఉంది. నిధుల పంపిణీపై అసంతృప్తుల ప్రజ్వలనం సమాఖ్య స్ఫూర్తిని కదలబార్చకముందే కేంద్రం దిద్దుబాటు చర్యలు చేపట్టాలి. రాష్ట్రాల బడ్జెట్ లోటుపాట్లు, అభివృద్ధి పథకాల నిమిత్తం సొంత వనరుల సమీకరణ, వ్యయనియంత్రణ సామర్థ్యం తదితర అంశాలన్నింటినీ ఆర్థిక సంఘం క్షుణ్నంగా మదింపు వేసి- పన్నుల్లో వాటాల పంపిణీకి సహేతుక సూత్రాలు రూపొందించాలి. రాష్ట్రాలు బలోపేతమైతేనే దేశం సుదృఢమవుతుంది. సమధికంగా బాధ్యతలు మోయాల్సిన రాష్ట్రాలు ఆ బరువు కింద చితికిపోయే దురవస్థ దాపురించకూడదు. అందరికీ అభివృద్ధి ఫలాలు సమకూరేలా జాతీయ ప్రాథమ్యాలు నిర్దేశించే అద్భుత అవకాశాన్ని ముఖ్యమంత్రులకు కట్టబెడతామని గతంలో ప్రధాని మోదీ జాతికి మాటిచ్చారు. ఆ మేరకు రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛను ఇనుమడింపజేసేలా నిధుల పంపిణీ క్రమబద్ధీకరణలో కేంద్రం సత్వర దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించాలి!

ఆశలకు అద్దం... ప్రగతి ప్రస్థానం

ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ తన నాలుగేళ్ల ప్రయాణంలో ఆర్థికంగా మెరుగైన స్థితికి చేరుకుంది. ఆందోళనకర ఆర్థిక పరిస్థితుల నుంచి ఆశావహ దిశగా అడుగులు వేసింది. అగమ్యగోచర స్థితిగతుల నుంచి ఆత్మవిశ్వాసంతో ముందుకువెళ్తోంది. ఆదాయాన్ని పెంచుకుంటూ, మెరుగైన ఆర్థిక వృద్ధిరేటు సాధిస్తూ ఇప్పుడు ఎన్నికలకు ముందు పూర్తిస్థాయి బడ్జెట్‌కు సిద్ధమైంది. 2014 జూన్ రెండో తేదీన ఆవిర్భవించిన రాష్ట్రంలో తొలిసారిగా అధికారాన్ని చేజిక్కించుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం నాలుగు బడ్జెట్లను ప్రవేశపెట్టినప్పటికీ, 2018-19 ఆర్థిక సంవత్సరానికి, ఎన్నికలకు ముందు ప్రవేశపెడుతున్న ఈ చివరి పూర్తిస్థాయి బడ్జెట్ అత్యంత కీలకమైంది. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ఇది అద్దం పట్టాల్సిన అవసరం ఉంది. 'పది నెలల బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం కత్తిమీద సామే, నూతన రాష్ట్రానికి బడ్జెట్ ప్రవేశపెట్టడం కష్టమైన పని, ఆదాయం ఎంత వస్తుందో, కేంద్రం నుంచి సహాయం ఎంత అందుతుందో తదితర వివరాలు తెలియని అనిశ్చితిలో 2014-15 బడ్జెట్ రూపొందించాల్సి వచ్చింది' అని రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలి బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ చెప్పిన మాటలు ఇక్కడ గమనార్హం.



పన్నుల రాబడే ఇంధనం

నాలుగేళ్ల ప్రస్థానంలో అనిశ్చితి నుంచి పూర్తిగా బయటపడి భారీ లక్ష్యాలు నిర్దేశించుకుని రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. వ్యవసాయం, సాగు, తాగు నీరు, సంక్షేమం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయలను వ్యయం చేస్తోంది. మెరుగైన ఆర్థిక వృద్ధిరేటు సాధించి, ఆదాయాన్ని పెంచుకుని కేంద్రం తోడ్పాటు లేకున్నా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. 45 నెలల ప్రస్థానంలో రాష్ట్ర రాబడి రెట్టింపు అయింది. తలసరి ఆదాయం, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో జాతీయ సగటుకన్నా మిన్నగా ఉంది. పన్నుల ద్వారా లభించే ప్రతి పైసా కూడా ప్రజోపయోగానికి ప్రభుత్వం ఖర్చు చేస్తోందనే విశ్వసనీయతను ప్రజలకు కలిగేలా రేపటి బడ్జెట్ ఉండాలి. 2017-18లో రూ.1,49,646 కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం, 2018-19 ఆర్థిక సంవత్సరానికి మరింత భారీ బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు 19 శాతంపైగా అంచనాలతో ఉన్న ప్రభుత్వం ఈ మేరకు బడ్జెట్ పరిమాణాన్ని పెంచనుంది.

రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇంధనం పన్ను రాబడే. రాష్ట్రం సొంతంగా సమకూర్చుకునే నిధులతో ప్రభుత్వం నడుస్తోంది. కేంద్రం నుంచి పన్నుల వాటాగా అందే మొత్తం, కేంద్ర ప్రభుత్వ పథకాలకు వాటాగా కేంద్రం అందించే నిధులు బడ్జెట్‌లో 20 శాతం లోపే ఉంటున్నాయి. 2017 జులై ఒకటో తేదీ నుంచి వస్తు,సేవల పన్ను (జీఎస్‌టీ) అమలులోకి వచ్చింది. జీఎస్‌టీ పరిధిలోని వస్తువుల పన్ను రాబడిపై కొత్త విధానం తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రం ఆర్థిక వృద్ధిరేటు 19 శాతంగా ఉంటుందని భావించినా, జీఎస్‌టీ సహా వివిధ కారణాలవల్ల అది 15.7 శాతానికి పరిమితం కావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పన్నుల ఆదాయం పెంచుకోవడంలో ప్రభుత్వ విభాగాల పనితీరు కీలకంగా మారింది. వ్యవసాయం, సాగునీరు, సంక్షేమం వంటి రంగాలకే బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు దక్కనున్న నేపథ్యంలో పన్నుల ఆదాయం ఈ రంగాలకు ఊతంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో సింహభాగం 74.3 శాతం అమ్మకం పన్ను ద్వారానే వస్తుంది. ఎక్సైజ్ విభాగం నుంచి 14.4 శాతం, స్టాంపులు రిజిస్ట్రేషన్ల నుంచి 4.8 శాతం, వాహనాల పన్ను ద్వారా 4.8 శాతం ఆదాయం లభిస్తుంది. ఇతర పన్నుల ఆదాయం 1.8 శాతంగా ఉంది.

కొత్త రాష్ట్రానికి కేంద్రం చేయూత అందలేదు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు జాతీయస్థాయి గుర్తింపు దక్కినా, నిధుల తోడ్పాటు మాత్రం లభించలేదు. పన్నుల వాటాగా రాష్ట్రానికి రావాల్సిన నిధులతోపాటు, ఉపాధి హామీ, సర్వశిక్షా అభియాన్, జాతీయ ఆరోగ్య మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి గ్రామ్ సడక్‌యోజన, వెనకబడిన జిల్లాల్లకు ఇచ్చే నిధులు మినహా ఇతర భారీ పథకాలకు కేంద్రం నుంచి చేయూత అందలేదు. ఇంటింటికి తాగునీటిని అందించేందుకు ఉద్దేశించిన మిషన్ భగీరథ, చెరువుల పునరుద్ధరణకు సంబంధించిన మిషన్ కాకతీయ, కాళేశ్వరం సహా సాగునీటి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి నిధుల సాయం అందకపోవడంతో రాష్ట్ర ఆదాయం, రుణాలతో వీటికి కేటాయింపులు చేయాల్సి వస్తోంది. ఫలితంగా రుణభారం పెరుగుతోంది. 2018-19 కేంద్ర బడ్జెట్ రాష్ట్రానికి పూర్తి నిరాశను మిగిల్చింది. దీంతో తాజా రాష్ట్ర బడ్జెట్‌లో ఆయా పథకాలకు రాష్ట్రం పూర్తిగా నిధులను సర్దుబాటు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రేపు తెలంగాణ రాష్ట్ర బడ్జెట్

అభివృద్ధి సాధించాలంటే అప్పులు తప్పనిసరి అని ప్రభుత్వం చెప్పడంలో హేతుబద్ధత ఉంది. ఇదే సమయంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లడం భవిష్యత్తులో అభివృద్ధికి అవరోధంగా మారుతుందనడంలో సందేహం లేదు. రాష్ట్రం ఏర్పాటునాటికి ఉన్న అప్పులు మూడు రెట్లకు చేరుకున్నాయి. బడ్జెట్ పరిధిలో ఏటా రూ.27 వేలకోట్ల నుంచి రూ.30 వేలకోట్లను అప్పులుగా తెచ్చుకుంటున్న రాష్ట్రం బడ్జెట్ వెలుపల తెచ్చుకుంటున్న అప్పులు భారీగా పెరుగుతున్నాయి. మిషన్ భగీరథ, రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణం సహా భారీ ప్రాజెక్టులకు కార్పొరేషన్లను ఏర్పాటు చేసుకుని బ్యాంకులు, హడ్కో, నాబార్డ్ లాంటి సంస్థలనుంచి పెద్ద మొత్తంలో రుణాలు తెచ్చుకుంటోంది. బడ్జెట్ వెలుపల కార్పొరేషన్ల పేరిట తీసుకుంటున్న వేలకోట్ల రూపాయల రుణాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూచీ వహిస్తోంది. రుణాలు తిరిగి చెల్లించే పరిస్థితుల్లో కార్పొరేషన్లు ఉండవు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే అసలు, వడ్డీలను చెల్లించాల్సి ఉంటుంది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రుణాల శాతం 2014-15లో 16.06 శాతం ఉండగా, తాజాగా అది 19 శాతానికి చేరుకుంది. 2015-16లో 17.27 శాతం కాగా 2016-17లో 18.7 శాతంగా ఉంది. ద్రవ్య నియంత్రణ, బడ్జెట్ నిర్వహణ (ఎఫ్ఆర్‌బీఎం) పరిధిలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)లో రాష్ట్రం రుణం తీసుకోగలిగింది మూడు శాతం మాత్రమే. ఇది గరిష్ఠంగా మరో 0.5 శాతం మాత్రం పెంచుకునే అవకాశం ఉంది. నిధులు సమకూర్చుకునేందుకు ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్లుగా కేంద్రాన్ని కోరుతున్నా ఫలితం లేదు.

దేశ తలసరి ఆదాయం రూ.1.03 లక్షలు అయితే, రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1.54 లక్షలుగా ఉంది. రాష్ట్రంలోని 31 జిల్లాలవారీగా చూస్తే తలసరి ఆదాయంలో తేడాలు స్పష్టమవుతాయి. తలసరి ఆదాయంలో రాష్ట్ర సగటు కంటే కేవలం నాలుగు జిల్లాల తలసరి ఆదాయ మాత్రమే ఎక్కువగా ఉందనే అంశాన్ని విస్మరించరాదు. రాష్ట్రంలో 18 జిల్లాల తలసరి ఆదాయం లక్ష రూపాయల లోపే ఉండగా, 14 జిల్లాల తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే తక్కువగా ఉంది. చిట్టచివర ఉన్న జగిత్యాల జిల్లా తలసరి ఆదాయం రూ. 77,669. మాత్రమే. హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాలు తలసరి ఆదాయంలో అగ్రభాగంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల సమాన అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి.

వ్యవసాయానికి ఊతం

రాష్ట్రంలో జీఎస్‌డీపీలో వ్యవసాయ రంగం వాటా 14.7 శాతమే. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయంపై ఆధారపడి ఉన్నవారు 73 శాతం. ఈ నేపథ్యంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అభ్యున్నతికి ప్రత్యేక కార్యాచరణ అవసరం. రుణమాఫీతో పాటు వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తోంది. రైతులకు పెట్టుబడి రాయితీగా ఒక్కో సీజన్‌కు రూ.4,000 అందించడానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు చేయనుంది. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించేలా చేయడానికి ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. కాళేశ్వరం సహా అనేక భారీ ప్రాజెక్టులకు వేలకోట్ల రూపాయలు వ్యయం చేస్తోంది. ప్రాజెక్టులు కీలక దశకు చేరుతున్న నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో సాగునీటికి భారీగా నిధులు ఇవ్వనున్నారు. దేశంలోనే సంక్షేమ రంగానికి బడ్జెట్‌లో ఎక్కువ శాతం నిధులు కేటాయిస్తున్న రాష్ట్రం తెలంగాణ. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి నిధుల కేటాయింపులు ఉంటున్నా, అవి పూర్తి స్థాయిలో వ్యయం కావడంలేదనే వాస్తవాన్ని గుర్తించాలి. రాష్ట్ర జనాభాలో 20 శాతం, 20 నుంచి 29 ఏళ్లలోపువారే. మరో 18 శాతం, 10 నుంచి 18 ఏళ్లలోపు వారు. జనాభాలో పనిచేయగలిగిన వయసులో (15 నుంచి 59 ఏళ్లలోపు) ఉన్నవారు 65 శాతం. వీరందరికి పని కల్పించడంతో బాటు, యువశక్తిని ఉపయోగించుకోవడంపై దృష్టి సారించాలి. తలసరి ఆదాయంలో జాతీయ సగటుకంటే ఎక్కువగా ఉన్నా, అక్షరాస్యతలో జాతీయసగటు కంటే వెనకబడి ఉంది. సగటు అక్షరాస్యత శాతం 66.54. పేదలకు రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీలకు మూడెకరాల భూమి వంటివి పూర్తిస్థాయిలో అమలు కావాల్సిఉంది. బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు ఉంటున్నా వ్యయం దగ్గరకు వచ్చేసరికి పరిస్థితులు భిన్నంగా ఉంటున్నాయి. నిధుల వ్యయంపై జవాబుదారీతనం పెరగాలి. ప్రజలపై అదనపు భారం వేయకుండా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. ప్రజలు చెల్లించే ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా కార్యాచరణ ఉండాలి!

- బి.ఎన్.జ్యోతిప్రసాద్

ఆవిర్భావం నుంచి రాష్ట్ర ఆదాయాలు (రూ.కోట్లలో)

అంశం	2014–15	2015–16	2016–17	2017–18
సొంత పన్నుల రాబడి	29,288	39,975	50,126	62,619
పన్నేతర రాబడి	6,446	14,414	8,510	6,601
కేంద్ర పన్నుల వాటా	8,188	12,351	14,877	17,005
కేంద్రం నుంచి సహాయ నిధులు	7,118	9,394	13,557	26,858
అప్పులు	11,371	17,498	24,465	29,380
ఇతర ఆదాయాలు	5,000	4,185	1,118	6,857

☛ 2016–17 సవరించిన బడ్జెట్ అంచనా ☛ 2017–18 బడ్జెట్ అంచనాలు

గత నాలుగేళ్లుగా బడ్జెట్ మొత్తాలు

సంవత్సరం	బడ్జెట్ (రూ.కోట్లలో)
2014-15	1,00,637
2015-16	1,15,689
2016-17	1,30,415
2017-18	1,49,646

నిధుల లేమి-కొరవడిన హామీ



ఆచార్య గొల్లు సూర్యనారాయణ

విద్య ఒక సామాజిక అవసరం. ఏ దేశ పురోగతికైనా అది కీలకం. భారత్‌లో మొత్తం విద్యావ్యవస్థే సమస్యలమయంగా మారింది. పలు పాఠశాలల మొదలు కళాశాలలు, విశ్వవిద్యాలయ స్థాయి వరకు బోధన, పరిశోధన రంగాల్లో ఉదాసీనత తాండవిస్తోంది. అనేకచోట్ల మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉంది. ఎన్ని విధాన నిర్ణయాలు చేసినా, సంస్కరణలు తెస్తామంటున్నా ఆచరణలో అవి అంతంతమాత్రంగా ఉంటున్నాయి. లోటుపాట్లను చక్కదిద్దాల్సిన ఆవశ్యకతపై డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి మేధావులు ప్రభుత్వాలకు ఎన్నో సూచనలు చేశారు. విద్యాభివృద్ధి కోసం వివిధ సంఘాలు నివేదికలు సమర్పించాయి. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, సాంకేతిక, ఉపాధ్యాయ విద్యల ప్రాముఖ్యాన్ని విశదీకరిస్తూ అధ్యయన బృందాలు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు ఎన్నింటినో ప్రతిపాదించాయి. వీటన్నింటి నేపథ్యంలో, ముఖ్యంగా ప్రాథమిక విద్యను పరిపుష్టం చేసేందుకు కొన్ని ప్రభుత్వాలు ప్రస్తుతం విస్తృత చర్యలు చేపడుతున్నాయి.

జాతీయ విద్య, పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 2015లో సర్వే నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన లక్షా తొంభై వేలమంది విద్యార్థుల్ని ప్రశ్నించి సమాచారం రాబట్టారు. దేశానికి సంబంధించి, ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకూ కనీస పరిజ్ఞానం లేదని అప్పట్లో తేలింది. బోధనలోనూ ప్రమాణాలు నామమాత్రమే! ఉపాధ్యాయుల కొరత, ఉన్నవారిలోనూ అనేకులు నూతన మార్పుల్ని ఆకళింపు చేసుకోలేకపోవడం, విద్యార్థులకు మార్గదర్శనం చేయని ప్రణాళికలు... వంటి సమస్యలున్నాయి. ఇవన్నీ విద్యావ్యవస్థను కుంగదీస్తున్నాయి. దాదాపు 6.5 కోట్లమంది తొలిదశ చదువులకైనా నోచని దేశం ఇది. ప్రాథమిక విద్యారంగంలో బాగా వెనకబడి ఉందని 2016లో 'యునెస్కో' అధ్యయనం తేల్చింది. పదేళ్లపాటు ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో చదివినా, కనీసం చదవడమో రాయడమో రాని పరిస్థితిని అది బయటపెట్టింది. పునాదిలోనే పటుత్వం లేని విద్య వల్ల ఉపయోగమేమిటి, ఉన్నత చదువుల్లో నైపుణ్యం ఇక ఎలా సాధ్యమవుతుందని సంస్థ ప్రశ్నించింది. ఫిన్లాండ్, నార్వే, స్వీడన్ వంటి దేశాలు ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు మంచి జీతాలిస్తూ, అటువంటి ఫలితాలనే రాబడుతున్నాయి. అట్టడుగు స్థాయి నుంచి విద్యార్థుల్ని శ్రద్ధగా తీర్చిదిద్దడంలో దక్షిణ కొరియా ముందుంటోంది. అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాలు ప్రాథమిక దశలోనే విద్యార్థులకు చక్కటి విలువలు నేర్పుతున్నాయి. సృజనాత్మక బోధనతో దూసుకువెళుతున్నాయి. మనదేశంలో అటువంటి పరిస్థితి లేదు.



ప్రాథమిక విద్యా 'అవస్థ'

అనేక రంగాల అభివృద్ధి విద్యతోనే ముడిపడి ఉంది. పరిశ్రమలు, ఆర్థికం, సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయం, విదేశీ సంబంధాల వంటివి ప్రత్యక్షంగా/పరోక్షంగా విద్యతో అనుబంధమై ఉంటాయి. ప్రాథమిక దశ నుంచి సరైన ప్రణాళిక ఉండాలి. సమర్థ కార్యాచరణ కావాలి. అంకితభావం గల సిబ్బంది అవసరం ఎంతైనా ఉంది. దూరదృష్టి లోపించడం వల్లనే, కేవలం 20 శాతం విద్యార్థులే ఉన్నత చదువుల్లో స్థానం పొందగలుగుతున్నారు. అటువంటి విద్యను అభ్యసించినవారిలో 20 శాతం మాత్రమే చదువుకు తగిన ఉపాధి సాధించగలుగుతున్నారు. ఎంతోమంది నిరుద్యోగులుగానో, చిరుద్యోగులుగానో జీవనాన్ని సాగిస్తున్నారు. దేశంలో సుమారు 66 లక్షలమంది ప్రాథమిక స్థాయి బోధనా సిబ్బంది ఉన్నారు. వారిలో 11 లక్షలమందికి ప్రామాణిక అర్హతలు, శిక్షణ కొరవడ్డాయని అంచనా. ఇది విద్యారంగ దుస్థితిని తెలియజేస్తోంది. ఉన్నత విద్యాలయాల్లోనూ భర్తీ కాని బోధకుల ఖాళీలు 30 శాతానికి పైగా ఉంటాయి. విద్యతో సాంకేతికతను అనుసంధానించాలి. ప్రభుత్వ పాఠశాలల పనితీరును మెరుగుపరచే కృషి ఇంకా విస్తృతం కావాలి. విద్య ప్రైవేటీకరణ వల్ల పేదలు, బడుగు, బలహీనవర్గాలవారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. విద్యారంగాన్ని సంస్కరించడంపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించకుంటే, ప్రైవేటు సంస్థల విపరీత ప్రభావం దేశానికి ఆర్థిక నష్టదాయకంగా పరిణమిస్తుంది. మన దేశానికి చెందిన ఎంతోమంది విదేశాల్లో స్థిరపడి, తమ శక్తి సామర్థ్యాలు, ప్రతిభా పాటవాలను అక్కడే వినియోగిస్తున్నారు. విజ్ఞానం అందించిన స్వదేశాన్ని వారు విస్మరిస్తున్నారు. ఈ రకమైన పరిణామాలు సరికావు. దేశంలోని విద్యా సంస్థలు పూర్తిస్థాయి అవకాశాలను కల్పిస్తే, విద్యావకాశాల కోసం ఎవరూ విదేశాలకు అదేపనిగా వెళ్లాల్సిన అవసరం ఉండదు.

ఉపాధ్యాయులు ఏకోన్ముఖ లక్ష్యంతో పనిచేస్తే- ప్రాథమిక విద్య మెరుగుపడుతుంది. వారిని ప్రభుత్వాలు పలు సదుపాయాలతో ప్రోత్సహించాలి. ఆ మేరకు ఉభయ తెలుగు రాష్ట్రాలూ ముందడుగు వేస్తున్నాయి. నాణ్యమైన రీతిలో బోధనా సిబ్బందిని నియమించుకోవాలన్న ప్రయత్నాలు సాగిస్తున్నాయి. విద్య అనేది కేవలం చదవడం, రాయడం, మార్కులు పొందడానికే పరిమితం కారాదు. అది జాతీయ ప్రయోజనాల్ని దృష్టిలో ఉంచుకోవాలి. ఇతర దేశాల మాదిరిగా భారత్‌లోనూ ప్రాథమిక విద్యారంగానికి అధికంగా నిధులు కేటాయించాలి. విద్యార్థులకు విద్యతో పాటు జాతీయ భావన కలిగించాలి. అధికారులు, తల్లిదండ్రులు తమ వంతు బాధ్యత వహించాలి. ఏమాత్రం మెతక వైఖరి కనబరచినా, ఆశించిన ఫలితాలు లభించవని తెలిసి వ్యవహరించడం ఎంతో అవసరం!

(రచయిత- విద్యారంగ నిపుణులు)

ఈనాడు లేఖలు

'పూడికతీత'లో లోటుపాట్లు

ఇది వేసవికాలం కావడంతో, పలు గ్రామాల్లో పూడికతీత పనులు సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలోని 'మిషన్ కాకతీయ' వంటి పథకాల కింద ఆ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పూడిక తీసిన మట్టిని అక్కడి చెరువుకట్టల్ని గట్టి చేయడానికి, పొలాలకు ప్రయోజనం కల్పించేందుకు వినియోగిస్తున్నారు. చెరువు మట్టి సహజంగానే వ్యవసాయ భూముల సారాన్ని పెంచుతుంది. అందువల్ల సాగుదారులు ప్రత్యేకించి ఎరువుల్ని కొనుగోలు చేసి అదేపనిగా వాడాల్సిన అవసరమేదీ ఉండదు. ఆ మేరకు వారికి భారాన్ని ఎంతో కొంత తగ్గించినట్లవుతుంది. కానీ కొన్నిచోట్ల గుత్తేదారుల వర్గాలు స్వప్రయోజనాల కోసం అన్ని విలువలకూ తిలోదకాలిస్తున్నాయి. పూడిక మట్టిని అక్కడి కట్టల కోసం కాకుండా, ఇతరత్రా పనులకు వాడుతూ సొమ్ముచేసుకోవడం కనిపిస్తోంది. అధికార యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలి.

- ఎ.మనోజ్, వెల్గొండ, జగిత్యాల జిల్లా

ఆర్టీసీ బస్సుల తీరే వేరు

ప్రయాణికులకు ఎన్నో రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని సంబంధిత ప్రభుత్వ శాఖలు చెబుతున్నాయి. అందులో వాస్తవం ఎంత అనేది హైదరాబాద్, విజయవాడ వంటి నగరాల్లోని వాస్తవ స్థితిగతుల్ని గమనిస్తే ఇట్టే బోధపడుతుంది. అనేక ప్రాంతాల్లో ఆర్డినరీ బస్సు సర్వీసుల నిర్వహణా అంతంతమాత్రంగా ఉంటోంది. వివిధ రకాల కారణాలు చెప్పి వాటి సంఖ్యను అధికారులు కుదిస్తున్నారు. ట్రిప్పుల్ని పరిమితం చేయడం, ఏకంగా అసలు బస్సులనే రద్దుపరచడం వంటివి ఎక్కువవుతున్నాయి. ఇది విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, మహిళలు- అందరికీ పలు ఇబ్బందులు కలిగిస్తోంది. ప్రయాణికులు గంటల తరబడి ఎదురు చూడటమే తప్ప, ఎటువంటి ప్రయోజనమూ ఉండటం లేదు. రోడ్డురవాణా విభాగం ఇప్పటికైనా తగిన విధంగా చర్యలు తీసుకోవాలి. అవసరమైన చోట్ల బస్సుల సంఖ్య పెంచాలే తప్ప, అందుకు విరుద్ధంగా ఇష్టానుసారం నిర్ణయాలు చేయడం తగదు.

- అఖ్తర్ హుస్సేన్, హైదరాబాద్

సంస్కృతి

సంస్కారం అనేది మనసును, బుద్ధిని ప్రభావితం చేస్తుంది. దానికి ప్రతీక- నమస్కారం. ఆ సమయంలో బాహ్యాంతరాలు ఒక్కటిగా ఉండాలి. అలా లేకుండా చేసే ఏ వందనమైనా, అర్చన అయినా వ్యర్థమే అవుతుంది.

గంగకు నమస్కరించే మనసు ఆ పవిత్ర నదీమతల్లినే చూడాలి. విద్యార్థి 'సరస్వతీ నమస్తుభ్యం' అనే ప్రార్థనతో మనసులో ఆ అక్షర దేవతను సాక్షాత్కరింపజేసుకోవాలి.

జాతీయ పతాకానికి అభివందనం చేసేటప్పుడు, హృదయం అంతటా దేశభక్తి నిండాలి. భారతీయ సంస్కృతి ఘనమైనది. సకల జీవరాశులతో పాటు దిక్కులకు, కాలాలకు, రుతువులకు, ఆఖరికి చెట్టుకు పుట్టకు సైతం అది కృతజ్ఞత చెబుతుంది. అనంత ప్రకృతికి, ఆరోగ్యాన్ని ప్రసాదించే సూర్యనారాయణుడికి వందనాలు సమర్పించే సంస్కృతి మనది. జీవితం వాటి ఉనికితోనే ముడివడి ఉంది. జీవించినంత కాలం విలువలతో కూడిన విధానాల్ని సంస్కారాలే ప్రసాదిస్తాయి.

శరీరంలోని శిరస్సు, హృదయం- ఉన్నతమైన స్థానాలు. వాటి నుంచి ప్రకటితమయ్యే వందనాలు ఆధ్యాత్మిక వికాసానికి దోహదపడతాయి. మనసా, వాచా, కర్మణా అభివ్యక్తమయ్యే ప్రణతులు అవి. యజ్ఞయాగాదుల్లో దేవతలకు సమర్పించే హవిస్సుల వంటివి. వాటిని ఆచరించేవారికి, స్వీకరించేవారికి పవిత్ర భావం ఉండాలి. అప్పుడే అవి నైతిక జీవన విలువల్నీ ప్రతిబింబిస్తాయి.

రెండు చేతులూ ముకుళించి అర్పించే నమస్కారం, మనసులో ఏవైనా ద్వైదీ భావనలుంటే వాటిని ఏకీకృతం చేస్తుంది. వినయం, గౌరవం, నియమం వంటి సులక్షణాల్ని ప్రతిఫలిస్తుంది. నిత్యం భగవానుడికి సమర్పించే నమోవాకాల ఆంతర్యమూ ఇటువంటిదే. మనఃపూర్వకంగా చేసేదే 'నమస్సు'. ఓం శివాయ నమః, ఓం గోవిందాయ నమః అంటూ భగవాన్ నామావళుల్ని ముందుగా ఓంకారంతో పలుకుతారు. అవి నమః శబ్దంతో ముగుస్తాయి. అంటే, అన్యచింతన లేకుండా దైవనామాల్ని భక్తితో నమస్కరిస్తూ పలుకుతున్నామని అర్థం.

అద్భుత, అపూర్వ శక్తిని అనుభూతి చెందినప్పుడు; సాధకుడి నమ్మకం లేదా విశ్వాసం సాకారమైనప్పుడు- అప్రయత్నంగా వందనం ఓ పూజాపుష్పంలా అర్పితమవుతుంది. నిష్కామ భావంతో చేసే ఆ సమర్పణ భగవానుడి అనుగ్రహం పొందేలా చేస్తుంది.

శ్రీకృష్ణుడి హితైషి, భక్తుడు- అక్రూరుడు. శ్రీకృష్ణ బలరాముల్ని సంహరించేందుకు సిద్ధమైన కంసుడు అందుకు ధనుర్ యాగాన్ని ఎంచుకుంటాడు. అదే మిషతో, వారిద్దరినీ మధురకు తీసుకురమ్మని అక్రూరుణ్ని పంపుతాడు. వారిని రథంలో తీసుకొస్తున్న ఆయన, దారిలో యమునా నది వద్ద ఆగుతాడు. స్నానానికని నీటిలోకి దిగుతాడు. మనసంతా కృష్ణుడే నిండి ఉండటంతో, భక్తిపూర్వకంగా యమునకు వందనం ఆచరిస్తాడు. అప్పుడు శ్రీకృష్ణ బలరాములు అదే నీటిలో కనిపిస్తారు. ఆశ్చర్యపడుతూ అటు ఒడ్డున చూడగానే, రథంలోనూ వారే దర్శనమిస్తారు. నిర్మల చిత్తంతో పుష్పంలా అర్పించిన వందనమే అక్రూరుణ్ని అలా భక్తిపారవశ్యంలో ముంచెత్తుతుంది.



అంతర్యామి

మహాభారత యుద్ధం పరిసమాప్తమవుతుంది. కృష్ణుడు తిరిగి ద్వారకకు వెళుతున్నప్పుడు, కుంతి భక్తిప్రపత్తితో నమస్కరిస్తుంది. అప్పుడు ఆమె చేసిన ప్రార్థన శ్రీమద్భాగవతంలో మనోహరంగా నిలుస్తుంది. 'మాధవా! సముద్రాన్ని గంగ చేరే రీతిగా, పరమాత్మలో జీవాత్మ ఐక్యమైతేనే మోక్షం. నా భవబంధాలు తొలగించు. నాకు ముక్తి ప్రసాదించు' అంటూ కుంతి వేడుకోవడం ఆయన మనసును తాకుతుంది.

మానవ బాహ్యాంతర ప్రవృత్తులు రెండుగా ఉంటాయి. అవి కుడి ఎడమల వంటివి. అభివందన వేళలో, చేతులు రెండూ కలవాలి. మనసును లక్ష్యంపైనే ఉంచాలి. అది మనిషిని ఉత్తముణ్ని చేస్తుంది. భావంలో, బాహ్యంలోనూ మనసును గోవిందుడిపై నిలిపి ఉంచి స్మరించాలంటాడు అన్నమయ్య.

ఇటువంటి సంస్కృతీ వారసత్వమే మనో వికాసాన్ని కలిగిస్తుంది. ధార్మిక పరిమళాల్ని గుబాళింపజేస్తుంది. వందన స్వీకరణ ఓ అత్యున్నత గౌరవ పురస్కారం. దైవీ లక్షణ సమన్వితులకే అది అందుతుంటుంది. ఆ వందనం భగవత్ లక్షణాలకే తప్ప, శరీరానికి కాదు!

- దానం శివప్రసాదరావు

ప్రాణం ఖరీదు రూ. 6.3 లక్షలు!

- **పొగాకుకు ఏటా 71 లక్షల మంది బలి**
- **రూ. 130 లక్షల కోట్ల ప్రజాధనానికి 'పొగ'**



వాషింగ్టన్: పొగ తాగడం వల్ల సంభవిస్తున్న ప్రతి మరణం నుంచి ప్రపంచంలోని పొగాకు పరిశ్రమ 9,730 డాలర్ల (రూ. 6.3 లక్షలు) వంతున లబ్ధి పొందుతున్నట్లు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. ప్రధానంగా ఆఫ్రికా, ఆసియా, మధ్య ప్రాచ్య దేశాల్లో పొగాకుకు అలవాటుపడిన ప్రజల నుంచి వాటికి లాభాలు పెరుగుతున్నట్లు వెల్లడించింది. అత్యధిక మరణాలకు సిగరెట్లు తాగడమే కారణంగా తెలిపింది. ఈమేరకు అమెరికన్ క్యాన్సర్ సొసైటీ (ఏసీఎస్), యూఎస్‌కు చెందిన వైటల్ స్ట్రాటజీస్ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన 'టుబాకో అట్లాస్' నివేదికలో ప్రపంచవ్యాప్తంగా పొగాకు దుష్ప్రభావాలు పెరుగుతున్న తీరును వివరించింది. పొగతాగే వారే కాకుండా. . ఆ ప్రభావంతో కొందరు.. పొలాల్లో పనిచేస్తున్నవారు మరికొందరు కూడా ప్రాణాలు కోల్పోతున్నట్లు వెల్లడించింది. నియంత్రణ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపడితే ప్రాణ, ఆర్థిక నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అట్లాస్ రచయిత జెఫ్రీ డ్రోప్ పేర్కొన్నారు. సాగు నుంచి వినియోగం దాకా ప్రతిదశలోనూ పొగాకు హాని చేస్తున్నట్లు వైటల్ స్ట్రాటజీస్ శాస్త్ర సలహాదారు నీల్ స్కుల్జర్ తెలిపారు.

'ఘనా'ంకాలు..

71 లక్షలు: 2016లో పొగాకు వినియోగంతో మరణాలు

8.84 లక్షలు: పొగ తాగనప్పటికీ పరోక్ష ప్రభావంతో మృతులు

110 కోట్లు: ప్రపంచవ్యాప్తంగా పొగతాగుతున్న జనాభా.

36 కోట్లు: పొగ తాగకుండా.. పొగాకును వినియోగిస్తున్నవారు.

ఆర్థికాంశాలు..

- ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తున్న మరణాలతో ఏటా 2 ట్రిలియన్ డాలర్ల (దాదాపు రూ. 130 లక్షల కోట్లు) ప్రజాధనానికి నష్టం వాటిల్లుతోంది.
- 2015లో ప్రపంచంలోని పెద్ద పొగాకు కంపెనీల మొత్తం లాభాలు 62.27 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 4.03 లక్షల కోట్లు) పైమాటే.
- గత 'అట్లాస్' ప్రకటించే నాటికి సగటున ఒక్కో పొగాకు మరణంపై సంబంధిత పరిశ్రమ 7 వేల డాలర్ల (రూ. 4.5 లక్షలు) లాభాలు పొందగా.. తాజా నివేదిక సరికి అది 39 శాతం పెరిగింది.

నేనింకా పూర్తిస్థాయి రాజకీయ నేతను కాదు: రజనీకాంత్

ఈనాడు డిజిటల్, చెన్నై: తానింకా పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిని కాదని ప్రముఖ నటుడు రజనీకాంత్ వ్యాఖ్యానించారు. గతేడాది డిసెంబరు31న తన రాజకీయ ప్రవేశాన్ని ఘనంగా చాటారు. ఇటీవల రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఉందని, తాను దాన్ని భర్తీ చేస్తానని ప్రకటించారు. రెండు వారాలపాటు ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా హిమాలయాలకు వెళ్లిన రజనీకాంత్ మంగళవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తానింకా పూర్తిస్థాయి రాజకీయ నాయకుడిని కాదని, పార్టీనీ ప్రారంభించలేదని చెప్పారు. ఇటీవలే ఎంఎన్ఎం అధ్యక్షుడు కమల్‌హాసన్ మాట్లాడుతూ... రాష్ట్రంలోని సమస్యలపై రజనీ మౌనం వహిస్తున్నారని వ్యాఖ్యానించారు. దీనికి స్పందనగా అన్నట్లు రజనీ పరోక్షంగా జవాబిచ్చారు.

ఒకే భూ సేకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు ప్రకటనలా!

- **భూసేకరణ, అవార్డుల జారీ ప్రక్రియను ఆపండి**
- **'సూర్యాపేట నుంచి ఖమ్మం' ఎన్‌హెచ్ విస్తరణపై తెలంగాణ సర్కారుకు హైకోర్టు ఆదేశం**

ఈనాడు, హైదరాబాద్: సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు జాతీయ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా భూసేకరణ ప్రకటనలు జారీ చేయడంపై హైకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. భూసేకరణను నిలిపేయాలని, పరిహార నిర్ధారణ అవార్డుల జారీ, భూమిని స్వాధీనంలో తీసుకునే ప్రక్రియలను నిలుపుదల చేయాలని తెలంగాణ సర్కారును ఆదేశించింది. కేంద్రప్రభుత్వం జారీచేసిన భూసేకరణ ప్రకటనను ఉపసంహరించుకునేంతర వరకు అన్ని చర్యలను ఆపాలని చెప్పింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారి విస్తరణ నిమిత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరుగా భూసేకరణ ప్రకటనలు జారీచేశాయని, నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ చేయిస్తున్నారంటూ సామాజిక ఉద్యమకారుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన టి.వెంకటేశ్వరరావు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. మంగళవారం జరిగిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ప్రస్తుతం కేంద్రం ఎన్‌హెచ్ఏఐ చట్టప్రకారం ఇచ్చిన ప్రకటన అమల్లో ఉంటుందని గుర్తుచేసింది. కేంద్రం భూసేకరణ ప్రకటనను ఉపసంహరించుకోని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం తన ప్రకటనను ఉపసంహరించుకోవాలంది. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ఉత్వర్వులు చెల్లుబాటుకానివిగా ప్రకటించాలని కోర్టు స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని విచారణను వాయిదా వేసింది.

ఆంధ్రప్రదేశ్ ద్రవ్యలోటుకు సంబంధించి జూన్ 2, 2014 నుంచి మార్చి 31, 2015 వరకు గల కాలానికి కేంద్రం, రాష్ట్రం మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయని కేంద్రం పేర్కొంది. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పి.రాధాకృష్ణన్ లిఖితపూర్వక జవాబిచ్చారు. ఆ సమయంలో ద్రవ్యలోటు రూ.16078.76 కోట్లని ఏపీ చెబుతుండగా రూ.4117.89 కోట్లు అని కేంద్రం లెక్క కట్టిందన్నారు.

TSPSC

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION

Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

TEACHERS RECRUITMENT TEST FOR RECRUITMENT TO THE POSTS OF SCHOOL ASSISTANT, SECONDARY GRADE TEACHER, LANGUAGE PANDIT, SCHOOL ASSISTANT - PHYSICAL EDUCATION & PHYSICAL EDUCATION TEACEHR VIDE NOTFN NOS. 52/2017, 53/2017, 54/2017, 55/2017 & 56/2017

TSPSC has conducted written examinations for the above notifications from 24/02/2018 to 04/03/2018. The Preliminary Keys of these exams will be available on TSPSC website from 14/03/2018. The objections on the Preliminary Keys will be accepted online on TSPSC website from 21/03/2018 to 31/03/2018. Candidates are advised to note the above dates and submit their objections through the link provided. Objections received beyond 31/03/2018 will not be considered at any cost. The candidates are instructed to submit their objections only in **English language** through the **"Text Box of Submit Objection"** link if they want to submit their objections in the form of Text. The objections if typed in other than English language in the Text Box will not be visible and hence will not be considered. Thus those who want to submit their objections in **other language** should upload their objection file only through the link **"Attach File"** in the form of PDF duly mentioning the HT No. Paper code, series, Question no/Question ID in the PDF file. For further details please visit www.tspsc.gov.in

Date: 13/03/2018 Sd/-

DIPR 670PP/ CL/ADVT/1/1/2017-18 SECRETARY

ప్రత్యేక హోదా కోసం ఆమరణ దీక్ష

సినీ నటుడు శివాజీ

గాంధీనగర్ (విజయవాడ), న్యూస్‌టుడే: కేంద్రం ఇచ్చిన హామీ మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సిన ప్రత్యేక హోదాను ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో ప్రకటించకపోతే అమరణ నిరాహార దీక్ష చేస్తానని సినీనటుడు శివాజీ వెల్లడించారు. విజయవాడలోని మంగళవారం ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఏపీకి పదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని మోసం చేసిన మోదీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. హోదా ఎందుకు రావడం లేదని ఇంట్లో ఆడవాళ్లు సైతం అడుగుతున్న విషయాన్ని భాజపా నాయకులు ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ గుంటూరులో స్థిరనివాసం ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ మరింత పోరాడేందుకు ఈనెల 19న అన్ని పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని, భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని వివరించారు. రాయలసీమపై మాట్లాడే నైతిక హక్కు భాజపాకు లేదన్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ భాజపా నేత అమిత్‌షాపై మాట్లాడిన మాటలతో తాము ఏకీభవిస్తున్నామన్నారు. రాష్ట్రానికి నష్టం కలిగే చర్యలు తీసుకుంటే తాము తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు, ఎల్లుండి వర్ష సూచన

అరేబియా సముద్రం నుంచి గాలులు

ఈనాడు, హైదరాబాద్: అరేబియా సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గురు, శుక్రవారాల్లో రాయలసీమ, తెలంగాణలో అక్కడక్కడ జల్లులు లేదా ఒక మాదిరి వర్షం పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సంచాలకుడు వై.కె.రెడ్డి తెలిపారు. తెలంగాణలో పడే అవకాశాలు తక్కువగా ఉన్నాయని ఉరుములతో కూడిన జల్లుల వల్ల వాతావరణం చల్లబడుతుందని చెప్పారు. తిరిగి శనివారం నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. తూర్పు భారతం నుంచి వీస్తున్న గాలులు అరేబియా సముద్రంపై పశ్చిమ గాలులతో కలిసే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడి వాతావరణంలో మార్పులొస్తాయని వివరించారు. అరేబియా సముద్రం నుంచి వీస్తున్న గాలుల వల్ల ఏపీ, తెలంగాణ వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. ప్రసుత్తం తెలంగాణలో పొడి వాతావరణం ఏర్పడింది. పగటి ఉష్ణోగ్రతలు 37, రాత్రి పూట 14.4 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఇవి ఇలాగే మరో రెండు రోజులు కొనసాగుతాయి. ఆకాశంలో మేఘాలు ఏర్పడటం వల్ల ఉష్ణోగ్రతల్లో పెరుగుదల పెద్దగా ఉండదని చెప్పారు.

సిరిసిల్లలో రూ.వంద కోట్లతో అపెరల్ సూపర్‌హబ్

- 30 వేల మందికి ఉపాధి
- కరూర్ కె-వెంచర్స్ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం
- నేతన్నకు శాశ్వత భరోసా: కేటీఆర్

ఈనాడు - హైదరాబాద్

సిరిసిల్ల జిల్లాలోని పెద్దూరు గ్రామంలో 20 ఎకరాల్లో రూ.100 కోట్లతో అపెరల్ సూపర్ హబ్‌ను ఏర్పాటు చేయడానికి తమిళనాడులోని కరూర్‌కు చెందిన ప్రముఖ దుస్తుల తయారీ సంస్థ కేవై వెంచర్స్ ముందుకొచ్చింది. 30 వేల మంది నేత కార్మికులకు ఉపాధి కల్పించేందుకు హామీ ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో మంగళవారం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఛైర్మన్ సుశీంద్రన్, రాష్ట్ర చేనేత, జౌళిశాఖల కమిషనర్ శైలజారామయ్యర్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు. పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, జౌళిశాఖ అధికారులు, ప్రముఖ వస్త్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఒప్పందాన్ని మంత్రి కేటీఆర్ స్వాగతించారు. దేశంలోనే మొదటిసారిగా సిరిసిల్లలో అపెరల్ పార్కులో సూపర్ హబ్ ఏర్పాటవుతోందని, దీని ద్వారా సిరిసిల్లలోని నేతన్నల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. 'నేను జౌళి కార్మికుల స్థితిగతులపై అధ్యయనానికి తిరుపూర్, కోయంబత్తూరులకు వెళ్లాను. తిరుపూర్ ప్రగతి నన్ను ఎంతగానో ఆకట్టుకుంది. సిరిసిల్ల నుంచి జరిగే వస్త్రాల ఉత్పత్తులు యేటా రూ.వేయి కోట్లు మాత్రమే. తిరుపూర్ నుంచి యేటా రూ.36 వేల కోట్ల ఎగుమతులు జరుగుతున్నాయి. ఆ స్ఫూర్తితో సిరిసిల్లను తీర్చిదిద్దాలని నిర్ణయించాం. మా ఆహ్వానం మేరకు కేవై వెంచర్స్ సంస్థ సిరిసిల్లలో హబ్‌ను ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఇక్కడ ఆ సంస్థ 3,500 కుట్టుమిషన్లను ఏర్పాటు చేస్తోంది. 15 వేల మందికి ప్రత్యక్షంగా, మరో 15 వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తుంది. ఇందులో ఎక్కువ మంది మహిళలే. ఎంబ్రాయిడరీ, డిజైన్, ఫ్యాషన్, ప్రింటింగ్, వాషింగ్, తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. హబ్ సమీపంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తారు. నెలకు 2.5 మిలియన్ వస్త్రాల ఉత్పత్తి ఇక్కడ జరుగుతుంది. ఈహబ్‌కు మొదటి సంవత్సరమయ్యే ఖర్చులో 90 శాతం ప్రభుత్వం భరిస్తుంది. రెండు, మూడో దశల్లో రాష్ట్రం సబ్సిడీగా వ్యయాన్ని భరిస్తే, మిగిలిన 90 శాతం కేవై సమకూర్చుకుంటుంది. దేశంలోని ప్రముఖ వస్త్ర సంస్థలైన అరవింద్, శ్యామ్, షాపర్స్ స్టాప్ వంటివి ఈ హబ్‌లో పాలు పంచుకుంటున్నాయి. సిరిసిల్లలో 75 వేల కుటుంబాలుండగా, 30 వేల కుటుంబాలు దీని ద్వారా లబ్ధి పొందుతారు' అని కేటీఆర్ చెప్పారు.



సిరిసిల్ల అపెరల్ పార్కు సూపర్ హబ్‌లో పెట్టుబడులపై మంత్రి కేటీఆర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న జౌళి శాఖ కమిషనర్ శైలజా రామయ్యర్, కేవై వెంచర్ సంస్థ సీఈవో సుశీంద్రన్

ఏప్రిల్‌లో ప్రారంభం

సిరిసిల్లలో సూపర్ హబ్‌ను వచ్చే నెలలోనే ప్రారంభిస్తామని సుశీంద్రన్ తెలిపారు. 9, 10 నెలల్లో పూర్తిస్థాయి నిర్మాణాలు జరిపి ఉత్పత్తులు పెంచుతామన్నారు. తమకు కేటీఆరే స్ఫూర్తి అని, ప్రభుత్వం గొప్ప సహకారం ఇచ్చిందన్నారు. తమ హబ్ ద్వారా నేతన్నలతో పాటు సిరిసిల్లను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.

పట్టణాలను దత్తత తీసుకోవాలి

నగరాలకు టీయూఎఫ్ఐడీసీ నిధులు:మంత్రి కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ఒక్కో పట్టణాన్ని దత్తత తీసుకోవాలని పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) సూచించారు. కలెక్టర్లు పట్టణాల అభివృద్ధి బాధ్యతను తీసుకుంటే అభివృద్ధి పనులు వేగంగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. పురపాలికల్లో అభివృద్ధి పనులకు తెలంగాణ పట్టణ ఆర్థిక, మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీయూఎఫ్ఐడీసీ) ద్వారా నిధులు అందించనున్నట్లు మంత్రి తెలిపారు. మంగళవారం మంత్రి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, పురపాలక కమిషనర్లతో దూరదృశ్య సమీక్ష నిర్వహించారు. పట్టణాల్లో చేపట్టాల్సిన పనులకు సిద్దిపేటను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కొత్త జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాలను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేయాలన్నారు. పనులను నిర్దేశించిన గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను ప్రజా ఆరోగ్య ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు పురపాలికల్లో పర్యటించడంతో బాటు ప్రతివారం పనుల పురోగతిని సమీక్షించాలన్నారు. సమావేశంలో పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్, టియుఎఫ్ఐడీసీ ఛైర్మన్ విప్లవకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాలస్తీనా ప్రధాని రమీ హమ్దల్లా ప్రాణాపాయం నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. మంగళవారం ఆయన అరుదైన రీతిలో గాజాలో పర్యటిస్తుండగా వాహన శ్రేణి (కాన్వాయ్) సమీపంలో పేలుడు చోటు చేసుకొంది. ఇది ఆయనపై గాజా ఉగ్రవాదులు చేసిన హత్యాయత్నమేనని ఫతా పార్టీ పేర్కొంది. పేలుడు ధాటికి 3 వాహనాలు దెబ్బతిన్నాయి.

'పాలమూరు' విచారణ వాయిదా

ఈనాడు, దిల్లీ: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ)లో జరుగుతున్న విచారణ వాయిదా పడింది. ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జావేద్ రహీం, జస్టిస్ ఎస్పీ వాంగ్డి, నిపుణుడు నాగిన్ నందాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ కేసు వాదనలు ఏప్రిల్ 12న వింటామన్న ధర్మాసనం విచారణ వాయిదా వేసింది.

హిల్లరీ క్లింటన్ చెయ్యి బెణికింది!

జోధ్‌పూర్: మూడురోజుల రాజస్థాన్ పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగశాఖ మాజీ మంత్రి హిల్లరి క్లింటన్‌కు మంగళవారం చెయ్యి బెణికింది. దీంతో, మంగళవారం కొన్ని కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. బుధవారం నాటి కార్యక్రమాల్లోనూ కొన్ని మార్పుచేర్పులు తప్పనిసరైనాయి. ఉమెయిద్ భవన్‌లో విడిదిచేసి ఉన్న ఆమెను వైద్య నిపుణుల బృందం పరిశీలించి తగిన చికిత్స అందించింది.

దిగువనున్న నీటి వినియోగం ఎలా!

- చర్చించనున్న కృష్ణా నదీ యాజమాన్య బోర్డు
- నేడు మళ్లీ త్రిసభ్య కమిటీ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: కనీస నీటిమట్టాల దిగువనున్న నీటి వినియోగం ఎలా అన్నదానిపై చర్చించేందుకు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు ఏర్పాటు చేసింది. ఇది బుధవారం జరగనుంది. కనీస మట్టానికన్నా దిగువనున్న నీటిని తాగేందుకు వినియోగించుకోవాలని, తెలంగాణకు 69శాతం, ఆంధ్రప్రదేశ్‌కు 31శాతం కేటాయింపు ఉంటుందని తెలంగాణ పేర్కొన్నందున బోర్డు అత్యవసరంగా సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ 512, తెలంగాణ 299 టీఎంసీలు వాడుకొనేలా 2015లో కేంద్రజలవనరుల శాఖ వద్ద రెండు రాష్ట్రాల అధికారులతో జరిగిన సమావేశంలో నిర్ణయం జరిగింది. గతేడాది కృష్ణా నదీ యాజమాన్యబోర్డు వద్ద జరిగిన సమావేశంలో స్వల్ప మార్పు చేసి ఆంధ్రప్రదేశ్ 66 శాతం, తెలంగాణ 34 శాతం నీటిని వినియోగించుకొనేలా నిర్ణయం జరిగింది.

తాజా నిర్ణయం ఇదీ

ఈనెల 2వతేదీన జరిగిన బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో మార్చిలో ఎవరెంత నీటిని వినియోగించుకోవాలి.. ఈనెలాఖరుకు శ్రీశైలంలో కనీస నీటి మట్టం దిగువకు తీసుకోవాలని నిర్ణయించారు. శ్రీశైలంలో 800 అడుగులు, నాగార్జునసాగర్‌లో 500 అడుగుల వరకు నీటిని తీసుకోవడానికి రాతపూర్వకంగా అంగీకారం తెలపాలని రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లకు సభ్య కార్యదర్శి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి తాజాగా బోర్డు ఛైర్మన్‌కు రాసిన లేఖలో శ్రీశైలంలో కనీస నీటిమట్టం దిగువన, 800 అడుగుల వరకు ఉన్న 24.87 టీఎంసీలలో తెలంగాణకు 17.16 టీఎంసీ, ఆంధ్రప్రదేశ్‌కు 7.71 టీఎంసీలు వస్తాయని పేర్కొన్నారు. నాగార్జునసాగర్‌లో మే నెలాఖరు వరకు కనీస నీటిమట్టం నిర్వహించాలన్నారు. దీంతో అత్యవసరంగా బుధవారం త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. మంగళవారం బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్ చీఫ్‌లకు లేఖ రాశారు.

పెంచిన సొమ్ము ఎక్కడికెళ్లింది?

- 'పాలమూరు' ఎత్తిపోతలపై నాగంను ప్రశ్నించిన ఉమ్మడి హైకోర్టు
- ఎంఈఐఎల్ వాదనలు వినకుండా ఉత్తర్వులివ్వలేం
- పనుల అప్పగింతపై అభ్యంతరం లేదన్న నాగం

ఈనాడు, హైదరాబాద్: పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్) నిమిత్తం ఎలక్ట్రో మెకానికల్ సామగ్రి కొనుగోలులో అంచనాల పెంపుతో వచ్చిన సొమ్ము ఎక్కడికెళ్లిందో వివరించాలంటూ నాగం జనార్దన్‌రెడ్డిని ఉమ్మడి హైకోర్టు ప్రశ్నించింది. బీహెచ్ఈఎల్‌తోపాటు కాంట్రాక్ట్ దక్కించుకున్న సంయుక్త భాగస్వామి మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్(ఎంఈఐఎల్) వాదన వినకుండా ఈ వ్యవహారాన్ని తేల్చలేమని, దీన్ని ప్రతివాదిగా చేర్చాలని సూచిస్తూ విచారణను ఈనెల 20కి వాయిదా వేసింది. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిమిత్తం ఎలక్ట్రో మెకానికల్ సామగ్రి కొనుగోలులో అంచనాల పెంపునకు సంబంధించిన వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరిపించాలంటూ వ్యక్తిగత హోదా (పార్టీ ఇన్ పర్సన్)లో మాజీ మంత్రి నాగం వ్యాజ్యం దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టారు. నాగం వాదనలు వినిపిస్తూ ఎస్కీ రూ.1729 కోట్లకు అంచాన వేయగా రూ.707 కోట్లు పెంచి రూ.2436 కోట్లకు అప్పగించారన్నారు. పరికరాలకు సొమ్ము చెల్లింపులను నిలిపివేయాలని కోరారు. ఎంఈఐఎల్‌కు పనులు అప్పగించడంపై అభ్యంతరం ఉందా, దాన్ని ప్రతివాదిగా చేశారా? అన్న ధర్మాసనం ప్రశ్నలకు స్పందిస్తూ ఈ వ్యవహారంలో ఎలాంటి అభ్యంతరం లేదని నాగం చెప్పారు. ఈపనులకు సంబంధించి ఎంఈఐఎల్‌కు కాంట్రాక్ట్ అప్పగించడాన్ని ప్రశ్నించలేదని, దానిపై ఎలాంటి ఆరోపణలు చేయలేదన్నారు. అందుకే ఎంఈఐఎల్‌ను ప్రతివాదిగా చేర్చలేదని చెప్పారు. దీనిపై ధర్మాసనం వాఖ్యానిస్తూ మరి పెంచిన సొమ్ము ఎక్కడికి వెళ్లిందని ప్రశ్నించగా అది తేల్చాల్సింది కోర్టేనని నాగం చెప్పారు. వాదనలను విన్న ధర్మాసనం ఎంఈఐఎల్‌ను ప్రతివాదిగా చేర్చాలంటూ విచారణను వాయిదా వేసింది.

1,965 మంది హజ్ యాత్రికులకు ఊరట!

అయిదు దఫాలుగా మక్కా వెళ్లలేకపోయిన వారికి ప్రత్యేక అవకాశం

దిల్లీ: హజ్ యాత్రకు వెళ్లేందుకు ప్రతియేటా దరఖాస్తు చేసుకుంటున్నా ప్రభుత్వం నిర్ణయించిన కోటాలో అవకాశం లభించని 65-69 ఏళ్ల ముస్లింలకు శుభవార్త ఇది. అయిదు దఫాలుగా ఒక్కసారి కూడా హజ్‌యాత్రకు నోచుకోని 1,965 మందికి ఈ ఏడాది అవకాశం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయిదు దఫాలే కాదు ఆరు దఫాలుగా ఒక్కసారి కూడా మక్కా వెళ్లే ప్రయత్నాలు ఫలించని 65-69 ఏళ్ల వయస్సు వారికీ ఈ ఆదేశాలు వర్తిస్తాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్, జస్టిస్ డీవై చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. 2018 హజ్ యాత్రకు సంబంధించి కేంద్ర అల్పసంఖ్యాక వర్గాల మంత్రిత్వ శాఖ అందజేసిన వివరాల ప్రకారం ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. హజ్ సీట్ల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వ వైఖరి పక్షపాతంగా ఉందంటూ కేరళ హజ్ కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌పై తుది విచారణను జులై 10న చేపట్టనున్నట్లు తెలిపింది. అంతకుముందు ధర్మాసనం మొత్తం హజ్ కోటా సీట్లు ఎన్ని, వాటిలో ఖాళీల వివరాలను బుధవారానికల్లా సమర్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ధర్మాసనం ఆదేశించింది.

సకల ఉద్యోగుల మహాసభకు భారీగా తరలిరావాలి

ఐకాస సమావేశంలో ఉద్యోగులకు పిలుపు

ఈనాడు, హైదరాబాద్: సీపీఎస్ రద్దుకు కేంద్రంపై ఒత్తిడి కోసం తెలంగాణ సకల ఉద్యోగుల మహాసభ ద్వారా తమ వాణిని దిల్లీదాకా వినిపిస్తామని ఉద్యోగ సంఘాల ఐకాస నేతలు పేర్కొన్నారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరుగనున్న మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. మంగళవారం టీజీవోభవన్‌లో జరిగిన సమావేశంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ఐకాస అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మమతలతోపాటు సత్యనారాయణ, మధుసూదన్, రవీందర్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ..సీపీఎస్ రద్దు కోసం సభ ద్వారా తెలంగాణ ఉద్యోగులవాణిని దిల్లీ దాకా వినిపిస్తామనితెలిపారు.

బీటీ పత్తి విత్తనాల కొత్త ధరలు ప్రకటన

ఈనాడు, హైదరాబాద్: బీటీ పత్తి విత్తనాల కొత్త ధరలను ప్రకటిస్తూ కేంద్ర వ్యవసాయశాఖ తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఈ ఉత్తర్వులు మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయశాఖకు అందాయి. బీటీ-1 రకం విత్తన ప్యాకెట్(450 గ్రాములు) ధర యథాతథంగా రూ.635 కొనసాగుతోంది. రైతులు అధికంగా వినియోగించే బీటీ-2 విత్తన ప్యాకెట్(450గ్రాములు) ధరను రూ.800 నుంచి 740కి తగ్గిస్తున్నట్లు తెలిపింది. ఇందులో విత్తన విలువ రూ.701గా, మోన్‌శాంటో కంపెనీకి చెల్లించాల్సిన సుంకాన్ని రూ.39గా నిర్ణయించినట్లు తెలిపింది. వచ్చేనెల నుంచి ప్రారంభమయ్యే కొత్త ఖరీఫ్ సీజన్ అమ్మకాల్లో ఈ ధరలకే విత్తనాలను అమ్మాలని స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 5 కోట్ల ప్యాకెట్ల విత్తనాలు అవసరమని అంచనా. తెలంగాణలోనే కోటి ప్యాకెట్లు కావాలని ఇందుకోసం రూ.740 కోట్ల దాకా రైతులు వెచ్చించాల్సి ఉంటుందని వ్యవసాయశాఖ ప్రతిపాదించింది. ఒక్కో ఎకరానికి రైతులు 2 ప్యాకెట్ల విత్తనాలను వినియోగిస్తారు.

ఖర్చు తగ్గిస్తే విత్తనాలెలా ఇస్తాం...: విత్తన ఉత్పత్తి వ్యయాన్ని తగ్గిస్తే తాము విత్తనాలెలా ఉత్పత్తి చేయగలమని, దీని వల్ల విత్తన కొరత ఏర్పడుతుందని జాతీయ విత్తన కంపెనీల సంఘం(ఎన్ఎస్ఏ) కేంద్రానికి తెలిపింది. 2011లో విత్తన ఉత్పత్తి విలువ రూ.840గా ఉంటే ఇప్పుడు రూ.701గా ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నించింది. ఆరేళ్లలో విత్తనపంటల సాగువ్యయం, ఉత్పత్తి ఖర్చులు పెరిగినా వ్యయాన్ని తగ్గించడంతో తమకు నష్టమని తెలిపింది. దీంతో ఉత్పత్తి తగ్గి విత్తనాల కొరత ఏర్పడుతుందని, రైతులు ఆందోళన చేస్తే విత్తన కంపెనీలను బాధ్యులను చేయవద్దని కేంద్ర వ్యవసాయశాఖకు తెలిపినట్లు ఎన్ఎస్ఏ అధ్యక్షుడు ప్రభాకరరావు 'ఈనాడు'కు చెప్పారు.

మద్దతు ధర కోసం 'సత్యాగ్రహం'

- నేటి నుంచి దేశవ్యాప్తంగా మార్కెట్ యార్డుల్లో పర్యటన
- స్వరాజ్ అభియాన్ నేత యోగేంద్ర యాదవ్

ఈనాడు, హైదరాబాద్: పంటలను మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14 నుంచి దేశవ్యాప్తంగా సత్యాగ్రహం ప్రారంభిస్తున్నట్లు స్వరాజ్ అభియాన్ నేత యోగేంద్ర యాదవ్ తెలిపారు. మంగళవారమిక్కడ ఐకాస ఛైర్మన్ కోదండరాం, కన్వీనర్ కన్నెగంటి రవి, రైతు స్వరాజ్య వేదిక ప్రతినిధి కొండల్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. తొలుత బుధవారం కర్ణాటకలోని యాద్గీర్ వ్యవసాయ మార్కెట్లలో పర్యటించి అక్కడి రైతులతో మాట్లాడి మద్దతు ధర ఇస్తున్నారా అని అడిగి తెలుసుకుంటామన్నారు. ఈ నెల 15న ఆంధ్రప్రదేశ్‌లోని ఆదోని, 16న తెలంగాణలోని సూర్యాపేట, కోదాడ మార్కెట్లలో సందర్శిస్తామన్నారు. పంటలకు మద్దతు ధర దక్కే వరకు సత్యాగ్రహాన్ని కొనసాగిస్తామన్నారు. మహారాష్ట్ర రైతులు చేసిన పాదయాత్ర దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని, రైతుల్లో స్ఫూర్తి నింపిందన్నారు. ఇప్పటికైనా అన్నదాతల సమస్యలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని యోగేంద్ర యాదవ్ డిమాండు చేశారు.

ఎన్నికల కమిటీలుగా.. సమన్వయసమితులు: కోదండరాం: కోదండరాం మాట్లాడుతూ.. రైతు సమన్వయ సమితు(రైసస)లు వచ్చే ఎన్నికల కోసం తెరాస పార్టీ ఏర్పాటు చేసుకున్న గ్రామస్థాయి పోలింగ్ బూత్ కమిటీలని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులను ఖర్చు పెట్టి అధికార పార్టీ నిర్మాణం చేసుకోవడం అప్రజాస్వామికమన్నారు. తెరాసకు చెందిన కొంతమందితో రైసస ఏర్పాటు చేసి ఊరుమీద పట్టు సాధించాలనుకుంటున్నారని చెప్పారు. మద్దతు ధరపై ఐకాస తరపున పలు గ్రామాల మార్కెట్లకు వెళ్లి రైతులతో మాట్లాడామని.. ఎకరాకు రూ.4 వేలు ఇచ్చినా పంటలకు లాభసాటి ధర ఇవ్వకుండా వృథా అని వారు తెలిపారని వివరించారు.



ఎంఎస్‌పీ సత్యాగ్రహం, రైతాంగ సమస్యలపై మీడియాతో మాట్లాడుతున్న యోగేంద్ర యాదవ్. చిత్రంలో తెలంగాణ రాజకీయ ఐకాస ఛైర్మన్ కోదండరాం

హెచ్1బి చెల్లుబాటుపై ఆధారపడి ఉంటుంది..!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

2018 వరకు చెల్లుబాటయ్యే హెచ్1బి వీసా ఉంది. నా భార్య, ఇద్దరు పిల్లలు డిపెండెంట్ వీసా కోసం దరఖాస్తు చేయవచ్చా? వారికి వీసాలు కేటాయిస్తే ఎంత కాలం చెల్లుబాటవుతాయి? – రామకృష్ణ కర్రి

మీ భార్య, పిల్లలు హెచ్-4 డిపెండెంట్ వీసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. చెల్లుబాటు కాలమన్నది మీ హెచ్1బి వీసా చెల్లుబాటు గడువుపై ఆధారపడి ఉంటుంది.

రెండేళ్ల కిందట నా బి1/బి2 వీసా కాలం తీరిపోయింది. అప్పట్లో పునరుద్ధరించుకోలేదు. ఇప్పుడు పునరుద్ధరణకు అవకాశముంటుందా? కొత్తగా దరఖాస్తు చేయాలా? – మోహనకృష్ణ ఎన్వీఎస్

వీసా కాలంతీరి ఏడాది దాటిన నేపథ్యంలో సాధారణ ప్రక్రియప్రకారమే మీరు వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం మీరుwww. ustraveldocs.com/in ద్వారా మీ ప్రొఫైల్‌ను నమోదు చేసుకొని ఎమ్మార్వీ ఫీజు చెల్లించండి. వేలిముద్రలు, ప్రత్యక్షఇంటర్వ్యూకు మీ కాన్సులేట్ పరిధిలో అపాయింటుమెంటు తీసుకోండి. మరింత సమాచారం కోసం కాల్ సెంటర్ 040 4625 8222, 0120 4844644 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

పర్యాటకుడిగా అమెరికా వెళ్దామనుకుంటున్నా. ఇప్పటి వరకు ఏ దేశంలోనూ పర్యటించలేదు. అమెరికా వీసాను పొందటానికి ఇదేమైనా ప్రతిబంధకం అవుతుందా? – ప్రసాద్ ఎమ్వీఎస్

తొలి అంతర్జాతీయ పర్యాటకులు వీసా కోసం దరఖాస్తు చేసుకునేందుకు అమెరికా ఆహ్వానిస్తుంది. పర్యాటక(బి1/బి2) వీసాదరఖాస్తుదారులు ఆయా విభాగాలకు అర్హులా? కాదా? అన్నది నిర్ణయించేందుకు కాన్సులర్ అధికారి దరఖాస్తును స్థూలంగా అంచనా వేస్తారు. అమెరికా వీసా దరఖాస్తు ప్రక్రియ కోసం www.ustraveldocs.com/in ను చూడండి.

అమెరికాలో మాస్టర్స్ చేద్దామనుకుంటున్నా. నా విద్యా రికార్డు అసాధారణంగా ఉంది. ఎఫ్-1 వీసా జారీకి ప్రామాణికాలేమిటి? వీసా ప్రక్రియకు ఎంత వ్యవధి పడుతుంది? – రూపాలి రావిపాటి

అసాధారణ విద్యా రికార్డును సాధించినందుకు అభినందనలు. అమెరికాలో చదువుకునేందుకు ఎడ్యుకేషన్ యూఎస్ఏ, యునైటెడ్ స్టేట్స్-ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్లకు చెందిన https://educationusa.state.gov, www.usief.org.in వెబ్‌సైట్లను చూడండి. విద్యార్థి వీసా(ఎఫ్-1) కోసం దరఖాస్తు చేసేందుకు మరింత స్పష్టమైన సమాచారాన్ని www.ustraveldocs.com/in ద్వారానూ తెలుసుకోవచ్చు. ఇంటర్వ్యూ నిర్వహణ, వీసాను పొందటానికి కొన్ని వారాలు పడుతుంది. ఐ-20 మీ చేతికి వచ్చిన వెంటనే ఎఫ్-1 వీసాకు దరఖాస్తు చేసుకోండి. రద్దీ ఎక్కువ ఉన్న సమయంలో వీసా అపాయింటుమెంటు కోసం రెండు, మూడు వారాలు వేచి ఉండాల్సి వస్తుంది.

★ వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support-india@ustraveldocs.comకు ఈ-మెయిల్ చేయండి.
★ మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
★ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

ఈనాడు

its@eenadu.in

ఈనాడు 7

బుధవారం మార్చి 14, 2018

హైదరాబాద్

రివ్యూ రింగ్



విభిన్నంగా వన్‌ప్లస్

ఖరీదు ఎక్కువైనా ఫర్వాలేదు... స్మార్ట్‌గా సెల్‌ఫోన్‌ని వాడదాం అనుకునేవారికి కొత్తగా దేశీయ మార్కెట్‌లోకి వచ్చిన 'వన్‌ప్లస్ 5టీ' ప్రత్యేకమైంది. డ్యూయల్ కెమెరాలతో (20 మెగాపిక్సల్, 16మెగాపిక్సల్) అదిరే సెల్ఫీలు... ఆకట్టుకునే ఫొటోలు తీసుకోవచ్చు. 'పోట్రెట్ మోడ్'లో కేవలం ముఖంపైనే ఫోకస్ చేస్తూ ఫొటో తీస్తే వెనకంతా బ్లర్ అయ్యి ముఖాన్ని మాత్రం స్పష్టంగా చిత్రీకరిస్తుంది. 4కే రిజల్యూషన్ క్వాలిటీతో ఫొటోలు చిత్రీకరించొచ్చు. చిత్రీకరణ సమయంలో ఫోన్ కదలినా వీడియోలో ఎలాంటి తేడా రాదు. ముందు భాగంలో 16 మెగాపిక్సల్ కెమెరా ఉంది. తాకేతెర పరిమాణం 6.01 అంగుళాలు. 18:9 కొత్త నిష్పత్తిలో పొడవైన తెరతో భిన్నంగా కనిపిస్తుంది. స్ప్లిట్ స్క్రీన్ మోడ్‌లో రెండు ఆప్‌లను ఒకేసారి వాడుకోవడానికి పొడవైన తెర అనుకూలం. ఆండ్రాయిడ్‌ని వినూత్నమైన మార్పులు చేసి 'ఆక్సిజన్ ఓఎస్'తో వినియోగదారులకు సరికొత్త సౌకర్యాల్ని పరిచయం చేస్తోంది. రెండు మోడళ్లుగా ఫోన్ ఆన్‌లైన్ అంగళ్లలో అందుబాటులో ఉంది. 6జీబీ ర్యామ్, 64జీబీ ఇంటర్నల్ మెమొరీతో ఒకటి. ధర రూ.32,999. 8జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ మెమొరీతో మరోటి. దీని ధర రూ.37,999.

ఇతర వివరాలకు https://oneplusstore.in/5t

వైద్యానికొకటి

* మీరు ఆఫీస్‌లో బాగా బిజీ... ఇంట్లో వయసు మళ్లిన తల్లిదండ్రులు ఉన్నారు... అనుకోకుండా వారు డాక్టర్‌ని సంప్రదించాల్సి వచ్చింది... ఇంటికెళ్లి వారిని ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే ఆలస్యం అవుతుంది... వారికి వెంటనే చికిత్స అందేలా చేయడం ఎలా సాధ్యం?
* చంటోడి కాలుపై టేబుల్ పడింది... నొప్పని ఒకటే ఏడుపు. కాలు ముట్టనివ్వడం లేదు. మీకేం చేయాలో తెలియడం లేదు. ఆసుపత్రి చాలా దూరం. వెంటనే డాక్టర్ సలహా తీసుకోవాలంటే ఎలా?

సింపుల్.... 'డాక్ఆన్‌లైన్' ఆప్‌ని స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయండి. అంతే... డాక్టర్‌ని ఎప్పుడంటే అప్పుడు ఆన్‌లైన్‌లో సంప్రదించొచ్చు. వీడియో కాల్ లేదా వాయిస్ కాల్... ఏదైనా మీ ఛాయిస్. మీ సమస్యని డాక్టర్‌కి వివరిస్తూ చికిత్స పొందొచ్చు. రాసిన మందుల్ని ఆ వెంటనే ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి కావాల్సినవి పొందొచ్చు. ఇవన్నీ ఎలా సాధ్యమో కాస్త వివరంగా తెలుసుకుందాం!

ప్రాంతీయ భాషలోనే...

ఆన్‌లైన్‌లో వైద్యుల్ని సంప్రదించడమంటే ఆంగ్లంలోనే మాట్లాడాల్సి వస్తుందేమో అనే సందేహం అక్కర్లేదు. తెలుగులోనే మాట్లాడుతూ బాధని చెప్పొచ్చు. వైద్యులు కూడా తెలుగులోనే సూచనలూ, సలహాలు అందిస్తారు. ఆప్‌లో అందుబాటులో ఉన్న డాక్టర్లు అందరూ 'మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' (ఎంసీఐ) ధ్రువీకరించినవారే. అంతేకాదు... ఐదేళ్ల పైబడి అనుభవం ఉన్నవారే! ఆండ్రాయిడ్, ఐఫోన్ యూజర్లు ఆయా ఆప్ స్టోర్‌ల నుంచి ఆప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



ఇన్‌స్టాల్ చేశాక సులువైన ఇంటర్‌ఫేస్‌తో ప్రొఫైల్‌ని క్రియేట్ చేసుకోవచ్చు. సభ్యత్వానికి అప్పటికే వాడుతున్న గూగుల్, ఫేస్‌బుక్ లాగిన్ వివరాల్ని వాడుకోవచ్చు. లేదంటే.. కొత్త ఐడీ, పాస్‌వర్డ్‌ని క్రియేట్ చేసుకోవచ్చు. 'డాష్‌బోర్డ్'లో విభాగాలుగా క్రియేట్ చేసిన ఆప్షన్స్‌తో మొత్తం ఆన్‌లైన్ చికిత్సా విధానాన్ని మేనేజ్ చేయవచ్చు. వైద్యుడిని సంప్రదించేందుకు 'బుక్ ఎ కన్సల్టేషన్' ఆప్షన్‌ని సెలెక్ట్ చేయాలి. 'ఆడియో, వీడియో' ఆప్షన్లతో మీరెలా డాక్టర్‌తో మాట్లాడాలో నిర్ణయించుకోవచ్చు. ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేని చోట ఆడియోని సెలెక్ట్ చేసుకోవడం మంచిది. అపాయింట్‌మెంట్ రూపంలో నిర్ణీత సమయానికి డాక్టర్‌తో మాట్లాడేందుకు 'షెడ్యూల్' చేయవచ్చు. రోజులో మీరు ఎంపిక చేసిన సమయానికి ఆడియో లేదా వీడియో కాల్ వస్తుంది. ఆన్‌లైన్ చికిత్స అనంతరం డాక్టర్ రాసిన మందుల్ని ఆప్ నుంచే ఆర్డర్ చేసే వీలుంది. ఎంపిక చేసిన సమయానికి ఇంటి అడ్రస్‌కి మందులు వచ్చేస్తాయి. అందుకు 'ఆర్డర్ మెడిసిన్స్' విభాగం ఉంది. డాక్టర్ ఏదైనా మెడికల్ టెస్ట్‌లను సూచిస్తే 'బుక్ డయాగ్నస్టిక్స్' మెనూలోకి డయాగ్నస్టిక్స్ సెంటర్లను ఆన్‌లైన్‌లోనే సంప్రదించే వీలుంది. వాట్సాప్ ఛాటింగ్ మాదిరిగానే డాక్టర్‌తో టెక్స్ట్ ఛాటింగ్ చేసే వెలుసుబాటు ఉంది. దీంట్లో వైద్యపరమైన సందేహాల్ని అడిగి సమాధానాన్ని పొందొచ్చు. ప్రత్యేక కూపన్ కోడ్‌తో నెలపాటు ఆప్ సర్వీసుని ఉచితంగా వాడుకోవచ్చు.

డేటా భద్రం

ఆన్‌లైన్‌లో వ్యక్తిగతమైన వ్యవహారం ఏదైనా ముందు సెక్యూరిటీ గురించి ఆలోచించడం సహజం. డాక్ఆన్‌లైన్ ఆప్‌లోనూ డేటాని గోప్యంగా ఉంచడంలో ప్రత్యేక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేశారు. ఫోన్ నెంబర్ మొదలుకుని వైద్య పరమైన రికార్డులన్నీ ఎన్‌క్రిప్షన్ మోడ్‌లోనే భద్రం చేస్తున్నారు. ఆప్‌లోనే వెబ్‌సైట్ నుంచి డాక్ఆన్‌లైన్ సేవల్ని వాడుకోవచ్చు. డాక్టర్ నుంచి వచ్చిన కాల్ నెట్‌వర్క్ పరమైన లేదా టెక్నాలజీ ఇబ్బందులతో డిస్ కనెక్ట్ అయితే చింతించాల్సిన పని లేదు. కొంత సమయానికి డాక్టర్ నుంచి కాల్ వస్తుంది. ఇంటర్నెట్ సౌలభ్యం లేని చోట వీడియో కాల్‌కి ఇబ్బంది ఎదురైతే ఆటోమాటిక్‌గా కాల్ వాయిస్ మోడ్‌లోకి మారిపోతుంది. తెలుగు, హిందీతో పాటు మరో నాలుగు ప్రాంతీయ భాషల్లోనూ డాక్టర్లతో మాట్లాడొచ్చు.

డౌన్‌లోడ్ లింక్: www.doconline.com

మొబైల్ మాయ

వైద్యులకొకటి

డాక్టర్ల కమ్యూనిటీ

తెల్లటి యాప్రాన్‌ని ధరించి మెడలో స్టెతస్కోప్‌తో డాక్టరుగా సేవలందించడం అంటే.... నిత్య విద్యార్థిగా ఎప్పుడూ నేర్చుకుంటూనే ఉండాలి. వ్యాధుల మూలాల్లోకి వెళ్లాలి... ఇతర వైద్యులతో చర్చించాలి... సూచనలు తీసుకోవాలి... చికిత్సలో వినూత్న పద్ధతుల్ని ఇతర డాక్టర్లతో పంచుకోవాలి... అప్పుడే నాణ్యమైన వైద్యం ప్రజలకు అందుతుంది. ఇదే దృక్పథంతో మారుతున్న టెక్నాలజీని వాడుకుని 'వైట్‌కోట్స్' ప్లాట్‌ఫామ్ ముందుకొచ్చింది.



దీంట్లో వైద్యులు సభ్యులై లింకిడ్‌ఇన్ మాదిరిగా ప్రొఫెషన్ నెట్‌వర్క్‌ని క్రియేట్ చేసుకుని వైద్య పరమైన సమాచారాన్ని పంచుకోవచ్చు. ప్రపంచ వ్యాప్తంగా వైద్య రంగంలో చోటు చేసుకునే అప్‌డేట్స్‌ని ప్రత్యేకంగా పొందే వీలుంది. వైద్యం గురించో మరేదైనా ఇతర చికిత్సా పరమైన అంశాల్ని 'టెక్స్ట్ మెసేజింగ్' ద్వారా ఇతర డాక్టర్లతో చర్చించొచ్చు. అరుదైన వ్యాధుల చికిత్సాపరమైన ఇబ్బందుల్ని ఇతర నిపుణులైన డాక్టర్లతో చర్చించి సలహాలు పొందొచ్చు.

మారుమూల నుంచి కూడా...

ఎక్కడో మారుమూల పల్లెలో అరుదైన వ్యాధిని వైద్యుడు గుర్తిస్తే సంబంధిత వివరాల్ని నెట్‌వర్క్‌లో పోస్ట్ చేసి నెట్‌వర్క్‌లోని ఇతర వైద్యులతో పంచుకోవచ్చు. 'పేషెంట్ ప్రైవసీ ప్రొటెక్షన్'కు లోబడే వైద్యులు రోగికి సంబంధించిన చిత్రాల్ని వాల్‌పై పబ్లిష్ చేస్తారు. వాటిపై నిపుణులైన వైద్యులూ స్పందిస్తారు. వ్యాధికి తగిన చికిత్సని సూచిస్తారు. వాల్ పోస్టింగ్‌లపై ఫేస్‌బుక్‌లో మాదిరిగా లైక్ కొట్టడంతో పాటు కామెంట్, షేర్ చేయవచ్చు. వైద్యుల కమ్యూనిటీకే పరిమితం కాకుండా రోగులకూ అవగాహన కల్పించేలా విలువైన సమాచారాన్ని వారితోనూ పంచుకోవచ్చు. వైద్య పరమైన అప్‌డేట్స్‌ని 'ఛానల్స్' విభాగంలో బ్రౌజ్ చేయవచ్చు. 'నెట్‌వర్క్' విభాగంలోకి వెళ్లి కమ్యూనిటీలో సభ్యుల డాక్టర్ల వివరాల్ని బ్రౌజ్ చేసి ఒక్కొరితో కనెక్ట్ అవ్వొచ్చు. దేశవ్యాప్తంగా సుమారు 1,600 ప్రాంతాల నుంచి 1,25,000 డాక్టర్లు ఆప్‌లో సభ్యులయ్యారు. 50పైనే మెడికల్ కమ్యూనిటీలు వైద్యపరమైన డేటాని పంచుకున్నాయి.

డౌన్‌లోడ్ లింక్: www.whitecoats.com



మీరు సిద్ధమా జీ!

వేగం.. వేగం.. వేగం.. నేటి ఆధునిక జీవితంలో ఇప్పుడెవరిని పలకరించినా వినబడుతున్నది ఇదే. ఇంటి అవసరాల దగ్గర్నుంచి ఆఫీసు వ్యవహారాల వరకూ అన్నీ చిటికెలో పూర్తి కావాల్సిందే. దీనికి తగ్గట్టు సాంకేతిక పరిజ్ఞానమూ రోజురోజుకీ కొత్తపుంతలు తొక్కుతోంది. మొబైల్ సేవలు సైతం 3జీ, 4జీలను దాటుకొని 5జీ దిశగా శరవేగంగా ఉరకలు వేస్తున్నాయి. రేపో మాపో ఇదీ మన ఇంటి గడప తొక్కనుంది. అంతర్జాలాన్ని మెరుపు వేగంతో పరుగులు పెట్టించే దీంతో అల్ట్రా హై డెఫినెషన్ (4కె) వీడియోలు, సినిమాలు, గేమ్స్, సాఫ్ట్‌వేర్ల వంటివన్నీ చిటికెలో డౌన్‌లోడ్ అయిపోతాయి. ఇవేకాదు.. ఇది ఇంకెన్నో మార్పులకు తెరతీయనుంది.

ఇంతకీ 5జీ అంటే?

ప్రస్తుతం వైర్‌లెస్ మొబైల్ నెట్‌వర్క్‌లకు మనం వినియోగిస్తున్న 4జీ ఎల్‌టీఈ పరిజ్ఞానానికిది తర్వాతి దశ. మెరుపువేగంతో పనిచేసే దీన్ని ఒక్క మొబైల్ నెట్‌వర్క్‌లకే కాదు.. హోం ఇంటర్నెట్ వంటి మరెన్నో అప్లికేషన్లకు వినియోగించుకోవచ్చు. నిజానికి 5జీ ప్రమాణాలను వచ్చే సంవత్సరం జరిగే వరల్డ్ కమ్యూనికేషన్స్ కాన్ఫరెన్స్ తర్వాతే పూర్తిస్థాయిలో నిర్వచించే అవకాశమున్నప్పటికీ.. ఇది రెండు రకాలుగా అందుబాటులోకి రావొచ్చని అంచనా వేస్తున్నారు. స్వల్ప, మధ్య బ్యాండ్ 6 గిగాహెర్ట్జ్ కన్నా తక్కువ స్పెక్ట్రమ్ మీద, హై బ్యాండ్ 6 గిగాహెర్ట్జ్ కన్నా ఎక్కువ స్పెక్ట్రమ్ మీద.. ముఖ్యంగా మిల్లీమీటర్ వేవ్ బ్యాండ్లలో సేవలు అందించొచ్చు. ఈ రెండు బ్యాండ్లూ ప్రస్తుతం వాడకంలో ఉన్న ఎల్‌టీఈ నెట్‌వర్క్‌లను తోసిరాజనకుండా వీటి సామర్థ్యాన్ని, పనితీరును గణనీయంగా పెంచుతాయి.

ఎంతెంత వేగం?

ఇటీవల ముగిసిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో సామ్‌సంగ్ సంస్థ ప్రదర్శించిన 5జీ హోం రూటర్లతో దీని వేగం అందరికీ స్పష్టమైంది. ఇది 4 గిగాబిట్స్-పర్-సెకండ్ (జీబీపీఎస్) వేగాన్ని అందుకోవటం గమనార్హం. అంటే ఇది 500 మెగాబైట్స్-పర్-సెకండ్ వేగంతో సమానమన్నమాట. ఈ వేగంతో 50జీబీ గేమ్ 2 నిమిషాల్లో, 100జీబీ 4కె సినిమా 4 నిమిషాల్లోనే డౌన్‌లోడ్ అవుతుంది. మనదేశంలో ఇప్పుడు ఇంటర్నెట్ సగటు వేగం 6.5 మెగాబైట్స్-పర్-సెకండ్‌గా ఉంది. దీన్ని బట్టి 5జీ ఎంత వేగంతో పనిచేస్తుందో మీరే అర్థం చేసుకోవచ్చు. కొత్త రూటర్‌కు 5జీ రేడియో సెల్ టవర్ నుంచి ఎలాంటి అడ్డంకులు లేకుండా నేరుగా సిగ్నల్స్ అందటం మూలంగానే ఈ వేగం సాధ్యమైందని చెబుతున్నప్పటికీ.. 5జీ రాకతో ఇంటర్నెట్ స్పీడ్ ఇప్పటికన్నా ఎన్నో రెట్ల వేగం పుంజుకోవటం మాత్రం ఖాయం.

నిరంతరంగా.. నిరాటంకంగా..

5జీ మిల్లీమీటర్ల తరంగాలకు సంబంధించి మరో మంచి విషయం ఏంటంటే.. వీటికి తీగల వంటి మౌలిక వసతుల అవసరం లేకపోవటం. మన ఫోన్లకు అందే మొబైల్ నెట్‌వర్క్ మాదిరిగా ఇవీ గాలి ద్వారానే ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తెస్తాయి. ఉదాహరణకు- కిటికీకి ఆవల యాంటెనా అమర్చుకున్నారనుకోండి. ఇది సెల్ టవర్ల నుంచి తరంగాలను గ్రహించి ఇంట్లోని 5జీ హోం రూటర్‌కు అందజేస్తుంది. ఫలితంగా వైఫై సదుపాయంతో కూడిన అన్ని పరికరాలూ అంతర్జాలంతో అనుసంధానమవుతాయి.

కనికట్టు చేసే 'వస్తు మాయాజాలం'

అత్యధిక వేగం, సత్వర సమాచార మార్పిడి, మరింత మెరుగైన సామర్థ్యం మూలంగా 4కె వీడియోలు, వర్చువల్ రియాలిటీ వంటి అధునాతన అప్లికేషన్లను ఎలాంటి ఆటంకం లేకుండా వాడుకోవచ్చు. విపత్కర పరిస్థితుల నియంత్రణలోనూ తోడ్పడే అవకాశముంది. అన్నింటికన్నా మించి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) విషయంలో విప్లవాత్మక మార్పులు రావొచ్చు. ఇంతకీ ఐఓటీ అంటే ఏంటి? స్థూలంగా చెప్పాలంటే 'వస్తు అంతర్జాలం' అనుకోవచ్చు. కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లు అంతర్జాలంతో అనుసంధానమై పనిచేస్తుండటం తెలిసిందే కదా. ఐఓటీ కూడా ఇలాంటిదే. కాకపోతే ఇది అంతర్జాలంతో అనుసంధానమయ్యే వీలుగల వస్తువులు, వాహనాల వంటి వాటన్నింటినీ ఏకం చేస్తుంది. అంటే పరికరాలు, యంత్రాల వంటివన్నీ మన అవసరాలను ముందుగానే కనిపెడుతూ.. వాటికి అనుగుణంగా పనులను చేసిపెడతాయన్నమాట. ఇప్పటికే దీని ప్రభావాలను చవిచూస్తున్నాం కూడా. ఆఫీసు నుంచే ఇంట్లోని వాషింగ్ మెషిన్లు, రిఫ్రిజిరేటర్లను నియంత్రించటం.. మనుషుల రాకను పసిగట్టి తమంతా తాముగా లైట్లు వెలిగేలా చేయటం.. వంటివన్నీ ఇలాంటివే. 5జీ రాకతో దీని పరిధి మరింత విస్తృతమవుతుంది. ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే మానవ జీవనం ఎంతో సులభం కాగలదు.

ఇంధన పొదుపు: విద్యుత్తును ఎక్కువగా తీసుకునే ఇంటి పరికరాలు విద్యుత్ ధరలకు అనుగుణంగా ఇంధనం వాడుకోవటాన్ని మార్చుకోవచ్చు. ఇలా విద్యుత్తు బిల్లు తగ్గటానికి తోడ్పడొచ్చు. బల్బులు, ఇంటిని వేడిగా ఉంచే థర్మోస్టాట్ వంటివి మన జీవనశైలికి అనుగుణంగా పనిచేయొచ్చు. అంటే మనం ఆఫీసు నుంచి ఇంటికి రావటానికి కొద్ది నిమిషాల ముందే థర్మోస్టాట్స్ తమకు తామే స్టార్ట్ కావొచ్చు. ఇంట్లో ఎవరూ లేకపోతే ఆ విషయాన్ని పసిగట్టి ఆఫ్ కావొచ్చు. దీంతో ఇంధనం వృథా కావటం, ఖర్చు తగ్గుతాయి.



కారు ప్రయాణం సుఖవంతం: కారులో పెట్రోలు అయిపోతుంటే దానిలోని పరికరాలు ముందుగానే పసిగట్టి హెచ్చరిస్తే? టైరులో గాలి తగ్గుతున్నా, సర్వీసింగ్ సమయం దగ్గరపడుతున్నా 'స్మార్ట్' కారు మిమ్మల్ని ముందుగానే మెకానిక్ షెడ్డుకు తీసుకెళ్తే? మీ అపాయింట్‌మెంట్ తేదీని, క్యాలెండర్‌ను చెక్ చేసి తనంత తానుగానే అపాయింట్‌మెంట్ తీసుకొని మీకు మెసేజ్ పెడితే? ఆశ్చర్యంగా అనిపించినా ఐఓటీ మూలంగా ఇవన్నీ నిజమయ్యే రోజు మరెంతో దూరంలో లేదనే చెప్పుకోవచ్చు.



ట్రాఫిక్ జామ్‌లకు స్వస్తి: ప్రయాణాలు మరింత సురక్షితం కావొచ్చు. వాహనాల రద్దీని బట్టి ట్రాఫిక్ లైట్లు తమ సమయాన్ని అడ్జస్ట్ చేసుకోవచ్చు. అలాగే అంబులెన్సుల వంటివి వస్తుంటే ముందే పసిగట్టి దారిని క్లియర్ చేయొచ్చు. రోడ్డు సెన్సర్లు నేరుగా వాహనాల డ్యాష్‌బోర్డులతో అనుసంధానమై వాతావరణం, రోడ్డు ప్రమాదాల మేరకు వాహనాల వేగాన్ని నియంత్రించొచ్చు.




స్మార్ట్ అలారం: ఆఫీసుకు వెళ్లే దారిలో ఏదైనా ప్రమాదం జరిగినా, వాతావరణం బాగా లేకున్నా ప్రయాణం ఆలస్యం అయ్యేటట్టుంటే ఆ విషయాన్ని స్మార్ట్ అలారమ్ గ్రహించి.. మనల్ని ఇంకాస్త ముందే నిద్ర లేపొచ్చు. ప్రత్యామ్నాయ దారుల్లో వెళ్లటం మంచిదంటూ వాటిని కూడా చూపించొచ్చు.



ఆరోగ్య పరిరక్షణ: మందులు నిండుకుంటుంటే సీసా మీదుండే నిక్షిప్త సమాచారం అంతర్జాలం ద్వారా డాక్టర్‌ను సంప్రదించి మన తరపున తనే అపాయింట్‌మెంట్ తీసుకోవటానికీ వీలుంటుంది. మనం మందులు వేసుకుంటున్నామా? లేదా?.. అదీ సరైన సమయానికి వేసుకుంటున్నామ? లేదా? అనే సమాచారాన్ని కూడా ఇది డాక్టరుకు పంపించగలదు. ఇంట్లో ఎవరైనా మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలతో బాధపడుతుంటే వారిని కనిపెట్టుకోలేకపోతున్నామని బెంగ పడాల్సిన పని ఉండకపోవచ్చు. రక్తంలో గ్లూకోజు స్థాయిలను, రక్తపోటు తీరుతెన్నులను డాక్టర్లు, ఆత్మీయులు దూరం నుంచే పరిశీలించే అవకాశమూ లేకపోలేదు.



పిల్లలపై కన్ను: తల్లిదండ్రులు స్మార్ట్‌ఫోన్ల దూరం నుంచే తమ పిల్లలు ఎలా ఉన్నారు? ఒళ్లు ఏమైనా వేడిగా ఉందా? శ్వాస సరిగా తీసుకుంటున్నారా? అనేవి కూడా పసిగట్టొచ్చు. పిల్లలకు ఏదైనా ప్రమాదం ముంచుకొచ్చినా, అస్వస్థతగా ఉన్నా ఇంట్లోని సెన్సర్లు వెంటనే గ్రహించి అప్రమత్తం చేయొచ్చు. వీటి ద్వారా పెంపుడు జంతువులనూ ఆఫీసు నుంచే కనిపెట్టుకోవచ్చు.



సరుకుల జాబితా: స్మార్ట్ రిఫ్రిజిరేటర్లు వాటి లోపలి వస్తువుల సంఖ్యను లెక్కించొచ్చు. ఒకవేళ గుడ్లు, పాల ప్యాకెట్ల వంటివి అయిపోతుంటే తమంత తామే సరకుల జాబితాను సిద్ధం చేయొచ్చు. దుకాణాలు, షాపింగ్ మాల్స్ కూడా మన కొనుగోలు తీరుతెన్నులను బట్టి ఇంట్లో ఏయే సరకులు నిండుకుంటున్నాయో అనేది సందేశాల రూపంలో అందించొచ్చు. మనం దుకాణం ముందు నుంచి వెళ్తున్నట్టు గమనిస్తే ఆ విషయాన్ని మరోసారి గుర్తుచేసినా ఆశ్చర్యం లేదు. దీంతో మరోసారి అక్కడికి రావటం తప్పుతుంది.



గ్యాడ్జెట్ గురూ





'ప్రొజెక్టర్'లో ఆండ్రాయిడ్

అత్యుత్తమైన వీడియో క్వాలిటీతో కూడిన ప్రొజెక్టర్‌లు మార్కెట్‌లో చాలానే ఉన్నాయి. అయితే, ఆండ్రాయిడ్ ఓఎస్‌తో పని చేసే ప్రొజెక్టర్లు ప్రత్యేకమైనవి. వాటిల్లో 'ఒప్టోమా ఎంఎల్330' ఒకటి. హోం యూజర్లకు ఇది ప్రత్యేకం. ఇంట్లో ఎక్కడైనా పెట్టుకుని వీడియోలు తిలకించొచ్చు. అందుకు అనువుగా తక్కువ పరిమాణంలో తీర్చిదిద్దారు. బరువు 460 గ్రాములు. ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఆండ్రాయిడ్ 4.4 (కిట్‌క్యాట్) ఓఎస్ వెర్షన్‌తో ఇది పని చేస్తుంది. సినిమాలే కాకుండా వీడియో గేమ్స్ ఆడొచ్చు. పీసీ అవసరం లేకుండా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్స్ రన్ చేసుకుని చూడొచ్చు. వై-ఫై నెట్‌వర్క్ సపోర్ట్‌తో నెట్టింట్లో అందుబాటులో ఉన్న వీడియో స్ట్రీమింగ్ సర్వీసుల్ని యాక్సెస్ చేసి చూడొచ్చు. ఆప్స్‌ని (నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్...) రన్ చేసుకునే వీలుంది. 3డీ కంటెంట్‌ని సపోర్ట్ చేస్తుంది. పై భాగంలో ఏర్పాటు చేసిన 'టచ్ కంట్రోల్స్'తో ప్రొజెక్టర్‌ని సులభంగా ఆపరేట్ చేయవచ్చు. హెచ్‌డీఎంఐ, మైక్రోఎస్‌డీ, యూఎస్‌బీ పోర్ట్, వై-ఫై, బ్లూటూత్, బిల్ట్ ఇన్ స్పీకర్లు ఉన్నాయి. ఇంట్లో హోం థియేటర్ స్పీకర్లను బ్లూటూత్ నెట్‌వర్క్ ద్వారా కనెక్ట్ చేసి వాడుకోవచ్చు. ఎక్కడికైనా సులువుగా తీసుకెళ్లేందుకు అనుకూలంగా ప్రత్యేక కేస్‌తో ప్రొజెక్టర్‌ని అందిస్తున్నారు.

ఇతర వివరాలకు https://goo.gl/d36APF



స్మార్ట్ తాళం

అదిరే బైక్‌లు... కార్లు ఎన్నొచ్చినా సైకిల్‌కి ఉండే ఆదరణే వేరు. ఇప్పటికీ ట్రెండీ మోడళ్లతో నేటి తరాన్ని ఆకర్షిస్తోంది. దీంతో సంబంధిత సైకిల్ యాక్సరీస్ కూడా కొత్తగా పుట్టుకొస్తున్నాయి. 'బైసెక్యూ' కూడా అలాంటిదే. ఇదో స్మార్ట్ తాళం. చిత్రంలో మాదిరిగా దీన్ని సైకిల్ ముందు చక్రానికి అమర్చి స్మార్ట్ ఫోన్‌తో జత చేసి వాడుకోవచ్చు. సైకిల్‌ని ఎక్కడ ఉంచినా మాన్యువల్‌గా తాళం వేయాల్సిన పని లేదు. స్టాండ్ వేసి సైకిల్‌కి సమీప దూరం నుంచి ఎటైనా వెళ్తే చాలు. ఆటోమాటిక్‌గా లాక్ అవుతుంది. ముందు చక్రం కదలదు. ఎవరైనా సైకిల్‌ని కదలిస్తూ తాళం తీసేందుకు ప్రయత్నిస్తే ఫోన్‌లో అలారం మోగుతుంది. నోటిఫికేషన్స్ రూపంలోనూ అలర్ట్ చేస్తుంది. సైకిల్ సమీపంలోకి యజమాని రాగానే తాళం అన్‌లాక్ అవుతుంది. ఏ రకమైనా తాళాలు వాడకుండా మొత్తం వ్యవస్థని బ్లూటూత్ టెక్నాలజీతో రన్ చేయవచ్చు. ప్రత్యేక ఆప్‌తో సైకిల్ వెళ్తున్నప్పుడు ఎంత వేగంతో వెళ్తున్నారో కూడా రీడింగ్‌ని తెరపై చూడొచ్చు. అంతేకాదు... రోజంతా చేసిన సైక్లింగ్‌తో ఎంత దూరం ప్రయాణించారు? ఎన్ని కేలరీలు ఖర్చు అయ్యాయో తెలుసుకోవచ్చు.

వీడియో, ఇతర వివరాలకు https://www.bisecu.com/

ప్రశ్నజవాబులు

విండోస్ 10 ఓఎస్‌తో ఎసర్ ఎస్పైర్ 5738జెడ్ ల్యాపీని వాడుతున్నాను. ఆండ్రాయిడ్ ఆప్‌లను తయారు చేయడానికి ఆండ్రాయిడ్ స్టుడియో వాడుతున్నాను. అయితే, అది సమగ్రంగా పని చేయడానికి బయోస్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'వీటీ'ని ఎనేబుల్ చేసుకోమని సూచిస్తోంది. అది ఎలా చేయాలో వివరిస్తారా? – ఆది విష్ణు

సిస్టం రీస్టార్ట్ చేసి ఎఫ్2 బటన్, పవర్ బటన్ లేదా ఎఫ్10, ఎఫ్12 బటన్లను అదేపనిగా నొక్కే ప్రయత్నం చేయండి. దీంతో బయోస్ స్టార్ట్ అవుతుంది. అందులో సెక్యూరిటీ ఆప్షన్‌ని సెలెక్ట్ చేసి హార్డ్‌వేర్ వర్చువలైజేషన్ (వీటీ)ని ఎనేబుల్ చేయాలి. బయోస్ అమరికలో హార్డ్‌వేర్ వర్చువలైజేషన్ ఆన్ అయ్యిందని నిర్ధారించుకున్నాక బయోస్‌ని సేవ్ చేసి కంప్యూటర్‌ని సాధారణ పద్ధతిలో బూట్ చేయండి. మరిన్ని వివరాలకు https://goo.gl/h26dEV లింక్‌ని చూడండి.

రికవర్ చేయాలంటే?



జీమెయిల్ పాస్‌వర్డ్ మర్చిపోయా. రికవరీ మెయిల్ ఐడీ కూడా సరిగా గుర్తులేదు. అయితే, వాడుతున్న మొబైల్ నెంబర్‌తో పాస్‌వర్డ్‌ని మార్చుకునే వీలుందా? – నరేందర్.ఎన్

గూగుల్ మెయిల్ ఐడీ మర్చిపోతే 'ఫర్గెట్ పాస్‌వర్డ్' ఆప్షన్‌ని సెలెక్ట్ చేసి రికవరీ మెయిల్ ఐడీ లేదా మొబైల్ నెంబర్‌తో కొత్త పాస్‌వర్డ్‌ని సెట్ చేసుకోవచ్చు. మొబైల్ నెంబర్ ఉందంటున్నారు కాబట్టి ప్రత్యేక గూగుల్ కోడ్‌ని పొందడం ద్వారా పాస్‌వర్డ్‌ని మార్చుకోవచ్చు. అందుకు https://goo.gl/LpMHKd లింక్‌ని బ్రౌజర్‌లో ఓపెన్ చేయండి. కనిపించే బాక్స్‌లో ఫోన్ నెంబర్‌ని ఎంటర్ చేసి గూగుల్ నుంచి కోడ్‌ని పొందొచ్చు. వచ్చిన కోడ్‌ని ఎంటర్ చేసి కొత్త పాస్‌వర్డ్‌ని సెట్ చేసుకోవచ్చు.



సీహెచ్ఏఎస్ మూర్తి
సీ-డాక్, జాయింట్ డైరెక్టర్


టెక్నాలజీ వాడకంలో సందేహం ఏదైనా మాకు పంపండి. నిపుణులతో సూచనలు అందిస్తాం.
మా ఈ-మెయిల్: its@eenadu.in

ఈనాడు సినిమా



అఖిల్, నాగార్జున, నాగచైతన్య

తెలుగిళ్లలో పండగపూట పరమాన్నం రుచి చూడాల్సిందే! పులిహోర తాళింపు వేయాల్సిందే గారెలు.. బూరెలూ.. మూకెట్లో వేగాల్సిందే. లేదంటే పండగ ఎలా అవుతుంది..? ఇంట్లో ఇంత సందడి ఉంటే - థియేటర్లలో ఇంకెంత ఉండాలి? అందుకే పండగ పూట సినిమా విందు వడ్డిస్తుంటారు దర్శక నిర్మాతలు. కనీసం... ప్రచార పర్వంలో తొలి పేజీ అయినా తిప్పే ప్రయత్నం చేస్తుంటారు. త్వరలో ఉగాది రాబోతోంది. తెలుగు కొత్త సంవత్సరాదిని స్వాగతిస్తూ చిత్రసీమ తన సన్నాహాల్లో పడిపోయింది.




సుమంత్



మహేష్‌బాబు

పర్వదినం... ప్రచార పర్వం!



రవితేజ



'రంగస్థలం'లో సమంత, రామ్‌చరణ్

షడ్రుచుల సమ్మేళనం ఉగాది. జీవితం అంటే 'అన్ని రుచులూ అనుభవించాలి' అని హితోపదేశం చేసే పండగ. తీపి, కారం, చేదు, వగరు, పులుపు, ఉప్పు.. ఇవన్నీ కలగలిపిన కొత్తరుచి..' ఉగాది. వీటికి మరిన్ని రుచులు జోడించడానికి సిద్ధమైంది తెలుగు పరిశ్రమ. కొత్తయేడాది తొలి రోజున శ్రీకారం చుట్టుకోవడానికి సినిమాలు సిద్ధమయ్యాయి. ఆ రోజున కొబ్బరికాయ కొట్టుకోవాలని కొత్త సినిమాలు ఎదురుచూస్తున్నాయి. టీజర్లు, ఫస్టు లుక్కుల హడావుడి కూడా కనిపించబోతోంది.

ఈ ఉగాది.. అక్కినేని హీరోలదే అనిపిస్తోంది. ఎందుకంటే అక్కినేని కథానాయకుల హంగామా ఈ ఉగాదిన కనిపించబోతోంది. నాగార్జున - నానిల మల్టీస్టారర్ ఈ ఉగాదిన ప్రారంభం కాబోతోంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని వైజయంతీ మూవీస్ నిర్మిస్తోంది. అదే రోజున నాగచైతన్య కూడా అభిమానులకు ఉగాది కానుక ఇవ్వబోతున్నాడు. తను కథానాయకుడిగా నటించిన చిత్రం 'సవ్యసాచి'. చందూ మొండేటి దర్శకుడు. ఫస్ట్ లుక్‌ని ఉగాది రోజున విడుదల చేయాలని చిత్రబృందం భావిస్తోంది. 'అఖిల్', 'హలో' చిత్రాల తరవాత అఖిల్ నటించే సినిమా ఎవరితో.? అనే చర్చ మొదలైంది. పలువురి దర్శకుల పేర్లు కూడా వినిపించాయి. ఆ దర్శకుడు ఎవరన్నది ఉగాది రోజున తేలే అవకాశం ఉంది. అఖిల్ తన మూడో చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన ఆరోజే చేయొచ్చని సమాచారం.

సుమంత్ గతేడాది 'మళ్లీ రావా'తో మళ్లీ ఫామ్‌లోకి వచ్చాడు. సున్నితమైన కథా కథనాలు, తనకు తగ్గ పాత్రని ఎంచుకుని ఆ చిత్రంతో ప్రేక్షకుల మనసుల్ని గెలుచుకున్నాడు. ఇప్పుడు కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టబోతున్నాడు. సుమంత్ నూతన చిత్రం ఈ ఉగాదిన సెట్స్‌పైకి వెళ్లనుందని తెలుస్తోంది. ఇందులో సుమంత్ పాత్రలో ప్రతినాయక లక్షణాలు కనిపిస్తాయని సమాచారం. దర్శకుడు, ఇతర నటీనట, సాంకేతిక వర్గం వివరాలు ఆరోజే ప్రకటిస్తారు.

రవితేజ - కల్యాణ్ కృష్ణ కలయికలో ఓ చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'నేల టికెట్' అనే పేరు పరిశీలనలో ఉంది. ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ ఉగాది రోజున ప్రకటిస్తారు. అదే రోజున ఫస్ట్‌లుక్ విడుదల చేస్తారు. మహేష్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'భరత్ అనే నేను'. ఇప్పటికే టీజర్ విడుదలైంది. ఉగాది రోజున తొలి పాటని విడుదల చేస్తారు. రామ్‌చరణ్, సమంత జంటగా నటించిన 'రంగస్థలం' విడుదలకు సిద్ధమైంది. ఇప్పటికే మూడు పాటలు బయటకు వచ్చాయి. ఉగాది రోజున విశాఖపట్నంలో విడుదల ముందస్తు వేడుక జరగబోతోంది. చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని సమాచారం. అల్లు అర్జున్, నితిన్, నాని, గోపీచంద్, విజయ్ దేవరకొండ, సాయిధరమ్‌తేజ్, వరుణ్‌తేజ్, బెల్లంకొండ శ్రీనివాస్ తదితర కథానాయకుల చిత్రాలు ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్నాయి. వీటికి సంబంధించిన కొత్త విశేషాలు ఉగాది రోజున తెలిసే అవకాశం ఉంది.

ఆ ప్రేమ తిరిగివ్వాల్సిందే!

"తొలి సినిమా చేస్తున్నప్పుడు నాలో ఏ భయాలూ లేవు. చిత్రంగా విజయాలొచ్చాకే గందరగోళం మొదలైంది. ఏది ఎంపిక చేసుకోవాలి? ఎవరితో మాట్లాడాలి? ఎవరితో మాట్లాడకూడదు? తదితర విషయాలు అసలేమాత్రం అర్థమయ్యేవి కాదు. అనుభవం వల్లేమో మరి, ఇప్పుడిప్పుడే మళ్లీ అన్ని విషయాల్లోనూ స్పష్టతతో వ్యవహరిస్తున్నా" అంటోంది అనుపమ పరమేశ్వరన్. త్వరలోనే 'కృష్ణార్జున యుద్ధం'తో సందడి చేయనున్న ఆమె, ప్రస్తుతం సాయిధరమ్ తేజ్, రామ్‌లతో కలిసి సినిమాలు చేస్తోంది. చిత్రసీమలోకి వచ్చాక మిమ్మల్ని బాగా ఆకట్టుకొన్న విషయం ఏంటని అడిగితే... ప్రేక్షకులు చూపించే అభిమానమే అని చెప్పుకొచ్చింది అనుపమ. "ఒక మంచి సినిమా చేస్తే ఇంత మంది మనల్ని ప్రేమిస్తారా? ఇంత అభిమానం చూపిస్తారా? అని ఆశ్చర్యపోయిన సందర్భాలు ఎన్నో. ఆ ప్రేమని వాళ్లకి తిరిగి పంచాల్సిందే అనిపిస్తుంటుంది. మన పనితీరు నచ్చే వాళ్లు ఇంతగా అభిమానిస్తున్నారు కాబట్టి, మరింతగా కష్టపడి మెప్పించాలని ప్రయత్నిస్తుంటా. సామాజిక మాధ్యమాల్లో కూడా అభిమానులు రాసే సందేశాల్ని చదివి వీలైనంత వరకు బదులిస్తుంటా. మన కోసం అంతగా సమయం కేటాయించినపుడు దానికి విలువ ఇవ్వాల్సిందే అని నా అభిప్రాయం" అని చెప్పుకొచ్చింది అనుపమ.



అనుపమ పరమేశ్వరన్

విచ్చలవిడిగా చేస్తే విధ్వంసం. విచక్షణతో చేస్తే ధర్మం.

చిత్రం: అజ్ఞాతవాసి - పంపినవారు: రామిజిన్ని ప్రశాంతిరామకృష్ణ, విజయనగరం

'సంత'లో ఏం జరిగింది?



సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు

సూర్య భరత్ చంద్ర, శ్రావ్యారావు జంటగా శ్రీసుబ్రమణ్య పిక్చర్స్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'సంత'. మట్టి మనుషుల ప్రేమకథ... అనేది ఉపశీర్షిక. నెల్లుట్ల ప్రవీణ్ చందర్ దర్శకుడు. శ్రీజై వర్ధన్ బోయెనపల్లి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పాటల్ని చిత్రీకరిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఒక సంత నేపథ్యంలో సాగే ప్రేమకథా చిత్రమిది. అక్కడ ఓ జంట మధ్య ఎలా ప్రేమ చిగురించింది? వాళ్లిద్దరూ ప్రేమలో పడ్డాక ఏం జరిగిందనే విషయాలు తెరపైనే చూడాలి. హైదరాబాద్, వరంగల్‌ల్లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నాం" అన్నారు. కిన్నెర, మధుమణి, జబర్దస్త్ ఫణి, ప్రసన్న, ఆర్.ఎస్.నందా, దుర్గేష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: ఎస్.కె.అనీఫ్, డా.పసునూరి రవీందర్. ఛాయాగ్రహణం: ఫణీంద్ర వర్మ అల్లూరి.

కలల కుర్రాడు



తేజ, హరిణి రెడ్డి

తేజ, హరిణి రెడ్డి నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'డ్రీమ్ బాయ్'. రాజేష్ కనపర్తి దర్శకత్వం వహిస్తున్నారు. రేణుక నరేంద్ర నిర్మాత. హైదరాబాద్‌లో ప్రారంభమైందీ చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత రాజ్ కందుకూరి క్లాప్‌నిచ్చారు. మరో నిర్మాత ఎం.వి.రావు కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం దర్శకుడు మాట్లాడుతూ "అందమైన ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం థ్రిల్‌ని పంచుతూ సాగుతుంది. సంగీత ప్రధానమైన ఈ చిత్రంలో హాస్యానికి కూడా పెద్ద పీట వేశాం" అన్నారు. నిర్మాత మాట్లాడుతూ "దర్శకుడు చెప్పిన కథలో కొత్తదనం నచ్చింది. కలల రాకుమారుడిలాంటి ఓ అబ్బాయి చుట్టూ ఈ కథ సాగుతుంది. వాణిజ్యాంశాలతో కూడిన ఈ చిత్రం ఇంటిల్లిపాదికీ నచ్చేలా ఉంటుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ధన్‌రాజ్, రాకేష్, సుఖేష్‌రెడ్డి, లడ్డు, వెంకట్ సన్నిధి తదితరులు పాల్గొన్నారు.


ప్రపంచంలోనే అతి పెద్ద సూపర్‌స్టార్

ప్రపంచంలోనే అతి పెద్ద సూపర్‌స్టార్ ఆమీర్ ఖాన్! ఇదీ సినీ విశ్లేషకులు చెబుతున్నమాట. అత్యధిక జనాభా ఉన్న రెండు దేశాలు ఇండియా, చైనాల్లో ఏ హీరోకూ లేని రీతిలో ఆమీర్‌కు ఆదరణ ఉందని, ఇటీవలి కాలంలో ఆయన సినిమాలకు ఆ రెండు దేశాల్లో వచ్చిన వసూళ్లు చూస్తే ఆ విషయం అవగతమవుతుందంటూ వారు రుజువు చూపిస్తున్నారు. చైనాలో ఆమీర్ గత చిత్రాలు 'దంగల్' రూ.1908 కోట్లు, సీక్రెట్ సూపర్‌స్టార్ రూ.874 కోట్లు, పీకే రూ.831 కోట్లు వసూలు చేశాయి. దీంతో చైనాలో అత్యధిక ఆదరణ సొంతం చేసుకున్న చైనాయేతర నటుడిగా నిలిచారు ఆమీర్. దీని గురించి ఆమీర్ స్పందిస్తూ ప్రపంచంలోనే అతి పెద్ద సూపర్‌స్టార్ అని తనను పిలవడం సబబే అన్నారు. "చైనా, ఇండియాల్లో ఆదరణ ఉన్న నటులు దాదాపు మూడు వందల కోట్ల మంది ప్రేక్షకులకు చేరువైనట్లు. అంటే అది ప్రపంచ జనాభాలో సగం. ఈ విషయంలో పాశ్చాత్య దేశాల వారు మనల్ని అధిగమించలేర"న్నారు ఆమీర్. చైనాలో తనకున్న ఆదరణ గురించి చెబుతూ "నాకు చైనాలో అనుకోకుండా క్రేజ్ వచ్చింది. చాలా మందికి తెలియని విషయమేంటంటే 'త్రీ ఇడియట్స్'తోనే నాకు చైనాలో అభిమానులు ఏర్పడ్డారు. ఆ చిత్రం అక్కడ విడుదల కాకపోయినా పైరసీ ద్వారా వారికి చేరువైంది. ఆ చిత్రంలో విద్యా వ్యవస్థపై చర్చించిన తీరు వారికి నచ్చుంటుందని అనుకుంటున్నాను. 'పీకే', టీవీ షో 'సత్యమేవ జయతే'లతో ఆ అభిమానం మరింత పెరిగింది. 'దంగల్' విడుదలయ్యేటప్పటికే వారికి నా నటన గురించి బాగా తెలుస"న్నారు ఆమీర్.



ఆమీర్ ఖాన్

అమితాబ్‌కు స్వల్ప అస్వస్థత



అమితాబ్‌బచ్చన్

ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్‌బచ్చన్ అస్వస్థతకు గురయ్యారు. ఆయన ప్రస్తుతం 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' చిత్రీకరణ కోసం జోధ్‌పూర్‌లో ఉన్నారు. చిత్రీకరణ సమయంలో స్వల్ప అనారోగ్యానికి గురికావడంతో ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. తన సొంత వైద్యుల బృందం జోధ్‌పూర్ రానున్న విషయాన్ని అమితాబ్ తన బ్లాగులో మంగళవారం ఉదయమే రాశారు. "ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నాను. నా ఆరోగ్యానికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తాను" అని బ్లాగులో రాసుకున్నారు అమితాబ్. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' షూటింగ్ షెడ్యూల్స్‌లో కాస్త ఎక్కువగానే కష్టపడాల్సి వస్తోందట అమితాబ్‌బచ్చన్. "కష్టపడకుండా లక్ష్యాన్ని ఎలా చేరగలం? పోరాటం...నిరాశ...బాధ...చెమట..కన్నీళ్లు...లక్ష్య సాధనలో ఇవన్నీ ఉంటాయి. ఇంత కష్టపడినా ఒక్కోసారి ఫలితం రావచ్చు...రాకపోవచ్చు" అని రాశారు అమితాబ్.

కొండవీటి కోటలో...



చిత్రం శ్రీను

చిత్రం శ్రీను ప్రధాన పాత్రధారిగా నటించిన చిత్రం 'విశ్వదాభిరామ'. సురేష్ కాశీ, సురేష్ కమల్, అశోక్ చక్రం త్రయం దర్శకత్వం వహిస్తోంది. సురేంద్ర కమల్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "చిత్రం శ్రీను ఇందులో వ్యతిరేక ఛాయలున్న పాత్రలో కనిపిస్తాడు. కామెడీ పాత్రల్లో నటించిన ఆయన్ని కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. కొండవీటి కోట నేపథ్యంలో ఆద్యంతం థ్రిల్‌ని రేకెత్తిస్తూ సాగుతుందీ కథ. ఆ కోటలో ఏం జరిగిందనేది తెరపైనే చూడాలి. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"ని తెలిపారు దర్శకులు. ఈ చిత్రానికి కథ, కథనం, మాటలు: సురేష్ కాశీ, ఛాయాగ్రహణం: అజీమ్, తరుణ్ సోనూ.

నిఖిల్ జోయా వచ్చేస్తున్నారు!



దుల్కర్ సల్మాన్, సోనమ్‌కపూర్

బాలీవుడ్ అందాల భామ సోనమ్‌కపూర్, మలయాళ యువ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ కలిసి నటించబోతున్నారు. ఆహూజా చౌహాన్ నవల 'ది జోయా ఫ్యాక్టర్'ను వెండితెరకెక్కిస్తున్నారు దర్శకుడు అభిషేక్ శర్మ. ఈ సినిమాకు సంబంధించి సోనమ్, దుల్కర్‌పై ఫొటోషూట్ చేశారు. దానికి సంబంధించిన ఫొటోలను ట్విట్టర్‌లో పంచుకొన్నారు సోనమ్, దుల్కర్. 'జోయా ఫ్యాక్టర్' నవలను ముఖానికి అడ్డుపెట్టుకొని చూస్తున్న ఈ ఫొటోలో దుల్కర్ పేరు నిఖిల్ అని, సోనమ్ పేరు జోయా అని రాసి ఉంది. భారత క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ నిఖిల్ ఖోడా పాత్రలో దుల్కర్, యాడ్ ఏజెన్సీ ప్రతినిధి జోయా సింగ్ సోలం పాత్రలో సోనమ్ కనిపించనున్నారు. ఆగస్టులో సెట్స్‌పైకి వెళ్లనున్న ఈ సినిమాను వచ్చే ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

షారుఖ్ మరో మైనపు విగ్రహం

మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో ఒక్కసారి మైనపు విగ్రహం పెడితేనే గొప్పగా చెప్పుకుంటారు. బాలీవుడ్ కథానాయకుడు షారుఖ్‌ఖాన్‌కు ఈ గౌరవం రెండోసారి దక్కనుంది. 2007లో షారుఖ్ మైనపు విగ్రహాన్ని లండన్‌లోని మేడమ్ టుస్సాడ్స్‌లో ఆవిష్కరించారు. ఇప్పుడు అలాంటిదే మరో విగ్రహాన్ని దిల్లీ మేడమ్ టుస్సాడ్స్‌లో పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. "ప్రపంచవ్యాప్తంగా కోట్లాది అభిమానులున్న నటుడు షారుఖ్ ఖాన్. అభిమానులు ఆయనపై చూపిస్తున్న ప్రేమను దృష్టిలో ఉంచుకొని రెండోసారి ఆయన విగ్రహాన్ని దిల్లీలో ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. తమ అభిమాన కథానాయకుడి విగ్రహాన్ని తిలకించడానికి విదేశాలు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఈ ఏర్పాటు చేశామ"న్నారు ఆ సంస్థ ప్రతినిధి అన్షుల్ జైన్.



‘ వై షుడ్ బాయ్స్ హేవ్ ఆల్ ద ఫన్’
- ఇది ఓ స్కూటీ సంస్థ క్యాప్షన్! సరదా అంతా అబ్బాయిలకే ఎందుకు... అనేది దానర్థం.
దీపా రాధాకృష్ణన్ కూడా ఇదే కోణంలో ఆలోచించింది. అమ్మాయిలు ఏదయినా చేయగలరు అని చెప్పేందుకు.. మగాళ్లు మాత్రమే ఎక్కువగా నడిపే రాయల్‌ఎన్‌ఫీల్డ్, బుల్లెట్.. లాంటి బడా బడా బైకుల్ని అమ్మాయిలకు నేర్పించడం మొదలుపెట్టింది.
ఒకప్పుడు పైలట్‌గా శిక్షణ తీసుకున్న ఆమె...
అసలు ఇటువైపు ఎందుకు, ఎలా వచ్చిందో వసుంధరకు వివరించిందిలా...



రాయల్... బుల్లెట్...
ఏదైనా నేర్పిస్తా!

‘నా చదువంతా హైదరాబాద్‌లోనే. విద్యార్థినిగా ఎన్‌సీసీలో ఉన్నప్పుడు పైలట్ శిక్షణ తీసుకోవాలనుకున్నా. అందుకే టొరంటో ఎయిర్‌వేస్ నుంచి 100 గంటల పైలట్ శిక్షణ తీసుకుని లైసెన్సు తెచ్చుకున్నా. నాకు చిన్నప్పటి నుంచీ బైక్‌లు నడపడం అంటే ఇష్టం. తాతయ్యవాళ్లు కేరళలో ఉంటారు. స్కూల్ సెలవులకు వెళ్లినప్పుడు మావయ్య వద్ద బజాజ్ వెస్పా నేర్చుకున్నా. అప్పట్లో వాటిని నడిపే మహిళలు చాలా తక్కువయినా నేర్చుకున్నా. ఇక, నాకు పదిహేడేళ్లున్నప్పుడు అనుకుంటా... ఓ స్నేహితుడి దగ్గర యమహా ఆర్‌ఎక్స్ 100 ను అరగంటలో నేర్చుకుని రోడ్లన్నీ తిరిగేశా. అదే నా మొదటి బైకు. ఆ తరువాత కాలేజీలో స్నేహితుల బైకులు దొరికితే చాలు.. ఏ మాత్రం ఆలోచించకుండా ఓ రౌండు వేసేదాన్ని. కాలేజీలో అందరూ నన్ను యమహా గాళ్ అనేవారు. ఓసారి అలా నడుపుతున్నప్పుడే అమ్మావాళ్లు చూశారు. ఇంటికెళ్లాక తిడతారనుకున్నా. కానీ ‘ఎప్పుడు నేర్చుకున్నావు... ఆ బైకు ఎవరిది’ అని అడిగారంతే. అన్నయ్యా, అక్క మాత్రం మెచ్చుకున్నారు. ఆ తరువాత ముంబయిలో ఉన్నపుడు బైకుపై ఒంటరిగా లాంగ్‌రైడింగ్‌కి వెళ్లొచ్చాక నాలో ఇంకాస్త ఆత్మవిశ్వాసం పెరిగింది. ఆ తరువాత కొద్దిరోజుల్లోనే అన్ని రకాల బైకులూ నేర్చేసుకున్నా. ప్రస్తుతం నాది రాయల్ ఎన్‌ఫీల్డ్ స్టాండర్డ్ 500 బైకు. దాని బరువు 194 కేజీలు.

గేర్ స్పాట్ పేరుతో...

కొన్నాళ్లు టొరంటోలో ఉన్నాక ముంబయి వచ్చేశా. ముంబయిలో బైకు రైడింగ్ ద్వారా అవగాహన అందించేలా పలు కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. మా అమ్మావాళ్లు ఇక్కడే ఉంటారు. నాకు ఈనగరమంటే ఇష్టం. దాంతో నాలుగేళ్లక్రితం ఇక్కడికి వచ్చేశా. నాకు బైకు రైడింగ్‌పై ఆసక్తి కదా.. అందుకే ఇక్కడ యునైటెడ్ బైకర్స్ అనే సంస్థలో చేరా. దీనికింద 17 బైకింగ్ క్లబ్స్ ఉన్నాయి. వీటి తరపున పలు సామాజిక అంశాలపట్ల అవగాహన కలిగించే దిశగా చాలా రైడ్స్ చేశా. అయితే వీటన్నింటిలో దాదాపు వెయ్యిమంది పాల్గొంటే.. అందులో ఇద్దరు లేదా ముగ్గురు మాత్రమే మహిళలు ఉండటం గమనించా. క్లబ్‌లన్నింటిలో రెండువేలమందికి పైగా సభ్యులుంటే మహిళల సంఖ్య మాత్రం 20 లోపే. ఇది చూశాక ఆసక్తి ఉన్న మహిళలకు బైక్‌లు నడపడంపై శిక్షణ ఎందుకు ఇవ్వకూడదనిపించింది. సోషల్‌మీడియా ద్వారా సందేశాన్ని పంపా. ఆసక్తి ఉన్నవారు నన్ను సంప్రదించొచ్చని చెప్పా. అలా ‘గేర్ స్పాట్ ’ మొదలైంది. దీంతో 16 నుంచి 64 ఏళ్ల మహిళలెందరో నన్ను సంప్రదించారు. వీరిలో చాలామందికి నేర్చుకోవాలని ఉన్నా, నేర్పించేవాళ్లు, మహిళా శిక్షకులు లేకపోవడమే వారు అప్పటివరకూ నేర్చుకోలేకపోవడానికి కారణమని తెలిసింది.



దేశమంతా తిరిగా..

17 ఏళ్ల క్రితం నేను బైకు రైడింగ్ ప్రారంభించా. ఇప్పటివరకు ఒంటరిగా, గ్రూపులతో దేశమంతా బైకుపై తిరిగా. ప్రస్తుతం నేను టాంగీ సెషన్స్‌కు కో ఫౌండర్‌గా ఉన్నా. అంటే సహజసిద్ధంగా స్వరాలు సమకూర్చే సంగీతకళాకారులకు దీని ద్వారా వేదిక కల్పిస్తాం. సైకాలజీలో పీజీ చేశా. సమోసా ల్యాబ్స్ (మొబైల్ యాప్) అనే సంస్థలో క్రియేటివ్ కంటెంట్ హెడ్‌గా ఉన్నా. ఖాళీ దొరికినప్పుడల్లా ట్రెక్కింగ్, స్కూబా డైవింగ్, ర్యాఫ్టింగ్, పారా సెయిలింగ్, షూటింగ్ వంటివీ చేస్తుంటా.

యాభైమందికి శిక్షణ అందించా...



- నా వద్ద శిక్షణ తీసుకుంటున్నవారితో అప్పుడప్పుడూ సిటీరైడ్స్ చేయిస్తా. దీనివల్ల వారిలో భయం పోతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.
- ఇప్పటివరకూ నా దగ్గర సుమారు యాభైమంది శిక్షణ తీసుకున్నారు.
- నిజానికి కొందరు మొదట్లో ఉత్సాహంగా నేర్చుకున్నా తరువాత రైడింగ్ అంటే భయపడతారు. అలాంటివారికి ప్రపంచవ్యాప్తంగా ఉండే మహిళా బైక్‌రైడర్ల గురించి చెబుతూ వారిలో ధైర్యాన్ని నింపుతా.

నచ్చిన బైకు నేర్పుతా..

ఏ బైక్ నేర్పమని అడిగినా శిక్షణనిస్తా. అయితే వాళ్లకు ముందుగా స్కూటీ అయినా నడపడం తెలిసుండాలి. వారికి నావద్ద ఉన్న యమహా ఆర్ ఎక్స్ 100, హోండా యూనీకామ్, రాయల్ ఎన్‌ఫీల్డ్ స్టాండర్డ్ 500 బైకులను ఎనిమిదిరోజుల్లో నేర్పిస్తా. ఇప్పుడు వచ్చే బైకులన్నీ దాదాపు 200 నుంచి 250 కేజీల్లోనే ఉంటున్నాయి. బైక్‌కు ఉండే సెంటర్ ఆఫ్ గ్రావిటీని గుర్తించగలిగితే చాలు, ఎంత బరువైన బైకు అయినా కూడా రెండు వేళ్లతో బ్యాలెన్సు అవుతుంది. ఏదైనా ప్రమాదం లేదా సమస్య అనిపిస్తే వెంటనే కాళ్లు కింద ఉంచకూడదు. ముందుగా వేగం తగ్గించి ఆ తరువాతే కాళ్లను భూమిపై ఆనించాలి. ఇదంతా సెకన్లలో జరగాలి. ఈ జాగ్రత్తలతో నడిపితే గనుక కాస్త ఎత్తు తక్కువగాఉన్నవారు కూడా దూసుకెళ్లిపోవచ్చు. దీంతోపాటు బ్రేకులు ఫిక్స్ చేయడం, టైర్లు మార్చడం సహా చిన్నచిన్న మరమ్మతుల్ని కూడా నేర్పుతా. ఏడాది నుంచీ శిక్షణనిస్తున్నా. బైకు ఓ వస్తువు. అబ్బాయి నడుపుతున్నాడా, అమ్మాయి నడుపుతుందా అని ఆ బైకుకు తెలీదు. నడపడం ఒక్కటే కావాలి. బైకు నడపడంలో ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, ఆత్మస్థైర్యం పెరుగుతాయి. భయాన్ని వదిలితే చాలు, ఏదైనా సాధించవచ్చు.

– సిహెచ్. వసుంధరాదేవి

నజరానా


చేపల్ని పెంచుకుంటున్నప్పుడు తరచూ నీటిని మార్చాల్సి ఉంటుంది. ఆ నీటిని పారబోయకుండా మొక్కలకి పోస్తే ఎరువుగా ఉపయోగపడతాయి.



బంగారం వెండి

13న ముగింపు-క్రితం

తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,897	2,901
వెండి (గ్రా)	41.40	41.40



	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమండ్రి		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	31,310	31,320	31,340	31,350	31,300	31,360	30,980	31,040	31,160	31,370
ఆర్నమెంట్	29,220	29,250	29,100	29,100	29,010	29,030	28,980	29,010	28,980	29,180
వెండి(కిలో)	39,415	39,441	40,000	40,000	39,500	39,600	38,900	38,800	39,900	39,900

కలిసి ఆడుకోనివ్వండి...

అప్పుడప్పుడే నడకా, మాటలూ నేర్చుకుంటోన్న పిల్లల అల్లరిని ఓ పట్టాన ఆపలేం. మరీ శృతిమించకుండా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాల్సిందే.

ఇంటిపనో, వంటపనో చేసుకుంటున్నప్పుడు కాసేపు వారి అల్లరికి అడ్డుకట్ట వేయాలనుకుంటే... వారికి నచ్చే ఆటనో, పాటనో వారికి అలవాటు చేయండి. అలాకాకుండా మీరు హడావిడి పడిపోతూ...వారిని విసుక్కోవడం వల్ల ఉపయోగం ఉండదు. రోజంతా కార్టూన్‌షోలకి చూపించకుండా మీ పని సమయానికి తగినట్లుగా వారికి నచ్చే కార్యక్రమం చూసేలా ఏర్పాటు చేయండి.



- ఒంటరిగా ఉండే పిల్లలు ఎక్కువ పేచీలు పెడతారంటున్నాయి కొన్ని అధ్యయనాలు. వీలైనంతవరకూ వారి ఆటపాటలు ఒంటరిగా కాకుండా తోటివారితో కలిసి ఉండేలా చూసుకోండి. అప్పుడు వారి అల్లరి అదుపులో ఉంటుంది.
- మీరు వంట చేస్తున్నప్పుడు వారిని వదిలేయాలంటే కాస్త కష్టమే అలాని పనీ మానలేం. ఇలాంటప్పుడు వారి చేతికి కాయగూరలు ఇచ్చి వాటిని రంగుల వారీగా వేరు చేయమనడం వంటి చిన్న చిన్న సవాళ్లు ఇస్తే...వారికి ఆటలా ఉంటుంది. అల్లరి అదుపులో ఉంటుంది.

చల్లదనానికి కీరా

ఎండలు మండుతుంటే... చల్లని పదార్థాలు తినడానికే మనసు కోరుకుంటుంది. అలాంటి పదార్థాల్లో కీరదోస ఒకటి. ఎందుకో తెలుసుకోండి మరి.

- కీరదోసలో దాదాపు తొంభైశాతం నీరుంటుంది. ఇది శరీరానికి చల్లదనం ఇవ్వడమే కాదు... బరువును కూడా అదుపులో ఉంచుతుంది. దాహాన్నీ తీరుస్తుంది.
- ఇందులో సి విటమిన్లతోపాటూ ఫొలేట్ కూడా ఉంటుంది. సి చర్మానికి తాజాగా ఉంచుతుంది.



- దీనిలో పొటాషియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం, క్యాల్షియం లాంటి మూలకాలు ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- దీన్ని నమలడం వల్ల నోటి దుర్వాసన తగ్గి తాజాగా ఉంటుంది. దీనిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయి.
- తలనొప్పిగా అనిపించినా, మత్తుగా ఉన్నట్లున్నా రెండు మూడు కీరా ముక్కలను తినండి. మార్పు మీకే తెలుస్తుంది.
- దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల శరీరంలోని విషవ్యర్థాలు బయటకు వస్తాయి.

నిశ్చితార్థమయ్యాక నచ్చలేదన్నాడు!

డియర్ వసుంధర



డాక్టర్ పద్మజ
సైకాలజిస్టు

? నాకు ఈ మధ్య పెళ్లి కుదిరింది. పెళ్లికి కొంత సమయం ఉండటంతో పెద్దవాళ్లు నిశ్చితార్థం చేశారు. ఆ తరవాత కాబోయే అబ్బాయి బాగా మాట్లాడేవాడు. కానీ పెళ్లి దగ్గ పడేకొద్దీ అతని మాట తీరులో తేడా వచ్చింది. నేను బాగోననీ, అందంగా ఉండననీ, ఎత్తు తక్కువగా ఉంటానని.. ఇలా చాలా రకాలుగా విమర్శించేవాడు. ఒకసారి నా స్నేహితులకు తాగి రోడ్డు మీద కనిపించాడు. ఆ విషయం మా ఇంట్లో చెప్పడానికి భయమేసింది. కానీ నన్ను గమనించిన అక్క నిలదీసేసరికి విషయం చెప్పా. అమ్మానాన్నలు అతని గురించి ఆరా తీస్తే.. మరో అమ్మాయితో సంబంధం ఉన్నట్టు తెలిసింది. పెళ్లి రద్దు చేశారు. మనసుకు చాలా కష్టంగా ఉంది. పెళ్లి, జీవితం అని ఊహల్లో గడిపాక ఆ బాధ నుంచి తేరుకోలేకపోతున్నా. ఈ సమస్య నుంచి బయట పడేదెలా?

- ఓసోదరి


✔ నిజంగా మీరు చాలా అదృష్టవంతులు. అలాంటి వ్యక్తి గురించి ముందే తెలిసి.. సమస్య రాకుండానే బయటపడ్డారు. అయితే ఇది మీ మనసుకు బలంగా తగిలింది. పెళ్లి, భవిష్యత్తు... వంటి విషయాల్లో ప్రతి ఒక్కరికీ ఊహలు ఉంటాయి. మీరు నిశ్చితార్థం జరిగింది కదాని గాలి మేడలు కట్టుకుని ఉంటారు. అతని నిజస్వరూపం తెలియడంతో ఒక్కసారిగా అవి కుప్పకూలిపోయి.. బాధపడుతున్నారు. ఇక్కడ మీ ప్రమేయం లేకుండా అలా జరిగినందుకు జీర్ణించుకోలేకపోతున్నారని అర్థమవుతోంది. అయితే ఇక్కడ మీరు ఎంత సానుకూలంగా ఆలోచిస్తే అంత మంచిది. మనసు దృఢంగా చేసుకునేందుకు ప్రయత్నించాలి. మీకు ఈ సంఘటన వల్ల లాభం జరిగిందా.. లేదా నష్టమా అనేది విశ్లేషించుకోండి. మీ మనసే మీకు సమాధానం చెబుతుంది. ముమ్మాటికీ లాభం అనే అనిపిస్తుంది. ఆ లాభంతో పోలిస్తే.. ఈ సంఘటన పెద్ద లెక్కే కాదు. అదే పెళ్లి జరిగి ఉంటే ఇంకెంత నష్టం జరిగి ఉండేదో ఊహించడమే కష్టంగా ఉంటుంది. అమ్మానాన్నలు పెద్దవారు. మీరు విద్యావంతులు కాబట్టి వారికి ధైర్యం చెప్పండి. ఈ రోజుల్లో ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయి. పెళ్లి కుదిరినంత మాత్రాన వివాహం అయినట్టు కాదు కదా. మీకు ఇంకా మంచి భవిష్యత్తు ఉంది. బాగా చదువుకున్నారు. ఉద్యోగం దిశగా అడుగులు వేసి ఆలోచనల్ని అదుపు చేసుకోండి. అలానే చుట్టుపక్కల వాళ్లు ఏదో అనుకున్నారని సోషల్ ఇన్‌సెక్యూరిటీ వస్తుంది. అనుకోవడం సహజమే. కానీ పట్టించుకోవాల్సిన అవసరం లేదు. అయినా మీరింకా దాన్నుంచి బయటపడలేకపోతే మానసిక నిపుణుల్ని సంప్రదించండి.

మీ ప్రశ్నలు ఇకపై vasupsych@eenadu.net కు పంపించగలరు.



క్యాబ్ బుక్ చేయడానికి ఓలా లేదా ఊబర్ యాప్ ఉపయోగిస్తే పికప్ లొకేషన్స్, గమ్యస్థానం చేరే టైమ్ వెంటనే డిస్‌ప్లే అవుతుంది. ఫేస్‌బుక్‌లో ఏదైనా పోస్ట్ చేయగానే ఫలానా ఫ్రెండ్స్‌ని ట్యాగ్ చేయాలా అని అడిగేస్తుంది. గూగుల్‌లో సెర్చ్ చేస్తుంటే అంతకు ముందు అదే సబ్జెక్టుపై జరిగిన సెర్చ్ లిస్టులను చూపించేస్తుంది. కోట్లమంది కస్టమర్ల నుంచి కొంతమందిని కొద్దిటైమ్‌లోనే డిస్కౌంట్ కూపన్లకు అర్హులుగా అమెజాన్ లాంటి ఆన్‌లైన్ ఈ-కామర్స్ సంస్థలు గుర్తించేస్తాయి. ఇవన్నీ... ఎలా జరుగుతున్నాయి? పెద్దఎత్తున ఉన్న డేటాను అత్యంత వేగంగా విశ్లేషించి అంతే స్పీడుతో నిర్ణయాన్ని ప్రకటించే ఆ యంత్ర శక్తి ఏమిటి? అదే మెషిన్ లర్నింగ్. ఇవన్నీ మనుషుల కంటే కొన్ని కోట్లరెట్ల సామర్థ్యంతో పనిచేసే మర ప్రజ్ఞ మహా మాయలే. ఇది ఇప్పుడు కొత్త కొత్త కోర్సులకు, ఎన్నో రకాల ఉద్యోగాలకు కేంద్రంగా మారుతోంది.

మర ప్రజ్ఞ మహా మాయ!



ఎమర్జింగ్ కెరియర్
మెషిన్ లర్నింగ్



నీలమేఘశ్యామ్ దేశాయ్
Career Dev.Cell
ACE ఇంజినీరింగ్ కళాశాల

మీ యాక్టివిటీస్ అన్నింటిపై మీ ఫేస్‌బుక్ అకౌంట్ ఎప్పుడూ ఒక కన్నేసి ఉంచుతుంది. తరచూ ఎవరి ప్రొఫైల్స్ చూస్తున్నారు, మీ అభిరుచులు ఏమిటి, ఏయే గ్రూప్‌ల్లో ఎలాంటి కంటెంట్ పోస్ట్ చేస్తున్నారు... వీటన్నింటినీ కనిపెట్టి మీ ఆసక్తులకు తగిన ఫ్రెండ్స్‌ని మీకు సూచిస్తుంది.

కొన్ని ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్లలో లైవ్ ఎగ్జిక్యూటివ్‌లు కస్టమర్ల ప్రశ్నలకు టక టకా సమాధానాలు ఇచ్చేస్తుంటారు. ఆ జవాబులు ఇచ్చేది మనుషులు కాదు, చాట్‌బోట్.

అలాగే.. అడిగిన వెంటనే మన అవసరాలకు దాదాపు తగిన సమాచారాన్ని అందించే గూగుల్!

ఎప్పుడో ఒకసారి ఏమీ తోచక ఏదో వెబ్‌సైట్లో కావాల్సిన వస్తువు కోసం కాసేపు వెతికితే, దానికి సంబంధించి కొత్త సమాచారాన్ని తరచూ మెయిల్స్, మెసేజ్‌ల రూపంలో మోసుకొచ్చే టెక్నికల్ వ్యవస్థ!

ఇవన్నీ మెషిన్ లర్నింగ్ మాయలే.

మనుషుల ప్రమేయం లేకుండా ఒక కంప్యూటర్ ప్రోగామ్ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొని, సమస్యలకు సరైన సమాధానాలను కనిపెట్టగలిగే సామర్థ్యాన్ని సంతరించుకున్న సైన్స్ విజ్ఞాన విభాగాన్ని మెషిన్ లర్నింగ్ (మర ప్రజ్ఞ) అంటారు. నిర్ణయాలకు కావాల్సిన పూర్వపు డేటాను శోధించి, విశ్లేషించడానికి అవసరమైన శక్తిని ఈ ప్రోగ్రామ్‌లు కలిగి ఉండటం మెషిన్ లర్నింగ్ ప్రత్యేకత.

ఇలా కంప్యూటర్లు పనిచేయడానికి అవసరమైన అల్గారిథమ్ (క్రమసూత్ర పద్ధతి) రచన, నిర్మాణం, డెవలప్‌మెంట్‌లను చేయగలిగిన మెషిన్ లర్నింగ్ నిపుణుల అవసరం ఇప్పుడు వేగంగా పెరుగుతోంది.

ప్రతి దానికీ మనుషులు విడిగా ప్రోగ్రామ్‌లు రాసే అవసరం లేకుండా కంప్యూటర్లే స్వయంగా ప్రోగ్రామ్‌లను చేయడం మెషిన్ లర్నింగ్‌తో సాధ్యమవుతుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ) రంగంలోని కంప్యుటేషనల్ లర్నింగ్ (గణన ప్రజ్ఞ), ప్యాటర్న్ రికగ్నిషన్ (రీతుల మాన్యత)ల మిశ్రమమే మెషిన్ లర్నింగ్ (మర ప్రజ్ఞ).

అభ్యర్థులకు అవసరమైన మెలకువలు



మెషిన్ లర్నింగ్ నేర్చుకోవడానికి అవసరమైన మెలకువలు, నైపుణ్యాలను రెండు వర్గాలుగా నిర్వచించవచ్చు. ఇది ఒక వ్యవస్థకు అవసరమైన, ఉపయోగకరమైన, సమగ్రమైన సమాధానాన్ని అందించే టెక్నాలజీ. కాబట్టి దాన్ని ఎక్కడ వినియోగిస్తారో తెలుసుకోవాలి. ఈ డొమెయిన్ నాలెడ్జ్‌ని మొదటి వర్గంగా పేర్కొంటారు. రెండో దాంట్లో సాంకేతిక నైపుణ్యాలు ఉంటాయి.

- కంప్యూటర్ సైన్స్ మౌలికాంశాలపై, ప్రధానంగా ప్రోగ్రామింగ్‌లో మంచి ప్రవేశం ఉండాలి. కంప్యూటర్ నిర్మాణానికి సంబంధించిన హార్డ్‌వేర్‌పై సరైన అవగాహన ఒక స్థాయి వరకు అవసరమవుతుంది.
- గణిత శాస్త్రంలోని సమితులు, ప్రమేయాలు, సంభావ్యత, గణాంక శాస్త్రం, క్రమసూత్రాల సంక్లిష్టతలు (సెట్స్, ఫంక్షన్స్, రిలేషన్స్, ప్రాబబిలిటీ, స్టాటిస్టిక్స్, అల్గారిథమ్ కాంప్లెక్సిటీ) తదితర పాఠ్యాంశాల్లో పట్టు ఉండాలి.
- డేటా మోడలింగ్, మూల్యాంకనాలను నేర్చుకోవాలి.
- మెషిన్ లర్నింగ్ కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన అపాచె సింగ, షోగన్, అపాచె మహూత్, అపాచె స్పార్క్ ఎంఎల్‌లిబ్, టెన్సర్‌ఫ్లో, ఒరిక్స్-2, అకార్డ్.నెట్, అమెజాన్ మెషిన్ లర్నింగ్, ప్రిడిక్షన్‌ఐఓ, ఎక్లిప్స్ డీప్ లర్నింగ్ వంటి టూల్స్, ఫ్రేమ్‌వర్క్‌ల్లో ఒకటి కన్నా ఎక్కువ వాటితో పరిచయం ఉండాలి (కోచింగ్ సెంటర్లు వీటిలో కొన్నింటికి శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది).
- చివరగా సాఫ్ట్‌వేర్ ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ డిజైన్‌లలో కొంతమేరకు నైపుణ్యం అవసరం.

మర ప్రజ్ఞ రకాలు


మనకు కావాల్సిన ఫలితాల ఆధారంగా మెషిన్ లర్నింగ్ అల్గారిథమ్‌ను ప్రధానంగా మూడు రకాలుగా గుర్తించవచ్చు.

- సూపర్‌వైజ్‌డ్ లర్నింగ్ (పర్యవేక్షిత ప్రజ్ఞ)
- అన్-సూపర్‌వైజ్‌డ్ లర్నింగ్ (అపర్యవేక్షిత ప్రజ్ఞ)
- రీ-ఇన్‌ఫోర్స్‌డ్ లర్నింగ్ (ప్రబలిత ప్రజ్ఞ)

అంతరాలు తెలియాలి

మెషిన్ లర్నింగ్‌కి సంబంధించి ప్రధానంగా నాలుగు కొత్త పదాలు కనిపిస్తాయి. అవే డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డీప్ లర్నింగ్. ఒకే భావాన్ని వేర్వేరు పదాల్లో చెప్పినట్లు అనిపించినా వీటి మధ్య అంతరాలు ఉన్నాయి. వాటిని తప్పనిసరిగా తెలుసుకోవాలి.

- డేటా సైన్స్‌లో ప్రధానంగా డేటా విశ్లేషణ ఉంటుంది. ఇందులో ఆర్ అనే ప్రోగ్రామింగ్ లాంగ్వేజిని ఉపయోగిస్తారు.
- మెషిన్ లర్నింగ్‌లో మనుషుల కన్నా కంప్యూటర్లు నడిపే ప్రోగ్రామ్‌లకు ప్రాధాన్యం ఉంటుంది.
- డీప్ లర్నింగ్ అంటే దృశ్య, శ్రవణ, పాఠ్య మాధ్యమాల్లోని డేటాను విశ్లేషించి, వర్గీకరణ చేసే మెషిన్ లర్నింగ్‌లోని ఉపరంగం. ఇది న్యూరల్ నెట్‌వర్క్ ఆర్కిటెక్చర్ మీద ఆధారపడి పనిచేస్తుంది.
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది న్యూరల్ నెట్‌వర్క్స్, మెషిన్ లర్నింగ్, డీప్ లర్నింగ్‌లతో కూడిన కుటుంబానికి పెద్దలాంటిది. ఇది కంప్యూటర్లను మనుషుల్లా వివేకంతో కూడుకున్నవిగా అభివృద్ధి చేసే వ్యవస్థ.



ఏయే రంగాల్లో వినియోగం?

మెషిన్ లర్నింగ్ టెక్నాలజీ అనువర్తన ఈ కింది రంగాల్లో రోజు రోజుకీ విస్తరిస్తోంది.

- ఇమేజ్ రికగ్నిషన్ - నలుపు, తెలుపు చిత్రాలు; రంగు చిత్రాల అక్షరాలను గుర్తించడం, ముఖాన్ని గుర్తించడం.
- స్పీచ్ రికగ్నిషన్ - మాటలు, ధ్వని గుర్తించడం.
- మెడికల్ డయాగ్నోస్టిక్స్ - వైద్యరంగంలో వ్యాధి లక్షణ పరిశీలన, రోగ నిర్ధారణ.
- ఫైనాన్షియల్ ఆర్బిట్రేజ్ - వ్యాపార రంగంలో వస్తు వినియోగ పద్ధతులు, అలవాట్లు, కొత్త ఆవిష్కరణలు, షేర్ మార్కెట్‌లలో పెట్టుబడి నిర్ణయాలు.
- క్లాసిఫికేషన్ - ఒకే రకమైన లక్షణాలు కలిగిన భిన్న సమూహాల వర్గీకరణ.
- బ్యాంకింగ్ వ్యవస్థ - రుణాల మంజూరీ నిర్ణయాలు, ఎగవేతదారుల ముందస్తు గుర్తింపు.
- ఇన్‌ఫర్మేషన్ ఎక్స్‌ట్రాక్షన్ - నిర్మిత, అనిర్మిత డేటా నుంచి ఉపయోగమైన సమాచారం వెలికితీత.
- విద్యారంగం - విద్యార్థుల గ్రాహ్య, వినిమయ శక్తి, పద్ధతుల గుర్తింపు.
- సెర్చ్‌ఇంజిన్ - గూగుల్ లాంటి సెర్చ్ ఇంజిన్ల వివేచన సామర్థ్యాన్ని పెంచడం.
- డిజిటల్ మార్కెటింగ్- వినియోగదారుల అభిరుచిని బట్టి ఉత్పాదకతకు ప్రాముఖ్యాన్నివ్వడం, వ్యక్తిగత ఇష్టానిష్టాల గుర్తింపు.
- హెల్త్‌కేర్ - వైద్య ఆరోగ్య రంగం, ఆరోగ్య బీమా

శిక్షణనిచ్చే సంస్థల్లో కొన్ని!

ప్రభుత్వ సంస్థలు

✦ ఐఐటీ, బాంబే ✦ ఐఐటీ, మద్రాసు ✦ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, దిల్లీ ✦ ట్రిపుల్ ఐటీ, హైదరాబాద్ ✦ ట్రిపుల్ ఐటీ, బెంగళూరు

ప్రైవేటులో..

◆ కెర్నెల్‌స్ఫియర్ టెక్నాలజీస్, హైదరాబాద్ ◆ మెషిన్ లర్నింగ్ ల్యాబ్, గచ్చిబౌలి, హైదరాబాద్ ◆ అనలిటిక్స్ పాత్, హైటెక్ సిటీ, హైదరాబాద్ ◆ డేటా సైన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ ట్రెయినింగ్, రామచంద్రాపురం, హైదరాబాద్ ◆ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్, గచ్చిబౌలి, హైదరాబాద్ ◆ అనలిటిక్స్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్ ప్రైవేట్ లిమిటెడ్, సోమాజిగూడ, హైదరాబాద్ ◆ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లర్నింగ్ ట్రెయినింగ్, రామచంద్రాపురం, హైదరాబాద్

ఆన్‌లైన్‌లో..

✤ కోర్స్‌ఎరా (మూడు కోర్సులు) ✤ ఉడాసిటీ (రెండు కోర్సులు) ✤ ఎడెక్స్ లర్నింగ్ (రెండు కోర్సులు) ✤ కార్నెజి మెల్లన్ యూనివర్సిటీ ✤ క్యాగ్‌ల్ ✤ కొల్లబెర టాక్ట్ ✤ జిగ్‌సా అకాడమీ ✤ ఎడ్వన్సర్ ఎడ్యువెంచర్స్ (edvancer eduventures) ✤ ఐవీ ప్రొఫెషనల్ స్కూల్ ✤ సింప్లీలర్న్ ✤ మైక్రోసాఫ్ట్ ఎంసీఎస్‌ఏ

'వి స్కిల్స్' అనే ప్రభుత్వ సంస్థ ఆన్‌లైన్ సర్టిఫికేషన్ ఇస్తుంది.

పెరుగుతున్న ఉద్యోగాలు

★ ప్రముఖ అంతర్జాతీయ సంస్థ ఫోర్బ్స్ అంచనాల ప్రకారం మెషిన్ లర్నింగ్ రంగంలో పేటెంట్ల సంఖ్య 2018లో దాదాపు 34% పెరిగింది.

★ మరో అంతర్జాతీయ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ అంచనాల ప్రకారం 2021 నాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో పెట్టుబడులు 57 బిలియన్ డాలర్ల పైగానే ఉంటుంది.

★ అంతర్జాతీయ సంస్థ డెలాయిట్ అంచనాల ప్రకారం ఈ రంగంలో ప్రాజెక్టులు 2020 నాటికి నాలుగు రెట్లు పెరుగుతాయి.

★ కెల్లిఓసీజీ ఇండియా అంచనాల ప్రకారం మనదేశంలో 2018 నాటికి మెషిన్ లర్నింగ్‌లో ఉద్యోగావకాశాలు 60% వరకు పెరిగే అవకాశాలున్నాయి.

మొదట రూ. రెండు నుంచి రూ. నాలుగు లక్షల వరకు వార్షిక ఆదాయం లభిస్తుంది. తర్వాత అనుభవం, నైపుణ్యాలను బట్టి పారితోషికం క్రమంగా పెరుగుతుంది.

ఉత్తమ విద్య.. ఉన్నత బోధన!

కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు ప్రకటన విడుదల



ప్రతిభావంతులైన బోధనా సిబ్బంది, పరిపూర్ణ సౌకర్యాలు, పారదర్శక ఎంపిక.. ఇవీ కేంద్రీయ విద్యాలయాల ప్రత్యేకతలు. ఒకటో తరగతిలో ప్రవేశం దొరికితే ప్లస్‌టూ వరకు ప్రశాంతంగా ఉండవచ్చు. లక్షల రూపాయల ఖర్చు లేదు. నాణ్యమైన విద్యకు కొదవ లేదు. ప్రస్తుతం కేవీల్లో అడ్మిషన్లకు ప్రకటన వెలువడింది.

కేంద్రీయ విద్యాలయాలకు ఉన్న డిమాండ్ దృష్ట్యా ప్రవేశం అంత సులువుగా లభించదు. కానీ అడ్మిషన్ల కోసం ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది కాబట్టి ఒకటో తరగతిలో ప్రవేశానికి తల్లిదండ్రులు ప్రయత్నం చేయవచ్చు. మిగిలిన తరగతుల్లో ప్రవేశాలు మాత్రం ఖాళీ సీట్లు ఉంటేనే లభిస్తాయి.

ప్రవేశ విధానం

ఒకటో తరగతిలో 40 సీట్లు ఉంటాయి. వీటిలో 25 శాతం లాటరీ విధానంలో భర్తీ చేస్తారు. సంబంధిత కేంద్రీయ విద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న అందరినీ లాటరీలోకి తీసుకుంటారు. 15 శాతం అంటే 6 సీట్లు ఎస్సీలకు, 7.5 శాతం అంటే 3 ఎస్టీలకు కేటాయించారు. రెండు సీట్లు సింగిల్ గర్ల్ చైల్డ్ (ఒకే కుమార్తె కలిగి ఉన్న తల్లిదండ్రులు)కు లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. దివ్యాంగులకు 3శాతం సీట్లు ఉంటాయి. రెండో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు అనుగుణంగా ప్రవేశాలు కల్పిస్తారు. వీటికి కూడా లాటరీ విధానాన్నే అనుసరిస్తారు. 9, 11 తరగతుల్లో ప్రవేశానికి పరీక్షలు నిర్వహిస్తారు.

వీరికి ప్రాధాన్యం

సీట్ల కేటాయింపులో డిఫెన్స్, పారామిలటరీలో పనిచేస్తున్న పిల్లలకు మొదటి ప్రాధాన్యం లభిస్తుంది. అలాగే కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల పిల్లలకు ద్వితీయ ప్రాధాన్యం లభిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పబ్లిక్ సెక్టార్ కంపెనీలు, స్వయంప్రతిపత్తి సంస్థలు...మొదలైన చోట్ల పనిచేసే ఉద్యోగుల పిల్లలకూ ఆ తర్వాతి ప్రాధాన్యం లభిస్తుంది. ప్రతి ఎంపీ (లోక్‌సభ) తన పరిధిలోని కేంద్రీయ విద్యాలయానికి ఏడాదికి పది మందిని సిఫార్సు చేయవచ్చు. రాజ్యసభ సభ్యులైతే వారు ప్రాతినిధ్యం వహిస్తోన్న రాష్ట్రం పరిధిలో ఉన్న కేవీలకు సిఫార్సు చేయవచ్చు. ఇలా ఎంపీలు ఎంపిక చేసిన విద్యార్థుల వివరాలను కేవీ కేంద్ర కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి ఆయా కేవీలకు అనుమతి పత్రాలు వస్తే సీట్లను కేటాయిస్తారు. అలాగే కేంద్ర మానవ వనరుల శాఖ, ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉన్నతోద్యోగులు, రిసెర్చ్ అండ్ ఎనాలసిస్ వింగ్...తదితర విభాగాలవారీ సీట్ల కోటా ఉంటుంది.

ముఖ్యమైన తేదీలు

ఒకటో తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 19 (సాయంత్రం 4 గంటలు)

రెండు, ఆపైన తరగతుల్లో ప్రవేశానికి ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 9 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్లస్ వన్‌లో ప్రవేశానికి పదో తరగతి బోర్డు ఫలితాలు వెలువడిన పది రోజుల తర్వాత నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు.

వెబ్‌సైట్: http://kvsangathan.nic.in

దరఖాస్తు విధానం

ఒకటో తరగతిలో ప్రవేశానికి విద్యార్థి వయసు మార్చి 31, 2018 నాటికి అయిదేళ్లు పూర్తికావాలి (ఏప్రిల్ 1 నాటికి పూర్తయినా పరిగణనలోకి తీసుకుంటారు) అలాగే ఏడేళ్లకు మించకూడదు. దరఖాస్తు చేసుకోవడానికి ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత లాగిన్ అయి వివరాలు అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తు చేసుకునేటప్పుడే చేరాలనుకుంటున్న మూడు కేవీలను ప్రాధాన్య క్రమంలో నమోదు చేయాలి. ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు చేసుకుంటే చివరి దరఖాస్తునే పరిగణనలోకి తీసుకుంటారు.

ఫీజు వివరాలు

విద్యా హక్కు చట్టం ద్వారా ప్రవేశాలు పొందినవారు ప్లస్ టూ వరకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పనిలేదు. వీరికి పాఠ్యపుస్తకాలు, నోట్సులు, యూనిఫారం, పాఠశాలకు రావడానికి ప్రయాణ ఖర్చులు సైతం చెల్లిస్తారు. బాలికలు ఎలాంటి ట్యూషన్ ఫీజు చెల్లించనవసరం లేదు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాల్లోని ఇద్దరు పిల్లల వరకు ఫీజు మినహాయింపు ఉంది. ఎస్సీ, ఎస్టీ బాలబాలికలకు ఫీజు లేదు. 9, 10 తరగతులకు బాలురు నెలకు రూ.200 ఫీజు కట్టాలి. 11, 12 తరగతులకు కామర్స్, హ్యుమానిటీస్ కోర్సులైతే రూ.300, సైన్స్ కోర్సులకు రూ.400 చెల్లించాలి. కంప్యూటర్ తరగతులు ఉంటే అన్ని విభాగాల విద్యార్థులూ నెలకు రూ.వంద చొప్పున చెల్లించాలి. విద్యాలయ వికాస నిధి కోసం రూ.500 చొప్పున అందరూ చెల్లించాలి. సైనికోద్యోగులు, మాజీ సైనికోద్యోగుల పిల్లలకు ఫీజు మినహాయింపు లభిస్తుంది.

ప్రభుత్వ ఉద్యోగాలు

నాబార్డ్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

సంస్థ: నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్), ముంబయి.
పోస్టు-ఖాళీలు: అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్-ఎ (రూరల్ డెవలప్‌మెంట్ బ్యాంకింగ్ సర్వీస్)- 92.
అర్హత, వయసు, ఎంపిక: సంస్థ నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆన్‌లైన్.
ఆన్‌లైన్ దరఖాస్తు: 13.03.2018 నుంచి 02.04.2018 వరకు.
వెబ్‌సైట్: www.nabard.org

ఎన్‌సీఆర్ ప్లానింగ్ బోర్డులో కన్సల్టెంట్లు

సంస్థ: నేషనల్ కేపిటల్ రీజియన్ ప్లానింగ్ బోర్డు, న్యూదిల్లీ.
పోస్టు-ఖాళీలు: ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ (ప్లానింగ్)- 10. **అర్హత:** ప్లానింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ లేదా పీజీ, పని అనుభవం ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు: ఆఫ్‌లైన్. **చివరి తేదీ:** 31.03.2018. **వెబ్‌సైట్:** ncrpb.nic.in

ప్రవేశాలు

టీఎస్ ఎల్పీసెట్-2018

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఐఏఎస్ఈ/ సీటీఈ/ ప్రైవేట్ పండిట్ ఇన్‌స్టిట్యూషన్లలో భాషా పండిట్ శిక్షణ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి పరీక్ష.
కోర్సులు: తెలుగు పండిట్ శిక్షణ, హిందీ పండిట్ శిక్షణ, ఉర్దూ పండిట్ శిక్షణ.
అర్హతలు: సంబంధిత సబ్జెక్టుల్లో బీఏ లేదా ఎంఏ.
ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తు: 28.03.2018 నుంచి 19.04.2018 వరకు.
వెబ్‌సైట్: lpcet.cdse.telangana.gov.in

నోటీస్ బోర్డు

నన్నయ సెట్-2018

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీ, అనుబంధ కళాశాలల్లో పీజీ ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. **కోర్సులు:** ఎంఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎంఈడీ, ఎంపీఈడీ. **అర్హత:** బ్యాచిలర్స్ డిగ్రీ. **చివరి తేదీ:** 14.04.2018.
పరీక్షల ప్రారంభ తేదీ: 07.05.2018.
వెబ్‌సైట్: www.aknudoa.in

డీఐఏటీలో పీజీ ప్రోగ్రాం

పుణెలోని డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీలో పీజీ ప్రవేశాలు. **కోర్సులు:** ఎంటెక్, ఎంఎస్సీ, పీజీ డిప్లొమా, ఎంఎస్.
అర్హతలు: బీఈ/ బీటెక్, ఎంఎస్సీ ఉత్తీర్ణత.
ఎంపిక: గేట్ స్కోర్ ఆధారంగా.
చివరి తేదీ: 13.04.2018. **వెబ్‌సైట్:** www.diat.ac.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

దేశంలోనే సంపన్న ఎంపీగా జయాబచ్చన్

రూ. వెయ్యి కోట్ల ఆస్తులు వెల్లడి



దిల్లీ: దేశంలోనే సంపన్న ఎంపీగా జయాబచ్చన్ నిలవనున్నారు. ప్రముఖ నటి, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఆమె యూపీ నుంచి రాజ్యసభకు పోటీచేస్తున్న సందర్భంగా తాజాగా ప్రమాణపత్రంలో రూ. వెయ్యి కోట్ల ఆస్తులున్నట్లు ప్రకటించారు. ఇంతవరకు అత్యంత సంపన్న ఎంపీగా భాజపాకు చెందిన రవీంద్ర కిశోర్ సిన్హా గుర్తింపు పొందారు. 2014లో ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యే నాటికి తన ఆస్తుల విలువ రూ. 800 కోట్లుగా వెల్లడించారు. కాగా 2012లో రూ. 493 కోట్ల ఆస్తులున్నట్లు ప్రకటించిన జయ తాజాగా తనకు, తన భర్త అమితాబ్ బచ్చన్‌కు కలిపి రూ. 460 కోట్ల స్థిరాస్తులు, రూ. 540 కోట్ల చరాస్తులు ఉన్నట్లు వెల్లడించారు.

రుణ మాఫీకి సుముఖంగా లేం

లోక్‌సభలో కేంద్రం స్పష్టీకరణ

దిల్లీ: రైతుల పంట రుణాల మాఫీకి సుముఖంగా లేమని పార్లమెంటుకు కేంద్రం మంగళవారం తెలియజేసింది. రుణాల అందజేత, తిరిగి చెల్లింపుపై రుణమాఫీ ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించింది. ఈ అంశంపై లోక్‌సభలో వ్యవసాయ శాఖ సహాయ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వకంగా స్పందించారు. రైతులపై రుణ భారాన్ని తగ్గించేందుకు, సంస్థాగత రుణాలు అందుబాటులో ఉంచేందుకు పలు చర్యలు తీసుకున్నామని తెలిపారు. రైతులపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రభావంపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందించారు. "రైతులు తమ ఉత్పత్తులను విక్రయించే సమయంలో జీఎస్టీతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు దాఖలాలు ఎక్కడా లేవు"అని వివరించారు. మరోవైపు ఆమోదించలేని బీటీ పత్తి విత్తనాల విక్రయాలపై దర్యాప్తు కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రల్లో కొందరు ఇలాంటి విక్రయాలు జరిపినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.

ఐఎస్‌తో సంబంధమున్న నలుగురిపై ఎన్ఐఏ అభియోగపత్రం

దిల్లీ: ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రసంస్థతో సంబంధాలున్న నలుగురు వ్యక్తులపై జాతీయ విచారణ సంస్థ (ఎన్ఐఏ) అభియోగపత్రం దాఖలు చేసింది. హజా ఫక్రుద్దీన్, బాషా మొయినుద్దీన్, షకుల్ హమీద్, అన్వర్ మీరలేలు ఐఎస్ కోసం తమిళనాడు, తెలంగాణల్లో శిక్షణ శిబిరాలు నడిపారు. ఐఎస్‌లో చేరేందుకు కొందరిని సిరియాకు పంపించారని పేర్కొంది. గతేడాది జనవరిలో ఎన్ఐఏ ఈ కేసు నమోదు చేసింది. ఐఎస్ కోసం నిధులు సేకరించేందుకు, సభ్యులను చేర్పించేందుకు దేశంలోని పలుచోట్లకు ప్రధాన నిందితుడు ఫక్రుద్దీన్ తిరిగినట్లు ఎన్ఐఏ చెబుతోంది. 2014 జనవరిలో కుటుంబంతో సహా ఐఎస్‌లో అతడు చేరాడని.. 2016లో ఐఎస్ విడుదల చేసిన ఓ ప్రచార వీడియోలోనూ అతడు కనిపించాడని పేర్కొంది. మిగతా ముగ్గురు నిందితులు అతడికి ఉద్దేశపూర్వకంగానే సహకరించారని తెలిపింది.

హరియాణాలో లెక్చరర్‌ను కాల్చి చంపిన విద్యార్థి

సోనిపట్: హరియాణాలోని సోనిపట్ జిల్లాలో ఉన్న షాహిద్ దల్బీర్ సింగ్ కళాశాలలో రాజేష్‌మాలిక్ అనే లెక్చరర్‌ను ఓ విద్యార్థి మంగళవారం దారుణంగా కాల్చి చంపేశాడు. బీఏ రెండో సంవత్సరం చదువుతున్న జగ్మల్ అనే విద్యార్థి ఈ దుశ్చర్యకు పాల్పడిన అనంతరం పారిపోయాడు. 35-40 ఏళ్ల మధ్య వయస్సులోని రాజేష్ ఈ కళాశాలలో తాత్కాలిక అధ్యాపకుడిగా పనిచేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. జగ్మల్ తనను వేధిస్తున్నాడంటూ ఓ విద్యార్థిని చేసిన ఫిర్యాదుతో లెక్చరర్ రాజేష్ తీవ్రంగా మందలించడంతో కోపంతో అతడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మంగళవారం రాజేష్ మాలిక్ కళాశాలలోకి ప్రవేశించేటప్పటికే అక్కడ ఉన్న జగ్మల్ తన రివాల్వర్ తీసుకుని మూడు నాలుగు సార్లు సమీపం నుంచి కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన లెక్చరర్ మరణించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ల్యాండింగ్ విషయంలో గందరగోళం

నేపాల్‌లో విమాన ప్రమాదానికి కారణమదే!

ఏ రన్‌వేపై దిగాలో తేల్చుకోలేకపోయిన పైలట్

కాఠ్‌మాండూ: విమానం దిగాల్సిన రన్‌వేకు సంబంధించి తలెత్తిన గందరగోళమే నేపాల్‌లో సోమవారం చోటుచేసుకున్న ఘోర ప్రమాదానికి కారణం కావొచ్చని తెలుస్తోంది. బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నుంచి 67 మంది ప్రయాణికులతో కాఠ్‌మాండూ చేరుకున్న యూఎస్-బంగ్లా ఎయిర్‌లైన్స్ విమానం త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో 49 మంది మృత్యువాతపడ్డారు. విమానాన్ని రన్‌వే-2(దక్షిణం వైపు)పై దించాలా? లేక రన్‌వే-20(ఉత్తరం వైపు)పై ల్యాండ్ చేయాలా? అనే విషయంలో పైలట్ గందరగోళంలో పడినట్లు ప్రమాదానికి ముందు నాలుగు నిమిషాలపాటు పైలట్, విమానాశ్రయంలోని గగనతల ట్రాఫిక్ నియంత్రణ(ఏటీసీ) అధికారుల మధ్య చోటుచేసుకున్న సంభాషణలను బట్టి తెలుస్తోందని నేపాలీ పత్రిక ఒకటి తెలిపింది.

ఇంజిన్ లోపాలతో 65 విమాన సర్వీసుల రద్దు

వందల మంది ప్రయాణికులకు ఇబ్బందులు

ముంబయి: లోపభూయిష్ఠ ఇంజిన్ల కారణంగా ఏ320 నియో శ్రేణికి చెందిన 11 విమానాలను పౌర విమానయాన విభాగ డైరెక్టర్ జనరల్ (డీజీసీఏ) నిలిపివేయడంతో ఇండిగో, గోఎయిర్ విమానయాన సంస్థలు 65 సర్వీసులను రద్దు చేశాయి. దీంతో వందలమంది ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఇండిగో సంస్థ 47 సర్వీసులను, గోఎయిర్ సంస్థ 18 సర్వీసులను రద్దు చేశాయి. హైదరాబాద్, దిల్లీ, ముంబయి, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు తదితర నగరాల నుంచి ఈ విమాన సర్వీసులు బయలుదేరాల్సి ఉంది. అదనంగా ఎలాంటి చెల్లింపులు లేకుండా తమ సంస్థకు చెందిన ఇతర విమాన సర్వీసులను ఎంపిక చేసుకోవడం కానీ పూర్తి సొమ్మును వాపస్ పొందడం కానీ చేయవచ్చని ప్రయాణికులకు సూచించినట్లు ఇండిగో తెలిపింది. సోమవారం అహ్మదాబాద్ నుంచి లఖ్‌నవూకు బయలుదేరిన ఇండిగో విమానానికి మార్గమధ్యంలో ఇంజిన్ వైఫల్యం తలెత్తింది. దీంతో 40 నిమిషాల తర్వాత అది అహ్మదాబాద్‌కు తిరిగొచ్చింది. ఈ నేపథ్యంలో ప్రాట్ అండ్ విట్నీ సంస్థకు చెందిన పీడబ్ల్యూ1100 ఇంజిన్లు కలిగిన ఎ320నియో విమానాల గగనవిహారాలను ఆపేయాలని డీజీసీఏ ఆదేశించింది. ఇదే తరహా ఇంజిన్ సమస్యలతో మూడు విమానాలను గత నెల నుంచి నిలిపివేశారు.

భద్రతా కారణాల వల్లే: మంత్రి

ప్రయాణికుల భద్రతను దృష్టిలోపెట్టుకొని మాత్రమే ఏ320నియో విమానాలను నిలిపివేశామని పౌర విమానయాన శాఖ బాధ్యతలను అదనంగా చూస్తున్న కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు చెప్పారు. సాధ్యమైనంత త్వరగా వాటి సేవలను విమానయాన సంస్థలు పునరుద్ధరిస్తాయని ఆశాభావం వ్యక్తచేశారు.



కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఆరాధనోత్సవం కాంచీపురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు శంకర మఠానికి కేంద్ర మాజీ మంత్రి మురళీమనోహర్ జోషి, రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వీరు ప్రస్తుత పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో చర్చించారు. **– న్యూస్‌టుడే, కాంచీపురం**

క్షయకు చరమగీతం

- 2025కల్లా "క్షయ రహిత భారత్"
- బృహత్తర కార్యక్రమానికి మోదీ శ్రీకారం
- వ్యాధిపై పోరాట వ్యూహాలు మార్చేందుకు సమయం ఆసన్నమైందని వ్యాఖ్యలు
- కలిసి పనిచేద్దామని ముఖ్యమంత్రులకు లేఖలు

దిల్లీ: మహమ్మారి క్షయకు కళ్లెం వేయడమే లక్ష్యంగా బృహత్తర కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారు. 2025నాటికి ఈ వ్యాధిని నిర్మూలించాలని దీనిలో ఆయన లక్ష్యం నిర్దేశించారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో విధించిన గడువు(2030) కంటే ఐదేళ్లు ఇది ముందే ఉండటం విశేషం. "క్షయకు చరమగీతం" పేరిట మంగళవారమిక్కడ నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో), స్టాప్ టీబీ పార్ట్‌నర్‌షిప్‌లతో కలిసి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ దీన్ని ఏర్పాటుచేసింది. "క్షయ రహిత భారత్-2025" కార్యక్రమాన్ని దీనిలో మోదీ ఆవిష్కరించారు. 'క్షయను అత్యంత ప్రమాదకర వ్యాధిగా 25ఏళ్ల క్రితమే ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించింది. అప్పటి నుంచీ దీన్ని నిర్మూలించేందుకు కృషి జరుగుతోంది. అయితే ఇప్పటివరకూ కచ్చితమైన ఫలితాలు కనిపించడం లేదు. పది నుంచి 20 ఏళ్లు గడుస్తున్నా పురోగతి లేకపోతే... మనం అనుసరిస్తున్న విధానాలు మార్చుకోవాలి. మనం ఇప్పటివరకూ చేసిన కృషినీ విశ్లేషించాలి. ఆ సమయం ఇప్పుడు వచ్చింది'అని మోదీ చెప్పారు.

ఏ అవకాశాన్నీ వదిలిపెట్టబోం

క్షయ రోగులందరికీ చికిత్స అందించే ఏ అవకాశాన్నీ వదిలిపెట్టబోమని మోదీ తెలిపారు. అంతేకాదు ఈ కార్యక్రమంలో ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్నీ ఆయన ఆహ్వానించారు. 'రోగులను క్షయ కుంగదీస్తుంది. కొందరు వ్యాధి గురించి ఇతరులకు చెప్పుకొనేందుకు ఎంతో మథనపడుతుంటారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పడం చాలా కీలకం. వ్యాధిని జయించేందుకు ఇది తప్పనిసరి' అని ఆయన వివరించారు. 'ప్రజల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ, దేశ భవిష్యత్తులను క్షయ ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా పేద రోగుల కుటుంబాలను ఇది దుర్భరంగా మారుస్తోంది. దీన్ని నిర్మూలించేందుకు తీసుకునే ప్రతి చర్యా నేరుగా ప్రజల జీవితాలతో ముడిపడివుంటుంది'అని ఆయన పేర్కొన్నారు.

టీమ్ ఇండియా"లా పనిచేద్దాం

'ఈ మహాక్రతువులో రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఎనలేనిది. మాతో చేతులు కలపాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇప్పటికే లేఖలు రాశాను. మనమంతా కలిసి టీమ్ ఇండియాలా పనిచేద్దాం'అని ఆయన వివరించారు. "క్షయ రహిత గ్రామం, పంచాయతీ, జిల్లా, రాష్ట్రం" కల సాకారం చేసుకునేందుకు భిన్న శాఖలు, రంగాలు, వర్గాలు ఇలా అందరూ కలిసి కృషిచేయాలనీ పిలుపునిచ్చారు. క్షయ నిపుణులు, ఆరోగ్య సేవల కార్మికులు అందించాల్సిన కృషిని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. 'క్షయకు కళ్లెం వేసేందుకు రూపొందించిన జాతీయ ప్రణాళిక క్రియాశీలంగా పనిచేస్తోంది. దీని పరిధిలోని పథకాలకు కేంద్రం నిధుల కేటాయింపులను ఏటా పెంచుతూ వస్తోంది. క్షయ బాధితులకు పోషకాహారం అందేలా చూసేందుకు ఏటా 648.69 కోట్లు (100 మిలియన్ల డాలర్లు) ఖర్చుచేయాలని ఓ నిబంధననూ తీసుకొచ్చాం'అని ఆయన వివరించారు.



మంగళవారం దిల్లీలో క్షయ రహిత భారత్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా

స్వచ్ఛ భారత్ నుంచి.. ఉజ్వల వరకూ

స్వచ్ఛ భారత్ అభియాన్, పొగరహిత వంట గది కోసం ఉజ్వల యోజన కింద ఎల్‌పీజీ కనెక్షన్లు లాంటి చర్యలూ క్షయ వ్యాప్తి ముప్పును తగ్గిస్తాయని ఆయన చెప్పారు. శక్తిమంతమైన కొత్త ఔషధాలు, మెరుగ్గా వ్యాధుల నిర్ధారణ కోసం అధునాతన సాంకేతికతలు, ఆవిష్కరణలపైనే భారం వేస్తున్నామన్నారు. దీని కోసం భారత క్షయ పరిశోధన విభాగాన్నీ నెలకొల్పామని పేర్కొన్నారు. మరోవైపు సంప్రదాయ వైద్య విధానాలకూ పదును పెట్టేందుకు పరిశోధనలు జరిగేలా చూడాలని ఆరోగ్యం, కుటుంబ సంరక్షణ మంత్రిత్వ శాఖలను ఆయన కోరారు.

ఇదివరకటి ప్రభుత్వాలకు చురకలు

మరోవైపు ఇదివరకటి ప్రభుత్వాలకు మోదీ చురకలు వేశారు. 'గత 30 నుంచి 35 ఏళ్లుగా టీకా కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. అయితే 2014నాటికి అందరికీ టీకాలు వేయించాలనే లక్ష్యం మాత్రం నెరవేరలేదు. ఇదివరకటి స్థాయిలో నామమాత్రంగా టీకాల వృద్ధిలో పెరుగుదల కనిపిస్తే.. క్షయకు కళ్లెం వేసేందుకు మరో 40 ఏళ్లు పడుతుంది. అయితే గత మూడున్నరేళ్లలో గణనీయమైన పురోగతి కనిపించింది'అని ఆయన వ్యాఖ్యానించారు.



నేపాల్ అధ్యక్షురాలిగా మళ్లీ బిద్యాదేవి భండారి ఘనవిజయం!

కాఠ్‌మాండూ: నేపాల్ అధ్యక్షురాలిగా బిద్యాదేవి భండారి(56) మంగళవారం తిరిగి భారీ మెజారిటీతో ఎన్నికయ్యారు. అధ్యక్ష ఎన్నికలో ఆమె తన సమీప నేపాలీ కాంగ్రెస్ నాయకురాలు కుమారి లక్ష్మీ రాయ్‌పై విజయాన్ని సాధించారు. నేపాల్ తొలి మహిళా అధ్యక్షురాలిగా ప్రత్యేకంగా నిలిచిన ఆమె మరోమారు అదే పదవిలో కొనసాగనున్నారు. అధికార వామపక్ష కూటమి భాగస్వాములతో పాటూ.... ఇతర పలు పార్టీలు బిద్యాదేవి అభ్యర్థిత్వానికి మొదటి నుంచీ మద్దతు తెలిపాయి.

విదేశీ న్యాయవాద సంస్థలు దేశంలో వ్యాజ్యాలు చేపట్టరాదు

- శాశ్వత కార్యాలయాలకూ అనుమతి నిరాకరణ
- విదేశీ చట్టాలపై న్యాయ సలహాలు మాత్రమే ఇవ్వొచ్చు
- సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ

దిల్లీ: దేశంలోని న్యాయస్థానాల్లో విదేశీ న్యాయవాద సంస్థలు కేసులు వాదించటానికి వీల్లేదని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ విషయంలో బాంబే, ముంబయి హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సమర్థించింది. అయితే, ఆ తీర్పుల్లోని అంశాలకు స్వల్ప మార్పులు చేసింది. విదేశీ చట్టాల విషయంలో తన కక్షిదారుల(క్లయింట్ల)కు విదేశీ న్యాయవాద సంస్థలు సలహాలను మాత్రం ఇవ్వొచ్చని స్పష్టం చేసింది. జస్టిస్ అరుణ్ మిశ్ర, జస్టిస్ ఉదయ్ ఉమేశ్ లలిత్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు తీర్పునిచ్చింది. విదేశీ న్యాయవాదసంస్థలు మనదేశంలో శాశ్వత కార్యాలయాలను ఏర్పాటు చేసుకోరాదని పేర్కొంది. అయితే, విదేశీ చట్టాల్లో న్యాయ సలహాలను ఇచ్చేందుకు ఆ సంస్థల న్యాయవాదులు ఇక్కడికి వచ్చి వెళ్లవచ్చని తెలిపింది. అంతర్జాతీయ వాణిజ్య మధ్యవర్తిత్వం(ఐసీఏ)లో విదేశీ న్యాయవాదులు పాల్గొనవచ్చని తెలిపింది. న్యాయ సేవలందించే బీపీఓ కంపెనీలు మన దేశంలో తమ కార్యకలాపాలను నిర్వహించుకోవచ్చు. న్యాయవాదుల చట్టం పరిధిలోకి అవిరానందున ఈ మినహాయింపు వాటికి ఉంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ..గత ఏడాది జనవరి 3వ తేదీన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ దేశంలోని ప్రత్యేక ఆర్థిక మండళ్ల(సెజ్)లో విదేశీ న్యాయవాద సంస్థలు తమ కార్యాలయాలను స్థాపించుకోవటానికి వీలుగా నిబంధనను సవరించింది. ఈ సవరణకు ముందు దేశంలో బహుళజాతి న్యాయవాద సంస్థలు కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు అనుమతి లేదు. అలాగే భారతీయ న్యాయ సంస్థలు కూడా సెజ్‌ల నుంచి కార్యకలాపాలు నిర్వహించుకోవటానికి వీల్లేదు.

రాఫెల్ ఒప్పందంపై దర్యాప్తు జరిపించండి

రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి ఫ్రాన్స్‌తో కేంద్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ విమానాల కొనుగోలు ధరను పార్లమెంటుకు వెల్లడించేలా ఆదేశించాలనీ కాంగ్రెస్ నాయకుడు తెహసీన్ ఎస్ పూనావాలా న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం దాఖలైన ఈ పిటిషన్ ఈ వారంలోనే విచారణకు వచ్చే అవకాశం ఉంది. ఒప్పంద విలువను పార్లమెంటుకు, దేశ ప్రజలకు వెల్లడించాల్సిన బాధ్యత రక్షణ మంత్రిత్వ శాఖపై ఉందని పిటిషనర్ పేర్కొన్నారు.

రైల్వే జోన్‌పై హైకోర్టు నోటీసులు

కౌంటర్లు దాఖలు చేయాలని రైల్వే, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లో 'రైల్వే జోన్' ఏర్పాటుకు సంబంధించి రైల్వేతోపాటు, రాష్ట్ర ప్రభుత్వానికి ఉమ్మడి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా గుంతకల్లులో రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న చర్యలపై పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఇప్పటికే ఇదే అంశంపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంతో దీన్ని జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో అదీ గుంతకల్లులో రైల్వే జోన్ ఏర్పాటుకు ఆదేశించాలంటూ అనంతపురం జిల్లాకు చెందిన కె.శ్రీనివాసచౌదరి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ ప్రతివాదులైన రైల్వేతోపాటు ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తూ 4 వారాలకు విచారణను వాయిదా వేసింది.

ఏపీకి పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇవ్వాలి

- తాజా అంచనాల ప్రకారం పోలవరం ఖర్చును కేంద్రమే భరించాలి
- మూడునెలల్లో విశాఖ రైల్వేజోన్‌ను ప్రకటించాలి
- ఏడాదిలోగా విశాఖపట్నం మెట్రోరైల్ ప్రారంభించాలి
- విజయవాడ-మంగళగిరి-గుంటూరు మధ్య కూడా..
- ఆర్థిక బిల్లుకు సవరణల్లో గల్లా జయదేవ్ ప్రతిపాదన

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలో కొత్తగా సెక్షన్ 46(4) చేర్చి ఈశాన్య, హిమాలయ రాష్ట్రాల తరహాలో ఆంధ్రప్రదేశ్‌కు పదేళ్లపాటు ప్రత్యేకహోదా ఇవ్వాలని గుంటూరు తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ డిమాండ్ చేశారు. అలాగే ఏపీలో వెనుకబడిన జిల్లాలకు తలసరి ఆదాయం ప్రాతిపదికన కేబీకే, బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలుచేయాలన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2018 ఆర్థిక బిల్లుకు గుంటూరు తెదేపా ఎంపీ గల్లా జయదేవ్ పలు సవరణలు ప్రతిపాదించారు. ఆర్థిక బిల్లులో కొత్తగా 21వ భాగం చేర్చి అందులో ఆంధ్రప్రదేశ విభజన చట్టానికి సవరణలు చేయాలని కోరుతూ లోక్‌సభ సెక్రెటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు నోటీసు ఇచ్చారు.

జయదేవ్ ప్రతిపాదించిన సవరణలు..

- సెక్షన్ 90 కింద కొత్తగా 5వ ఉపసెక్షన్ చేర్చి... పోలవరం ప్రాజెక్టు ఖర్చును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించిన తాజా అంచనాల ప్రకారం కేంద్రమే భరించేలా నిబంధన విధించాలి.
- 13వ షెడ్యూల్‌లో చెప్పిన విద్యాసంస్థలన్నీ 2019-20 ఆర్థిక సంవత్సరంలోపు ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పిస్తూ సవరణ చేయాలి.
- కడప ఉక్కు కర్మాగారం, పెట్రోలియం కాంప్లెక్స్, దిల్లీ-ముంబయి పారిశ్రామిక కారిడార్ తరహాలో విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను ఆరునెలల్లోగా ఏర్పాటు చేసేట్లుగా 13వ షెడ్యూల్‌కు సవరణలు.
- మూడునెలల్లోపు విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్, ఆరునెలల్లోపు అమరావతి-హైదరాబాద్ మధ్య వేగవంతమైన రైలు, రోడ్డు అనుసంధానం, సంవత్సరంలోపు విశాఖపట్నం, విజయవాడ-మంగళగిరి-గుంటూరుల మధ్య మెట్రోరైల్ ప్రారంభించాలి.
- ఆంధ్రప్రదేశ్ కొత్తరాజధానిలో మౌలికవసతుల కల్పన, పరిపాలన నగరం నిర్మాణం కోసం ఏటా రూ.10వేల కోట్లచొప్పున అయిదేళ్లపాటు ఆర్థికసాయం చేసేలా విభజన చట్టంలో సెక్షన్ 94(3) చేర్చాలి.
- ఆర్థిక బిల్లులోని 15వ విభాగంలో 210వ క్లాజ్‌లో కొత్తగా సెక్షన్4(1)(ఏఏ) చేర్చి ఆంధ్రప్రదేశ్ ఎఫ్ఆర్‌బీఎం పరిధిని 5%కి పెంచుతున్నట్లు చేర్చాలి.
- అంతకుముందు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 377వ నిబంధన కింద డిమాండ్ చేశారు. తన డిమాండ్లను లిఖితపూర్వకంగా సభముందుంచారు.

ఆందోళనలో పాల్గొన్న జయదేవ్ చిన్నకుమారుడు

గల్లాజయదేవ్ చిన్నకుమారుడు సిద్ధార్థ్ ప్రత్యేకహోదా కోసం పార్లమెంటు ఆవరణలో ఎంపీలు చేస్తున్న ఆందోళనల్లో పాల్గొన్నారు. మెడలో తెదేపా కండువా వేసుకొని, ప్లకార్డులు పట్టుకొని ఎంపీలతోపాటు నినాదాలు చేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వాలి... విశాఖకు రైల్వేజోన్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

బలపరీక్షలో నెగ్గిన రియో ప్రభుత్వం

నాగాలాండ్ అసెంబ్లీలో సాఫీగా విశ్వాస తీర్మానం

కోహిమా: ముఖ్యమంత్రి నెయిఫియు రియో నాయకత్వంలో కొలువుదీరిన నాగాలాండ్ కొత్త ప్రభుత్వం మంగళవారం శాసనసభలో నిర్వహించిన బలపరీక్షలో సునాయాసంగా గెలుపొందింది. మొత్తం 60 మంది సభ్యులున్న సభలో 33 మంది ప్రభుత్వానికి అనుకూలంగా, 26 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. స్పష్టమైన మెజార్టీ రావటంతో సభాపతి విఖో ఓ యోషు ఓటింగ్‌లో పాల్గొనాల్సిన అవసరం ఏర్పడలేదు. ప్రభుత్వ అనుకూల ఓటు వేసిన వారిలో 17 మంది ఎన్డీపీపీ సభ్యులు కాగా 12 మంది భాజపా, ఇద్దరు ఎన్పీపీ, ఒకరు జేడీ(యు), మరొకరు స్వతంత్ర ఎమ్మెల్యే. ఓటింగ్‌కు ముందు సభ కొలువుదీరగానే సభాపతిగా విఖో ఓ యోషు ఎన్నికయ్యారు.



మంగళవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద తెదేపా ఎంపీల నిరసన

ప్రజలపై దాడి మంచిది కాదు

- కేంద్రంలో కుడిచేయి ఏం చేస్తోందో ఎడమచేయికి తెలియడం లేదు
- తెలుగుదేశం ధ్వజం
- డిమాండ్లు సాధించేంతవరకూ పోరాడతామని స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా కేంద్రం ఆంధ్రప్రదేశ్ ప్రజలపై దాడి చేస్తోందని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఆరోపించింది. ఇది మంచి పద్ధతి కాదని పేర్కొంది. హామీల అమలు కోసం తెలుగుదేశం ఏడోరోజూ వరుసగా పార్లమెంటుబయట, లోపల ఆందోళన కొనసాగించింది. కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేశాక తొలిసారి ఆపార్టీ పార్లమెంటరీ పార్టీ నేత సుజనాచౌదరి మంగళవారం గాంధీ విగ్రహం ముందు ధర్నాలో పాల్గొన్నారు. ఆయనతోపాటు కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, లోక్‌సభనేత తోట నరసింహం, ఎంపీలు కొనకళ్ల నారాయణ, పి.రవీంద్రబాబు, అవంతి శ్రీనివాస్, మురళీమోహన్, గల్లా జయదేవ్, నిమ్మల కిష్టప్ప, మాగంటి బాబు, కె.రామ్మోహన్ నాయుడు, కేశినేని నాని, శ్రీరాంమాల్యాద్రి, రాజ్యసభ సభ్యులు సీఎం రమేష్, టీజీ వెంకటేష్, గరికపాటి మోహన్‌రావు, తోట సీతారామలక్ష్మిలు ప్లకార్డులుపట్టుకొని ఆంధ్రాకు న్యాయంచేయాలంటూ నినదించారు. సోమవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి వద్ద జరిగిన సమావేశంలో రైల్వే అధికారులు జోన్ సాధ్యం కాదంటూచేసిన వ్యాఖ్యలపై సుజనాచౌదరి మండిపడ్డారు.

పదినిమిషాలు కూడా సాగని సభ

లోక్‌సభ పట్టుమని పది నిమిషాలుకూడా సాగలేదు. రోజువారీలాగానే తెలుగుదేశం, తెరాస, వైకాపా, అన్నాడీఎంకె, టీఎంసీ, కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి ఆందోళనలు చేశారు. ప్రత్యేక హోదా, రిజర్వేషన్ల పెంపు, కావేరీ నదీ యాజమాన్యమండలి ఏర్పాటు, నీరవ్‌మోదీని భారత్‌కు రప్పించాలన్న నినాదాలతో ఆయా పార్టీల సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించారు. సభ్యుల నినాదాలు, అరుపులు కేకల మధ్య సభ కార్యకలాపాలు సాగించే అవకాశం లేకపోవడంతో స్పీకర్ సుమిత్రామహాజన్ తొలుత మధ్యాహ్నం 12 గంటలకు, తర్వాత బుధవారానికి సభను వాయిదావేశారు.

నిమిషాల్లో రాజ్యసభ వాయిదా

రాజ్యసభ నిమిషాల్లో వాయిదా పడింది. 11 గంటలకు సభావ్యవహారాల కాగితాలను మంత్రులు, సభ్యులు సభ ముందుంచాక ఛైర్మన్ వెంకయ్యనాయుడు సభ్యుల వ్యవహార శైలిపై ఆందోళన వ్యక్తం చేశారు. 'సభాధ్యక్షుడి అనుమతి లేకుండా మాట్లాడటం, కూర్చొని వ్యాఖ్యానాలు చేయడం సభా సంప్రదాయాలకు విరుద్ధం. అనవసర వ్యాఖ్యానం సభలో ఉద్రిక్తతకు దారితీసి పని చేయలేని పరిస్థితి కల్పిస్తుంది. సభ పున:ప్రారంభమై ఏడు రోజులైనా ఎలాంటి కార్యకలాపాలు సాగలేదు. ఇప్పటికైనా అన్ని పార్టీలూ కలిసి సభ ముందుకుసాగేలా సహకరించాలి. లేకపోతే ప్రజల ఓపిక నశిస్తుంది. ఇది రాజ్యసభను చీకటిలో ఉంచుతుంది. ప్రతిపక్షాలనుంచి వచ్చిన నోటీసులపై చర్చకు సిద్ధమని ప్రభుత్వం చెబుతోంది. అందువల్ల సభ్యుల ఆందోళనలకు కారణాలు అర్థం కావడం లేదు' అన్నారు. ఇంతలో అన్నాడీఎంకే సభ్యులు ప్లకార్డులతో వెల్‌లోకి అడుగుపెట్టిన వెంటనే వెంకయ్యనాయుడు సభను రెండు గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం అదే పరిస్థితి పునరావృతం కావడంతో ఉపాధ్యక్షుడు పీజే కురియన్ సభను బుధవారానికి వాయిదావేశారు.

విదేశాంగ మంత్రిపై వేటువేసిన ట్రంప్

- టిల్లర్‌సన్‌కు ఉద్వాసన
- ఆయన స్థానంలో సీఐఏ అధిపతి మైక్ పాంపియోకు పగ్గాలు
- నిఘా సంస్థ డైరెక్టర్‌గా తొలిసారి మహిళకు అవకాశం

వాషింగ్టన్: అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిల్లర్‌సన్‌పై ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వేటువేశారు. వీరిద్దరి మధ్య పలు మార్లు బహిరంగంగానే మాటల యుద్ధం నడిచిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. టిల్లర్‌సన్ స్థానంలో అమెరికా గూఢచర్య సంస్థ సీఐఏ డైరెక్టర్ మైక్ పాంపియోను ఎంపిక చేశారు. "సీఐఏ డైరెక్టర్ మైక్ పాంపియో కొత్త విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపడతారు" అని ట్రంప్.. ట్విటర్‌లో అనూహ్య ప్రకటన చేశారు. ఆ తర్వాత ఆయన మరో ప్రకటన విడుదలచేశారు. "కీలకమైన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పదవికి మైక్ సరైన వ్యక్తి. మన సంకీర్ణ భాగస్వామ్యాలను బలోపేతం చేయడం, ప్రత్యర్థులను ఎదుర్కోవడం, కొరియా ద్వీపకల్పంలో అణునిరాయుధీకరణవంటి కార్యక్రమాలను ఆయన కొనసాగిస్తారు"అని పేర్కొన్నారు. సైన్యం, కాంగ్రెస్, సీఐఏ నాయకుడిగా ఆయనకున్న అనుభవం బాగా కలిసొస్తుందని చెప్పారు. తాజా నియామకానికి అమెరికా సెనేట్ ఆమోదంతెలిపాలి. సీఐఏలో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న గినా హాస్పెల్‌ను ఆ సంస్థకు కొత్త అధిపతిగా ట్రంప్ ఎంపిక చేశారు. ఈ పదవిలో మహిళను నియమించడం ఇదే మొదటిసారి.

ఛార్జీలను పెంచి నష్టాలను పూడ్చండి

రైల్వేకు కాగ్ సూచన

దిల్లీ: రైల్వే ఆదాయం కుంటుపడుతోందని కాగ్ (కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్) ఆందోళన వ్యక్తం చేసింది. ఒక రూపాయి రాబట్టడానికి రైల్వేశాఖ చేస్తున్న ఖర్చు ఎక్కువగా ఉంటోందని పేర్కొంది. ప్రయాణ, సరకురవాణా ఛార్జీలను పెంచడం తదితర కఠిన నిర్ణయాలతో నష్టాలను కొంత వరకూ పూడ్చుకోవాలని సూచించింది. ట్రాక్‌ల నిర్వహణలో లోపాలనూ ఎండగట్టింది. తనిఖీలు సరిగా జరగట్లేదనీ, ట్రాక్‌ల్లో లోపాలను గుర్తించే యంత్రాలను సక్రమంగా వినియోగించట్లేదంది. ఈ నివేదికను మంగళవారం పార్లమెంటుకు సమర్పించింది. 2014-15, 2016-17 వరకు 16 రైలు ప్రమాదాలు, పట్టాలుతప్పిన ఘటనలు చోటుచేసుకున్నట్లు నివేదికలో వివరించింది. ప్రమాదావకాశాలు ఉండటంతో 294 చోట్ల వేగనియంత్రణపై శాశ్వత ఆంక్షలు విధించినట్లు పేర్కొంది. 37 రైల్వే ప్రాంతాల్లో అధ్యయనం చేపట్టి, ఈ నివేదికను కాగ్ రూపొందించింది.

రైల్వేలో ప్రైవేటీకరణ యోచన విరమించాలి :ఎన్ఎఫ్ఐఆర్

ఈనాడు, దిల్లీ: రైల్వేలో ప్రైవేటీకరణ యోచన విరమించాలని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్ (ఎన్ఎఫ్ఐఆర్) డిమాండుచేసింది. మంగళవారం దిల్లీలో ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రిరాఘవయ్య నేతృత్వంలో కార్యనిర్వాహక కమిటీ సమావేశమైంది. రైల్వేలో ప్రైవేటీకరణ, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగాలు రావడం వల్ల వ్యవస్థ నాశనమైపోతుందని అభిప్రాయం వ్యక్తంచేసింది. స్టేషన్లు, బోగీల్లో శుభ్రత పెంచాలని, రైళ్ల సామర్థ్యం పెంచాలని, రైల్వేబోర్డులో ఖాళీలు భర్తీ చేయాలని కోరింది. ఇటు రైల్వేలో పెద్ద ఎత్తున పనులను 'పొరుగు సేవల' (ఔట్‌సోర్సింగ్)కు అప్పగిస్తున్నారంటూ అఖిల భారత రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్ఎఫ్) ఆందోళన వ్యక్తం చేసింది. విదేశీ సంస్థలను ఈ రంగంలోకి అనుమతించడం.. ప్రయాణికుల భద్రతకు ముప్పుగా మారవచ్చని అభిప్రాయపడింది.



అందరికీ నెట్.. అదే మా లక్ష్యం

స్థానిక ప్రభుత్వాల్లో అవగాహన పెరగాలి

● అప్పుడే భారత్ నెట్ వేగవంతం ● నాణ్యమైన సేవల కోసమే ఎన్‌టీపీ

● కాల్ అంతరాయాల ఆధారంగా సంస్థలకు ర్యాంకులు

ఇంటర్వ్యూ — టెలికాం కార్యదర్శి అరుణ సుందరరాజన్

అందరికీ వేగవంతమైన ఇంటర్నెట్ (బ్రాడ్‌బ్యాండ్) సేవలు అందించేందుకు రూ.45,000 కోట్లతో భారత్‌నెట్ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. ఈ పథకం కింద ప్రతిగ్రామంలో కనీసం ఒక వైఫై హాట్‌స్పాట్ నెలకొల్పాలన్నది లక్ష్యం. ఈ ఏడాది ఆఖరు కల్లా పూర్తికావాల్సిన ఈ ప్రాజెక్టు అమలు ఆలస్యం అవుతుండగా, స్థానిక రాజకీయ నాయకులకు కూడా అవగాహన ఉండటం లేదు. ఈ పథకం ప్రాధాన్యతను గ్రామీణులకు వివరించడంతో పాటు సాధ్యమైనంత వేగంగా పనులు జరిగేలా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, మున్సిపాలిటీ, పంచాయతీ పాలకవర్గాలు సహకరించాలని అంటున్నారు, టెలికాం కార్యదర్శి అరుణ సుందరరాజన్. ఆటంకాలు అన్నీ పరిష్కారమై, పథకం పూర్తవుతుందనే విశ్వాసాన్ని 'ఈనాడు' ఇంటర్వ్యూలో వ్యక్తం చేశారు. ముఖ్యాంశాలివీ..

- ఈనాడు, దిల్లీ

? భారత్ నెట్ ప్రాజెక్ట్ ప్రగతి ఎలా ఉంది

ఆప్టికల్ ఫైబర్ కేబుల్ అత్యధిక గ్రామాలకు చేరింది. ఇప్పటికీ ఈ ప్రాజెక్ట్‌పై అవగాహన సరిగా ఏర్పడలేదు. కేంద్ర, రాష్ట్ర సంస్థల మధ్య సహకార లోపమూ ఉంది. ఇవి మెరుగైతే ప్రాజెక్టును గడువులోపే పూర్తి చేయొచ్చు. ఈ ప్రాజెక్ట్ రెండో దశ కింద, ఈ ఏడాది చివరకు దేశంలోని 2.50 లక్షల గ్రామాల్లో 5-6 లక్షల వైఫై హాట్‌స్పాట్‌లు నెలకొల్పాల్సి ఉంది. ప్రతి గ్రామానికీ ఒక్క వైఫై హాట్‌స్పాట్ అయినా ఉంటుంది. ఇప్పుడు దేశంలో 38,000 హాట్‌స్పాట్ ప్రాంతాలే ఉన్నాయి. వాణిజ్య సంస్థలు వసూలు చేస్తున్న మొత్తంలో నాలుగోవంతుకే భారత్‌నెట్ సేవలు లభిస్తాయి. ఈ ప్రాజెక్ట్ మూడోదశ కింద టెలికాం సంస్థలతో కలిసి పనిచేసి, గ్రామాల్లో 4జీ సేవలు ప్రారంభిస్తాం. కొత్తగా ఫైబర్ వేయకుండానే, భవిష్యత్తులో గ్రామాలకు 5జీ సేవలు అందించేందుకు వీలవుతుంది.

? క్షేత్రస్థాయిలో అవగాహన లేదంటున్నారు. కారణమేంటి

గ్రామంలో విద్యుత్తు స్తంభం వేస్తే, ఇంటికి విద్యుత్తు కనెక్షన్ వస్తుంది కనుక అందరికీ తెలుస్తుంది. బ్రాడ్‌బ్యాండ్ విషయానికొస్తే, మొబైల్‌ఫోన్ అనుసంధానతతో చూసినా ప్రత్యేకమైనదే. ప్రభుత్వసేవలన్నీ అందుకునేందుకు బ్రాడ్‌బ్యాండ్ సరైన ప్లాట్‌ఫామ్ అని ప్రజలకు అవగాహన ఏర్పడితే, భారత్‌నెట్ ప్రాజెక్ట్ విజయవంతం అవుతుంది. జీవన ప్రమాణాలు మెరుగయ్యేందుకు ఇది ఒక సాధనం. ఇది అర్థం కావాలంటే, డిజిటల్ అక్షరాస్యత గ్రామాల్లో పెరగాలి. బ్రాడ్‌బ్యార్ కనెక్షన్లు ఇచ్చేందుకు సాధారణ సేవా కేంద్రాల (సీఎస్‌సీ)ను వినియోగిస్తాం. అవగాహన పెంచడంలో ప్రైవేటు టెలికాం సంస్థల పాత్ర కీలకం. అయితే గ్రామీణులకు ప్రతి సేవ బ్రాడ్‌బ్యాండ్ ద్వారా అందించడంలో రాష్ట్రప్రభుత్వాలది ముఖ్య పాత్ర అవుతుంది.

? రాష్ట్రాలు ఎలా సహకరిస్తున్నాయి

కేంద్రప్రభుత్వ ప్రోత్సాహంతోనే ఈ పథకం పూర్తికాదని, తమ పాత్రా కీలకమని రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. తమ పంచాయతీలు, మున్సిపాలిటీలను ఈ పథకంలో భాగం చేయడాన్ని కేరళ, కర్ణాటక, రాజస్థాన్ ప్రారంభించాయి. మిగిలిన రాష్ట్రాలు కూడా ఇదే విధానం అనుసరిస్తాయని భావిస్తున్నాం.

? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయానికి ప్రత్యేక వ్యవస్థ అవసరమని భావిస్తున్నారా

జాతీయ స్థాయిలో బ్రాడ్‌బ్యాండ్ కార్యాచరణ బృందం కావాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక పాలకవర్గాలు కూడా ఏకతాటిపై నడిచి, పథకం వేగంగా పూర్తయ్యేలా చూసుకోవాలి. వేర్వేరు కార్యాచరణ బృందాల మధ్య సమన్వయానికి, త్వరలో అమల్లోకి రానున్న జాతీయ టెలికాం విధానం (ఎన్‌టీపీ) ఉపకరిస్తుంది.

? ఎన్‌టీపీలో కీలక అంశాలేమిటి

గ్రామీణ భారతానికి 4జీ, 5జీ సేవలందేలా ఆప్టికల్ ఫైబర్‌కు ప్రత్యేక లక్ష్యాలను ఎన్‌టీపీ విధిస్తుంది. తంత్రి రహిత టవర్ పరిశ్రమా కీలకమే. రెండంచెల లక్ష్యాల సాధనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేట్ టెలికాం కంపెనీల పాత్రపై ఎన్‌టీపీ స్పష్టత ఇస్తుంది.

? టెలికాం సంస్థలకు లైసెన్స్ ఫీజులు పెంచుతారని, స్పెక్ట్రమ్ వినియోగ ఛార్జీల పెంపుద్వారా వినియోగదారులకు భారం మోపేలా ఎన్‌టీపీ ఉంటుందని వార్తలొస్తున్నాయి..

అలాంటివి తప్పుడు ఊహాగానాలు.. వాస్తవం వేరుగా ఉండొచ్చు. గతంలో ఆదాయంపై అధిక దృష్టి ఉండేది. కానీ ఎన్‌టీపీ దీనికి భిన్నంగా ఉంటుంది. దేశీయులందరికీ అందుబాటు ధరల్లోనే నాణ్యమైన సేవలు, అనుసంధానత కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఎన్‌టీపీ రూపొందుతోంది. ఇందువల్ల టెలికాం సంస్థలు, వినియోగదారులకు ప్రయోజనమే. దేశీయంగా టెలికాం పరికరాల తయారీకి ప్రాధాన్యమిస్తున్నాం.

? టెలికాం సంస్థల మధ్య జరుగుతున్న కొనుగోళ్లు, స్వాధీనతల వల్ల, సంస్థల సంఖ్య తగ్గి, ఛార్జీలు పెరుగుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. మేరేమంటారు?

విలీనాల నేపథ్యంలో, పోటీ లేనపుడు ఛార్జీలు పెంచేందుకు సంస్థలు ప్రయత్నించవచ్చు. అయితే వినియోగదారుల ప్రయోజనాలకే మేం అత్యధిక ప్రాధాన్యమిస్తాం. సంస్థల యత్నాలను నిశితంగా పరిశీలిస్తూ, కుమ్మక్కవకుండా చూసి, వినియోగదారుల ప్రయోజనాలు దెబ్బతినకుండా జాగ్రత్త వహిస్తాం. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్, టెలికాం విభాగం (డాట్) ఇలాంటి అంశాల్లో డేగకన్నుతో వ్యవహరిస్తాయి. అమెరికా, చైనా వంటి దేశాల్లో 3-4 సంస్థలే టెలికాం సేవలందిస్తున్నాయి. దేశంలోనూ అదే పరిస్థితి రావచ్చు.

? పోటీ పెంచేందుకు ప్రభుత్వం కొత్త సంస్థలకు లైసెన్స్ ఇస్తుందా

దేశంలో టెలికాం సేవలకు 4 సంస్థలు సరిపోతాయన్నది నా అభిప్రాయం. ఇదికాక మరిన్ని సముచిత సేవలందించే సంస్థలు కూడా ఉన్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌నే తీసుకుంటే, డేటా సేవలపైనే దృష్టి సారిస్తామని తెలిపింది కదా. ఇలానే ప్రత్యేక సేవలు అందించే సంస్థలు వస్తాయి. విశాల దేశంలో, ఒకే తరహా/పరిమాణంలో సేవలు అందరికీ ఇవ్వలేరు. మొబైల్ డేటా అవసరాల్లో టెలికాం సంస్థలు కొంతవరకే దక్కించుకున్నాయి. అపార అవకాశాలు ఇందులో ఉన్నాయి.

? సంస్థల సంఖ్య తగ్గడంతో పాటు, సేవల నాణ్యతా సరిలేకపోతే, వినియోగదారులు ఏం చేయాలి

ఇప్పటికే సేవా లోపాలకు జరిమానాను ట్రాయ్ 4 రెట్లు పెంచింది. అవసరమైతే మరింత పెంచే హక్కు ప్రభుత్వం, ట్రాయ్‌కు ఉంది. సేవాలోపాలను సహించేది లేదు.

? కాల్ అంతరాయాల పరిష్కారానికి ప్రభుత్వ ప్రణాళికలు ఏమిటి

కొన్ని టెలికాం సంస్థలు వాయిస్ నుంచి డేటాకు మారాయి. వాయిస్ సేవలకు తగినంత మౌలిక వసతులు కల్పించకనే ఇలా చేశారు. అంటే కొత్త పెట్టుబడులకు వీరు దూరంగా ఉంటున్నారు. దీన్ని ప్రశ్నిస్తే, టవర్ల ఏర్పాటుకు సమస్యలు వస్తున్నాయని బదులిస్తున్నారు. అందుకే కాల్ అంతరాయాలను పరిగణనలోకి తీసుకుని, టెలికాం సంస్థలకు ర్యాంకులు ఇవ్వబోతున్నాం. ఇందువల్ల వినియోగదారులే తమ టెలికాం సంస్థ పేరు, నాసిరకం సేవలను బట్టి, రేటింగ్ ఇస్తారు. కాల్ అంతరాయాలను టవర్ పరిధిలో లెక్కించి, అత్యధికం ఉంటే కనుక రూ.10 లక్షల వరకు టెలికాం సంస్థలకు జరిమానా విధించవచ్చు. నెట్ సమానత్వంపై ట్రాయ్ ఇచ్చిన సిఫారసులపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు.

ప్రపంచ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్తగా సుబ్రమణియన్!



దిల్లీ: ప్రపంచ బ్యాంకు తదుపరి ముఖ్య ఆర్థికవేత్తగా భారత ముఖ్య ఆర్థిక సలహాదారు అయిన అరవింద్ సుబ్రమణియన్‌ను నియమించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాలు వార్తా సంస్థ కోజెన్సిస్‌కు తెలిపాయి. జనవరిలో రాజీనామా చేసిన పాల్ రోమర్ స్థానంలో వచ్చే నెల మొదట్లో ఈ నియామకం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. 'అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎమ్‌ఎఫ్), ప్రపంచ బ్యాంకుల వసంత కాల సమావేశాల్లో సుబ్రమణియన్‌తో భేటీ అనంతరం ప్రపంచ బ్యాంకు ఆ మేరకు నియామక ప్రకటన చేసే అవకాశం ఉంద'ని ఆ వర్గాలు పేర్కొన్నాయి. ఏప్రిల్ 20-22 మధ్య వాషింగ్టన్ డి.సి.లో ఆ సమావేశాలు జరగనున్నాయి. కాగా, ఊహాజనిత వార్తలపై స్పందించలేమని ప్రపంచ బ్యాంకు ఒక ఇ-మెయిల్ సమాధానంలో తెలిపింది.

విపణిలోకి హోండా ఎక్స్-బ్లేడ్



ధర రూ.78,500

దిల్లీ: హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా (హెచ్ఎంఎస్ఐ) తమ స్పోర్టీ మోటార్ సైకిల్ ఎక్స్-బ్లేడ్‌ను తాజాగా విపణిలోకి తీసుకొచ్చింది. 160 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందిన ఈ బైకు ధరను రూ.78,500 (ఎక్స్-షోరూం, దిల్లీ) లుగా నిర్ణయించారు. గత నెలలో జరిగిన ఆటో ఎక్స్‌పోలో ఈ బైకును ప్రదర్శించారు. మంగళవారం దీన్ని విపణిలోకి తీసుకొచ్చారు.

హీరో ప్యాషన్ ప్రొ, ఎక్స్‌ప్రొ



ధరలు రూ.53,189-54,189

దిల్లీ: హీరో మోటోకార్ప్ సంస్థ నుంచి మరో రెండు కొత్త బైకులు విపణిలోకి వచ్చాయి. ప్యాషన్ ప్రొ, ప్యాషన్ ఎక్స్‌ప్రొ పేరుతో విడుదల చేసిన ఈ బైకుల ధరల్ని రూ.53,189-54,189 (ఎక్స్ షోరూం, దిల్లీ)లుగా నిర్ణయించింది. 100-110 సీసీ మోటార్‌సైకిల్ విభాగంలో మార్కెట్ వాటా పెంచుకునేందుకు వీలుగా ఈ కొత్త మోడల్ బైకుల్ని తీసుకొచ్చినట్లు కంపెనీ తెలిపింది. బీఎస్-4 ప్రమాణాలతో 110 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో ఈ బైకులు తయారయ్యాయి.

టాటా మోటార్స్ పండగ ఆఫర్లు

దిల్లీ: టాటా మోటార్స్ తమ కొత్త తరం ప్యాసింజర్ వాహనాలపై 'మ్యాగ్జిమమ్ మార్చి ఆఫర్'ను ప్రకటించింది. గుడి పడ్వా, ఉగాది సమయంలో ఖాతాదారులకు ఆనందం పంచాలనే ఉద్దేశంతో ఈ ఆఫర్‌ను ప్రకటించినట్లు, మార్చి 31వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుందని సంస్థ వెల్లడించింది. ఈ ఆఫర్ కింద రూ.లక్ష వరకు ప్రయోజనంతోపాటు రూ.1కే వాహన బీమా కూడా చేయిస్తామని కంపెనీ తెలిపింది. టియాగో, టిగోర్, హెక్సా, సఫారి స్టార్మ్, జెస్ట్ మోడళ్లకు ఈ ఆఫర్ వర్తిస్తుందని, ఖాతాదారులకు ఎక్స్ఛేంజీ బోనస్ ఆఫర్ కూడా కల్పిస్తున్నట్లు టాటా మోటార్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. దీనికితోడు ప్రచార ఆఫర్‌లో భాగంగా కొంతమంది అదృష్ట ఖాతాదారులకు స్క్రాచ్ కార్డుపై రూ.లక్ష వరకు బహుమతులు కూడా అందించనున్నామని సంస్థ ప్రకటించింది.

ఎస్‌బీఐ ఖాతాదార్లకు ఊరట

● 'కనీస నిల్వ' ఛార్జీలు తగ్గింపు ● ఏప్రిల్ 1 నుంచి అమలు ● 25 కోట్ల మంది ఖాతాదార్లకు ప్రయోజనం

ముంబయి: ఖాతాలో నెలవారీ సగటు కనీస నిల్వ (ఏఎంబీ) లేకపోతే విధిస్తున్న ఛార్జీలను 75 శాతం వరకు తగ్గిస్తూ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి వస్తాయని తెలిపింది. మహా నగరాలు (మెట్రో), పట్టణాల్లో ఏఎంబీ లేకపోతే గరిష్ఠంగా ఛార్జీ రూ.50+ వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూలు చేస్తుండగా, ఇప్పుడు రూ.15 + జీఎస్‌టీ మాత్రమే వసూలు చేయాలని నిర్ణయించింది. ఇందువల్ల 25 కోట్ల మంది ఖాతాదారులకు ఊరట లభిస్తుందని పేర్కొంది. ఇదే విధంగా సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో గరిష్ఠ ఛార్జీ రూ.40+జీఎస్‌టీ విధిస్తుండగా రూ.12+ జీఎస్‌టీ, రూ.10+ జీఎస్‌టీకి తగ్గించాలని నిర్ణయించినట్లు ఎస్‌బీఐ మేనేజింగ్ డైరెక్టర్ (రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్) పి.కె.గుప్తా వెల్లడించారు.

ఖాతాను మార్చుకునే వీలు

ఎవరైనా ఖాతాదారులు సాధారణ పొదుపు ఖాతా (ఎస్‌బీ) నుంచి, ఇలాంటి ఛార్జీలు విధించని



ప్రాథమిక పొదుపు ఖాతా (బీఎస్‌బీడీ)కి మారాలనుకుంటే, అందుకు అనుమతిస్తున్నట్లు గుప్తా తెలిపారు. ఇందుకు ఛార్జీ ఏమీ వసూలు చేయరు. బీఎస్‌బీడీలలో నెలవారీ కనీస నిల్వ అవసరం ఉండదు.

✦ ప్రస్తుతం ఎస్‌బీఐలో 41 కోట్ల పొదుపుఖాతాలున్నాయి.

✦ వీటిల్లో 16 కోట్ల ఖాతాలు ప్రధాన్‌మంత్రి జన్‌ధన్ యోజన/బీఎస్‌బీడీ/ పింఛనర్లు/ మైనర్లు/సామాజిక భద్రతా పథకాల లబ్ధిదారులవి. ఈ ఖాతాలకు కూడా ఏఎంబీ షరతులు వర్తించవు.

కనీస నిల్వ ఛార్జీల తగ్గింపు ఇలా

మెట్రో/పట్టణాలు	ప్రస్తుత ఛార్జీలు	1 నుంచి ఛార్జీలు
ఏఎంబీ (రూ.3,000)	(ప్రతినెలా)	(ప్రతినెలా)
50%, అంతకన్నా తగ్గితే	రూ.30+జీఎస్‌టీ	రూ.10+జీఎస్‌టీ
50-75% లోపు తగ్గితే	రూ.40+జీఎస్‌టీ	రూ.12+జీఎస్‌టీ
75% కన్నా ఎక్కువ తగ్గితే	రూ.50+జీఎస్‌టీ	రూ.15+ జీఎస్‌టీ
సెమీ అర్బన్ (ఏఎంబీ రూ.2,000)		
50 శాతం, అంతకన్నా తగ్గితే	రూ.20+జీఎస్‌టీ	రూ.7.50+జీఎస్‌టీ
50-75 శాతం లోపు తగ్గితే	రూ.30+జీఎస్‌టీ	రూ.10+జీఎస్‌టీ
75 శాతం కన్నా ఎక్కువ తగ్గితే	రూ.40+జీఎస్‌టీ	రూ.12+ జీఎస్‌టీ
గ్రామీణప్రాంతాలు (ఏఎంబీ రూ.1,000)		
50 శాతం, అంతకన్నా తగ్గితే	రూ.20+జీఎస్‌టీ	రూ.5+జీఎస్‌టీ
50-75 శాతం లోపు తగ్గితే	రూ.30+జీఎస్‌టీ	రూ.7.50+జీఎస్‌టీ
75 శాతం కన్నా ఎక్కువ తగ్గితే	రూ.40+జీఎస్‌టీ	రూ.10+ జీఎస్‌టీ

డిజిటల్ లావాదేవీలు రూ.65 లక్షల కోట్లకు!



● ప్రతి 5 లావాదేవీల్లో 4 ఇవే అవుతాయి

● 2025 నాటికి సాకారం

● ఏసీఐ వరల్డ్‌వైడ్, ఏజీఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్ నివేదిక

దిల్లీ: పెద్దనోట్ల రద్దు అనంతరం నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలిస్తున్నాయి. 2025 నాటికి వార్షిక డిజిటల్ లావాదేవీలు రూ.65 లక్షల కోట్ల (ట్రిలియన్ డాలర్లు) స్థాయికి చేరతాయని ఏసీఐ వరల్డ్‌వైడ్, ఏజీఎస్ ట్రాన్సాక్ట్ టెక్నాలజీస్ (ఏజీఎస్‌టీటీఎల్) నివేదిక పేర్కొంది. అప్పటికి ప్రతి 5 లావాదేవీల్లో 4 డిజిటల్ రూపంలోనే జరుగుతాయని అంచనా వేస్తోంది. గ్రామీణ, సెమీ అర్బన్ (పాక్షిక పట్టణాలు) ప్రాంతాల వారూ డిజిటల్ లావాదేవీలకు ముందుకు వస్తున్నందున, అధిక వృద్ధి లభించనుందని తెలిపింది. అత్యధికులు ఇ చెల్లింపులు జరిపేందుకు ఫిన్‌టెక్ సంస్థలు ఉపకరిస్తున్నాయని, అనువైన నిబంధనావళి.. ముఖ్యంగా యూనిఫైడ్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) చెల్లింపులు అత్యధికులకు చేరువ కానున్నాయని విశ్లేషించింది.

అనువైన, భారీస్థాయిలో వినియోగించుకునే, విశ్వసనీయ సాంకేతికతపైనే ఈ రంగం భవిత ఆధారపడి ఉందని నివేదిక విశ్లేషించింది. డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నందున, ఈ సేవలు అందించే సంస్థలు సైబర్ భద్రతకు అధిక మొత్తాలు వెచ్చించాల్సి వస్తుందని తెలిపింది. డిజిటల్ చెల్లింపులు సౌకర్యవంతమే కాక సురక్షితమని నమ్మకం కలిగిస్తేనే, మోసాలను నివారించగలిగితేనే ఈ లావాదేవీల్లో భారీ వృద్ధి లభిస్తుందని వివరించింది. అందుబాటు ధర స్మార్ట్‌ఫోన్లు, తక్కువ ధరల్లో అధికవేగం డేటా వల్ల డిజిటల్ చెల్లింపుల తీరే మారనుందని పేర్కొంది. వేలిముద్ర ఆధారితంగా నిర్వహించేవి, డిజిటల్ చెల్లింపునకు బహుళస్థాయి ఆమోదం (ఓటీపీ వంటివి) వంటివి అవలంబిస్తే, సురక్షిత లావాదేవీలు పెరుగుతాయని తెలిపింది.

ముఖ్యాంశాలివీ..

✦ దేశీయంగా డిజిటల్ లావాదేవీలు నిర్వహిస్తున్న వారి సంఖ్య..9 కోట్లు

✦ 2020 నాటికి ఈ సంఖ్య.. 30 కోట్లు (అంచనా)

✦ దేశంలో సైబర్ దాడుల వల్ల వార్షిక నష్టం.. 4 బి.డాలర్లు (సుమారు రూ.26,000 కోట్లు)

✦ 2020 నాటికి సైబర్‌దాడుల వల్ల నష్టం.. 20 బి.డాలర్లని అంచనా (సుమారు రూ.1.30 లక్షల కోట్లు)

✦ ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వినియోగదార్ల సంఖ్య ..25 కోట్లు

✦ 2020 నాటికి స్మార్ట్ వినియోగదార్ల సంఖ్య.. 50 కోట్లు

✦ ఏసీఐ సంస్థ ఎలక్ట్రానిక్ చెల్లింపులు, బ్యాంకింగ్ సొల్యూషన్లు అందించే అంతర్జాతీయ సంస్థ కాగా, ఏజీఎస్‌టీటీఎల్ పూర్తిస్థాయి చెల్లింపు సొల్యూషన్ల కంపెనీ.

ఎంఎస్‌ఎంఈలకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం

ప్రకటించిన ఐసీఐసీఐ బ్యాంక్

దిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) తక్షణ ఓవర్‌డ్రాఫ్ట్ (ఇన్‌స్టా ఓడీ) సదుపాయం కల్పిస్తున్నట్లు ఐసీఐసీఐ బ్యాంకు తాజాగా ప్రకటించింది. ఇందుకోసం ఖాతాదారులు బ్యాంకు శాఖలకు రావాల్సిన అవసరం లేదని, ముందస్తు అర్హత (ప్రీ క్వాలిఫైడ్) పొందిన వారికి కాగితాలతో పని లేకుండా ఆన్‌లైన్‌లోనే తక్షణం ఓవర్‌డ్రాఫ్ట్ పొందే వెసులుబాటు కల్పిస్తున్నామని బ్యాంకు తెలిపింది. ఖాతాదారులకు సౌకర్యవంతమైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏడాదికి రూ.15 లక్షల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కల్పిస్తున్నట్లు, అంతర్జాల బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ఉపయోగించి ఎక్కడి నుంచైనా, ఏ సమయంలోనైనా ఈ మొత్తాన్ని పొందవచ్చని బ్యాంకు తెలిపింది. 'భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి దిశగా వెళుతోంది. ఇలాంటి తరుణంలో ఇన్‌స్టా ఓడీతో ఎంఎస్‌ఎంఈలు సులభంగా తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాం. మా ఖాతాదారులకు ఇదొక ప్రత్యేక సౌకర్యంలా ఉంటుంద'ని ఐసీఐసీఐ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) అనూప్ బాగ్చి తెలిపారు.

హెచ్‌డీఎఫ్‌సీ కార్డులతో క్రిప్టో కరెన్సీలు కొనలేరు

ముంబయి: తమ డెబిట్, క్రెడిట్, ప్రీపెయిడ్ కార్డులతో బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీల కొనుగోలు, ట్రేడింగ్ లావాదేవీలు జరగకుండా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నిషేధించింది. క్రిప్టోకరెన్సీలకు చట్టబద్ధత లేదని ప్రభుత్వం, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించిన నేపథ్యంలో ఈ చర్య తీసుకుంది. సంబంధిత విక్రయదార్ల వద్ద, ఆన్‌లైన్‌లో అయినా క్రిప్టోకరెన్సీల లావాదేవీలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్డులు పనిచేయవు.

హిందుస్థాన్ షిప్‌యార్డుకు రూ.230 కోట్ల ఆర్డరు

విశాఖపట్నం(సింధియా), న్యూస్‌టుడే : హిందుస్థాన్ షిప్‌యార్డుకు భారత నౌకాదళానికి చెందిన నాలుగు బొల్లార్డ్ టగ్‌ల నిర్మాణ ఆర్డరు లభించింది. దీని విలువ రూ.230 కోట్లు. గత మూడేళ్ల నుంచి పురోగతి బాటలో పయనిస్తున్న సంస్థకి ఈ ఆర్డరు రాడం మంచి పరిణామం అని పేర్కొంది. ఇదే నౌకాదళం నుంచి డైవింగ్ సపోర్టు వెసల్‌ని నిర్మించేందుకు రూ.2020 కోట్ల ఆర్డరు కూడా త్వరలో షిప్‌యార్డుకి దక్కబోతుందని ఆశాభావం వ్యక్తంచేసింది.

ఎల్‌ఓయూలు ఇవ్వొద్దిక

బ్యాంకులపై ఆర్‌బీఐ నిషేధాజ్ఞలు

ముంబయి



లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్(ఎల్‌ఓయూ) రూపంలో హామీలను జారీ చేయకుండా ప్రభుత్వ రంగ బ్యాంకులపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) నిషేధం విధించింది. నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీలు పీఎన్‌బీకి చెందిన ఒక శాఖ ద్వారా ఎల్ఓయూలను ఇప్పించుకుని భారీ కుంభకోణానికి పాల్పడ్డారన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. భవిష్యత్‌లో ఈ తరహా మోసాలు జరగకుండా ఉండేందుకే తక్షణం అమల్లోకి వచ్చేలా వీటిపై నిషేధం జారీ చేసినట్లు తెలుస్తోంది. అయితే కొన్ని షరతులకు లోబడి లెటర్స్ ఆఫ్ క్రెడిట్(ఎల్‌ఓసీ), బ్యాంకు హామీలు కొనసాగుతాయని ఆర్‌బీఐ ఒక ప్రకటనలో పేర్కొంది. నీరవ్, మెహుల్‌లకు చెందిన కంపెనీలు ఎటువంటి నగదును హామీగా పెట్టకుండా; ముందస్తు రుణ పరిమితి లేకుండా మోసపూరిత ఎల్‌ఓయూలను పొందారన్న ఆరోపణలున్న విషయం విదితమే.

ప్రభావం ఏమిటి

సాధారణంగా భారత దిగుమతిదార్లకు ఎల్‌ఓయూలు ఉపకరిస్తుంటాయి. దిగుమతిదారుకు చెందిన బ్యాంకు జారీ చేసే ఎల్‌ఓయూల ఆధారంగా ఆ బ్యాంకుల విదేశీ శాఖలు దిగుమతిదార్లకు నగదు ఇస్తుంటాయి. తద్వారా విదేశీ కరెన్సీ రూపంలో సరఫరాదార్లకు చెల్లింపులు చేయడానికి వీలవుతుంటుంది. కాగా, తాజా నిబంధనల్లో మార్పుల వల్ల దిగుమతి ఆధారిత వ్యాపారాలపై ప్రభావం పడనుంది. ఎల్‌ఓయూలపై ఆధారపడి వాణిజ్యం చేసే వ్యాపారులపై దెబ్బ పడనుంది. ఎక్కువగా రత్నాభరణాల రంగం ఈ ఎల్‌ఓయూలను ఉపయోగించుకుంటూ ఉంటుంది.

ఆరేళ్లలో 1213 మోసపూరిత హామీలు: ముంబయిలోని పీఎన్‌బీ బ్రాడీ హౌస్ శాఖ నుంచి 2011 మార్చి 10న నీరవ్ మోదీ మొట్టమొదటి మోసపూరిత హామీని పొందారని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. ఆ తర్వాత 74 నెలల్లో మరో 1212 హామీలను తెచ్చుకోగలిగారని రాజ్యసభకిచ్చిన లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. చివరి మోసపూరిత హామీ 2017 మే 23న జారీ అయ్యిందని చెప్పారు. ఇదే ఆరేళ్లలో 53 మంచి (మోసపూరితం కాని) ఎల్‌ఓయూలు సైతం నీరవ్ మోదీ గ్రూప్‌కు జారీ అయ్యాయని అన్నారు.

ఉద్దేశపూర్వక ఎగవేతదార్ల పేర్లు బయటకు వెల్లడించండి

బ్యాంకులకు ప్రభుత్వం సూచన

ఉద్దేశపూర్వక ఎగవేతదార్లకు ముకుతాడు వేసేందు కోసం అలాంటి వారి పేర్లను; ఫొటోగ్రాఫులను, ఇతర వివరాలను పత్రికల్లో ప్రచురింపజేయాలని(నేమ్ అండ్ షేమ్) బ్యాంకులకు ప్రభుత్వం సూచన ఇచ్చింది. అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆ మేరకు ఆదేశాలు జారీ చేస్తూ ఆర్థిక శాఖ లేఖ రాసింది. ఎగవేతదార్ల చిత్రాల ప్రచురణకు బ్యాంకులు ఆయా బోర్డుల అనుమతులు తీసుకోవాలని అందులో తెలిపింది. డిసెంబరు 2017 నాటికి ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఎగవేతదార్ల సంఖ్య 9,063 మందికి పెరిగింది. వీరు రూ.1,10,050 కోట్ల వరకు చెల్లించాల్సి ఉందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా లోక్‌సభకిచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

రూ.50 కోట్లు అంత కంటే ఎక్కువ రుణాలను తీసుకున్న వారి పాస్‌పోర్ట్ వివరాలను తప్పనిసరిగా ఇవ్వాలని ప్రభుత్వం గత వారం బ్యాంకులకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. 45 రోజుల్లోగా ఆ వివరాలను ఇవ్వాలని ఆర్థిక సేవల కార్యదర్శి రాజీవ్ కుమార్ అప్పట్లో పేర్కొన్న విషయం విదితమే. నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీ, జతిన్ మెహతాలు దేశం వదిలి వెళ్లి బకాయిల వసూలును సంక్లిష్టం చేసిన నేపథ్యంలో ఆ ఆదేశాలను ప్రభుత్వం జారీ చేసింది.

సెన్సెక్స్ ▼ 61 **33857**

నిఫ్టీ ▲ 05 **10427**

డోజోన్స్ 25140 ▼ 38

నాస్‌డాక్ 7548 ▼ 40

అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 64.89 ▲ 15 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 64.48 ▼ (బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ఘనం (+)


నిఫ్టీ	13న	మార్పు %
BPCL	466.65	4.45
HPCL	382.95	4.42
BHARTI INFRATEL	349.00	2.80
AXIS BANK	531.50	2.37
GAIL (INDIA)	455.95	2.13
SUN PHARMA	523.30	2.08
WIPRO	296.60	2.03
EICHER MOTORS	28849.35	1.88

గ్రహణం (-)

నిఫ్టీ	13న	మార్పు %
TCS	2886.80	-5.42
KOTAK MAHI BANK	1083.90	-1.52
HCL TECH	957.00	-1.10
NTPC	169.40	-1.02
COAL INDIA	294.85	-0.94
AMBUJA CEM	238.80	-0.85
HINDALCO	226.15	-0.66
MARUTI SUZUKI	8756.05	-0.62


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.10	68.52
పౌండ్ స్టెర్లింగ్	82.14	95.25
యూరో	72.88	84.52
జపనీస్ యెన్/100	55.48	64.34
ఆస్ట్రేలియా డాలరు	46.54	53.85
సింగపూర్ డాలరు	45.00	53.30
థాయ్ బాత్/100	188.93	225.88
బహ్రెయిన్ దీనార్	160.03	183.39
కువైట్ దీనార్	178.87	222.67
ఒమన్ రియాల్	156.71	179.29
సౌదీ రియాల్	15.72	18.62
యూఏఈ దిర్హమ్	16.09	18.80
మలేషియా రింగిట్	14.82	18.22
చైనీస్ యువాన్	7.26	11.77

మంగళవారం నిఫ్టీ కదలికలు



వీటి పనితీరు చెత్త!

- బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిరిండియా, ఎంటీఎన్‌ఎల్
- 2016-17లో పీఎస్‌యూల తీరుపై ప్రభుత్వ సర్వే
- లాభాల్లో ఇండియన్ ఆయిల్, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా

దిల్లీ: ఇండియన్ ఆయిల్, ఓఎన్‌జీసీ, కోల్‌ఇండియా గత ఆర్థిక సంవత్సరంలో అత్యధిక లాభాలు ఆర్జించిన ప్రభుత్వరంగ సంస్థ (పీఎస్‌యూ)లుగా నిలిచాయని ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. ఇదే సమయంలో అధిక నష్టాలతో చెత్త పనితీరు ప్రదర్శించిన సంస్థలుగా బీఎస్‌ఎన్‌ఎల్, ఎయిరిండియా, ఎంటీఎన్‌ఎల్ నిలిచాయని పేర్కొంది. 2016-17లో ప్రభుత్వరంగ సంస్థల పనితీరుపై నివేదికను ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. నిర్వహణలో ఉన్న 257 సంస్థలు ఆర్జించిన లాభాలు రూ.1,27,602 కోట్లకు చేరాయి. 2015-16లో ఆర్జించిన రూ.1,14,239 కోట్ల కంటే ఇది 11.7 శాతం ఎక్కువ.

- ✦ 82 ప్రభుత్వరంగ సంస్థలు (సీపీఎస్ఈ) నష్టాలు తెచ్చాయి. ఈ మొత్తం నష్టాల్లో 82 శాతం వాటా 'అత్యధిక నష్టాలు తెచ్చిన తొలి 10 సంస్థలదే'.
- ✦ తొలి 10 సంస్థల వల్ల ఏర్పడిన నష్టం విలువలో, 55.66 శాతం వాటా బీఎస్ఎన్ఎల్, ఎయిరిండియా, ఎంటీఎన్‌ఎల్‌లదే.
- ✦ ఎక్కువ నష్టాలు ఆర్జించిన 10 సంస్థల్లో వెస్టర్న్ కోల్‌ఫీల్డ్స్, ఎస్‌టీసీఎల్, ఎయిరిండియా ఇంజినీరింగ్ సర్వీసెస్, బ్రహ్మపుత్ర క్రాకర్స్&పాలిమర్ చేరాయి.

లాభాల్లో..

- ✦ 2016-17లో సీపీఎస్ఈలు ఆర్జించిన మొత్తం లాభంలో, తొలి 3 స్థానాల్లోని సంస్థల వాటాయే 53 శాతానికి పైగా ఉంది. ఐఓసీ వాటా 19.69 శాతం కాగా, ఓఎన్‌జీసీ 18.45 శాతం, కోల్ ఇండియా 14.94 శాతం సాధించాయి.
- ✦ అధిక లాభాలు ఆర్జించిన 10 సంస్థల్లో హెచ్‌పీసీఎల్, ఎంఆర్‌పీఎల్ చేరాయి. హిందుస్థాన్ ఫెర్టిలైజర్, పవర్ ఫైనాన్స్ తప్పుకున్నాయి.
- ✦ మొత్తం 174 సీపీఎస్ఈలు లాభాలు ఆర్జించాయి. ఈ మొత్తంలో, తొలి 10 సంస్థల లాభాల వాటా 63.57 శాతానికి సమానం.
- ✦ 2015-16లో నష్టాలు నమోదు చేసిన హిందుస్థాన్ కేబుల్స్, భెల్, ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్) 2016-17లో లాభాలు ఆర్జించాయి.

ట్రంప్‌కు చైనా భయం!

- క్వాల్‌కామ్ కొనుగోలుకు మోకాలడ్డు
- 117 బి. డాలర్ల బ్రాడ్‌కామ్ బిడ్‌కు తిరస్కరణ
- దేశభద్రతకు ముప్పంటూ వివరణ
- చైనానే ప్రధాన కారణమంటున్న మీడియా వర్గాలు

వాషింగ్టన్

అమెరికా చిప్‌తయారీ సంస్థ క్వాల్‌కామ్‌ను 117 బిలియన్ డాలర్ల(రూ.7.6 లక్షల కోట్లు)తో కొనుగోలు చేయాలన్న సింగపూర్ సంస్థ బ్రాడ్‌కామ్ ప్రతిపాదన ముందుకు సాగలేదు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అందుకు కారణం. చిప్ మార్కెట్‌లో చైనా మరింత ముందుకెళ్లడానికి ఈ కొనుగోలు ఉపయోగపడుతుందన్న ఆందోళనతోనే ఆ ప్రతిపాదనకు ట్రంప్ మోకాలడ్డారన్న వాదనలు వినవస్తున్నాయి. అయితే క్వాల్‌కామ్‌ను బ్రాడ్‌కామ్ నియంత్రణలోకి తీసుకుంటే అమెరికా దేశ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్న 'విశ్వసనీయమైన సమాచారం' అందినందునే ఈ నిర్ణయం తీసుకున్నానని ఒక అధికారిక ప్రకటనలో ట్రంప్ వివరించారు. 'ప్రతిపాదిత టోకేవర్‌ను తక్షణం శాశ్వతంగా రద్దు చేస్తున్నాం. విలీనం, కొనుగోలు, టేకోవర్ లేదా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆ దిశగా ప్రయత్నాలను సైతం నిషేధిస్తున్నాం' అని ఆదేశాల్లో పేర్కొన్నారు.



అతిపెద్ద టేకోవర్ ఇదే!

ఈ ఒప్పందం జరిగితే ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మైక్రోచిప్‌ల తయారీ కంపెనీ అవతరించేది. ఇంటెల్, శాంసంగ్‌లు మొదటి రెండు స్థానాల్లో ఉన్నాయి. అదీ కాక టెక్నాలజీ రంగంలోనే అతిపెద్ద టేకోవర్‌గా నిలిచేది. ఆసియాలోని కంపెనీ నియంత్రణలోకి అమెరికాకు చెందిన కంపెనీ వెళితే అమెరికాకు మొబైల్ సాంకేతిక పరిజ్ఞానంలో పోటీ తీవ్రతరమవుతుందన్న ఆందోళనలే తాజా పరిణామానికి కారణమయ్యాయి.

తీవ్రంగా ఖండించిన కంపెనీ

అధ్యక్షుడి ఇచ్చిన ఆదేశాలను సమీక్షిస్తున్నామని బ్రాడ్‌కామ్ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రతిపాదిత క్వాల్‌కామ్ కొనుగోలు వల్ల జాతి భద్రతకు ముప్పు వాటిల్లుతుందన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కంపెనీ అందులో తెలిపింది. చైనాతో బ్రాడ్‌కామ్‌కు అనుబంధం పెరుగుతూ ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ క్వాల్‌కామ్ టేకోవర్‌ను నిలిపివేయాలంటూ గత వారం పలువురు అమెరికా చట్టసభ్యులు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ట్రంప్ నిర్ణయానికి చైనానే ప్రధాన కారణమని 'ద న్యూయార్క్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది.

2018లో వడ్డీ రేట్ల కోత ఉండదు

బ్రోకరేజీ సంస్థల అంచనా

ముంబయి: ఫిబ్రవరి నెలకు రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గినా, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఈ ఏడాది కీలక రేట్లలో కోత విధించకపోవచ్చని పలు బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఆహార ధాన్యాలకు అధిక కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తామని బడ్జెట్‌లో ప్రకటించిన నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం పైపైకి ఎగబాకే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

- ✦ 'కనీస మద్దతు ధరలు పెరగడం అనేది ప్రమాదకరమైన సంకేతం. ఈ ప్రభావంతో వచ్చే ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నుంచి ద్రవ్యోల్బణం ఒక్కసారి పెరగడం మొదలైతే ఆర్‌బీఐ గట్టిగానే వ్యవహరిస్తుంది. బ్యాంకింగ్ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిసితుల్లో 2018 మొత్తం కీలక రేట్లలో మార్పు జోలికి ఆర్‌బీఐ వెళ్లకపోవచ్చు. రాబోయే కాలం సవాలుతో కూడుకున్నద'ని బ్రోకరేజీ సంస్థ నోమురా వెల్లడించింది.
- ✦ 'తాజాగా ప్రకటించిన ద్రవ్యోల్బణం గణాంకాల ప్రభావం రాబోయే ఆరు నెలల్లో ఉండకపోవచ్చని, ఆర్‌బీఐ కీలక రేట్ల కోతకు ముందుకు రాకపోవచ్చ'ని క్రెడిట్ రేటింగ్ సంస్థ క్రిసిల్ తెలిపింది.

ఈసీఎస్ అతిచిన్న కంప్యూటరు

- ధర రూ.13,500

దిల్లీ: కంప్యూటర్ విడిభాగాలు, మొబైల్ పరికరాల తయారీ సంస్థ ఎలైట్ గ్రూప్ కంప్యూటర్ సిస్టమ్స్ (ఈసీఎస్) విండోస్ ఆధారంగా పనిచేసే అతిచిన్న పాకెట్ సైజ్ కంప్యూటర్ 'లివా క్యూ'ను విపణిలోకి ప్రవేశపెట్టింది. ఆపరేటింగ్ సిస్టమ్ లేని కంప్యూటరు ధర రూ.13,500 కాగా.. విండోస్ 10 హోమ్ కలిగిన కంప్యూటరు ధర రూ.15,500. ఇంటెల్ అపోలో లేక్ ఎస్ఓసీ ప్రాసెసర్లు, గ్యాడ్జెట్ స్పోర్ట్స్ 4జీబీ ర్యామ్, 32 జీబీ నిల్వ సామర్థ్యం, హెచ్‌డీఎంఐ 2.0 వంటి ఫీచర్లు ఉన్నాయి. 4కే కంటెంట్‌ను లివా క్యూలో సులభంగా వినియోగించుకోవచ్చని కంపెనీ తెలిపింది. లివా క్యూలో డ్యూయల్ నెట్‌వర్క్ ఆప్షన్లు ఉన్నాయి. మైక్రోఎస్‌డీ కార్డ్‌తో నిల్వ సామర్థ్యాన్ని 128 జీబీ వరకు విస్తరించుకోవచ్చు. లివా క్యూ బరువు కేవలం 260 గ్రాముల కావడం విశేషం.




చిన్న కంప్యూటర్ 'లివా క్యూ'ను విడుదల చేస్తున్న సంస్థ ప్రతినిధులు

హాస్టల్ నిర్మాణానికి జెన్ టెక్నాలజీస్ రూ.56 లక్షల సాయం

ఈనాడు, హైదరాబాద్: డెహ్రాడూన్‌లో యుద్ధ స్మారక బాలురు, బాలికల హాస్టల్ నిర్మాణానికి జెన్ టెక్నాలజీస్ రూ.56 లక్షల సాయం అందించనుంది. యుద్ధంలో మరణించిన అమర జవాన్లు, ఎక్స్‌సర్వీస్‌మెన్ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఈ హాస్టల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జెన్ టెక్నాలజీస్‌కు చెందిన వీర సమ్మాన్ ఫౌండేషన్ ఈ సహాయాన్ని అందిస్తుంది. ఈ నిధులతో కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, భద్రత పరికరాలు మొదలైనవి కొనుగోలు చేస్తారు. సాయం చేయడానికి భారత ఆర్మీకి చెందిన గ్రావల్ రైఫిల్స్ రెజిమెంట్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు జెన్ టెక్నాలజీస్ తెలిపింది.

13న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	332
బెంగళూరు	365	చెన్నై	370
14వ తేదీకి...		చిత్తూరు	362
విజయవాడ/గోదావరి	322	నమక్కల్	360

ఒక్క రోజు ముచ్చటే..

- సెన్సెక్స్‌కు మళ్లీ నష్టాలు
- చివర్లో లాభాల స్వీకరణ

సమీక్ష

రెండేళ్లలోనే అత్యధిక ఒకరోజు లాభం నమోదు చేసిన సెన్సెక్స్.. రెండో రోజు మాత్రం ఆ జోరును కొనసాగించలేకపోయింది. మధ్యాహ్నం తర్వాత ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో మదుపర్లు లాభాలు స్వీకరించడంతో సెన్సెక్స్ నష్టాల్లో ముగియగా, నిఫ్టీ స్వల్ప లాభంతో సరిపెట్టుకుంది. టీసీఎస్ షేరు పతనం ఇందుకు తోడైంది. రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు అంచనాలు మించడం సానుకూల ప్రభావం చూపాయి. అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాల కోసం మదుపర్లు ఎదురుచూడటంతో రోజులో అధికభాగం సూచీలు ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా షేర్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి.

బలహీన ఆసియా సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 33,818.22 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. అనంతరం బలంగా కోలుకున్న సూచీ.. తిరిగి లాభాల్లోకి వచ్చింది. అదే జోరు కొనసాగిస్తూ.. ఇంట్రాడేలో 34,077.32 పాయింట్ల వద్ద గరిష్ఠానికి చేరింది. అయితే మధ్యాహ్నం తర్వాత అమ్మకాలు వెల్లువెత్తడంతో ఒకానొకదశలో 33,722.96 పాయింట్లకు పడిపోయింది. చివరకు 61.16 పాయింట్లు కోల్పోయి 33,856.78 పాయింట్ల దగ్గర స్థిరపడింది. ఇక నిఫ్టీ మాత్రం వరుసగా రెండో రోజూ లాభాలు కొనసాగించింది. 5.45 పాయింట్లు పెరిగిన సూచీ 10,426.85 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,377.85- 10,478.60 పాయింట్ల మధ్య కదలాడింది.

టీసీఎస్ కుదేల్: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) షేర్లు కుదేలయ్యాయి. కంపెనీలో దాదాపు 1.48 శాతం వాటాను రూ.8,200 కోట్లకు టాటా సన్స్ విక్రయించడానికి సన్నాహాలు చేస్తోందన్న వార్తలే ఇందుకు నేపథ్యం. ఒకానొకదశలో 5.49 శాతం క్షీణించిన షేరు.. చివరకు 5.22 శాతం నష్టంతో రూ.2,892.45 వద్ద ముగిసింది. షేరు పతనంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.30,512.89 కోట్లు తగ్గి రూ.5,53,698.11 కోట్లకు చేరింది.

- ✦ గత రెండు నెలల్లో లెటర్స్ ఆఫ్ క్రెడిట్ కింద ఇచ్చిన రూ.7,000 కోట్లను వసూలు చేసినట్లు ప్రకటించడంతో బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు 7.47 శాతం దూసుకెళ్లి రూ.102.20 వద్ద ముగిశాయి. ఈ ప్రభావం ఇతర బ్యాంకింగ్ షేర్లు సైతం రాణించాయి.



సెన్సెక్స్ 30 షేర్లలో 14 నష్టాలు చవిచూశాయి. టీసీఎస్ 5.22%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.46%, కోల్ ఇండియా 1.02%, ఎన్‌టీపీసీ 0.94%, మారుతీ సుజుకీ 0.66%, ఎల్ అండ్ టీ 0.59% చొప్పున డీలాపడిన వాటిలో ఉన్నాయి. యాక్సిస్ బ్యాంక్ 2.23%, సన్‌ఫార్మా 2.04%, విప్రో 1.65%, డాక్టర్ రెడ్డీస్ 1.60%, భారతీ ఎయిర్‌టెల్ 1.22%, ఐసీఐసీఐ బ్యాంక్ 1.10%, టాటా స్టీల్ 0.90%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో ఐటీ అత్యధికంగా 1.56% కోల్పోయింది.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడే అవకాశం ఉంది. దేశీయంగా కీలక పరిణామాలేవీ లేకపోవడంతో.. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సంకేతాలు అందిపుచ్చుకోవచ్చని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఫిబ్రవరి అమెరికా వినియోగ ద్రవ్యోల్బణ గణాంకాలు మార్కెట్లపై ప్రభావం చూపొచ్చు. అమెరికా ఫెడ్ రిజర్వు భవిష్యత్ వడ్డీ రేట్ల పెంపునకు ఈ గణాంకాలను ప్రామాణికంగా తీసుకోనుండటమే ఇందుకు కారణం. అధిక ద్రవ్యోల్బణం కారణంగా ముందుగా అనుకున్న మూడు సార్లు రేట్ల పెంపు స్థానంలో.. ఈ ఏడాది నాలుగు సార్లు పెంచొచ్చన్న అంచనాలతో గతనెలలో అంతర్జాతీయ మార్కెట్లు కుదేలైన విషయం తెలిసిందే. ఎక్కువసార్లు రేట్లు పెంచితే.. భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల నుంచి నిధులు తరలిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు. దేశీయంగా చూస్తే.. భారత బ్యాంకుల సంఘం సమావేశంపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. నేడు వెలువడనున్న టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణ గణాంకాలు సైతం కీలకం కానున్నాయి. నేడు నిఫ్టీ 10320- 10450 పాయింట్ల శ్రేణిలో కదలాడొచ్చని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

మార్కెట్ కబుర్లు

- ✦ పాత లావాదేవీలకు సంబంధించి భారత్ జారీచేసిన రూ.10,247 కోట్ల పన్ను డిమాండ్‌పై అంతర్జాతీయ మధ్యవర్తిత్వ న్యాయస్థానంలో **కెయిర్న్ ఎనర్జీ** వేసిన పిటిషన్‌పై తుది విచారణ వచ్చే ఆగస్టులో జరగనుంది.
- ✦ యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం లభించినందున, గర్భ నిరోధక మాత్రలు టైడెమిని అమెరికా విపణిలో ప్రవేశ పెట్టినట్లు **లుపిన్** తెలిపింది. బేయర్ తయారీ సఫైరల్ ట్యాబ్లెట్లకు ఇవి జనరిక్ రూపం.
- ✦ ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం తమ వ్యాపార ప్రచారకర్తగా బయోకాన్ అధిపతి **కిరణ్ మజుందార్ షా**ను నియమించింది. నిపుణులు, పరిశోధనా శాలలు, విశ్వవిద్యాలయాలకు కేంద్రమైన విక్టోరియా, వినూత్న ఆలోచనలు కార్యరూపం దాల్చే ప్రాంతంగా పేరొందింది.
- ✦ ప్లంబింగ్, అనుబంధ పరికరాల తయారీ సంస్థ **వేగా** తొలి ప్లాంటును గుజరాత్‌లోని సనంద్‌లో రూ.160 కోట్ల పెట్టుబడితో ప్రారంభించింది.
- ✦ అర్హత కలిగిన సంస్థాగత మదుపుదార్లకు షేర్లు కేటాయించడం ద్వారా రూ.1,000 కోట్లు సమీకరించినట్లు **ఎల్ అండ్ టీ ఫైనాన్స్ హోల్డింగ్స్** తెలిపింది. షేరుకు రూ.158.60 చొప్పున జారీచేసింది.
- ✦ దేశంలోనే అతిపెద్ద పవన విద్యుత్తు జనరేటర్ ఎస్ 128ని తమిళనాడులో ప్రారంభించినట్లు **సుజ్లాన్ గ్రూప్** వెల్లడించింది. 140 మీటర్ల ఎత్తువరకు కేంద్ర ఎత్తు ఉండే ఈ టర్బైన్ 2.6-2.8 మెగావాట్ల శ్రేణిలో లభిస్తుందని తెలిపింది.
- ✦ భారత్‌మాలా ప్రాజెక్ట్ కింద ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే లో భాగమైన రూ.1047 కోట్ల పనులను **ఎల్ అండ్ టీ** దక్కించుకుంది. హరియాణాలోని బసాయి నుంచి 8వ నెంబరు జాతీయ రహదారి వరకు 8 వరుసల్లో ఎక్స్‌ప్రెస్ వే నిర్మిస్తారు.
- ✦ కృత్రిమమేధ ద్వారా రూపొందించిన సంభాషణల మేనేజ్‌మెంట్ అప్లికేషన్ స్పోకెన్ కమ్యూనికేషన్స్‌ను స్వాధీనం చేసుకోవడం పూర్తి చేసినట్లు **అవాయా హోల్డింగ్స్** తెలిపింది.
- ✦ తమిళనాడులో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ నుంచి రూ.3,465 కోట్ల విలువైన ఆర్డర్లు లభించినట్లు **ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్** ప్రకటించింది.
- ✦ **టీసీఎస్**లో 1.63 శాతం వాటాకు సమానమైన 3.12 కోట్ల షేర్లను బహిరంగ విపణిలో విక్రయించడం ద్వారా రూ.8,989.84 కోట్లు సమీకరించినట్లు టాటా సన్స్ వెల్లడించింది. ఈ విక్రయానంతరం టీసీఎస్‌లో టాటా సన్స్‌కు 72 శాతం వాటా ఉంది.

దీర్ఘకాలానికి కొనొచ్చు!

- తొలి రోజు 72 లక్షల షేర్లకు దరఖాస్తులు
- బీడీఎల్ ఇష్యూకు రేపటి వరకూ గడువు
- ధరల శ్రేణి రూ.413-428

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన భారత్ డైనమిక్స్ (బీడీఎల్) పబ్లిక్ ఇష్యూకు తొలి రోజు 0.32 రెట్ల స్పందన లభించింది. దాదాపు రూ.960 కోట్ల సమీకరణకు 12.25 శాతం వాటాకు సమానమైన 2.24 కోట్ల షేర్లను జారీ చేయడానికి కంపెనీ పబ్లిక్ ఇష్యూకు (ఆఫర్ ఫర్ సేల్) వచ్చింది. తొలి రోజు 72.49 లక్షల షేర్లకు బిడ్లు దాఖలైనట్లు స్టాక్ ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ద్వారా తెలుస్తోంది. అర్హులైన సంస్థాగత మదుపర్ల కోసం కేటాయించిన షేర్లలో దాదాపు సగం షేర్లకు దరఖాస్తులు అందాయి. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకూ అందిన సమాచారం ప్రకారం రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 0.21 రెట్లు, సంస్థాగతేతర మదుపర్ల నుంచి స్వల్ప స్పందన లభించినట్లు తెలుస్తోంది. పబ్లిక్ ఇష్యూలో షేర్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి రూ.413-428 ధరల శ్రేణిని భారత్ డైనమిక్స్ నిర్ణయించింది. ఇష్యూ 15వ తేదీ వరకూ తెరిచి ఉంటుంది. కనీసం 35 షేర్లకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులకు, రిటైల్ ఇన్వెస్టర్లకు ఆఫర్ ధరపై రూ.10 తగ్గింపు ఉంటుంది. ప్రభుత్వ రంగంలోని ప్రధాన రక్షణ ఉత్పత్తుల తయారీ కంపెనీల్లో మినీ రత్న హోదా కలిగిన వాటిలో భారత్ డైనమిక్స్ ఒకటి. ప్రధానంగా ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే క్షిపణులు (ఎస్ఏఎం) యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులు, నీటి అడుగున ప్రయోగించే ఆయుధాలు,



లాంచర్లు, టెస్ట్ ఎక్విప్‌మెంట్ మొదలైన వాటిని భారత్ డైనమిక్స్ తయారు చేస్తోంది. ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించే క్షిపణులు (ఎస్ఏఎం), యాంటీ ట్యాంక్ గైడెడ్ క్షిపణులను (ఏటీజీఎం) దేశంలో తయారు చేస్తున్న ఏకైక కంపెనీ బీడీఎల్. కొత్త తరం ఎస్ఏఎంలు, ఏటీజీఎంలను అభివృద్ధి చేయడానికి డీఆర్‌డీఓతో కలిసి పని చేస్తోంది. హైదరాబాద్, భానూర్, విశాఖపట్నంలలో కంపెనీకి మూడు తయారీ యూనిట్లు ఉన్నాయి. ఆఫర్ ఫర్ సేల్ (ఇప్పటికే ఉన్న షేర్లను విక్రయించడం) కింద పబ్లిక్ ఇష్యూకు వచ్చినందున కంపెనీకి ప్రత్యేకంగా ఎటువంటి నిధులు సమకూరవు. పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహంలో భాగంగా భారత్ డైనమిక్స్‌లో వాటాను పబ్లిక్ ఇష్యూ ద్వారా ప్రభుత్వం విక్రయిస్తోంది.

భవిష్యత్తులో క్షిపణులకు గిరాకీ..

రక్షణ రంగంలో ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. దేశంలో క్షిపణులను తయారు చేస్తున్న ఏకైక కంపెనీ ఇదే. భారత రక్షణ దళాలకు కూడా ఒక్క బీడీఎల్ కంపెనీనే క్షిపణులను తయారు చేస్తోంది. భవిష్యత్తులో క్షిపణులకు ఉన్న గిరాకీ, గత కొద్ది సంవత్సరాలుగా కంపెనీ పనితీరు, కంపెనీ చేతిలో ఉన్న ఆర్డర్లు, మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకుని దీర్ఘకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్ డైనమిక్స్ పబ్లిక్ ఇష్యూలో మదుపు చేయొచ్చని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. 2018, జనవరి 31 నాటికి కంపెనీ చేతిలో రూ.10,543 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. గత అయిదేళ్లుగా ఆర్థిక, నిర్వహణ పరంగా భారత్ డైనమిక్స్ స్థిరమైన వృద్ధిని నమోదు చేస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత్ డైనమిక్స్ చేతిలో భారీగా ఆర్డర్లు ఉన్నాయని.. ఈ రంగంలోని ఇదే తరహా వ్యాపారంలోని కంపెనీలతో పోలిస్తే రిటర్న్‌లు కూడా ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయని దీర్ఘకాలానికి ఈ షేరును కొనుగోలు చేయొచ్చని ఏంజిల్ బ్రోకింగ్ వెల్లడించింది. పబ్లిక్ ఇష్యూలో ఆఫర్ చేసిన ధర ఆమోదయోగ్యమైందని, దీర్ఘకాలిక పెట్టుబడికి దీన్ని పరిశీలించవచ్చని ఐసీఐసీఐ డైరెక్ట్ పేర్కొంది. లిస్టింగ్ సమయంలో లాభాన్ని ఆశించక దీర్ఘకాల లాభాన్ని కోరుకునే మదుపర్లు ఈ షేర్లను కొనుగోలు చేయొచ్చని ప్రభుదాస్ లీలాధర్ తెలిపింది.

భారత్ డైనమిక్స్ పనితీరు (రూ.కోట్లలో)

	2016–17	2015–16	2014–15
మొత్తం ఆదాయం	5,198	4,601.37	3,253.22
నికర లాభం	490.31	562.06	443.54
మొత్తం ఆస్తులు	8,600.79	9,640.63	8,411.97

16 నుంచి హెచ్‌ఏఎల్ ఇష్యూ

రూ.4,230 కోట్ల సమీకరణ

ముంబయి: ప్రభుత్వ రంగంలోని రక్షణ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) తొలి పబ్లిక్ ఇష్యూకు రాబోతోంది. ఈ నెల 16 నుంచి ప్రారంభం కాబోతున్న ఈ ఇష్యూ ద్వారా 10 శాతం వాటాను ఉపసంహరించి రూ.4,230 కోట్ల నిధుల్ని సమీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఒక్కో షేరు ధరను రూ.1,215-1,240ల మధ్య నిర్ణయించింది. రిటైల్ మదుపర్లకు, సంస్థ ఉద్యోగులకు ఇష్యూ ధరలో రూ.25 తగ్గింపు ఇస్తోంది. ఇష్యూ ఈ నెల 16న ప్రారంభమై 20న ముగుస్తుంది. దీంతోపాటు మరో 10.20 శాతం వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) పద్ధతిలో విక్రయించనుంది. పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా రూ.75,000 కోట్ల నిధుల్ని సేకరించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని గడిచిన కొన్నేళ్లలో తొలిసారిగా దాటింది. 2016-17 ఆర్థిక సంవత్సరంలో హెచ్ఏఎల్ రూ.3,580 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.18,600 కోట్లుగా నమోదైంది. 'రాబోయే మూడేళ్లలో రూ.68,000 కోట్ల ఆర్డర్ బుక్ సంస్థ చేతిలో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో రూ.5,300 కోట్ల ఆదాయం వచ్చింద'ని తాత్కాలిక ఛైర్మన్ వీఎం ఛమోలా తెలిపారు.

చర్యల్లోనూ దేశానికి ఆదర్శంగా ఉందాం

- మరోసారి ఇలాంటివి జరగొద్దు
- ఉపఎన్నికలకు సిద్ధం: సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ నిర్వహణలో ఇప్పటికే దేశానికి ఆదర్శంగా నిలిచామని, ఇప్పుడు దాడికి పాల్పడిన సభ్యులపై చర్యల ద్వారా తెలంగాణ శాసనసభ మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా చర్య తీసుకుందని ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యానించినట్లు తెలిసింది. మంగళవారం రాత్రి ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ మంత్రులు, ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. గవర్నర్ ప్రసంగం రోజున జరిగిన పరిణామాలు చాలా తీవ్రమైనవనీ, మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ గాయపడటం, గవర్నర్ పైనా దాడికి యత్నం జరగడం తనను కలిచివేసిందని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. చట్టసభల్లో తానెక్కడా ఇలాంటి దారుణాన్ని చూడలేదనీ, దీని వల్ల తెలంగాణకు అపఖ్యాతి వచ్చిందని పేర్కొన్నట్లు తెలిసింది. సంఘటన తీవ్రత ఆధారంగా కఠిన చర్యలకు శాసనసభ పూనుకుందని, దీనికి ప్రధాన పక్షాల నుంచి మద్దతు లభించిందని అన్నారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల మరోసారి ఇలాంటి సంఘటనలకు అవకాశమే ఉండదన్నారు.

ఉప ఎన్నికలు జరుగుతాయి: నల్గొండ, అలంపూర్ ఎమ్మెల్యేల సభ్యత్వాల రద్దు కారణంగా ఆ రెండు చోట్ల తప్పక ఉప ఎన్నికలు జరుగుతాయని, వాటికి సన్నద్ధం కావాలని సీఎం కేసీఆర్ ముఖ్యనేతలను ఆదేశించినట్లు తెలిసింది. జూన్ రెండో తేదీ నుంచి తెలంగాణ శాసనసభ ప్రారంభమైందనీ, ఈ తేదీని పరిగణనలోకి తీసుకుంటే రద్దయిన సభ్యుల పదవీకాలం వచ్చే జూన్ వరకు ఉంటుందని, ఈ లెక్కన ఏడాదిపైగా సమయం ఉన్నందున తప్పనిసరిగా ఎన్నికల సంఘం అక్కడ ఉప ఎన్నికలను నిర్వహిస్తుందని తెలిపారు. ఎన్నికల సన్నాహాలపై ఒకటి, రెండు రోజుల్లో సమావేశం జరపాలని సీఎం నిర్ణయించినట్లు తెలిసింది.

మరో ఇద్దరిపైనా తీవ్ర చర్యలు!

నేడు సభాపతికి సిఫార్సు చేయనున్న ప్రభుత్వం

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌ల సభ్యత్వాల్ని రద్దు చేసిన క్రమంలో మరో ఇద్దరు సభ్యులపైనా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. దీనిపై ప్రభుత్వం బుధవారం సభాపతికి సిఫార్సు చేయనున్నట్లు సమాచారం. శాసనసభలో ఇద్దరు సభ్యులపై బహిష్కరణ తీర్మానం అనంతరం మంత్రులు న్యాయ నిపుణులతో కలిసి సీసీటీవీ దృశ్యాల్ని పరిశీలించినట్లు తెలిసింది. ఇందులో వెంకటరెడ్డి, సంపత్‌లతోపాటు మరికొందరు కూడా దాడికి దిగినట్లు గుర్తించినట్లు సమాచారం. అప్పటికే శాసనసభ వాయిదా పడటంతోపాటు మొదటి ఇద్దరు సభ్యుల సభ్యత్వాల రద్దుకు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉన్నందున దానిపై దృష్టి సారించారు. మంగళవారం రాత్రి నోటిఫికేషన్ అనంతరం మిగిలిన ఇద్దరు సభ్యులపైనా చర్య తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెండో దఫా కఠిన చర్యల కోసం గుర్తించిన సభ్యులు ఎవరనే దానిపై ఉత్కంఠ నెలకొంది. సోమవారం సంఘటనల అనంతరం కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌లతో పాటు రామ్మోహన్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డిలపైనా మంత్రులు సీఎంకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సీసీటీవీ దృశ్యాల్లో గుర్తించిన వారిలో ఇందులోని ఇద్దరు ఉండొచ్చని సమాచారం. బుధవారం సభ ప్రారంభమైన వెంటనే వీరిపై చర్య తీసుకోవాలంటూ ప్రభుత్వం సభాపతిని కోరనున్నట్లు తెలిసింది.

పట్టణాభివృద్ధి సంస్థలకు పాలకమండళ్లు: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా సగటున 30 శాతం జనాభా పట్టణాల్లో నివసిస్తోందని, తెలంగాణలో మాత్రం పట్టణ జనాభా 40 శాతం దాటిందని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. శాసనమండలిలో మంగళవారం ప్రశ్నోత్తరాల్లో తెరాస ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నారదాసు లక్ష్మణరావు, భానుప్రసాదరావు ప్రశ్నలకు కేటీఆర్ స్పందిస్తూ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట పట్టణాభివృద్ధి సంస్థలకు త్వరలోనే పాలకమండళ్లను ఏర్పాటుచేస్తామని ప్రకటించారు.

హైకోర్టు ఆదేశాలను బట్టి పదోన్నతులపై నిర్ణయం: కడియం

రాష్ట్రపతి సవరణల ప్రకారం ఏకీకృత సర్వీసు నిబంధనల్ని అమలుచేయడానికి రాష్ట్రప్రభుత్వానికి అభ్యంతరం లేదని, అయితే ఈ విషయం హైకోర్టు విచారణలో ఉందని.. న్యాయస్థానం ఆదేశాలను బట్టి ఎంఈఓ పోస్టుల భర్తీ, ఉపాధ్యాయుల పదోన్నతులపై నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంతి కడియం శ్రీహరి చెప్పారు. హైకోర్టులో యథాతథస్థితి ఎత్తివేయించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని.. మార్చి 31న కేసు విచారణకు రావాలని అడ్వకేట్ జనరల్‌ను కోరినట్లు తెలిపారు. హైకోర్టు నిర్ణయం సానుకూలంగా వస్తే ఏప్రిల్, మే నెలల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చే అవకాశం ఉందన్నారు. భాజపా ఎమ్మెల్సీ రామచంద్రరావు మండలిలో అడిగిన ప్రశ్నకు కడియం సమాధానమిచ్చారు.

దోస్తులయ్యారు.. హైకోర్టును విభజించుకోవచ్చు: రామచంద్రరావు

కేసీఆర్ కిట్‌కు ఖర్చుచేస్తున్న నిధుల్లో సగం కేంద్ర ప్రభుత్వానివేనని.. రాష్ట్రానికి అనేక విధానాలుగా కేంద్రం సహాయం చేస్తున్నా ఈ విషయాన్ని గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించలేదని మండలిలో భాజపాపక్షనేత రామచంద్రరావు ఆక్షేపించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడుతూ.. టీఎస్‌పీఎస్సీ ఉద్యోగప్రకటనలపై కోర్టు కేసులు ఉండటంతో విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. తెరాస ఎమ్మెల్సీ భానుప్రసాదరావు మాట్లాడుతూ హైకోర్టు విభజనపై కేంద్రం స్పందించడం లేదన్నారు. రామచంద్రరావు స్పందిస్తూ, ఇప్పుడు ఇద్దరూ (తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు) దోస్తులయ్యారు. మాట్లాడుకుని విభజించుకోవచ్చన్నారు. అంతకుముందు ప్రభుత్వ చీఫ్‌విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు పెట్టుబడి సాయం ఏప్రిల్ 20న ఇవ్వబోతున్నామని చెప్పారు.

కాంగ్రెస్ నేతలు ఉగ్రవాదుల్లా ఆనందించారు

మంత్రి జగదీశ్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: శాసనసభలో సోమవారం జరిగిన దాడిలో మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌కు హెడ్‌సెట్ తగలగానే కాంగ్రెస్ నాయకులు ఉగ్రవాదుల మాదిరిగా ఆనందించారని మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం శాసనసభ ముగిసిన తర్వాత ఆయన మరో మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానాలు, వాళ్లు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. సభ్యులను సస్పెండ్ చేయడంతో పాటు అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకునే అధికారం కూడా సభాపతికి ఉందన్నారు. మంత్రి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ విషయంలో స్పీకర్ సమర్థంగా వ్యవహరించారన్నారు. రాష్ట్రంలో తెరాస పాలన చూసి ఓర్వలేకే కాంగ్రెస్ అవాస్తవాలు ప్రచారం చేస్తుందని తెరాస ఎమ్మెల్యేలు అన్నారు. ఉద్యమ సమయంలో హరీశ్‌రావు సభలో పేపర్లు చింపి, బెంచీ ఎక్కారని విమర్శించే వారు ఆయన చేసిన దానికి ప్రజామోదం ఉందని గుర్తించాలని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఇంతకన్న దారుణంగా వ్యవహరించిందని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్యేలు వేముల వీరేశం, భాస్కర్‌రావు, రామలింగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ వైఖరిని తప్పుబట్టారు.

ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించింది: కృష్ణయ్య

కాంగ్రెస్ ఎమ్మెల్యేల సభ్యత్వం రద్దు, సస్పెన్షన్ విషయంలో ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరించిందని తెదేపా ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. అంతకుముందు ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా ఏకపక్ష నిర్ణయం తీసుకున్నారన్నారు.

సభ్యులపై చర్యలను రద్దు చేయాలి: తమ్మినేని

ఈనాడు, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగానికి అడ్డుపడడం, తదనంతర పరిణామాల నేపథ్యంలో శాసనసభ్యులపై తీసుకున్న చర్యలపై గౌరవ శాసనసభ పునరాలోచించాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం కోరారు. ప్రభుత్వం పట్టుదలకు పోకుండా సభ్యులపై చర్యలను రద్దు చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

సభ్యత్వ రద్దుపై వివరణ తీసుకోవాల్సింది: చాడ

మహనీయులు హుందాతనంతో పెంచిన ప్రతిష్ఠను శాసనసభలో వింత పోకడలతో దిగజారుస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ శాసనసభ్యుల సభ్యత్వాలను రద్దు చేసే విషయంలో వారి అభిప్రాయాలను తెలుసుకునే ప్రయత్నం చేస్తే బాగుండేదని చెప్పారు.

కాంగ్రెస్ ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష

- 48 గంటల నిరాహార దీక్షకు దిగిన కోమటిరెడ్డి, సంపత్‌కుమార్
- శాసన సభ సభ్యత్వ రద్దుకు నిరసన
- 'కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో' అంటూ నినాదాలు

హైదరాబాద్ - న్యూస్‌టుడే

తమ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని నిరసిస్తూ శాసన సభ్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్‌లు దీక్షకు దిగారు. మంగళవారం సాయంత్రం గాంధీభవన్ ఆవరణలో ప్రజాస్వామ్య పరిరక్షణ దీక్ష పేరుతో చేపట్టిన 48 గంటల నిరాహారదీక్షను టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ శాసనసభాపక్షనేత జానారెడ్డిలు వారికి పూలదండలు వేసి ప్రారంభింపచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ పీసీసీ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. 'కేసీఆర్ హఠావో.. తెలంగాణ బచావో' నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేయడం దేశంలోనే తొలిసారిగా జరిగిందన్నారు. బ్రిటీష్ వాళ్లను తరిమేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అని, కేసీఆర్ ఓ లెక్క కాదని వ్యాఖ్యానించారు. సీఎల్పీ నేత జానారెడ్డి మాట్లాడుతూ..ప్రజా సమస్యలను ప్రశ్నించే వారిపై అణిచివేత ధోరణి అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాలన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రజల పక్షం ఉంటుందన్నారు. భట్టి విక్రమార్క, షబ్బీర్ అలీ, వీహెచ్, రేవంత్‌రెడ్డి, బలరాం నాయక్ తదితరులు మాట్లాడుతూ నియంత పాలనను కాంగ్రెస్ ఖండిస్తోందన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలను అరెస్టు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. స్పీకర్ నిర్ణయాన్ని పునఃపరిశీలించుకోవాలని, సభ్యత్వం రద్దు, సస్పెన్షన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.





శాసనసభ నుంచి సస్పెన్షన్‌కు నిరసనగా గాంధీభవన్‌లో నిరాహార దీక్ష చేపట్టిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సంపత్‌లకు మద్దతు తెలుపుతున్న ప్రతిపక్షనేత జానారెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో భట్టి విక్రమార్క, జీవన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, చిన్నారెడ్డి తదితరులు ★ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసినందుకు నిరసనగా గాంధీభవన్ వద్ద ప్లకార్డులతో యువజన కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

నియంత పాలనను తెలియజెప్పేందుకే: కోమటిరెడ్డి

కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ నియంత పాలనను ప్రజలకు తెలియచేయడానికే దీక్షకు దిగామన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలు, రాజకీయ హత్యలపై నిలదీస్తామనే తమ సభ్యత్వం రద్దు చేశారన్నారు.

ప్రజల్లో సభ్యత్వం ఉంది: సంపత్‌కుమార్

సంపత్ మాట్లాడుతూ.. సమస్యలపై పోరాడాలని నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించారన్నారు. చివరి బడ్జెట్ అయినందునే ప్రజలపక్షాన పోరాటం చేశామన్నారు. సభ్యత్వం రద్దయినా 4 కోట్లమంది ప్రజల్లో సభ్యత్వం ఉందని, ప్రభుత్వానికి ఆ సంగతి తెలియజేస్తామన్నారు.

మీరు చేస్తే ఒప్పు.. మేం చేస్తే తప్పా?: కుంతియా

ఈనాడు, దిల్లీ : పార్లమెంటు వెల్‌లోకి వెళ్లి తెరాస ఎంపీలు నిరసన వ్యక్తం చేస్తే ఒప్పు..అసెంబ్లీలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నిరసన వ్యక్తం చేస్తే తప్పా? అని తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఆర్‌సీ కుంతియా ప్రశ్నించారు. మంగళవారమిక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేయడం, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌ల శాసనసభ సభ్యత్వం రద్దుచేయడం అప్రజాస్వామికమన్నారు. కాంగ్రెస్ హయాంలో హరీశ్‌రావు వ్యవహరించిన తీరును ఓసారి గుర్తుతెచ్చుకోవాలని హితవు పలికారు. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై కోమటిరెడ్డి దాడి చేశారనడం అవాస్తవమన్నారు. సభలో గందరగోళ పరిస్థితుల నాటి సీసీటీవీ ఫుటేజీలు బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తెరాస ప్రభుత్వ చర్యను అన్ని పార్టీలు వ్యతిరేకించాలని కోరారు.

బలరాం నాయక్‌కు ఎంతమంది మద్దతిస్తారో తెలుస్తుంది: రాజ్యసభలో ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గిరిజనుడు బలరాం నాయక్‌ను నిలబెట్టినట్టు ఈ సందర్భంగా కుంతియా వెల్లడించారు. ప్రస్తుతం తెరాసలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా ఉన్నారని, గిరిజన వ్యక్తికి వాళ్లలో ఎంతమంది మద్దతు ఇస్తారో ఈ సందర్భంగా తేలుతుందన్నారు. 'ఇక్కడ సంఖ్యాబలం లెక్క కాదు. ఒక ఎస్టీకి ఎవరు? ఏవిధమైన మద్దతు ఇస్తారన్నదే లెక్క' అని వ్యాఖ్యానించారు.

స్వామిగౌడ్‌పై దాడి జరగలేదు

- అదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడించిన నాటకం
- టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ ధ్వజం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్, న్యూస్‌టుడే: మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై ఎలాంటి దాడి జరగలేదని, అదంతా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడించిన నాటకంలో భాగమని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. లేని అధికారాలను ఆపాదించుకొని స్పీకర్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని...ఆయనపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయడంతోపాటు..పార్లమెంటుకూ నివేదిస్తామని స్పష్టంచేశారు. సస్పెండ్ అయిన తర్వాత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'గతంలో అసెంబ్లీలో గవర్నర్‌పై దాడికి పాల్పడిన హరీశ్‌రావు..ఇప్పుడు శాసనసభా వ్యవహారాల మంత్రిగా కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సిఫారసు చేయడం హాస్యాస్పదంగా ఉంది. పోడియం వద్దకు వెళ్లి నిరసన తెలపడం సభ్యుల హక్కు. పార్లమెంటులో కేసీఆర్ కుమార్తె, ఎంపీ కవిత కూడా ఇదే విధంగా నిరసన తెలుపుతున్నారు. పార్లమెంటులో తెరాస ఎంపీలకు ఒక న్యాయం, అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులకు మరొక న్యాయం ఉంటుందా?. ఎడమవైపు నుంచి హెడ్‌ఫోన్ విసిరితే స్వామిగౌడ్ కుడి కన్నుకు గాయం ఎలా అవుతుంది. కళ్లజోడు పెట్టుకున్నా గాయం కావడం అనుమానాలకు తావిస్తోంది. ప్రసంగం అనంతరం గవర్నర్ వెళ్లిపోయే సమయంలోనూ స్వామిగౌడ్ బాగానే ఉన్నారు. ఆ విషయం కొన్ని వీడియోల్లో స్పష్టంగా కన్పిస్తోంది. నిజంగానే దాడి జరిగితే వీడియో ఫుటేజీలను ఎందుకు మీడియాకు విడుదల చేయడం లేదు. సభ్యుల హక్కులను కాపాడాల్సిన స్పీకర్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ ప్రజాస్వామ్యం, శాసనసభకు మచ్చ తెస్తున్నారు. స్పీకర్‌పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తాం.' అని ఉత్తమ్ పేర్కొన్నారు. ప్రతిపక్షం లేకుండా అసెంబ్లీని నడిపించుకోవడం ఎందుకని, టీఆర్ఎస్ భవన్‌కు మార్చుకోవాలని సూచించారు.

స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యంపై దాడి: భట్టి

స్పీకర్ నిర్ణయం ప్రజాస్వామ్యం మీద జరిగిన అతి పెద్ద మూకుమ్మడి దాడి. ఇలాంటి ధోరణి ప్రమాదకరం. సభ్యుల నుంచి కనీసం అభిప్రాయం తీసుకోకుండా, అఖిల పక్షాన్ని పిలిచి మాట్లాడకుండా, కమిటీ వేయకుండా నిందలు వేసి చర్యలు తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధం. స్పీకర్ నిర్ణయంపై న్యాయ పోరాటం చేస్తాం.

దుర్యోధనుని ఏకపాత్రాభినయంలా సీఎం తీరు: రేవంత్

రాష్ట్ర శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవహరిస్తోన్న తీరు.. మయసభలో దుర్యోధనుని ఏకపాత్రాభినయంలా ఉంది. కాంగ్రెస్ సభ్యులపై సస్పెన్షన్ విధించి వారి హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది.

కారణాలు అడగకుండానే శిక్షా: షబ్బీర్‌అలీ

ఉరిశిక్ష పడ్డవారికి కూడా ఆ శిక్ష ఎందుకు విధించారో కారణం చెబుతారు. ఇక్కడ మాత్రం కారణం చెప్పకుండా ఏకపక్షంగా ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్సీలను సస్పెండ్ చేశారు. మీ ఎంపీలు పార్లమెంటులో వెల్‌లోకి వెళ్లి నిరసన తెలపవచ్చు.. ఇక్కడి ప్రతిపక్ష సభ్యుల్ని మాత్రం వెల్‌లోకి వెళ్లనివ్వరా. ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వతీరును ఎండగడతాం.

ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి: రాజగోపాల్‌రెడ్డి

ఎలాంటి తప్పుచేయని పెద్దలసభ సభ్యుల్ని మూకుమ్మడిగా సస్పెండ్‌చేశారు. కేసీఆర్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి. ఈ విషయాన్ని గ్రహించే సీఎం జాతీయ రాజకీయాల్లోకి, దిల్లీకి వెళతానంటున్నారు.

అప్రజాస్వామికం: సీఎల్పీ ఉపనేత జీవన్‌రెడ్డి

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన సభ్యులపై చర్యలు తీసుకోలేని స్పీకర్.. తనకు లేని అధికారాలను చేతుల్లోకి తీసుకుని అప్రజాస్వామ్యంగా నిర్ణయం తీసుకోవడం దారుణం.

స్పీకర్ నిర్ణయంపై న్యాయస్థానానికి

- కాంగ్రెస్ నిర్ణయం

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఇద్దరు సభ్యుల శాసన సభ సభ్యత్వం రద్దు, మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బడ్జెట్ సమావేశాల వరకు సస్పెండ్ చేయడాన్ని న్యాయపరంగా ఎదుర్కొనేందుకు ఉన్న మార్గాలను కాంగ్రెస్ పార్టీ పరిశీలిస్తోంది. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ న్యాయ స్థానాన్ని ఆశ్రయించాలని నిర్ణయించింది. సస్పెన్షన్ అనంతరం సీఎల్పీ నేత జానారెడ్డి ఛాంబర్‌లో జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, భట్టివిక్రమార్క, షబ్బీర్‌అలీ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్‌కుమార్ సహా ఇతర సభ్యులు సమావేశమై సమాలోచనలు జరిపారు. ప్రభుత్వం కావాలనే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. మూకుమ్మడి రాజీనామాలు చేసి ప్రజల్లోకి వెళ్తే బాగుంటుందని, దూకుడుగా వ్యవహరించాలని కొందరు సూచించినట్లు తెలిసింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యుడు రామచంద్ర కుంతియాను ఫోన్‌లో సంప్రదించి..జరిగిన, జరుగుతున్న పరిణామాలను వివరించారు. ఈ సందర్భంగా మూకుమ్మడి రాజీనామాలు చేయాలనే ఆలోచనను కుంతియాకు తెలియచేశారు. ఈ అంశాన్ని అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని, అప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని కుంతియా చెప్పినట్లు తెలిసింది. ఇదే సమయంలో స్పీకర్ నిర్ణయంపై న్యాయ పోరాటం చేసే అంశంపైనా నేతలు చర్చించారు. పలువురు న్యాయ నిపుణులతోనూ సంప్రదించారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడిన ప్రతినిధుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం స్పీకర్‌కు ఉంటుందా? ఇది గవర్నర్ పరిధిలోకి వస్తుందా? అనే అంశాలపై వారి అభిప్రాయాలు, సలహాలు తీసుకున్నారు. న్యాయవాది జంధ్యాల రవిశంకర్‌ను పిలిపించుకొని సుదీర్ఘంగా చర్చించారు. చివరికి స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ బుధవారం హైకోర్టులో పిటిషన్ వేయాలని నిర్ణయించారు. అనంతరం జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు బీజేఎల్పీ, టీడీఎల్పీ కార్యాలయాలకు వెళ్లి ఆయా పార్టీల సభ్యులను కలిసి వారి మద్దతు కోరారు. మరోవైపు స్పీకర్ నిర్ణయం వెలువడిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ..శ్రేణులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు యువజన కాంగ్రెస్ నేతలు నాంపల్లిలోని గాంధీభవన్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయగా..పోలీసులు అరెస్టు చేశారు. ఇతర జిల్లాల్లోనూ కాంగ్రెస్ కార్యకర్తలు ఆందోళనలకు దిగారు.

రాజ్యసభ నామపత్రాల పరిశీలన పూర్తి

తెరాస, కాంగ్రెస్ అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జరుగుతున్న రాజ్యసభ ఎన్నికలకు దాఖలైన నామపత్రాల పరిశీలన మంగళవారం పూర్తయింది. తెరాస అభ్యర్థులు సంతోష్‌కుమార్, బండా ప్రకాశ్ ముదిరాజ్, బడుగుల లింగయ్య యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ల నామపత్రాలు నిబంధనల మేరకు ఉండడంతో వాటిని ఆమోదించారు. శాసనసభ్యులెవరూ ప్రతిపాదించకపోవడంతో స్వతంత్ర అభ్యర్థి జాజుల భాస్కర్ నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులు తిరస్కరించారు. దీంతో 3 స్థానాలకు నలుగురు అభ్యర్థులు రంగంలో మిగిలారు. ఈ నెల 15 వరకు ఉపసంహరణకు అవకాశముంది. ఆ తర్వాత నలుగురు అభ్యర్థులు కొనసాగితే 23న ఎన్నికలు జరుగుతాయి.

సభ్యుల హక్కులను కాలరాస్తున్నారు: లక్ష్మణ్

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: కాంగ్రెస్ శాసనసభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడం అప్రజాస్వామికమని, సభ్యుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని భాజపా రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మణ్ ప్రశ్నించారు. ఉమ్మడి రాష్ట్రంలో తొలగించిన హోంగార్డులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ హోంగార్డుల సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. దీనికి విచ్చేసిన లక్ష్మణ్ మాట్లాడుతూ. . ప్రభుత్వం అహంకారపూరితంగా వ్యవహరిస్తోందని, 2019 రాజకీయ తుపానులో కొట్టుకునిపోవడం ఖాయమన్నారు. సమైక్య రాష్ట్రంలో జరిగిన అన్యాయమే స్వరాష్ట్రంలోనూ పునరావృతమవుతోందన్నారు.

సస్పెన్షన్ అప్రజాస్వామికం: కిషన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగిస్తుండగా సభలో జరిగిన ఘటనలపై విచారణ లేకుండా కాంగ్రెస్ సభ్యులపై చర్యలు తీసుకోవడం అప్రజాస్వామికమని భాజపా శాసనసభాపక్ష నేత కిషన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో జరిగిన ఘటనకు సంబంధం లేని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డిపైనా సస్పెన్షన్ విధించారని.. ఆయన కనీసం కుర్చీలోంచి కూడా లేవలేదన్నారు. గవర్నర్‌పై కాగితాలు, మైక్‌లు, హెడ్‌సెట్‌లు విసరడాన్ని భాజపా సమర్థించదనీ, శాసనసభ నైతిక కమిటీ ద్వారా విచారణ చేయించి.. మిగతా పార్టీల సభ్యులతో మాట్లాడించాక నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందన్నారు. ఎంపీ కవిత నేతృత్వంలో పార్లమెంటు సభ్యులు స్పీకర్ ముఖంపై ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారని.. ఇదే విషయాన్ని శాసనసభలో ప్రస్తావిస్తే సీఎం ఒంటికాలిపై లేచి.. అగ్గిమీద గుగ్గిలమయ్యారన్నారు. భాజపా నేతలు కాంగ్రెస్‌తో కలుస్తారా అని సీఎం వ్యాఖ్యానించారని.. కానీ కేసీఆరే గతంలో ఆ పార్టీలో పని చేశారని.. పొత్తు కూడా పెట్టుకున్నారని అన్నారు. నియమావళికి విరుద్ధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారని.. నిరసనగా సభను బహిష్కరించామని తెలిపారు.

విపక్షాలతో మాట్లాడి ఉంటే బాగుండేది: దాడి ఘటనపై శాసనసభలో జరిగిన చర్చలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. సభలో ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. చర్యలు తీసుకునేటప్పుడు విపక్షాలతో మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. కాంగ్రెస్ సభ్యుల ఆందోళన సమయంలో జానారెడ్డి సంయమనంతోనే ఉన్నారని, ఆయనపై చర్య తీసుకోవడం సరికాదన్నారు. 'దేశంలోని అన్ని శాసనసభలకు పార్లమెంటు ఆదర్శం. రాష్ట్రానికి చెందిన అధికార పార్టీ సభ్యులు ప్లకార్డులతో అక్కడ ఆందోళనలు చేయడం లేదా?' అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై సీఎం అభ్యంతరం చెప్పగా.. 'ఇంత అసహనం మంచిది కాదు. కాంగ్రెస్ సభ్యుల తీరును నేనూ వ్యతిరేకిస్తున్నా. క్రమశిక్షణగా కూర్చున్న జానారెడ్డిపై చర్య తీసుకోవడం సరికాదనే నేను అంటున్నా' అని కిషన్‌రెడ్డి అన్నారు.

కేసీఆర్‌ను మరోసారి సీఎంగా చూడాలని ఉంది

- శాసనసభలో అక్బరుద్దీన్ ఒవైసీ
- ముఖ్యమంత్రి ప్రజలకు సమయం కేటాయించాలని సూచన
- ఉద్యోగ పరీక్షలు ఉర్దూ మాధ్యమంలో నిర్వహించాలని డిమాండ్
- కాంగ్రెస్ సభ్యులపై చర్యలు సమర్థనీయమేనని వ్యాఖ్య

ఈనాడు, హైదరాబాద్: కేసీఆర్ ప్రకటించిన మూడో కూటమి నిర్ణయంతో ఈ దఫా జాతీయ రాజకీయాల్లో తెలంగాణ కీలక (కింగ్ మేకర్) పాత్ర పోషించడం ఖాయమని శాసనసభలో ఎంఐఎం శాసనసభ పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. తెలంగాణలో అధికారం మాదేనంటూ కాంగ్రెస్ పగటి కలలు కంటోందన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెరాస, ఎంఐఎంలు హవా కొనసాగిస్తాయన్నారు.



గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని శాసనసభలో మంగళవారం చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ ప్రవేశపెట్టారు. అనంతరం అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ 70 ఏళ్లపాటు ప్రజలను మోసం చేసిందన్నారు. కేసీఆర్‌ను 2019లోనూ ముఖ్యమంత్రిగా చూడాలని ఉందన్నారు. కేసీఆర్ ప్రజలకు కాస్త సమయం కేటాయించాలని, వారికి దగ్గరవ్వాలని సూచించారు. పలు సమస్యలపైనా ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నగదు కొరత రాష్ట్రంలో తీవ్రంగా ఉందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాలని సూచించారు. హైదరాబాద్‌కు మోనో రైలు కావాలని దివంగత నేత జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేయగా.. మెట్రో రైలు కావాలని తాను అడిగానన్నారు. అయినా పాతబస్తీకి మెట్రో రైలు రాలేదన్నారు. 'తాము మార్గం మార్చాలని అడిగితే కుదరదన్నారు. మరి పాతమార్గంలోనైనా మెట్రో వస్తుందా?' అని ప్రశ్నించారు. ఒకవైపు ఉర్దూను రెండో అధికార భాషగా మార్చిన ప్రభుత్వం మరోవైపు ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలలను ఆంగ్ల మాధ్యమంలోకి మార్చడమేంటని నిలదీశారు. ప్రవేశ పరీక్షల మాదిరిగానే ఉద్యోగ పరీక్షలను కూడా ఉర్దూలో నిర్వహించాలన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

సభలో గవర్నర్, మండలి ఛైర్మన్‌లపై జరిగిన దాడి ఘటనపై విచారణ జరిపించాలని సభాపతిని కోరారు. సోమవారం సభ చరిత్రలో బ్లాక్‌డేగా మిగిలిపోతుందన్నారు. కాంగ్రెస్ సభ్యులపై చర్యలను సమర్థిస్తున్నట్టు చెప్పారు. ఘటన తాలూకూ దృశ్యాలను మీడియా ముందు ప్రదర్శించాలని కోరారు. దేశంలో ఎక్కడా విజయాలు లభించకపోవడంతో కాంగ్రెస్‌లో అసహనం పెరిగిపోతోందన్నారు. 'ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించలేని పక్షంలో సభ నుంచి వాకౌట్ చేయొచ్చు. ప్రజల మధ్యకు వెళ్లే అవకాశమూ ఉంది. అందుకు భిన్నంగా కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తన సరికాదు. సభలో ప్లకార్డులు ఉపయోగించడం దేనికి' అనివ్యాఖ్యానించారు.

సీఎం పనితీరుకు అద్దం: కొప్పుల ఈశ్వర్

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం ప్రవేశపెట్టిన చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ..గవర్నర్ ప్రసంగం సీఎం పనితీరుకు, రాష్ట్ర అభివృద్ధికి దర్పణం పట్టిందన్నారు. వృద్ధి రేటు, తలసరి ఆదాయంలో రాష్ట్రం జాతీయ సగటు కంటే ఎంతో మెరుగ్గా ఉందన్నారు. ఇదే సందర్భంగా తెరాస ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకునే నిర్ణయాలతో..ఎప్పటికీ తెలంగాణ దేశంలో ప్రథమ స్థానంలో నిలుస్తుందన్నారు. ఒకప్పుడు నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువులకు నిలయమైన ఈ ప్రాంతంలో ఇప్పుడు నకిలీ విత్తనం కన్పించడం లేదన్నారు. అక్రమార్కులపై పీడీ చట్టం ప్రయోగించడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూడాలని ఉంది. స్పీకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలందరినీ తీసుకెళ్తే బాగుంటుందని సూచించారు.

శక్తిమంతమైన తెలంగాణ మా లక్ష్యం



- వ్యవసాయం, సాగునీరు, సంక్షేమానికి ప్రాధాన్యం
- నోట్ల రద్దు.. జీఎస్టీ ప్రభావం నుంచి బయటపడతాం
- కేంద్ర ప్రభుత్వంపై విశ్వాసం లేదు
- పెట్టుబడి పథకానికి రూ.12 వేల కోట్లు
- 'ఈనాడు-ఈటీవీ'తో రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్

ఈనాడు - హైదరాబాద్

శక్తిమంతమైన తెలంగాణను తీర్చిదిద్దే దిశగానే 2018-19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ఉంటుందని ఆర్థికమంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఇన్ని ప్రత్యేక పథకాలు అమలు చేసుకోవచ్చా? అనిపించేలా నాలుగేళ్ల తెరాస ప్రభుత్వ బడ్జెట్ సాగిందని దీనికి కొనసాగింపుగానే ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకత్వంలో ముందుకు వెళ్తోందన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు ఈ బడ్జెట్‌లోనూ పెద్దపీట ఉంటుందని వివరించారు. కేంద్రం నుంచి తోడ్పాటు లేదని మున్ముందు కూడా ఉంటుందనే విశ్వాసం లేదని రాష్ట్ర బడ్జెట్ నేపథ్యంలో మంగళవారం మంత్రి ఈటల 'ఈనాడు-ఈటీవీ' ముఖాముఖిలో తెలిపారు.

2018-19 బడ్జెట్ ప్రత్యేకత ఏమిటి?

తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా ఆధారపడిన వ్యవసాయం, అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఉంటుంది. సాగునీరు, సంక్షేమానికి నిధుల కేటాయింపులు పెరగనున్నాయి. రాష్ట్ర బడ్జెట్ అంటే అది ఏడాది ప్రణాళికే కాదు. అయిదేళ్ల ప్రణాళిక. తెరాస ప్రభుత్వం అయిదేళ్లలో ఏంచేయాలనే లక్ష్యాలను నిర్దేశించుకుని వస్తున్నాం. దీనికి కొనసాగింపుగానే ప్రస్తుత బడ్జెట్ ఉంటుంది. పెట్టుబడి పథకానికి ఈ బడ్జెట్‌లో రూ.11 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల మేరకు కేటాయింపులు ఉంటాయి. రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు తగ్గాయి. విద్యుత్ సమస్యల నుంచి రైతులు పూర్తిగా బయటపడ్డారు. ఈ బడ్జెట్‌లో పెట్టుబడి పథకానికి రైతులకు అందించేందుకు రూ.12 వేల కోట్ల మేర కేటాయింపులు ఉంటాయి.

సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఎలా ఉండబోతోంది

సంక్షేమ రంగానికి కేటాయింపులను పెంచుకుంటూ వెళ్లడమే తప్ప పథకాలను ఉపసంహరించుకునే పరిస్థితి ఎంతమాత్రం ఉండదు. కొత్త పథకాలు, కార్యక్రమాలతో రాష్ట్రప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోంది. పాతవాటితో పాటు కొత్తగా పథకాలను ప్రభుత్వం తీసుకువస్తోంది. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతే లక్ష్యంగా సంక్షేమ రంగానికి కేటాయింపులుంటాయి.

రాష్ట్ర బడ్జెట్‌పై జీఎస్టీ ప్రభావం ఎలా ఉంది?

జీఎస్టీ అనంతరం ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్ ఇది. నోట్ల రద్దు ప్రభావంతో పాటు ఈఏడాది జీఎస్టీ వల్ల రాష్ట్ర రాబడి కొంత దెబ్బతిన్న మాట వాస్తవమే. నోట్ల రద్దు ప్రభావం నుంచి బయటపడుతున్నాం. జీఎస్టీ పరిధిలో లేని రాబడులు సహా స్టాంపులు రిజిస్ట్రేషన్లు, మోటారు వాహనాల పన్ను, ఎక్సైజ్ వంటివాటి రాబడి పెరగడం పరిస్థితిని తట్టుకునేలా చేసింది. దీంతోపాటు ఐజీఎస్టీ, సీజీఎస్టీ, జీఎస్టీ రాబడి పెరగడం వంటివి సానుకూలంగా తోడయ్యాయి. నోట్లరద్దు, జీఎస్టీ ప్రభావాల నుంచి బయటపడి వచ్చేఏడాది ఆర్థిక పరిస్థితి మరింత బావుంటుంది.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఏం చేయనున్నారు

తెలంగాణలో వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాం. ప్రైవేటు రంగంలో ఉద్యోగాల కల్పనకు పరిశ్రమల ఏర్పాటుకు టీఎస్ఐపాస్ వంటి ప్రత్యేక విధానాలను తెచ్చాం. ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేస్తున్నాం. యువత స్వయం ఉపాధి పథకాలకు పెద్దమొత్తంలో రాయితీ ఇస్తున్నాం.

కేటాయింపులు ఉన్నా నిధుల వ్యయం ఉండటం లేదనే విమర్శ ఉంది?

రాష్ట్రప్రభుత్వం కేటాయింపుల మేరకు వ్యయం ఉంటుంది. సాగునీటికి రూ.25 వేల కోట్లు కేటాయించాం. ఈసారి బడ్జెట్ కేటాయింపులతో పాటు బయట తీసుకున్న రుణాల ద్వారా రూ.25 వేలకోట్లు వ్యయం అవుతుంది.

రాష్ట్రంపై రుణభారం పెరగడం సమస్య కాదా?

అభివృద్ధికి ఆర్థిక తోడ్పాటు అవసరమే. ఈ నేపథ్యంలోనే రాష్ట్రం కీలక రంగాలకు రుణాలను, నిధులను సమకూర్చుకుంటోంది. తీసుకుంటున్న రుణాలను అనుత్పాదకత రంగాలపై పెట్టడంలేదు. ఆస్తులను సృష్టించడానికే వ్యయం చేస్తున్నాం. తద్వారా సంపదతో పాటు, రాష్ట్ర స్థూలఉత్పత్తి పెరుగుతుంది.

బడ్జెట్‌కు కేంద్రం తోడ్పాటు ఎలా ఉంది?

కేంద్ర ప్రభుత్వం నుంచి పన్నుల వాటాగా వస్తున్న 2.43 శాతంతో పాటు కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు కేంద్రం వాటాగా అందివస్తున్న నిధులు తప్ప ప్రత్యేకంగా ఏమీ ఇవ్వడంలేదు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథకు నిధులివ్వాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసినా కేంద్రం నిధులు ఇవ్వక పోవడం బాధాకరం. అభివృద్ధిపథంలో ముందుకు వెళ్తున్న రాష్ట్రాలకు కేంద్రం తోడ్పాటు తప్పనిసరిగా ఉండాలి. కేంద్రం నుంచి ఈతోడ్పాటు అందుతుందనే విశ్వాసం లేదు.

ఘనంగా ఎంపీ కవిత పుట్టినరోజు వేడుకలు

తెలుగులో ప్రధాని శుభాకాంక్షల లేఖ

ఈనాడు, హైదరాబాద్: నిజామాబాద్ తెరాస ఎంపీ, తెలంగాణ జాగృతి సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణతో పాటు దిల్లీలో, విదేశాల్లో ఘనంగా జరిగాయి. ప్రధాని మోదీ ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ తెలుగులో లేఖ పంపారు. ప్రజలకు సేవలందించేందుకు వీలుగా ఆరోగ్యకర, ఆనందమయ జీవితాన్ని భగవంతుడు ఆమెకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో జాగృతి, తెరాసల ఆధ్వర్యంలో తెలంగాణభవన్, తెరాస శాసనసభాపక్ష కార్యాలయంతో పాటు పలు సంస్థల్లో ఉత్సవాలను నిర్వహించారు. రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 'జయహో జననీ నీరాజనం' పేరిట జాగృతి రాష్ట్ర నాయకుడు రాజీవ్‌సాగర్ రూపొందించిన వీడియో పాటల సీడీని ప్రభుత్వ సలహాదారు రమణాచారి, తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మన్ నందిని సిధారెడ్డిలు ఆవిష్కరించారు. ఆస్ట్రేలియాలో తెరాస శాఖ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. బ్రిటన్‌లో జాగృతి అధ్యక్షుడు బల్మూరి సుమన్ నేతృత్వంలో సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన శిబిరం నిర్వహించారు.



ఎంపీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని పంపిన లేఖ

నేడు తెలంగాణ మంత్రిమండలి సమావేశం

వార్షిక బడ్జెట్‌కు ఆమోదం.. 6 బిల్లులపై చర్చ

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ మంత్రిమండలి సమావేశం ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం అయిదు గంటలకు ప్రగతిభవన్‌లో జరగనుంది. ఇందులో 2018-19 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించనున్నారు. గురువారం(15న) శాసనసభ, మండలిలో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఆనవాయితీ ప్రకారం బడ్జెట్‌ను మంత్రిమండలిలో ఆమోదం తెలపాల్సి ఉంది. దీంతో పాటు శాసనసభలో ప్రవేశపెట్టేందుకు ఆరు బిల్లులకు అనుమతిస్తారు. కొత్త పంచాయతీరాజ్ చట్టంపై బిల్లు, పోలీసు దళాల అధిపతి అయిన డీజీపీని రాష్ట్రమే నియమించుకునే అధికారం, పురపాలక సంఘాలలో గ్రామాల విలీనం, బోధన భాషగా తెలుగు, అసైన్డ్ భూముల క్రమబద్ధీకరణ, పీజీ వైద్య విద్యార్థులకు ప్రభుత్వ సర్వీసు మినహాయింపు తదితర బిల్లులు ఇందులో ఉన్నాయి. దీంతో పాటు వివిధ కేటాయింపులు, అనుమతులు ఇతర అంశాలకు సంబంధించి మరో 25 అంశాలు మంత్రిమండలి సమావేశంలో చర్చించనున్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ ఆరోగ్య రికార్డు

ఏప్రిల్ ఒకటి నుంచి వైద్య శిబిరాలు: లక్ష్మారెడ్డి

ఈనాడు, హైదరాబాద్: ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య రికార్డును ఆన్‌లైన్‌లో ఏర్పాటుచేయనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.హెచ్.లక్ష్మారెడ్డి తెలిపారు. మంగళవారం శాసనసభ ప్రశ్నోత్తరాల్లో శ్రీనివాస్‌గౌడ్, పువ్వాడ అజయ్‌కుమార్, జీవన్‌రెడ్డి, కమలాకర్ వైద్య సౌకర్యాలపై అడిగిన ప్రశ్నకు లక్ష్మారెడ్డి సమాధానం ఇచ్చారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ఆసుపత్రులను ఆధునికీకరించి బలోపేతం చేసినట్లు తెలిపారు.

★ హైకోర్టు విభజన వేగంగా పూర్తయ్యేలా ప్రభుత్వం చొరవ చూపాలని ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కోరారు. విభజనపై ఇప్పటికే హైకోర్టుకు చెందిన ఆరుగురు న్యాయమూర్తుల కమిటీ విజయవాడ వెళ్లి అక్కడి పరిస్థితులను పరిశీలించి వచ్చిందని న్యాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. న్యాయ విభాగంలో పోస్టుల భర్తీ ప్రక్రియను కోర్టులే నిర్వహిస్తాయని, ప్రభుత్వం జోక్యం చేసుకోదని స్పష్టం చేశారు.

★ గొర్రెల పంపిణీలో అక్రమాలు జరిగాయంటూ దుర్గం చిన్నయ్య, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్య యాదవ్ అడిగిన ప్రశ్నలపై పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ జవాబిస్తూ.. 2.40 లక్షల లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కొన్నిచోట్ల పునఃపంపిణీ జరిగినట్లు తేలడంతో ఆరు కేసులు నమోదు చేశామన్నారు.

అర్చకుల సమస్యలను పరిష్కరించాలి

దేవాలయ అర్చక, ఉద్యోగుల ఐకాస వినతి

రాష్ట్రంలోని అర్చకుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని దేవాదాయ అర్చక, ఉద్యోగుల ఐకాస అధ్యక్షుడు గంగు భానుమూర్తి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషిని కోరారు. ఐకాస నేతలు కృష్ణమాచారి, జనమంచి శ్యామ్ ప్రసాద్‌శర్మ, సుబ్రహ్మణ్యశర్మ, అంబా ప్రసాద్‌లతో మంగళవారం సచివాలయంలో సీఎస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఒకే పద్దు కింద అర్చకులందరికీ వేతనాలు చెల్లించాలని, త్వరితగతిన దీనిని అమలు చేయాలన్నారు. సీఎం హామీలన్నింటిని అమలు చేయించాలన్నారు.

సహకార బ్యాంకుల విలీనంపై పోరు

- డీసీసీబీలను టీఎస్‌క్యాబ్‌లో కలపాలని పట్టు
- వద్దని వ్యతిరేకిస్తున్న టీఎస్‌క్యాబ్ ఉద్యోగులు

ఈనాడు - హైదరాబాద్

సహకార బ్యాంకుల విలీనంపై తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ)లను తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టీఎస్ క్యాబ్)లో కలిపేయాలని ఒక వర్గం, వద్దని మరో వర్గం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ రెండు వాదనలకు అనుగుణంగా ఎవరికి వారు మంత్రుల ద్వారా తమ ప్రయత్నాలు చేస్తున్నారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లో సహకార బ్యాంకుల్లో మూడంచల వ్యవస్థ ఉండగా ఈశాన్య, కేరళ రాష్ట్రాలతో పాటు పలు కేంద్ర పాలిత ప్రాంతాల్లో రెండంచల వ్యవస్థతో పనిచేస్తున్నాయి. తెలంగాణ లో సైతం డీసీసీబీలను టీఎస్‌క్యాబ్‌లో విలీనం చేసి రెండంచల వ్యవస్థను తేవాలని డీసీసీబీల ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. దీన్ని టీఎస్‌క్యాబ్ ఉద్యోగ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. విలీనం వల్ల రైతులకు పంటరుణాలపై వడ్డీ భారం తగ్గుతుందని చెపుతున్నందున ప్రభుత్వం సైతం ఈ ప్రతిపాదనలపై పరిశీలన జరుపుతోంది.

ఎందుకీ వివాదం...

రాష్ట్రస్థాయిలో టీఎస్ క్యాబ్ ప్రధాన కార్యాలయంతో రాష్ట్రవ్యాప్తంగా సొంతంగా శాఖలను కలిగి ఉంది. ఒక డీసీసీబీ అంటే పాత 9 జిల్లా కేంద్రాల్లో ప్రధాన కార్యాలయాలు, వాటి జిల్లా పరిధిలో శాఖలున్నాయి. వాటి కింద 'ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు'(ప్యాక్స్) రైతులకు పంటరుణాలిస్తున్నాయి. ఈ మూడు విడివిడిగా పనిచేస్తున్నందున మూడంచల వ్యవస్థగా పిలుస్తారు. నాబార్డు నుంచి నిధులను 4.5 శాతం వడ్డీకి టీఎస్‌క్యాబ్ తీసుకుని కమీషన్ కింద మరో 0.5 శాతం కలిపి డీసీసీబీకిస్తోంది. తమకు 5 శాతం వడ్డీకి అందిన ఈ నిధులపై మరో శాతం కలిపి 6 శాతం వడ్డీకి ప్యాక్స్‌కు డీసీసీబీ ఇస్తోంది. తమకు 6 శాతానికి వడ్డీకి అందిన నిధులకు మరోక శాతం వడ్డీని కలిపి మొత్తం 7 శాతానికి రైతుకు పంట రుణంగా ప్యాక్స్ ఇస్తోంది. ఈ మూడంచల వ్యవస్థ వల్ల డీసీసీబీ తీసుకునే ఒక శాతం వడ్డీని తగ్గించాలంటే దానిని టీఎస్‌క్యాబ్‌లో కలిపేయడమే ఉత్తమమని, తద్వారా 6 శాతం వడ్డీకే పంటరుణం రైతులకు ఇవ్వడం ద్వారా వడ్డీ భారం తగ్గుతుందని డీసీసీబీ వర్గాలు వాదిస్తున్నాయి. అయితే కొన్ని డీసీసీబీలు, ప్యాక్స్ ఆర్థిక పరిస్థితి బాగా లేదని.. వాటిని విలీనం చేస్తే నిర్వహణ వ్యయం పెరిగి టీఎస్‌క్యాబ్ ఆర్థిక పరిస్థితి తారుమారు కానుందని... అప్పుడు నాబార్డు నుంచి నిధులు రావని టీఎస్‌క్యాబ్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో విలీనాన్ని అడ్డుకోవాలని సహకార శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి టీఎస్‌క్యాబ్ ఉద్యోగులు తాజాగా విన్నవించారు.



బీసీ సంక్షేమంపై అసెంబ్లీ కమిటీ హాల్‌లో సమావేశమైన మంత్రులు హరీశ్‌రావు, పద్మారావు, కేటీఆర్, జోగురామన్న

గీతన్నలకు చేయూత

మంత్రి వర్గ ఉపసంఘం సిఫార్సులు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని కల్లుగీత కార్మికులకు పెద్దఎత్తున సంక్షేమ చర్యలు చేపట్టాలని మంత్రి వర్గ ఉపసంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు పలు సిఫార్సులకు ఆమోదం తెలిపింది. మంగళవారం శాసనసభ కమిటీ హాలులో జరిగిన సమావేశానికి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జోగురామన్న, పద్మారావు, ఎంపీ బూరనర్సయ్య, ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీలు వీజీగౌడ్, బాలసాని లక్ష్మీనారాయణ, ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి సోమేశ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయాలని కోరగా ఉపసంఘం అంగీకరించింది. కల్లు, నీరా ఉత్పత్తులకు పరిశ్రమ హోదా కల్పన, 5 కోట్ల ఈత మొక్కలు నాటాలని, మొక్కల పెంపకానికి 90 శాతం సబ్సిడీ ఇవ్వాలని, ప్రమాదవశాత్తూ మరణించే కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, అంగవైకల్యం పొందితే రూ. 5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని అధికారులకు సూచించింది. గౌడ భవనం నిర్మాణం కోసం రూ. 10 ఎకరాలు, రూ. 25 కోట్లను మంజూరు చేయాలని ఎంపీ, ఎమ్మెల్యేలు కోరగా దీనిని సీఎం దృష్టికి తీసుకెళ్తామంది.

వైకాపాతో రహస్య ఒప్పందాల్లేవు: విష్ణుకుమార్‌రాజు

ఈనాడు, అమరావతి: వైకాపా నేత జగన్మోహన్‌రెడ్డితో తమ పార్టీకి ఎలాంటి రహస్య ఒప్పందాలు లేవని, అలాంటివి ఏమైనా ఉంటే మీకే చెబుతామని అసెంబ్లీలో భాజపా శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్‌రాజు అన్నారు. '2104 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు'పై జరిగిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖకు రైల్వే జోన్ రావడం లేదని అధికారులు ఎలా చెబుతారు? రాష్ట్రాభివృద్ధికి ఇబ్బంది, ప్రజల్లో అభద్రతాభావం, ఆందోళన కలిగించేలా కొందరు ప్రయత్నించడం శోచనీయమన్నారు.

రెండు విడతల రిజర్వేషన్ ఖరారు

- పంచాయతీల్లో 2018, 2023లలో అమలు
- ప్రస్తుత సమావేశాల్లో పంచాయతీ రాజ్ బిల్లు

ఈనాడు, హైదరాబాద్: గ్రామ పంచాయతీల్లోని సర్పంచిలు, వార్డు సభ్యులకు వరసగా రెండు విడతల పాటు ఒకే తరహా రిజర్వేషన్లు అమలయ్యే విధానం ఖరాయ్యింది. ప్రస్తుత 2018లో నిర్వహించే ఎన్నికల్లో నిర్ధరించే రిజర్వేషన్లు తిరిగి 2023లోనూ కొనసాగుతాయి. దీంతో పాటు గ్రామాల్లో ఇష్టానుసారంగా వ్యవహరించేవారికి ఇక జరిమానాలు పడనున్నాయి. పరిసరాలను అపరిశుభ్రపర్చటం వంటి 22 అంశాలు జరిమానాల పరిధిలోకి రానున్నాయి. పలు అంశాలతో తెలంగాణ నూతన పంచాయతీరాజ్ బిల్లును ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో సర్కారు ప్రవేశపెట్టనుంది. మరోవైపు.. సర్పంచి పదవులకు ఇప్పటి మాదిరిగా ప్రత్యక్ష ఎన్నికల విధానాన్నే అనుసరించాలని సర్కారు భావిస్తోంది.

బిల్లులోని ముఖ్యాంశాలు ఇలా..

★ 2018లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళ రిజర్వేషన్ల స్థానాలుగా ఏవైతే పంచాయతీలు, వార్డులు వస్తాయో తిరిగి 2023లోనూ అవి అదే తరహా స్థానాలుగా ఉంటాయి.


★ సర్పంచికి కార్యనిర్వహణ అధికారాలూ లభిస్తాయి. సర్పంచి, వార్డు సభ్యుల బాధ్యతలపై మరింత స్పష్టత ఏర్పడుతుంది.

★ ఏ పనిని ఎన్ని రోజుల్లోగా చేయాలో వివరించే పౌర సేవా పత్రాలు అమల్లోకి వస్తాయి. ప్రజల హక్కులను బిల్లులో విపులీకరించనున్నారు.

★ పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవాలంటే ఇక గ్రామ పంచాయతీ నుంచి అనుమతి పొందాల్సిన అవసరం ఉండదు.

★ బిల్లును ఉభయ సభలు ఆమోదించిన తర్వాత చట్టం అమల్లోకి వస్తుంది.

కేంద్రం అనుకుంటే ఏదైనా సాధ్యమే!



- రాజకీయ నిర్ణయాలు తీసుకోలేరా?
- సెంటిమెంట్‌ను అప్పుడు గౌరవించి ఇప్పుడు తిరస్కరిస్తారా?
- అసెంబ్లీలో కేంద్రంపై నిప్పులు చెరిగిన చంద్రబాబు

ఈనాడు - అమరావతి

విభజన హామీల అమలు విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా మరోసారి నిప్పులు చెరిగారు. కష్టాల్లో ఉన్న రాష్ట్రంపై పుండు మీద కారం జల్లే విధంగా వ్యవహరిస్తారా? అని నిలదీశారు. శాసనసభలో మంగళవారం సాయంత్రం గంటన్నరపాటు ఆయన '2014 ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమలు'పై చర్చ సందర్భంగా మాట్లాడారు. కేంద్రం తలచుకుంటే ఏదైనా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కొన్ని నిర్ణయాలు రాజకీయంగా తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వొద్దని కేంద్రానికి సూచించలేదని, కేంద్రం ఎప్పుడైనా ఇవ్వొచ్చని 14వ ఆర్థిక సంఘ ఛైర్మన్ వైవీ రెడ్డి ఓ ఇంటర్వ్యూలో, సంఘ సభ్యుడు గోపాలరావు మరో సందర్భంగా స్పష్టంగా చెప్పారన్నారు. అయినప్పటికీ 14వ ఆర్థిక సంఘం ఇవ్వొద్దన్న కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేకపోయామని కేంద్రం చెప్పడం ఎంతవరకు భావ్యమని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. "నిన్న ఒక అధికారి... విశాఖలో రైల్వే జోన్ సాధ్యం కాదని చెప్పారంటే ఏమనుకోవాలి? ఏ సమయంలో ఏం చేయాలో చేయకుండా చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఎలా? ఎన్నికలకు ముందు, ఎన్నికల తరువాత మోదీ, అమిత్‌షా, జైట్లీ వివిధ సందర్భాల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి అన్యాయం జరగదని, ఇతోధికంగా సహకరించి ఆదుకుంటామని హామీ లిచ్చి ఇప్పుడు వాటిని అమలు చేయమనడం బాధేస్తోంది" అని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నేను కేంద్రంతో లాలూచీ పడినా, భయపడినా కేంద్రాన్ని ప్రత్యేక హోదా కోసం నిలదీసేవాణ్ని కాదన్నారు.

> భారత ప్రభుత్వం అంటే పెద్ద వ్యవస్థ. కేంద్రం ఏమైనా ఇవ్వాలనుకుంటే ఇద్దరు, ముగ్గురితో కమిటీవేసి... 'రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఈ విధంగా హామీలిచ్చాం... వారికి న్యాయసమ్మతంగా రావాల్సిన వాటిని ఇచ్చేసి, మాకు నివేదించండ'ని సూచిస్తే అన్నీ పనులు చకచకా పూర్తవుతాయి. పోలవరం ప్రాజెక్టులోకి ఏడు మండలాలను కలిపే సమయంలో అంతా బాగానే జరిగింది. ఆ తరువాత రాన్రానూ కేంద్రం వైఖరిలో మార్పు రావడం మొదలైంది.
>
> - చంద్రబాబు

'సెంటిమెంట్'తో తెలంగాణ ఇవ్వలేదా?

సెంటిమెంట్‌తో నిధులు రావని చెప్పిన కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ అదే సెంటిమెంట్‌ను గౌరవించి భాజపా ప్రతిపక్షంలో ఉన్నప్పుడు... రాష్ట్ర విభజన చట్టాన్ని పార్లమెంట్‌లో యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టినపుడు ఆమోదించలేదా? అని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రత్యేక హోదా ఇవ్వం, రెవెన్యూ లోటు ఇచ్చేశాం అంటే ఒప్పుకోవాలా? 60 ఏళ్లు కష్టపడి సంపాదించుకున్న ఆస్తులు పోతే మీకు బాధ కలగదా? అని సభలోని భాజపా శాసనసభా పక్ష నాయకుడు విష్ణుకుమార్‌రాజుని ఉద్దేశించి అన్నారు. "నలభై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న నాకు భాజపా నాయకులు రాజకీయాలు నేర్పుతున్నారు. రాష్ట్రానికి సంబంధించి నాకంటే ఎక్కువగా ఎవరికీ తెలియదు. విభజన హామీలపై భాజపా నేతలు అన్యాయంగా మాట్లాడుతున్నారు?" అని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రాన్ని అడగడానికి రాష్ట్ర భాజపా నేతలకు మొహమాటం ఉందేమో కానీ తనకైతే లేదన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లా శాశ్వతంగా పేదరికంలోకి వెళ్లాలా? అదే మీరు కోరుకుంటున్నారా? అని నిలదీశారు.

> కేంద్రానికి ఒక నిర్దిష్టమైన రాజకీయ విధానం ఉందా? అధికారుల నిర్ణయాలే కాదు... రాజకీయంగా తీసుకునే విధాన నిర్ణయాలు కూడా పాలనలో ప్రధానం. అసంబద్ధంగా రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్‌ను ప్రజలు తుడిచిపెట్టేశారు. ఆ పరిస్థితి మరెవరికీ రాకూడదని కోరుకుంటున్నా.
>
> - చంద్రబాబు

బ్యూరోక్రాట్లు వద్దంటే వదిలేస్తారా?

రాజకీయంగా కూడా కొన్ని నిర్ణయాలు తీసుకోవాలని, బ్యూరోక్రాట్లు కాదన్నారని ఊరుకుంటే రాష్ట్రంలోని కిడ్నీ బాధితులకు పింఛన్లు అందించే వారమా? అని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. విశాఖలో రైల్వే జోన్‌పైగా రాజకీయంగా ఎందుకు నిర్ణయం తీసుకోరని కేంద్రాన్ని ప్రశ్నించారు. "మా పార్టీ నాయకుడు ఎన్టీఆర్ ఆత్మ గౌరవం కోసం పోరాడితే, రాష్ట్ర ప్రయోజనాల కోసం నేను ఆత్మ విశ్వాసంతో చివరి వరకు పోరాటం చేస్తాను" అని వ్యాఖ్యానించారు. "2019 నాటికి పోలవరాన్ని పూర్తిచేసి తీరుతాం. బెంగుళూరు, ముంబయి నగరాలకు నిధులిచ్చి, ఏపీకి ఎందుకివ్వరు? రాజధాని నిర్మాణం పూర్తయితే కేంద్రానికే ఎక్కువ ఆదాయం వస్తుంది" అని అన్నారు..

రోడ్లు పట్టుకొని తిరుగుతున్నారు..

రాష్ట్ర ప్రయోజనాల కంటే తమ స్వార్థం కోసం అప్పుడు, ఇప్పుడు పని చేస్తున్నందునే ఒక ఆయన (జగన్‌ను ఉద్దేశించి) అడ్రస్ లేకుండా రోడ్లు పట్టుకొని తిరుగుతున్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. 'ఎ1, ఎ2 నిందితులు ప్రధానిని ఎందుకు కలుస్తున్నారు. భాజపాలో జరిగే కీలక నిర్ణయాలు వైకాపాకు ముందుగానే ఎలా తెలుస్తున్నాయి. తప్పులు చేసే వారికి అధికారం వద్ద స్వేచ్ఛ ఉండనే కూడదు. ప్రధాని మోదీ ప్రత్యేక హోదా ఇస్తారని విజయసాయిరెడ్డి అంటున్నారు. అలాంటప్పుడు అవిశ్వాసం ఎందుకు?" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.

సాయం చేయమంటే హేళనా!

- కేంద్రం వైఖరిని తీవ్రంగా ఖండించిన ఏపీ శాసనసభ
- విభజన హామీల అమలులో నిర్లక్ష్యంపై సభలో నిరసన తీర్మానం ఆమోదం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని అంశాలు, ఆనాటి ప్రధాని ఇచ్చిన హామీల అమల్లో జరుగుతోన్న జాప్యం, కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపట్ల రాష్ట్ర శాసనసభ తీవ్ర నిరసనను వ్యక్తంచేస్తూ తీర్మానం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సభలో మంగళవారం సాయంత్రం తీర్మానాన్ని చదివి వినిపించగా సభ ఆమోదం తెలిపింది.

తీర్మానం ఇలా...: "రాష్ట్రాన్ని అశాస్త్రీయంగా విభజించారు. ఆస్తులు, అప్పులు; విద్యుత్తు, పన్నుల వసూళ్లు; తిరిగి చెల్లింపుల వంటి వాటి విభజనలో రాష్ట్రానికి ఎక్కువగా నష్టం జరిగింది. విభజన చట్టం ప్రకారం అమరావతి నిర్మాణానికి కేంద్రం ఆర్థిక సాయం చేయాలి. రైల్వేజోన్, ఉక్కు కర్మాగారాన్ని ఏర్పాటుచేయాలి. ఓడరేవు, పెట్రో కెమికల్ పరిశ్రమలు రావాలి. నియోజకవర్గాల సంఖ్యను పెంచాలి. విద్యా, పరిశోధన సంస్థలను ప్రారంభించాలి. పెట్రో కెమికల్ పరిశ్రమకు సుమారు ఐదువేల కోట్ల రూపాయల నష్ట నివారణ నిధి (వయబిలిటీ గ్యాప్ ఫండ్) భారాన్ని రాష్ట్రం భరించాలంటున్నారు. విద్యా సంస్థల పురోగతి మందగమనంలో ఉంది. ప్రస్తుత కేటాయింపులను పరిశీలిస్తుంటే వచ్చే ఇరవై యేళ్ళకైనా పూర్తవుతాయా అన్న సందేహం కలుగుతోంది. ఉమ్మడి రాష్ట్రంలోని సంస్థల విభజన నత్తనడకన సాగుతోంది. రాజ్యసభలో ఆనాటి ప్రధానమంత్రి ఆరు హామీ మేరకు రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలి. ఆదాయం కోల్పోతున్న రాష్ట్రానికి రెవెన్యూ లోటును భర్తీచేయాలి. బుందేల్‌ఖండ్, కోరాపుట్-బోలాంగిర్-కలహండి తరహాలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక సాయాన్ని అందించాలి. పోలవరం నిర్మాణాలకు రాష్ట్రం ఖర్చుచేసిన నిధుల రాకలోనూ జాప్యం జరుగుతోంది. 14వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇవ్వొద్దంటూ ఎక్కడా చెప్పలేదు. అది తమ పరిధిలోని అంశం కాదని ఆ సంఘాధ్యక్షులు, సభ్యులు బహిరంగంగా చెప్పారు. ప్రత్యేక హోదా ఇవ్వొద్దని ఆర్థిక సంఘం చెప్పినపుడు, రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రస్తుత హోదా రాష్ట్రాలకు కొనసాగిస్తున్నప్పుడు రాష్ట్రానికి ఎందుకు నిరాకరిస్తున్నారని కేంద్రాన్ని ఈ శాసనసభ ప్రశ్నిస్తోంది. చట్టంలో పేర్కొన్న అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీల అమలు ఆలస్యంగా జరగడంపట్ల రాష్ట్ర ప్రజానీకం తీవ్ర ఆగ్రహంతో ఉంది.

ఉదాసీనంగా కేంద్రం...: సీఎం 29సార్లు దిల్లీ వెళ్లి ఈ విషయాలపై చర్చించగా కేంద్రం ఉదాసీనతను ప్రదర్శించింది. రాష్ట్రానికి దక్కాల్సిన ఈ అంశాలపట్ల కేంద్ర ప్రభుత్వంలోని బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వారు హేళనగా మాట్లాడడాన్ని ఈ సభ తీవ్రంగా ఖండిస్తోంది. కేంద్రానికి రాష్ట్రంపట్ల బాధ్యత ఉంది ముఖ్యంగా రాష్ట్ర ప్రజల అభీష్టానికి విరుద్ధంగా విభజన జరిగి కష్టాల్లో ఉన్న రాష్ట్రంపట్ల బాధ్యత మరింత ఎక్కువ. మనం నిలదొక్కుకుని, దక్షిణ భారతంలోని ఇతర రాష్ట్రాలతో సమానంగా ఎదిగేంత వరకు కేంద్రం చేయూత అందించాలి. చట్టంలో లేనివీ, పార్లమెంటు సాక్షిగా ప్రధాని ఇచ్చిన హామీలో లేనివీ అడగడంలేదు. చట్టబద్ధమైన డిమాండ్లను, న్యాయమైన కోర్కెలను కేంద్రం గుర్తించి వ్యవహరించాలి" అని తీర్మానం చేశారు.

ఛాంపియన్

జోరు సాగేనా!

- నేడు బంగ్లాదేశ్‌తో భారత్ ఢీ
- ముక్కోణపు టీ20 సిరీస్
- రాత్రి 7 నుంచి డి స్పోర్ట్స్‌లో



కొలంబో

తొలి మ్యాచ్‌లో భంగపడ్డా బలంగా పుంజుకున్న టీమ్‌ఇండియా ముక్కోణంలో తన ఆఖరి లీగ్ సమరానికి సన్నద్ధమైంది. బుధవారం బంగ్లాదేశ్‌ను ఢీకొంటుంది. భారత్ ఇప్పటికే దాదాపుగా ఫైనల్ చేరినట్లే! ఈ మ్యాచ్‌లో ఓడినా ముందుకెళ్లే అవకాశాలు మెండుగానే ఉంటాయి. కానీ నెట్ రన్‌రేట్‌తో తేల్చే అవసరం లేకుండా దర్జాగా ఫైనల్ చేరాలనే పట్టుదలతో భారత్ ఉంది. ఫైనల్లో స్థానం దాదాపుగా ఖాయమైనా టీమ్ ఇండియా ఈ మ్యాచ్‌లో ఎలాంటి ప్రయోగాలు చేసే అవకాశం కనిపించట్లేదు.

రెండు వరుస విజయాలతో జోరు మీదున్న భారత్ చాలా ఉత్సాహంతో ఉంది. సీనియర్ ఆటగాళ్ల గైర్హాజరీలో.. కుర్రాళ్లకు అవకాశాలివ్వడం భారత్ ముఖ్యోద్దేశమని టోర్నమెంట్ ఆరంభంలో అనిపించింది. కానీ భారత జట్టు ఎంపికలో సాహసాలకు పోలేదు. ఎలాంటి ప్రయోగాలూ చేయలేదు. దీపక్ హుడా, మహ్మద్ సిరాజ్, అక్షర్ పటేల్ వంటి ఆటగాళ్లు ఇప్పటివరకు టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. అంటే లంకకు ద్వితీయ శ్రేణి జట్టును పంపిన ఉద్దేశమే నెరవేరలేదన్నమాట. ఈ మ్యాచ్‌లోనూ భారత్ ప్రయోగాలు చేసే అవకాశం కనిపించట్లేదు. ఇక భారత్‌కు అతిపెద్ద సమస్య కెప్టెన్ రోహిత్ శర్మ ఫామే. ఈ మ్యాచ్‌తోనైనా అతడు పరుగుల బాట పట్టాలని భారత జట్టు కోరుకుంటోంది. మరో ఓపెనర్ శిఖర్ ధావన్ చెలరేగినప్పటికీ.. రోహిత్ వైఫల్యంతో టోర్నీలు ఇప్పటివరకు భారత్‌కు మంచి ఆరంభాలు దక్కలేదు. రైనా 20లు కొడుతుంటే.. మిడిల్ ఆర్డర్‌లో మనీష్ పాండే నిలకడగా రాణిస్తున్నాడు. శ్రీలంకపై దినేశ్ కార్తీక్ 25 బంతుల్లో 39 పరుగులు చేసిన నేపథ్యంలో రిషబ్ పంత్ మరోసారి పెవిలియన్‌కు పరిమితంకాక తప్పకపోవచ్చు. ఇక కేఎల్ రాహుల్‌ను ఓపెనర్‌గా పంపి.. రోహిత్ తాను నాలుగో స్థానంలో వస్తాడేమో అన్న చర్చ నడుస్తోంది. ఈ మ్యాచ్‌లో బ్యాట్స్‌మెన్ కంటే భారత బౌలర్లే పెద్ద సవాల్‌ను ఎదుర్కోవాల్సివుంటుంది. ఎప్పుడు ఎలా ఆడతారో తెలియని బంగ్లా బ్యాట్స్‌మెన్‌ను వాళ్లు ఎలా కట్టడి చేస్తారో చూడాలి. బంగ్లాను గత మ్యాచ్‌లో 139కే పరిమితం చేశారు. కానీ ఆ తర్వాత జరిగిన మ్యాచ్‌లో తమిమ్ ఇక్బాల్, ముష్ఫికర్ రహీమ్ వంటి బ్యాట్స్‌మెన్ లంక బౌలింగ్‌ను తుత్తునియలు చేశారు. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ దారాళంగా పరుగులిచ్చిన ఉనద్కత్.. పొదుపుగా బౌలింగ్ చేయాల్సిన అవసరముంది. శార్దుల్ ఠాకూర్, స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ నిలకడగా రాణిస్తుండడం భారత్‌కు సానుకూలాంశం.

ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకంతో సత్తాచాటినా.. ప్రపంచ ఛాంపియన్‌షిప్ గెలిచి విశ్వవిజేతగా నిలిచినా.. ఆ టైటిల్ సాధించడంలో ఉన్న గర్వమే వేరు.. అక్కడ సత్తాచాటితే దక్కే గౌరవమే వేరు! కారణం.. ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత పురాతనమైన, వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న టోర్నీ అది.

కాబట్టే.. లెక్కలేనన్ని సూపర్ సిరీస్ టైటిళ్లు గెలిచిన సైనాకు.. ఒలింపిక్స్‌లో రజతం.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో ఓ రజతం, 2 కాంస్యాలతో హోరెత్తించిన సింధుకు ఆ టైటిల్ ఓ స్వప్నం.

ప్రకాశ్ పదుకొనె ఆల్ ఇంగ్లాండ్ ట్రోఫీ అందుకుని 38 ఏళ్లయింది. మరో దిగ్గజ ఆటగాడు గోపీచంద్ ఈ టోర్నీ నెగ్గి 17 ఏళ్లు దాటాయి. 2002 నుంచి భారత్‌కు ఆల్ ఇంగ్లాండ్ అందని ద్రాక్షే.


పదిసార్లు ఈ టోర్నీకి వెళ్లిన సైనాకు రెండేళ్ల క్రితం (2015) ఆల్‌ఇంగ్లాండ్ అందినట్లే అంది చేజారింది. ఐదు సార్లు దండెత్తిన సింధు.. అత్యుత్తమ ప్రదర్శన క్వార్టర్‌ఫైనలే.

మరి ఈసారైనా నిరీక్షణకు తెరపడేనా? సైనా, సింధుల్లో ట్రోఫీతో కెరీర్‌ను పరిపూర్ణం చేసుకునేదెవరు? శ్రీకాంత్, ప్రణయ్‌ల టైటిల్ అవకాశాలెంత? బుధవారమే ఈ ప్రతిష్టాత్మక టోర్నీ ఆరంభం.

కొట్టేదెవరో..?

నేటి నుంచే ఆల్‌ఇంగ్లాండ్ ఛాంపియన్‌షిప్

టైటిల్‌పై సింధు, సైనా, శ్రీకాంత్‌ల గురి ● మధ్యాహ్నం 2.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో



క్వార్టర్స్ నుంచే..

ఫామ్‌లో ఉన్న 22 ఏళ్ల సింధు ఈసారి టైటిల్ ఫేవరెట్లలో ఒకరు. నిరుడు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతంతో సత్తా చాటింది సింధు. ఇండియా ఓపెన్ సూపర్ సిరీస్, కొరియా ఓపెన్ సూపర్ సిరీస్, సయ్యద్ మోదీ గ్రాండ్‌ప్రి గోల్డ్ టోర్నీల్లో విజేతగా నిలిచింది. 2017లో మెరిసిన సింధుపై ప్రస్తుతం మంచి అంచనాలే ఉన్నాయి. ఈ టోర్నీలో నాలుగో సీడ్‌గా బరిలో ఉన్న సింధుకు తొలి రౌండ్ ప్రత్యర్థి పోర్న్‌పావీ చోచువాంగ్ (థాయ్‌లాండ్). ఒకే ఒక్కసారి వీరిద్దరు తలపడగా.. సింధుదే పైచేయి. ఆల్ ఇంగ్లాండ్‌లోనూ అదే ఫలితం పునరావృతం కావొచ్చు. క్వార్టర్స్‌లో జపాన్ స్టార్ ఒకుహరతో సింధుకు అసలు పోటీ ఎదురవ్వొచ్చు. వాళ్లిద్దరూ తలపడితే ఆ పోరాటం ఆల్ ఇంగ్లాండ్‌కే ప్రత్యేక ఆకర్షణ అవుతుంది. . భారత క్రీడాకారిణులు భిన్న పార్శ్వాల్లో ఉండటంతో ఫైనల్ వరకు సింధు, సైనా ఎదురుపడే అవకాశం లేదు.

ఉత్సాహంతో..

2014లో చైనా ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్‌తో మొదలైన కిదాంబి శ్రీకాంత్ అద్వితీయ ప్రస్థానం.. 2017లో పతాక స్థాయికి చేరుకుంది. ఇండోనేసియా ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్.. తర్వాత డెన్మార్క్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లతో చెలరేగాడు శ్రీకాంత్. ఒకే ఏడాది 4 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించి.. దిగ్గజ ఆటగాళ్లు లీ చాంగ్ వీ, లిన్ డాన్, చెన్ లాంగ్‌ల సరసన నిలిచాడు. దూకుడుగా ఆడే శ్రీకాంత్ నిరుడు జాతీయ ఛాంపియన్‌షిప్‌లో గాయపడటంతో అతడి జోరు కాస్త తగ్గింది. బీడబ్ల్యూఎఫ్ సూపర్ సిరీస్ ఫైనల్స్‌లో పెద్దగా ప్రభావం చూపించలేకపోయాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకుని కొత్త ఉత్సాహంతో ఉన్న శ్రీకాంత్ ఆల్ ఇంగ్లాండ్‌లో సత్తా చాటొచ్చన్నది అంచనా. ఆల్ ఇంగ్లాండ్‌లో నాలుగో ప్రయత్నంలోనైనా విజయవంతమవుతాడేమో చూడాలి. శ్రీకాంత్ ఆట ప్రకారం తొలి రౌండ్లో బ్రైస్ లెవర్డెజ్ (ఫ్రాన్స్)తో పోటీ అతనికి నామమాత్రమే.

తొలి రౌండే సవాల్

భారత బ్యాడ్మింటన్‌ను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన సైనా ఆటలో కొత్తగా నిరూపించుకోవాల్సిందేమీ లేదు. అయితే ఆల్ ఇంగ్లాండ్ ఇంకా ఆమె ఖాతాలో చేరలేదు. అందుకోసం 11వ సారి ఆల్ ఇంగ్లాండ్‌లో బరిలో దిగుతోంది 27 ఏళ్ల సైనా. గత ఏడాది ఆగస్టులో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యంతో మెరిసిన సైనా.. మళ్లీ గోపీచంద్ అకాడమీకి తిరిగొచ్చింది. అప్పట్నుంచి ప్రత్యేక శిక్షణ పొందుతోంది. ఆమె ఫిట్‌నెస్.. బరువు.. ఆటలో ఎంతో మార్పొచ్చింది. ఇప్పుడు మరింత ఫిట్‌గా కనిపిస్తున్న సైనాకు ఆల్ ఇంగ్లాండ్‌లో తొలి రౌండే ప్రధాన అడ్డంకి. ప్రపంచ నంబర్‌వన్, డిఫెండింగ్ ఛాంపియన్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో సైనా తలపడనుంది. వీళ్లిద్దరూ 14 సార్లు పోటీపడగా.. ఐదింట్లో సైనా గెలిచింది. 9 సార్లు తై జు నెగ్గింది. గత ఏడు మ్యాచ్‌ల్లో తై జుదే పైచేయి. ఒకవేళ తై జుపై గెలిస్తే ఫైనల్ వరకు సైనాకు తిరుగుండకపోవచ్చు.

స్థాయి మారింది..

2010లో ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో సత్తాచాటిన సాయిప్రణీత్.. 2016లో ఆల్ ఇంగ్లాండ్ తొలి రౌండ్లో లీ చాంగ్ వీని మట్టికరిపించినప్పుడు అందరి దృష్టిలో పడ్డాడు. నిరుడు థాయ్‌లాండ్ ఓపెన్ గ్రాండ్‌ప్రి గోల్డ్ టైటిల్ సాధించాడు. సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. శ్రీకాంత్‌పై విజయంతో సింగపూర్ ఓపెన్ సూపర్ సిరీస్ టైటిల్ గెల్చుకుని అగ్రశ్రేణి ఆటగాళ్ల జాబితాలో చోటు సంపాదించాడు. అయితే గాయాలు సాయిప్రణీత్‌ను వెనక్కి లాగాయి. గత కొంతకాలంగా ఫిట్‌నెస్‌పై దృష్టిసారించిన సాయిప్రణీత్ గాయాల నుంచి పూర్తిగా కోలుకున్నట్లే కనిపిస్తున్నాడు. ఆల్ ఇంగ్లాండ్ తొలి రౌండ్లో ఐదో సీడ్ సాన్ వాన్ హొ (కొరియా)తో సాయి తలపడనున్నాడు. ఇప్పటివరకు వీరిద్దరూ 3 మ్యాచ్‌ల్లో పోటీపడగా.. మూడింట్లోనూ ప్రత్యర్థిదే పైచేయి. గట్టి ప్రత్యర్థే అయినా తనదైన రోజున సాయిప్రణీత్‌కు తిరుగుండదు. లీ చాంగ్, శ్రీకాంత్‌లపై విజయాలే ఇందుకు నిదర్శనం. మరోసారి సాయి సత్తాచాటుతాడేమో చూడాలి.

తనదైన రోజు

ఇండోనేసియన్ మాస్టర్స్ (2014), స్విస్ ఓపెన్ (2016), యూఎస్ ఓపెన్ (2017)లలో విజేతగా నిలిచిన 25 ఏళ్ల హెచ్.ఎస్.ప్రణయ్‌లో ప్రతిభకు కొదవలేదన్నది విశ్లేషకుల మాట. తనదైన రోజున ఎంతటి ప్రత్యర్థినైనా చిత్తుచేయగల సమర్థుడు. నిరుడు ఇండోనేసియా ఓపెన్‌లో వరుసగా లీ చాంగ్ వీ, ఒలింపిక్ ఛాంపియన్ చెన్ లాంగ్‌లను మట్టికరిపించాడు. ఆల్ ఇంగ్లాండ్ తొలి రౌండ్లో చౌ తీన్ చెన్ (చైనీస్ తైపీ)తో ప్రణయ్ పోటీపడతాడు. తొలి రౌండ్, ప్రిక్వార్టర్స్ దాటితే క్వార్టర్స్‌లో ప్రణయ్‌కు శ్రీకాంత్ ఎదురయ్యే అవకాశముంది.

డబుల్స్‌లో..

ఎక్కువగా సింగిల్స్ అవకాశాల గురించే మాట్లాడే కోచ్ గోపీచంద్ ఇప్పుడు డబుల్స్‌లో పతకంపై ఆశతో ఉండటం విశేషం. అందుకు సాత్విక్ సాయిరాజు-చిరాగ్ శెట్టి జోడీ ప్రధాన కారణం. ఈ జంట నిరుడు ఇండోనేసియా ఓపెన్‌లో సెమీస్ చేరుకుంది. ఆ టోర్నీలో అగ్రశ్రేణి జోడీలను మట్టికరిపించింది. ఆల్ ఇంగ్లాండ్‌లోనూ సాత్విక్ జోడీ జోరు కొనసాగొచ్చన్నది గోపీచంద్ అంచనా. ఇంకా డబుల్స్‌లో సుమీత్‌రెడ్డి-మను అత్రి, మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి-అశ్విని పొన్నప్ప, మేఘన-పూర్విష; మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా- సిక్కిరెడ్డి ఆడనున్నారు.

★ ప్రస్తుత భారత క్రీడాకారుల్లో ఆల్ ఇంగ్లాండ్‌లో అత్యుత్తమ ప్రదర్శన సైనాదే. 2015లో ఆమె రన్నరప్‌గా నిలిచింది.

1898 ఆల్‌ఇంగ్లాండ్ మొదలైన సంవత్సరం. ప్రపంచ బ్యాడ్మింటన్ చరిత్రలో ఇదే అత్యంత పురాతన టోర్నీ. ఇప్పుడు జరగబోయేది 108వ టోర్నీ.

2 ఆల్‌ఇంగ్లాండ్ టైటిళ్లు గెలిచిన భారత షట్లర్ల సంఖ్య. 1980లో ప్రకాశ్ పదుకొనే, 2001లో పుల్లెల గోపీచంద్ ఈ టోర్నీలో విజేతలుగా నిలిచారు.

కోహ్లిని పెళ్లి చేసుకోమంటే..





లండన్: కొన్ని నెలల కిందటే ఆస్ట్రేలియాపై 56 బంతుల్లో సెంచరీ కొట్టి సంచలనం రేపింది ఇంగ్లాండ్ మహిళా క్రికెటర్ డాని వ్యాట్. ఆమె సెంచరీ బాదిన బ్యాట్ టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఆమెకు బహుమతిగా ఇచ్చాడట. ప్రస్తుతం తాను వినియోగిస్తున్నది ఆ బ్యాటే అని వ్యాట్ వెల్లడించింది. "టీ20 ప్రపంచకప్‌లో కోహ్లి దక్షిణాఫ్రికాపై ఆడిన మెరుపు ఇన్నింగ్స్ చూసి వెంటనే ట్విటర్లో 'కోహ్లి.. నన్ను పెళ్లాడు' అని సందేశం పెట్టాను. పది నిమిషాలకే వెయ్యి రీట్వీట్లు వచ్చాయి. అది భారత్‌లో పెద్ద వార్త అయింది. ఆ తర్వాత 2014లో ఇంగ్లాండ్ పర్యటనకు వచ్చినపుడు విరాట్‌ను కలిశా. ట్విటర్లో అలాంటి సందేశాలు పెట్టొద్దని.. కొందరు వాటిని నిజమనుకుంటారని కోహ్లి హెచ్చరించాడు. నేను సారీ చెప్పా. అప్పుడే అతను నాకు బ్యాట్ బహుమతిగా ఇచ్చాడు. ప్రస్తుతం నేను ఆ బ్యాటే వాడుతున్నా. దాంతోనే సెంచరీ కొట్టా" అని వ్యాట్ తెలిపాడు.

షమి బెదిరిస్తున్నాడు

భార్య హసీన్ తాజా ఆరోపణ



కోల్‌కతా: టీమ్‌ఇండియా ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమిపై అతడి భార్య హసీన్ జహాన్ తాజాగా మరో ఆరోపణ చేసింది. అతను తనను ఫోన్ చేసి బెదిరిస్తున్నట్లు చెప్పింది. "షమి నన్ను బెదిరిస్తున్నాడు. ఫోన్లు చేస్తున్నాడు. వేరే రకాలుగా కూడా నాకు బెదిరింపు సంకేతాలు పంపుతున్నాడు. నన్ను బెదిరించేందుకు వేరే ఫోన్ నంబర్లు వాడుతున్నాడు. వాట్సాప్ కాల్స్ చేస్తున్నాడు. ఇలా చేస్తున్నందుకు షమి సిగ్గుపడాలి. అయినప్పటికీ నాకు న్యాయం జరిగే వరకు రాజీ పడను, పోరాటం ఆపను" అని హసీన్ చెప్పింది. షమి మీడియా ద్వారా చేసిన రాజీ ప్రతిపాదన గురించి హసీన్ దగ్గర ప్రస్తావిస్తే.. తన కెరీర్‌ను కాపాడుకోవడం కోసమే ఈ ప్రణాళిక రచించాడని అంది. తనను రెండేళ్లుగా షమి వేధిస్తున్నాడని, తనను చంపించే ప్రయత్నం చేశాడని, అతడి సోదరుడు తనపై అత్యాచారం చేశాడని ఆరోపిస్తూ షమి సహా అతడి కుటుంబ సభ్యులపై హసీన్ కేసులు పెట్టిన సంగతి తెలిసిందే. మరోవైపు షమితో హసీన్ వివాదంపై ఆమె మొదటి భర్త షఫీయుద్దీన్ స్పందించాడు. హసీన్‌కు, షమికి వివాదాలు సమసిపోయి ఇద్దరూ మళ్లీ ఒక్కటవ్వాలని అతను అభిలషించాడు. హసీన్ చదువుకునే రోజుల్లో తనకు పరిచయమైందని, రెండేళ్ల తర్వాత.. 2002లో తాము ఇరు కుటుంబాల అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్లి చేసుకున్నామని.. తమకు ఇద్దరు కూతుళ్లు కలిగాక విభేదాలు తలెత్తి 2010లో విడిపోయామని అతను చెప్పాడు. హసీన్ మరింత చదవాలని, తన సొంతకాళ్లపై నిలబడాలని భావించి తనకు దూరమైందన్నాడు. ప్రస్తుతం అతను కిరాణా దుకాణం నడుపుతున్నాడు.

సర్దార్‌పై వేటు

మన్‌ప్రీత్‌కు సారథ్యం ● శ్రీజేశ్ పునరాగమనం



దిల్లీ: అజ్లాన్ షా కప్ హాకీలో భారత జట్టు కెప్టెన్‌గా వ్యవహరించిన సర్దార్ సింగ్‌పై వేటు పడింది. కామన్వెల్త్ క్రీడల కోసం హాకీ ఇండియా (హెచ్ఐ) ప్రకటించిన 18 మంది సభ్యుల జట్టులో అతడికి చోటు లభించలేదు. మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో టీమ్‌ఇండియా అదృష్టం పరీక్షించుకోనుంది. మన్‌ప్రీత్ కెప్టెన్సీలోనే నిరుడు భారత్ ఆసియా కప్‌ను సొంతం చేసుకుంది. ఆ తర్వాత ప్రపంచ హాకీ లీగ్ ఫైనల్లో కాంస్యం గెలుచుకుంది. చింగ్లెన్‌సేన సింగ్ కంగుజం వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. అజ్లాన్ షా సమయంలో విశ్రాంతి తీసుకున్న కీలక ఆటగాళ్లందరూ జట్టులోకి వచ్చారు. గాయం కారణంగా చాలాకాలం దూరమైన పీఆర్ శ్రీజేశ్ పునరాగమనం చేశాడు. అజ్లాన్ షాలో విఫలమైన సర్దార్‌పై వేటు ఊహించిందే. ఐతే రమన్‌దీప్ సింగ్‌ను తొలగించడమే ఆశ్చర్యం కలిగించింది. గత రెండు కామన్వెల్త్ క్రీడల్లో ఫైనల్ చేరిన భారత జట్టు ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయింది. ఈసారి స్వర్ణం సాధించాలని భారత్ పట్టుదలగా ఉంది.

జట్టు: గోల్‌కీపర్లు: పీఆర్ శ్రీజేశ్, సూరజ్ కార్కేరా **డిఫెండర్లు:** రూపిందర్ పాల్ సింగ్, వరుణ్ కుమార్, కోతాజిత్ సింగ్, గురిందర్ సింగ్, అమిత్ రోహిదాస్ **మిడ్‌ఫీల్డర్లు:** మన్‌ప్రీత్ సింగ్ (కెప్టెన్), చింగ్లెన్‌సెనా సింగ్ (వైస్ కెప్టెన్), సుమిత్, వివేక్ సాగర్ ప్రసాద్; **ఫార్వర్డ్స్:** ఆకాశ్‌దీప్ సింగ్, ఎస్వీ సునీల్, గుర్జాంత్ సింగ్, మన్‌దీప్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, దిల్‌ప్రీత్ సింగ్

అక్క చేతిలో ఓటమి



ఇండియన్‌వెల్స్: పునరాగమనంలో ఆడిన తొలి టోర్నీలో సెరెనా విలియమ్స్ ఎంతో దూరం వెళ్లలేదు. ఇండియన్ వెల్స్ డబ్ల్యూటీఏ టోర్నీలో ఆమె మూడో రౌండ్లోనే నిష్క్రమించింది. అక్క వీనస్ విలియమ్స్‌పై మెరుగైన రికార్డున్న సెరెనా.. ఆమె ముందే నిలవలేకపోయింది. ప్రిక్వార్టర్స్‌లో 3-6, 4-6తో వీనస్ చేతిలో పరాజయం చవిచూసింది. బిడ్డకు జన్మనివ్వడం కోసం ఏడాదికి పైగా ఆటకు దూరంగా ఉన్న సెరెనా.. ఈ టోర్నీతోనే ప్రొ టెన్నిస్‌లోకి పునరాగమనం చేసింది.

ఇరానీ కప్ నేటినుంచే

నాగ్‌పూర్: ఇరానీ కప్ కోసం రెస్టాఫ్ ఆఫ్ ఇండియాతో రంజీ ట్రోఫీ ఛాంపియన్ విదర్భ అమీతుమీ తేల్చుకోనుంది. ఐదు రోజుల ఈ మ్యాచ్ బుధవారం ప్రారంభంకానుంది. రంజీ ట్రోఫీలో ప్రతిభ కనబరిచిన క్రికెటర్లు ఇరానీ కప్‌లోనూ సత్తాచాటి సెలెక్టర్ల దృష్టిలో పడాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఆంధ్ర నుంచి హనుమ విహారి, భరత్ రెస్టాఫ్ ఇండియా జట్టు తరపున బరిలో దిగుతున్నారు.



గేల్, యువీ 2, 3 మ్యాచ్‌లు గెలిపించినా చాలు

ఈనాడు, దిల్లీ: ఈ సీజన్లో తమ జట్టుకు ఆడబోతున్న క్రిస్ గేల్, యువరాజ్ సింగ్ రెండు మూడు మ్యాచ్‌లు గెలిపించినా వారిపై వేలంలో తాము పెట్టిన ధరకు న్యాయం జరుగుతుందని కింగ్స్ ఎలెవన్ పంజాబ్ మార్గదర్శి వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. గేల్, యువీలిద్దరికీ పంజాబ్ రూ.2 కోట్ల చొప్పున కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వీరూ మాట్లాడుతూ.. "వాళ్లిద్దరూ ప్రాథమిక ధరకు మా సొంతమవడం చాలా సంతోషం. అది బేరమాడితే వచ్చే ధర. వాళ్లిద్దరూ వేలంలోకి వచ్చే సమయానికి పోటీ ఉండుంటే మిలియన్ డాలర్ల ధర పలికేవాళ్లేమో. గేల్, యువీ పెద్ద ఆటగాళ్లు, మ్యాచ్ విన్నర్లు. మాకోసం వాళ్లు తలో రెండు మూడు మ్యాచ్‌లు గెలిచినా మా పెట్టుబడి వెనక్కి వచ్చేసినట్లే" అన్నాడు.



ఐఎస్ఎల్ ఫైనల్లో చెన్నయిన్

చెన్నై: చెన్నయిన్ ఎఫ్‌సీ జట్టు ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన రెండో అంచె సెమీఫైనల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించిన చెన్నయిన్ 3-0తో ఎఫ్‌సీ గోవాను ఓడించింది. జెజె రెండు గోల్స్ (26వ, 90వ) కొట్టగా.. ధన్‌పాల్ గణేశ్ ఓ గోల్ (29వ) సాధించాడు. మొత్తంగా 4-1 ఆధిక్యంతో చెన్నయిన్ జట్టు ముందంజ వేసింది. రెండు జట్ల మధ్య తొలి అంచె సెమీఫైనల్ 1-1తో డ్రాగా ముగిసింది.

కాపీయింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- కేంద్రాల్లో పరీక్షలు పూర్తయ్యే వరకు తరగతులు నడపొద్దు
- పదో తరగతి పరీక్షలపై పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్

ఈనాడు, హైదరాబాద్: కాపీయింగ్‌కు పాల్పడినా...ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ హెచ్చరించారు. విద్యార్థులు నిజాయతీగా పరీక్షలు రాయాలన్నారు. ఈనెల 15 నుంచి ఏప్రిల్ 2వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బి.సుధాకర్‌తో కలిసి మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు మొదలవుతాయని, ఆ తర్వాత 5 నిమిషాల వరకు అనుమతిస్తారని, అదీ తగిన కారణముంటేనేని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు 45 నిమిషాల ముందుగా చేరుకోవాలని సూచించారు. చివరి నిమిషంలో పరీక్షా కేంద్రానికి వస్తే హడావిడిలో నష్టపోతారన్నారు. విద్యార్థులు పట్టుబడితే డిబార్ చేయడంతోపాటు చట్టం ప్రకారం చర్యలు తప్పవన్నారు.

తరగతులు, సిబ్బందికి అనుమతి లేదు

ప్రైవేట్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఉన్నందున వాటిల్లో పరీక్ష పూర్తయ్యే సమయం వరకు ఇతర తరగతుల వారికి తరగతుల నిర్వహించడం కుదరదని కిషన్ స్పష్టం చేశారు. ప్రశ్నపత్రంలోని ప్రతి పుటపై విద్యార్థి హాల్‌టికెట్ సంఖ్య రాయడం తప్పనిసరన్నారు. పాత జిల్లా కేంద్రాల్లోనే ఏప్రిల్ 2 నుంచి మూల్యాంకనం ప్రారంభిస్తామన్నారు. ఏకరూప దుస్తుల్లో పరీక్షలకు హాజరు కావడం నిషేధమన్నారు.

పరీక్ష వివరాలు

- **మొత్తం విద్యార్థులు!** 5,38,867 (బాలురు 2,76,388, బాలికలు 2,62,479. వారిలో ప్రైవేట్ విద్యార్థులు 35,750, ఒకేషనల్- 20,838)
- **పరీక్షా కేంద్రాలు:** 2,542
- **ఫ్లైయింగ్ స్క్వాడ్లు:** 148 (అదనంగా హైదరాబాద్ నుంచి 4 ప్రత్యేక ఫ్లైయింగ్ స్క్వాడ్లు)
- **చూచిరాతలపై ఫిర్యాదులకు:** కమిషనర్ కార్యాలయంలోని టోల్ ఫ్రీ నెంబరు 18004257462కు లేదా ఎస్ఎస్‌సీ బోర్డులోని 040-23230942 లేదా ఆయా జిల్లాల డీఈఓ కార్యాలయాలకు.

వెబ్‌సైట్లో జేఈఈ మెయిన్ హాల్‌టికెట్లు

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్‌కు హాజరయ్యే అభ్యర్థుల హాల్‌టికెట్ల(ఈ- అడ్మిట్ కార్డు)ను సీబీఎస్ఈ అందుబాటులోకి తెచ్చింది. వాటిని www.jeemain.nic.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 8న 112 నగరాల్లో రాత పరీక్ష. ఏప్రిల్ 15, 16 తేదీల్లో 258 నగరాలు, పట్టణాల్లో ఆన్‌లైన్ పరీక్షలు జరగనున్నాయి. అన్ని ప్రశ్నపత్రాలను నిపుణులు పరిశీలించి ఒకే స్థాయిలో ఉండేలా చూస్తారని, అందువల్ల విద్యార్థులు ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని సీబీఎస్ఈ పేర్కొంది. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, ఉదయం 7 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపింది.

పురుషోత్తమ్‌రెడ్డి బినామీలతో ఖాకీల వ్యాపారం!

- శివారు స్థిరాస్తి వెంచర్లలో భారీగా పెట్టుబడులు
- సమాచారం సేకరించిన ఏసీబీ అధికారులు

ఈనాడు, హైదరాబాద్: అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారంటూ అభియోగాలు ఎదుర్కొంటున్న పురుషోత్తమ్‌రెడ్డి వ్యవహారంలో ఏసీబీ అధికారులకు రోజూ కొత్త సమాచారం సేకరిస్తున్నారు. ఇతని బినామీల స్థిరాస్తి సంస్థల్లో ముగ్గురు పోలీస్ అధికారులు పెట్టుబడులు పెట్టినట్టు విశ్వసనీయ సమాచారం. వీరిలో ఇద్దరు హైదరాబాద్‌లోనే విధులు నిర్వహిస్తుండగా.. మరో అధికారి శివారు ప్రాంతంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. పురుషోత్తమ్‌రెడ్డి హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థలో ప్రణాళిక విభాగం సంచాలకుడిగా బాధ్యతలు స్వీకరించాక వీరు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. దీనిపై పురుషోత్తమ్‌రెడ్డిని ఏసీబీ పలుమార్లు ప్రశ్నించినా తనకేం తెలియదన్నట్లు సమాచారం.

మిత్రుల ద్వారా పరిచయం: హైదరాబాద్, రంగారెడ్డి, సైబరాబాద్ జిల్లాల్లో పనిచేసిన ముగ్గురు పోలీస్ అధికారులకు వారి మిత్రుల ద్వారా పురుషోత్తమ్‌రెడ్డి పదేళ్ల క్రితమే పరిచయమయ్యారు. వారు అప్పటినుంచీ రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టేవారు. ఇందులో ఒక అధికారి హోదా మారడంతో రూ.కోట్లలో తన వాటాను పెట్టుబడిగా పెట్టాడు. పురుషోత్తమ్‌రెడ్డి హెచ్ఎండీఏకు వచ్చాక వెంచర్లలోకి నిధులు మళ్లించారని ఏసీబీ అధికారుల సమాచారం. ఈ విషయం తెలుసుకున్న ఒక పోలీస్ అధికారి తన వ్యవహారం బయటకు రాకుండా పెట్టుబడులు, లావాదేవీలకు సంబంధించిన రికార్డులన్నింటినీ మాయం చేయాలంటూ చెప్పినట్టు విశ్వసనీయ సమాచారం.

ములాఖత్‌లపైనా నిఘా: పురుషోత్తమ్‌రెడ్డి, ఆయన బినామీలను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశాక కూడా ముగ్గురు పోలీస్ అధికారులు పరోక్షంగా తమవంతు సహకారాన్ని అందిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. జైల్లో ఉన్న పురుషోత్తమ్‌రెడ్డి బినామీలను ములాఖత్ ద్వారా కలుసుకున్న వారిపై ఏసీబీ నిఘా ఉంచినట్టు తెలిసింది. ములాఖత్‌లో కలిసిన వారిని.. ముగ్గురు పోలీసు అధికారుల అనుచరులు వారేం మాట్లాడారు? మరోసారి ములాఖత్‌కు వెళితే తమ తరఫున ఈ విషయాలు చెప్పాలంటూ వారికి వివరించినట్టు సమాచారం. ఈ వ్యవహారం ఉన్నతాధికారులకు తెలియడంతో వారిని హెచ్చరించినట్టు సమాచారం.

దసరాకల్లా మార్కెట్లోకి ఉత్పత్తులు

ఉద్యాన సంస్థ పాలకమండలి నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: 'కాకతీయ' బ్రాండ్ పేరుతో ఉద్యాన పంటల ఉత్పత్తులను వచ్చే దసరాకల్లా మార్కెట్‌లోకి విడుదల చేయాలని ఉద్యాన సంస్థ పాలకమండలి నిర్ణయించింది. ఛైర్మన్ పార్థసారథి అధ్యక్షతన మంగళవారం పాలకమండలి సమావేశం సంస్థ కార్యాలయంలో జరిగింది. కారం, ధనియాలు, చింతపండు పొడి, అల్లం-వెల్లుల్లి మిశ్రమం తదితర ఉత్పత్తుల తయారీకోసం ప్లాంటు ఏర్పాటుకు నిధులు కేటాయించింది. ప్రభుత్వ ఉత్పత్తులను కల్తీ లేకుండా నాణ్యతతో తయారు చేయాలని సూచించింది. ఉద్యాన సంస్థ ఎండీ వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ ప్లాంటు ఏర్పాటుకు జీడిమెట్లలో రూ.10.65 కోట్లతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అంతకుముందు ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుపై శాంతినగర్‌లోని పశుసంవర్ధక సంచాలకుల కార్యాలయంలో పార్థసారథి ఉన్నతాధికారులతో సమీక్షించారు. పాలు, చేపలు, పశు ఉత్పత్తుల తయారీకి శుద్ధి పరిశ్రమలు ఎలా ఏర్పాటు చేయాలనే అంశంపై పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించారు. త్వరలో దీనిపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

సహకార చట్ట సవరణలతో సంఘాలకు ఇబ్బందులు

రాష్ట్ర సహకార చట్టానికి సవరణలు చేస్తూ జారీచేసిన ఉత్తర్వు నెం.53తో సహకార సంఘాలు ప్రజాస్వామ్యయుతంగా నడిచే అవకాశాలు సన్నగిల్లాయని ఈ శాఖ విశ్రాంత అదనపు రిజిస్ట్రార్ ఎస్.రామానందస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఏర్పాటుచేసిన రాష్ట్ర సహకార ఎన్నికల సంఘానికి పూర్తిస్థాయి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని కోరారు. సవరణల ఉత్తర్వును పునఃసమీక్షించాలని ఆయన కోరారు.

పెట్టుబడి పథకానికి ఉత్తరప్రదేశ్ అధికారుల ప్రశంసలు

ఎకరానికి రూ.4 వేల చొప్పున ఇచ్చే పెట్టుబడి పథకం బాగుందని ఉత్తరప్రదేశ్ విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు ప్రశంసించారు. వారు మంగళవారం తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ(టీఎస్‌సీడ్స్) కార్యాలయానికి వచ్చారు. విత్తనాల కొనుగోలుకు రెండు రాష్ట్రాల సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయని టీఎస్‌సీడ్స్ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు చెప్పారు. ఉత్తరప్రదేశ్ నుంచి జీలుగ విత్తనాలను 2019 ఖరీఫ్‌లో ఇస్తామని ఆ సంస్థ తెలిపింది. తెలంగాణ సోనా, కూనారం సన్నాలు వరి విత్తనాలను ప్రయోగాత్మకంగా సాగుకు ఇవ్వనున్నట్లు వివరించారు. టీఎస్‌సీడ్స్ ఎండీ డాక్టర్ జగన్మోహన్ రాష్ట్ర విత్తనావసరాలు, విత్తనోత్పత్తి గురించి వారికి తెలిపారు.

విద్యాసంవత్సరం మొదలయ్యేలోపే పదోన్నతులు.. బదిలీలు

- 'పాఠశాల విద్య-సంస్కరణలు' సదస్సులో మంత్రి హరీశ్‌రావు



ఉపాధ్యాయ సదస్సులో మాట్లాడుతున్న హరీశ్‌రావు

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోపే పూర్తిచేయడానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీయూటీఎఫ్) రాష్ట్ర మహాసభల్లో, 'పాఠశాల విద్య-సంస్కరణలు' అంశంపై విద్యా సదస్సును మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు సి.స్వామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ఉద్యోగులకు ఆరోగ్య భద్రతను కల్పిస్తున్నట్లు చెప్పారు. కాంట్రిబ్యూటరీ పింఛను పథకం (సీపీఎస్)ను సున్నితమైన అంశంగా పేర్కొంటూ.. ఈ విషయంలో పార్లమెంట్‌లో చట్టం చేయాలని, జాతీయస్థాయిలో చర్చ జరగాలని అన్నారు. ఆశావర్కర్లు, విద్యావలంటీర్ల సమస్యల్ని పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 2018 చివరికల్లా ఇంటింటికీ సురక్షిత మంచినీరు అందించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. సంఘానికి హైదరాబాద్‌లో భవనం కావాలని కోరుతున్నారని, జిల్లాల్లో కూడా కార్యాలయాల ఏర్పాటుకు స్థలాల్ని సేకరిస్తే.. ముఖ్యమంత్రితో మాట్లాడదామని చెప్పారు. రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ.. రెండేళ్లలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల విద్యను అందుబాటులోకి తెచ్చే అవకాశాలున్నాయి కాబట్టి ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. సీపీఎస్ సమస్య ముఖ్యమంత్రి దృష్టిలో ఉందన్నారు. ప్రభుత్వ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌పై ప్రతిపక్ష నేతల దాడి ప్రజాస్వామ్యానికి మాయనిమచ్చ అన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ అధ్యక్షుడు జి.దేవిప్రసాదరావు, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం అధ్యక్షుడు కారెం రవీందర్, మహిళా అధ్యక్షురాలు రేచల్ మాట్లాడారు. ఉద్యోగ విరమణ చేసిన సంఘం అధ్యక్షుడు స్వామిరెడ్డి, నర్మద దంపతులను ఈ సందర్భంగా మంత్రులు సత్కరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి విద్యావ్యవస్థలో కొన్ని సంస్కరణలను ప్రతిపాదించారు. సదస్సులో సంఘం గౌరవాధ్యక్షుడు జె.కైలాసం, రాష్ట్ర సహాధ్యక్షుడు దామెర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కందులకు మరో రూ.660 కోట్ల రుణం

- పూచీకత్తునిస్తూ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: కందులు అమ్మిన రైతులకు చెల్లించేందుకు రూ.660 కోట్లను బ్యాంకుల నుంచి రుణాలుగా తీసుకోవడానికి పూచీకత్తునిస్తూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర సహకార మార్కెటింగ్ సమాఖ్య(మార్క్‌ఫెడ్)కు రూ.440 కోట్లు, హాకాకు రూ.200 కోట్లను రుణాలు తీసుకోవాలని ఆదేశించింది. ఇవి ప్రభుత్వం తరఫున నోడల్ సంస్థలుగా కందులను రైతుల నుంచి కొనుగోలు చేశాయి. తక్షణం సొమ్ములను రైతుల ఖాతాల్లో వేయాలని సూచించింది. గతంలో రూ.600 కోట్లను రుణాలు తీసుకుని రైతులకు ఇచ్చినా, అవి సరిపోకపోవడంతో ఇప్పుడు మరో రూ.660 కోట్లకు అనుమతించింది.

'ఇన్విజిలేటర్లకు ఆ హామీ పత్రం నిబంధన వద్దు'

ఈనాడు, హైదరాబాద్: పదో తరగతి పరీక్షల విధుల్లో ఇన్విజిలేటర్లుగా బాధ్యతలు నిర్వర్తించే ఉపాధ్యాయులు.. విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడితే తానే బాధ్యత వహిస్తాననే హామీ పత్రం ఇవ్వాలనే ఉత్తర్వును రద్దు చేయాలని పలు ఉపాధ్యాయ సంఘాలు వేర్వేరు ప్రకటనల్లో పాఠశాల విద్యాశాఖను డిమాండ్ చేశాయి. ఎవరైనా కొందరు ఉద్దేశపూర్వకంగా అక్రమాలకు పాల్పడితే అలాంటి వారిని కఠినంగా శిక్షించడానికి 25/1997 చట్టం ప్రకారం పూర్తి అధికారాలుండగా హామీపత్రాలెందుకని సంఘాలు ప్రశ్నించాయి. ఉత్తర్వులను ఉపసంహరించుకోకపోతే పరీక్ష విధులను బహిష్కరిస్తామని పీఆర్‌టీయూ టీఎస్, యూటీఎఫ్ హెచ్చరించింది. హామీపత్రం వల్ల ఉపాధ్యాయులు పదే పదే తనిఖీ చేస్తారని దాంతో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయలేరని టీపీటీఎఫ్ తెలిపింది. ప్రతి దానికీ ఉపాధ్యాయులను బాధ్యులను చేయడం తగదని పీఆర్‌టీయూ తెలంగాణ, డీటీఎఫ్, టీటీఎఫ్‌లు పేర్కొన్నాయి.

నేడు టీఆర్‌టీ ప్రాథమిక కీ విడుదల

ఈనాడు, హైదరాబాద్: గత నెల 24 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష(టీఆర్‌టీ)లకు సంబంధించిన ప్రాథమిక 'కీ'ని టీఎస్‌పీఎస్సీ బుధవారం విడుదల చేయనుంది. ప్రాథమిక కీపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా స్వీకరిస్తామని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ తెలిపారు. ఆంగ్లంలో అభ్యంతరాలను టీఎస్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లోని text box of submit objection అనే లింకు ద్వారా పంపించాలని సూచించారు. ఇతర భాషల్లో పంపించాలనుకుంటే హాల్‌టికెట్ సంఖ్య, పేపర్ కోడ్, సిరీస్, ప్రశ్న సంఖ్య వివరాలను పీడీఎఫ్ రూపంలో attach file ద్వారా పంపించాలన్నారు.

ఏప్రిల్ లోపే ఈటీఆర్‌ల జారీ

తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: వచ్చే విద్యా సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలలకు తాత్కాలిక అనుమతి పునరుద్ధరణ పత్రాలు(ఈటీఆర్)ను ఏప్రిల్ లోపే ఇస్తామని తెలంగాణ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కిషన్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో బోగస్ ఈటీఆర్‌లతో పలు ప్రైవేట్ పాఠశాలలు నడుస్తున్నట్లు, పదో తరగతి పరీక్షలు రాయిస్తున్నట్లు వెలుగులోకి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ డీఈఓ కార్యాలయ సిబ్బంది ఇంటి రుణాలు తీసుకోవడం, ఇళ్లు నిర్మించుకోకపోవడం తదితర అంశాలపై ఆర్‌జేడీని నివేదిక అందజేయాలని ఆదేశించినట్లు, అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

తమిళనాడులో కురంగణిలో కార్చిచ్చు కారణంగా చనిపోయిన వారి సంఖ్య పదకొండుకు చేరింది. మరోవైపు మృతుల కుటుంబాలకు రాష్ట్ర గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్ సానుభూతి ప్రకటించారు. తేని జిల్లా పోడి సమీపంలోనున్న కురంగణి అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్‌కి వెళ్లిన 36 మంది అగ్నిప్రమాదంలో చిక్కుకోగా... సోమవారం వరకు పదిమంది మృతి చెందిన విషయం తెలిసిందే. మంగళవారంతో ఆ సంఖ్య పదకొండుకు చేరింది.



మంగళవారం యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ ఇచ్చిన విందులో పాల్గొన్న విపక్ష పార్టీల నేతలు

విపక్ష పార్టీలకు సోనియా విందు

- హాజరైన 20 పార్టీలు
- వచ్చే ఎన్నికల్లో ఐక్య కూటమి ఏర్పాటుపై చర్చ!

దిల్లీ: యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ మంగళవారం రాత్రి విపక్ష పార్టీలకు విందు ఇచ్చారు. ఇందులో 20 ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో భాజపాను ఓడించడానికి ఉమ్మడి కూటమిని ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలను చర్చించారు.

భాజపా నేతృత్వంలోని ఎన్‌డీఏను ఓడించడానికి విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నంగా ఈ విందు సమావేశాన్ని విశ్లేషిస్తున్నారు. సంబంధిత వర్గాల కథనం ప్రకారం.. ఈ భేటీలో ఎన్‌సీపీ, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, వామపక్షాలు తదితర పార్టీల నాయకులు పాల్గొన్నారు. విందుకు హాజరైన నేతల్లో శరద్ పవార్ (ఎన్‌సీపీ), రామ్‌గోపాల్ యాదవ్ (ఎస్పీ), సతీశ్ చంద్ర మిశ్ర (బీఎస్పీ), మాజీ ముఖ్యమంత్రులు ఒమర్ అబ్దుల్లా, బాబూలాల్ మరాండీ, హేమంత్ సొరెన్, జితన్ రామ్ మాంఝీ, జేడీయూ నేత శరద్ యాదవ్, ఆర్ఎల్‌డీకి చెందిన అజిత్ సింగ్ హాజరయ్యారు. ఆర్జేడీ తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ కుమారుడు తేజస్వీ యాదవ్, కుమార్తె మీసా భారతీ పాల్గొన్నారు. ఇంకా.. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన సుదీప్ బందోపాధ్యాయ్, సీపీఎం నేతలు డి.రాజా, మహ్మద్ సలీమ్, డీఎంకే నాయకురాలు కనిమొళి, జేడీఎస్ నేత కుపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ తరఫున రాహుల్ గాంధీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, ఇతర నేతలు గులాం నబీ ఆజాద్, మల్లికార్జున ఖర్గే, అహ్మద్ పటేల్, ఆంటోనీ తదితరులు హాజరయ్యారు.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి వైదొలగినప్పటికీ ఎన్‌డీఏలోనే కొనసాగుతున్న తెదేపాతోపాటు తెరాస, బీజేడీలను ఈ విందుకు ఆహ్వానించలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ విందు ఉద్దేశం రాజకీయాలు కాదని, విపక్ష పార్టీల నడుమ మైత్రిని పెంపొందించుకోవడమేనని కాంగ్రెస్ నేత రణదీప్ సుర్జేవాలా చెప్పారు. పార్లమెంటును ప్రభుత్వం పనిచేయనివ్వని ప్రస్తుత తరుణంలో జాతీయ ప్రయోజనాలు ఇమిడి ఉన్న అంశాలపై చర్చించడానికి కలసికట్టుగా సాగడం వివిధ పార్టీలకు అవసరమని తెలిపారు.



మూడు నెలల్లో ఏపీ, తెలంగాణ బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించాలి

బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ బార్ కౌన్సిళ్లకు మూడు నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. దేశంలోని అన్ని బార్ కౌన్సిళ్లకు సకాలంలో ఎన్నికలు పూర్తి చేయాలని, తెలుగు రాష్ట్రాల్లో వేర్వేరు బార్ కౌన్సిళ్లు ఏర్పాటు చేయాలని వివేక్ నారాయణ శర్మ అనే వ్యక్తి దాఖలు చేశారు. తెలుగు రాష్ట్రాల బార్ కౌన్సిళ్లు వేర్వేరుగా ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని తెలుగు రాష్ట్రాలకు చెందిన కొంతమంది న్యాయవాదులు ఈ కేసులో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని మంగళవారం జస్టిస్ ఆర్కే అగర్వాల్, జస్టిస్ అభయ్ మనోహర్ సప్రేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరఫు సీనియర్ న్యాయవాది రాజీవ్ దత్తా వాదనలు వినిపిస్తూ.. తెలుగు రాష్ట్రాలకు వేర్వేరు కౌన్సిళ్లు ఏర్పాటు చేసి ఎన్నికల నిర్వహణ అన్నీ పూర్తి చేయడానికి సంవత్సరం గడువు ఇవ్వాలని కోరారు. దీనిపై తెలంగాణ తరఫు అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ ఉదయకుమార్ సాగర్, ఏపీ తరఫు అడ్వొకేట్ ఆన్ రికార్డ్స్ గుంటూరు ప్రభాకర్, ఇంప్లీడ్ అయిన అడ్వొకేట్ల తరఫు న్యాయవాదులు అల్లంకి రమేశ్, అనుమోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌లు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజీవ్ దత్తా విజ్ఞప్తి తిరస్కరించిన ధర్మాసనం అన్ని రోజులు ఎందుకని... మూడు నెలల్లో ఈ ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా మూడు ప్రధాన సూచనలు చేసింది. ఏపీ, తెలంగాణలకు వేర్వేరు బార్ కౌన్సిళ్లు ఏర్పాటు చేయాలని, ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి కావాలని, ఉమ్మడి కౌన్సిల్‌లో అడ్వొకేట్లకు ఏ కౌన్సిల్‌లో చేరాలన్న నిర్ణయం వారికే ఇవ్వాలని పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ అనంతరం జూన్ చివరికల్లా పూర్తి నివేదిక ఇవ్వాలని ధర్మాసనం ఆదేశించింది.

పార్టీ ఫిరాయింపులపై ఎమ్మెల్యేలకు నోటీసులు

ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ ఎన్నికల్లో వైకాపా నుంచి గెలిచి ఆ తర్వాత తెదేపాలోకి 22 మంది చేరారని, వారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంలో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశించింది. హైకోర్టు నోటీసులు జారీచేసిన వారిలో శాసనసభ్యులు, మంత్రులు ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, సుజయకృష్ణ రంగారావు, ఆదినారాయణరెడ్డి, భూమా అఖిలప్రియతో పాటు శాసనసభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి (గిద్దలూరు), పాలపర్తి డేవిడ్‌రాజు (ఎర్రగొండపాలెం) పోతుల రామారావు (కందుకూరు), గొట్టిపాటి రవికుమార్ (అద్దంకి), పాశం సునీల్‌కుమార్ (గూడూరు), జయరాములు (బద్వేల్), బుడ్డా రాజశేఖర్‌రెడ్డి (శ్రీశైలం), ఎస్వీ మోహన్‌రెడ్డి (కర్నూలు), మణిగాంధీ (కోడుమూరు), చాంద్‌బాషా (కదిరి), జలీల్‌ఖాన్ (విజయవాడ పశ్చిమ), ఉప్పులేటి కల్పన (పామర్రు), జ్యోతుల నెహ్రూ (జగ్గంపేట), వరుపుల సుబ్బారావు (ప్రత్తిపాడు), వంతల రాజేశ్వరి (రంపచోడవరం), కిడారి సర్వేశ్వరరావు (అరకులోయ), గిడ్డి ఈశ్వరి (పాడేరు), కలమట వెంకటరమణమూర్తి (పాతపట్నం)తో పాటు ఏపీ న్యాయ, శాసన వ్యవహారాలశాఖ ముఖ్య కార్యదర్శి, శాసనసభ కార్యదర్శులు ఉన్నారు. వీరిని అనర్హులుగా ప్రకటించాలంటూ ప్రకాశం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సి.వి.మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదుచేసినా చర్యలు లేవన్నారు. ఫిరాయింపుదార్లపై దాఖలు చేసిన వ్యాజ్యాలు సైతం హైకోర్టులో అపరిష్కృతంగా ఉన్నాయని గుర్తుచేశారు. ముందుగా నోటీసులు జారీచేసి వారి వాదనలు వినాల్సి ఉందని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరఫు న్యాయవాది స్పందిస్తూ.. నోటీసులిచ్చి వాయిదాపడ్డాక మరోసారి విచారణకు నోచుకోవడం లేదని అన్నారు. ధర్మాసనం స్పందిస్తూ.. హైకోర్టులో ప్రస్తుతం 3.25లక్షల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని, ప్రతీ కేసు న్యాయవాదికి ముఖ్యమైనదేనని తెలిపింది. అన్ని కేసులపై తాజాగా విచారణ జరపాలంటే ఏవిధంగా సాధ్యమవుతుందని ప్రశ్నించింది.

రుణ మాఫీ కోరుతూ.. దిల్లీలో రైతుల నిరసన



దిల్లీలో భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న రైతులు

దిల్లీ: రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ దిల్లీలో దాదాపు 3,000 మంది రైతులు మంగళవారం నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ స్ట్రీట్‌లో వీరు కిసాన్ మహా పంచాయత్‌ను నిర్వహించారు. భారతీయ కిసాన్ సంఘం (బీకేయూ), అఖిల భారత రైతుల ఉద్యమ సమన్వయ కమిటీ (ఏఐసీసీఎఫ్‌ఎం)ల నేతృత్వంలో ఈ నిరసన ప్రదర్శనలు సాగాయి. ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును కలిసి రైతులు డిమాండ్ల పత్రాన్నీ సమర్పించారని సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. రుణ మాఫీ, అన్ని పంటలకూ కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), జన్యు మార్పిడి పంటలపై నిషేధం తదితర డిమాండ్లతో నిరసలు చేపట్టినట్లు బీకేయూ, ఏఐసీసీఎఫ్‌ఎం ఓ ప్రకటన విడుదలచేశాయి. మహారాష్ట్రలో భారీ స్థాయిలో నిరసనలు చేపట్టడంతో రుణమాఫీకి అక్కడి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన మరుసటి రోజే తాజా నిరసనలు చోటుచేసుకున్నాయి.





Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.